www.visalaandhra.com
స్థాపితం : 1952

విశాలాంధ్ర

VISALAANDHRA Regd No.VJ/042/2015-17
అక్షరాక్షరం అభ్యుదయం

సంపుటి : 66 సంచిక : 228 | గురువారం 08-02-2018 | Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Tirupathi, Kurnool, Karimnagar, Khammam | వెల: రూ.3.00 | పేజీలు : 12+ టాబ్లాయిడ్ | విజయవాడ ప్రచురణ

తప్పంతా కాంగ్రెస్‌దే...

విషం కక్కిన మోడీ

- ఏపీపై పెదవి విప్పని ప్రధాని
- విభజన హామీలు, ప్రత్యేక ప్యాకేజీపై మౌనం
- కాంగ్రెస్‌పై నెపం నెట్టివేత
- విభజన పాపం బీజేపీది కాదట
- ఎన్నో అభివృద్ధి పనులు చేశాం
- కాంగ్రెస్ వల్లే ఏపీకి కష్టాలు
- సక్రమంగా లేని విభజన
- కాంగ్రెస్‌పై మోడీ దాడి
- ప్రతిపక్షాల వాకౌట్



న్యూఢిల్లీ : కాంగ్రెస్ పార్టీని ఎండగట్టటమే లక్ష్యంగా ప్రధాని నరేంద్ర మోడీ బుధవారం ఉభయ సభల్లో ఎదురుదాడి చేశారు. సంక్షేమంపై ప్రజల ఆకాంక్షకు అద్దం పట్టాల్సిన ఆయన ప్రసంగం ఆద్యంతం కాంగ్రెస్ పార్టీని తిట్టిపోసే రీతిలోనే సాగింది. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై లోక్‌సభలో ప్రధాని మాట్లాడుతూ ప్రజాస్వామ్యం గురించి కాంగ్రెస్ పార్టీ నుంచి తాము పాఠాలు నేర్చుకునే స్థితిలో లేమన్నారు. వాజ్‌పేయి హయాంలో మూడు రాష్ట్రాలు విభజిస్తే ఎలాంటి వివాదాలు రాలేదని.. కాంగ్రెస్ పార్టీ ఒక్క రాష్ట్రాన్ని విభజిస్తే నాలుగేళ్లుగా సమస్యలు కొనసాగుతూనే ఉన్నాయన్నారు. అవిభాజ్య ఆంధ్రప్రదేశ్‌ను కాంగ్రెస్ విభజించిన తీరు వల్లే ఇన్నేళ్లయినా సమస్యలు అలాగే ఉన్నాయన్నారు. 'తెలంగాణ ప్రజల మనోభావాలకు అనుగుణంగా ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటుకు మేం మద్దతు పలికాం. వాజ్‌పేయి ప్రభుత్వం దీర్ఘ దృష్టి కారణంగా మూడు రాష్ట్రాలను విభజించినా ఎలాంటి సమస్యలు ఉత్పన్నం కాలేదు. ఎవరి వాటాలు వారికి ఇచ్చారు. కానీ ఆంధ్రప్రదేశ్ విషయంలో అలా జరగలేదు. రాజకీయ లబ్ధి కోసం పార్లమెంటు తలుపులు మూసివేసి విభజన బిల్లు ఆమోదింప జేసుకున్నారు. నామమాత్రపు ప్రతిపక్షం, ప్రసార మాధ్యమాలపై నియంత్రణతో కాంగ్రెస్ ఇష్టారాజ్యంగా వ్యవహరించింది. తమ నిర్వాకాలు బయటకు రాకుండా కాంగ్రెస్ పార్టీ ఇష్టారీతిగా ప్రవర్తించింది. కేవలం ఎన్నికల్లో లబ్ధి పొందటానికే రాష్ట్రాన్ని విభజించారు. అప్పుడు వారు చేసిన తప్పుల వల్లనే ఈనాడు ప్రతిపక్షంలో కూర్చున్నారు. ప్రజాస్వామ్యం గురించి మాట్లాడే అర్హత కాంగ్రెస్ పార్టీకి లేదు. హైదరాబాద్‌లో ఏపీ దళిత సీఎం అంజయ్యను రాజీవ్‌గాంధీ అవమానించారు. నీలం సంజీవరెడ్డిని కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా అవమానించింది. ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రెస్ చేసిన రాజకీయ అరాచకాలు ఎన్నెన్నో... వీరా ఏపీ గురించి మాట్లాడేది. ఆంధ్రా నాయకులను తీవ్రంగా అవమానించారు. తెలుగు ప్రజల ఆత్మగౌరవం కాపాడేందుకే తెలుగుదేశం పార్టీ ఆవిర్భవించింది. దీనికోసమే తెలుగు ప్రజల ఆరాధ్య దైవం ఎన్టీఆర్ సినిమాలు వదిలి రాజకీయ ప్రవేశం చేశారు. కర్ణాటక ఎన్నికలు లేకుంటే ఆంధ్రప్రదేశ్ విభజన గురించి మల్లికార్జున ఖర్గే మాట్లాడేవారా?' అని మోడీ ఎదురుదాడి చేశారు. కాంగ్రెస్ పార్టీ, నెహ్రూ ప్రజాస్వామ్యబద్ధంగా వ్యవహరించలేదు. తమిళనాడు, పంజాబ్, కేరళ రాష్ట్రాల్లో ప్రజాస్వామ్యాన్ని అణచివేసింది. సర్దార్ వల్లభాయ్ పటేల్‌ను ప్రధానిని చేసుంటే, కాశ్మీర్ సమస్య ఉండేది కాదు. పార్టీలు శాశ్వతం కాదు.. దేశమే శాశ్వతమన్న విషయాన్ని కాంగ్రెస్ గుర్తుంచుకోవాలి. కాంగ్రెస్ పార్టీ హయాంలో రోజుకు 11 కిలోమీటర్లు మేర రోడ్డు వేస్తే.. ఈ ప్రభుత్వం రోజుకు 22కి.మీల మేర రహదారులు

- మిగతా 2 లో



బడ్జెట్‌లో రాష్ట్రానికి అన్యాయంపై

నేడు బంద్

- కాంగ్రెస్, వైసీపీ, జనసేన మద్దతు
- ప్రజా, కార్మిక, పాత్రికేయ సంఘాలు కూడా
- వర్తక, వాణిజ్య సంస్థల సంఘీభావం
- సెలవు ప్రకటించిన ప్రైవేటు విద్యాసంస్థలు
- డిపోలకే పరిమితం కానున్న బస్సులు
- ఎక్కడి లారీలు అక్కడే

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: బడ్జెట్‌లో మోడీ ప్రభుత్వం రాష్ట్రం పట్ల పూర్తి నిర్లక్ష్యంగా వ్యవహరించిన తీరును నిరసిస్తూ వామపక్షాలు ఇచ్చిన పిలుపులో భాగంగా గురువారం రాష్ట్ర బంద్ జరగనుంది. నాలుగేళ్లుగా విభజన హామీలు నెరవేర్చకుండా మాయమాటలతో కేంద్రం కాలం వెళ్లదీస్తున్నప్పటికీ చంద్రబాబు ప్రభుత్వం పట్టించుకోపోవడం దారుణమంటూ వామపక్షపార్టీలు బంద్‌కు పిలుపునిచ్చిన విషయం తెలిసిందే. ఇప్పటికే కాంగ్రెస్, వైసీపీలు బంద్‌కు సంపూర్ణ మద్దతు ప్రకటించాయి. బంద్‌కు జనసేన పార్టీ కూడా మద్దతు ప్రకటించింది. ఈమేరకు ఆపార్టీ అధినేత పవన్ కల్యాణ్ సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణకు బుధవారం సాయంత్రం ఫోన్ ద్వారా తెలిపారు. బంద్ ద్వారా శాంతియుత నిరసన తెలియచేయాలన్నారు. రాష్ట్ర పరిస్థితులపై చర్చించేందుకు ఈనెల 11వ తేదీన సమావేశమవుదామని ఆయన రామకృష్ణకు తెలిపారు. ఇక ఉత్తరాంధ్ర చర్చా ఐక్యవేదిక కన్వీనర్ కొణతాల రామకృష్ణ, రాయలసీమ ప్రజా సమితి, ముస్లిం ఐక్యవేదిక బంద్‌కు సహకరించేందుకు ముందుకొచ్చాయి. రాష్ట్రవ్యాప్తంగా కార్మిక, ఉద్యోగ, ఉపాధ్యాయ, విద్యార్థి, యువజన, పాత్రికేయ సంఘాలు సైతం కేంద్రం తీరుకు నిరసనగా

- మిగతా 2 లో



వడ్డీరేట్లు యథాతథం

- రెపోరేటు 6 శాతం, రివర్స్‌రెపో రేటు 5.7 శాతం
- నిరాశకు గురైన సామాన్య ప్రజానీకం

- వివరాలు 7 లో

ఆక్రోశానికి అవమానం

- ఏపీ ఎంపీల ద్వంద్వ వైఖరి
- రాష్ట్రానికి తీరని అన్యాయం



- వివరాలు 9 లో

కేంద్రం సీరియస్.....

ఎంపీల వెనకడుగు..

- స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చిన వెంకయ్య, మోడీ, జైట్లీ..
- ఆందోళనపై వెనక్కి తగ్గుతున్న ఎంపీలు
- రాజ్యసభలో ముగ్గురు టీడీపీ, ఒక కాంగ్రెస్ ఎంపీ సస్పెన్షన్
- ఏపీ ఎంపీల డిమాండ్లకు టీఆర్ఎస్ ఎంపీ జితేందర్ రెడ్డి మద్దతు
- గాంధీ విగ్రహం, లోక్‌సభలో టీడీపీ, వైసీపీ ఎంపీల ఆందోళన
- లోక్‌సభ నుంచి వాకౌట్ చేసిన వైసీపీ ఎంపీలు

విశాలాంధ్ర బ్యూరో -న్యూఢిల్లీ : ఆంధ్రప్రదేశ్ ఎంపీలపై కేంద్రం నిప్పులు చెరుగుతోంది. టీడీపీ, వైసీపీ ఎంపీలు బుధవారం ఢిల్లీలో తమదైన శైలిలో లోక్‌సభ లోపల, బయటా ఆందోళనలు చేశారు. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చలో భాగంగా ప్రధానమంత్రి నరేంద్ర మోడీ లోక్‌సభలో మాట్లాడుతున్న సమయంలో తెలుగుదేశం పార్టీ ఎంపీలు ఆందోళనకు దిగటంతో కేంద్రం సీరియస్‌గా వార్నింగ్ ఇచ్చినట్లు సమాచారం. కేంద్రమంత్రులు రాజ్‌నాథ్ సింగ్, అరుణ్‌జైట్లీ, అనంత్‌కుమార్ టీడీపీ ఎంపీలను పలుమార్లు వారించారు. మోడీ ప్రసంగం సాగుతుండగా మరో వైపు కాంగ్రెస్, టీడీపీ ఎంపీలు వెల్‌లోకి వెళ్లి నిరసనలు తెలిపారు. ఇదే పద్ధతి కొనసాగిస్తే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని ఎంపీలకు కేంద్ర మంత్రులు చెప్పినట్లు సమాచారం. రాజ్యసభలో ముగ్గురు టీడీపీ ఎంపీలు, ఒక కాంగ్రెస్ ఎంపీపై సస్పెన్షన్ వేటు వేస్తూ ఛైర్మన్ వెంకయ్యనాయుడు నిర్ణయం తీసుకున్నారు. టీడీపీ ఎంపీలు సిఎం రమేష్, గరికపాటి మోహనరావు, సీతారామలక్ష్మీ,

- మిగతా 11 లో

రాజధానిలో మరో వర్సిటీ



- కురగల్లులో శంకుస్థాపన
- అమృత విశ్వవిద్యాలయ ఏర్పాటు అభినందనీయం
- సీఎం చంద్రబాబు

విశాలాంధ్ర-మంగళగిరి : నూతన రాజధాని అమరావతిలో అమృత విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమని, విలువలతో కూడిన సమాజాన్ని తయారు చేయడానికి ఈ అమృత యూనివర్సిటీ ఎంతగానో ఉపయోగపడనుందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. గుంటూరు జిల్లా మంగళగిరి మండలం కురగల్లులో నూతనంగా ఏర్పాటు చేయనున్న అమృత విశ్వవిద్యాలయ నిర్మాణ పనులకు బుధవారం చంద్రబాబు శిలాఫలకాన్ని ఆవిష్కరించి ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో సీఎం మాట్లాడుతూ అమ్మ అమృతానంద ఒక సాధారణ పేద కుటుంబంలో పుట్టి శక్తివంతమైన వ్యక్తిగా తయారు కావడమే కాకుండా అనునిత్యం సమాజం కోసం ఎనలేని సేవలు అందిస్తున్నారని

- మిగతా 2 లో

హామీల ఊసేలేదు



- మోడీ ప్రసంగంపై పవన్
- టీడీపీపై నమక్మం పోతోంది
- జేపీసీ ఏర్పాటు అవశ్యం

హైదరాబాద్ : ఏపీ ఎంపీలు పార్లమెంటు ఉభయ సభల్లో నిరసన వ్యక్తం చేస్తున్నప్పటికీ విభజన హామీలపై కేంద్రం స్పష్టమైన ప్రకటన చేయకపోవడంపై జనసేనాధిపతి పవన్ కల్యాణ్ తనదైన శైలిలో స్పందించారు. లోక్‌సభలో ప్రధాని మోడీ ప్రసంగంలో కాంగ్రెస్ పార్టీపై విమర్శలు మినహా విభజన హామీల ప్రస్తావన లేదని పవన్ కళ్యాణ్ బుధవారం విలేకరుల సమావేశంలో ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్టీఆర్, నీలం సంజీవరెడ్డిల గురించి మాట్లాడిన మోడీ

- మిగతా 2 లో

కమ్యూనిజం అజరామరం

- శ్రమజీవులు, కష్టజీవుల గుండెచప్పుడు
- రాష్ట్రానికి బీజేపీ తీరని అన్యాయం
- అవినీతిలో కాంగ్రెస్‌ను మించిన టీడీపీ
- అంతిమలక్ష్యం రాజ్యాధికారమే : కె.రామకృష్ణ

3లో

రాష్ట్రం నెత్తిన రైల్వే భారం

- 12 ఆర్ఓబీ, 15 ఆర్‌యూబీలకు పచ్చజెండా
- రూ. 1000 కోట్లకు పైగా నిధుల అవసరం
- మూడేళ్లలో ఒక వంతెన మాత్రమే పూర్తి
- అధికారులకు సమస్యగా మారిన భూసేకరణ

11లో

ఇదీ లోకం!



కౌలు కబ్జా

- నకిలీ పత్రాలతో దర్జాగా లబ్ధి
- అధికారుల అండతో అక్రమాలు
- సీఆర్డీఏ ఆఫీసులోనే మాయాజాలం
- కొరవడిన పర్యవేక్షణ
- చర్యలు తీసుకుంటాం : శ్రీధర్



విశాలాంధ్ర అమరావతి : ఉన్నది లేనట్లు చేస్తాం..లేనిది ఉన్నట్లు చేస్తాం..ఎంతటి వారినైనా బురిడీ కొట్టిస్తాం..సర్వే నెంబర్లు సృష్టిస్తాం.. సంతకాలు చేసేస్తాం..అంతా సీఆర్డీఏ మహిమ...రాజధాని అమరావతిలో భూదందాలు, కబ్జాలు పెరిగిపోతున్నాయి. లేని భూముల్ని సృష్టించి అడ్డంగా దోచేస్తున్నారు. ఈ దారుణాలు ఎక్కడో జరిగినవి కాదు. సాక్షాత్తు సీఆర్డీఏ కార్యాలయంలోనే జరగటం సంచలనంగా మారింది. కోట్లరూపాయల కుంభకోణం కావటంతో రాష్ట్రవ్యాప్తంగా ఇది చర్చనీయాంశమైంది..గుంటూరుకి చెందిన పఠాన్ గౌస్ ఖాన్ మందడంలోని 201 సర్వే నెంబర్లో ఎకరం భూమి ఉన్నట్లుగా పత్రాలు సృష్టించి అందరి రైతులు మాదిరిగానే కౌలు పొందారు. ఇతర లబ్ధిని పొందాడు. అయితే అలా కేటాయించిన భూమిని అమ్ముకోవడానికి ప్రయత్నించాడు. ఆ కొనుగోలుదారుడు రికార్డులు పరిశీలించటంతో అసలు విషయం వెలుగులోకి వచ్చింది. అక్కడ భూమి లేకుండానే ఈ తతంగమంతా జరగటం విస్మయానికి గురి చేసింది. దీనితో రాజధానిలో భూముల వ్యవహారం మరోసారి వివాదాస్పదమైంది.

భూ స్కామ్ పరిశీలిస్తే...

రాజధానిలో జరిగిన భు కుంభకోణాన్ని పరిశీలిస్తే అధికారుల చేతివాటం ఏ స్థాయిలో ఉందో అర్థమవుతోంది. అమరావతి రాజధానిలో వెంకటపాలెం, మందడం, ఉద్దండ్రాయు నిపాలెం, లింగాయపాలెం, రాయపూడి గ్రామాల్లో లంక భూములు ఉన్నాయి. ఇక్కడి రైతుల భూములపై ల్యాండ్ పూలింగ్ ప్రకటించిన నాటి నుంచి లంకభూములపై వివాదాలు నెలకొన్నాయి. సరైన ప్యాకేజీలు ఇవ్వకపోవడంతో అధికశాతం రైతులు లంకభూముల్లో ఇప్పటికీ సాగు చేసుకుంటున్నారు. ఇదే క్రమంలో లంకభూముల్లో భూమి లేకపోయినా ఉన్నట్లు పత్రాలు సృష్టించి సీఆర్డీఏ నుంచి ఇతర రైతులకు వచ్చే అన్ని రకాల సంక్షేమ ఫలాలను అందుకున్నారు. ఆ భూమిని కొనుగోలు చేసే క్రమంలో అసలు వాస్తవాలు వెలుగులోకి వచ్చాయి. ఈ సమస్త సమాచారం

- మిగతా 2 లో

స్పేస్‌ఎక్స్ భారీ రాకెట్ ప్రయోగం



ఫ్లోరిడా : అత్యంత శక్తివంతమైన రాకెట్ ఫాల్కన్ హెవీని బుధవారం ఫ్లోరిడాలోని కెన్నడీ స్పేస్ సెంటర్ నుంచి ప్రయోగించారు. అమెరికా వ్యాపారవేత్త ఎలన్ మస్క్‌కు సంబంధించిన స్పేస్‌ఎక్స్ సంస్థ ఈ రాకెట్‌ను నింగిలోకి ప్రయోగించింది. ఇది అత్యంత శక్తివంతమైన, అత్యంత భారీ రాకెట్. ఈ రాకెట్ అట్లాంటిక్ సముద్రం మీదుగా.. అంతరిక్షంలోకి దూసుకువెళ్లింది. వాస్తవంగా కెన్నడీ స్పేస్ సెంటర్ నుంచి తరుచూ నాసా తన రాకెట్ల ద్వారా

- మిగతా 11 లో

సియోల్ ఒలింపిక్స్‌కు కిమ్ సోదరి

సియోల్ : దక్షిణకొరియా రాజధాని సియోల్‌లో శుక్రవారం ప్రారంభంకానున్న శీతాకాలం ఒలింపిక్స్ క్రీడలకు ఉత్తరకొరియా అధినేత కిమ్‌జాంగ్‌ఉన్ సోదరి కిమ్‌యోజాంగ్ పాల్గొననున్నారు. ఈ విషయాన్ని దక్షిణ కొరియా ఏకీకరణ మంత్రిత్వశాఖ తెలియజేసింది. కిమ్‌యోజాంగ్‌తో పాటు ఉత్తర కొరియా దేశ అధికార ప్రతినిధి కిమ్‌యోంగ్‌నామ్ కూడా వెళతారు. అలాగే జాతీయ క్రీడల కమిటీ ఛైర్మన్ చొహివి తదితర అధికార ప్రతినిధులు ఒలింపిక్స్‌కు హాజరవుతారని ఏకీకరణ మంత్రిత్వశాఖ తెలియజేసింది. కిమ్ కుటుంబం నుంచి ఒలింపిక్స్‌కు హాజరవుతున్న మొట్టమొదటి వ్యక్తి కిమ్‌యోజాంగ్. ఆమె వయస్సు 28 సంవత్సరాలు. పాలక వర్కర్స్ పార్టీలో సీనియర్ అధికార ప్రతినిధిగా కీలకమైన స్థానంలోవుండి పనిచేస్తున్నారు. ఆమె ఒలింపిక్స్ క్రీడలకు హాజరవుతున్న నేపథ్యంలో రెండు దేశాల మధ్య ఉద్రిక్తతలను సడలించుకుని కొరియా ద్వీపకల్పంలో శాంతిని నెలకొల్పాలన్న లక్ష్యం ఉన్నట్లుగా బ్లూహౌస్ ప్రతినిధి కిమ్‌యుకియమ్ తెలియజేశారు. గత ఏడాది అమెరికా ఆమెపైన ఆంక్షలు విధించింది. ఇతర దేశాలకు వెళ్ళరాదన్న ఆంక్షలు కూడా ఉన్నాయి. అయితే రెండు కొరియాలు ఐక్యం కావాలన్న ఆకాంక్ష వ్యక్తమవుతున్న నేపథ్యంలో ఆమె దక్షిణకొరియాలో పర్యటించనున్నారు. ఆమె ఒలింపిక్స్ క్రీడలకు హాజరై కిమ్‌జాంగ్‌ఉన్ నుంచి నేరుగా తమ దేశం తరఫున సందేశాన్ని అందించే అవకాశం కలుగుతుంది. రెండు దేశాల మధ్య పూర్తిగా శాంతిని నెలకొల్పేందుకు అవసరమైన చర్చలను ప్రారంభించేందుకు ఈ ఒలింపిక్స్ దోహదం చేస్తాయా? లేదా అన్న అంశం భవిష్యత్తులో తేలవలసివుంది.



తైవాన్‌లో భూకంపం

ఆరుగురి మృతి, 88మంది గల్లంతు



హువలియన్ : తైవాన్‌లో బుధవారం సంభవించిన భూకంపానికి అనేక భవనాలు దెబ్బతిన్నాయి. ఒకవైపుకు ఒరిగిపోయిన భవనాలు ఎప్పుడైనా పడిపోయే ప్రమాదం ఏర్పడింది. ఈ ప్రమాదంలో 6గురు చనిపోగా 88 మంది గల్లంతయినట్టు అధికారవర్గాలు తెలిపాయి. భూకంప బాధితులను ఆదుకునేందుకు పెద్దఎత్తున సహాయ కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ఒకమాదిరి భవనాలు ఎక్కువగా దెబ్బతిన్నట్టుగా వీడియో దృశ్యాలు, ఫొటోలు తెలియజేస్తున్నాయి. ప్రాణ నష్టంకంటే ఆస్తినష్టం ఎక్కువగా జరిగింది. భవనాలు పైకప్పులు వంగిపోవటం, ఇనుప దూలాలుసైతం మెలికలు తిరిగిపోయాయి. భవనాల శిథిలాలలో ప్రజలు ఉండవచ్చునని భావిస్తున్నారు. పలు అంతస్తుల భవనాలపైకి నిచ్చెనలద్వారా ఎక్కి సజీవంగావున్న వారిని కిందకు తీసుకువస్తున్నారు. భూకంపం రిక్టర్‌స్కేలుపై 6.4గా నమోదయ్యింది. మంగళవారం రాత్రి పొద్దుపోయాక భూకంపం సంభవించింది. ఇక్కడ మార్షల్ హోటల్ పునాదివరకు దెబ్బతినిపోయింది. మొదట భూప్రకంపనలు స్వల్పంగా సంభవించాయి. ఇలా స్వల్పంగా ప్రకంపనలు రావటం గతంలో చాలాసార్లు జరిగిందని ఇదికూడా అంతే ఉండవచ్చునని ప్రజలు భావించారు. అందువల్ల ప్రథమంలో ప్రకంపనలను తీవ్రంగా తీసుకోలేదని చెన్‌మింగ్‌హుయ్ అనే కార్మికుడు అధికార వార్తాసంస్థకు తెలియజేశాడు. ప్రకంపనలు అధికమైన తర్వాత చెన్ తన కుమారుడు, మనవడిని తీసుకుని ఇంటినుంచి బయటకు వచ్చివేశారు. ఈ ప్రమాదంలో 256 మంది గాయపడినట్టుగా అగ్నిమాపక దళాలు తెలియజేశాయి. విద్యుత్తు, నీటి సరఫరాకు ఎక్కువగా అంతరాయం కలిగి వేలాది ఇళ్లకు ఈ రెండు సౌకర్యాలు నిలిచిపోయాయి. రోడ్లు బీభత్సంగా తయారయ్యాయి. గాయపడిన వారిలో తమ దేశస్తులు 9మంది ఉన్నట్టుగా జపాన్ విదేశాంగశాఖ తెలియజేసింది. భూకంపం సంభవించిన ప్రాంతాలలో సహాయ కార్యక్రమాలను ముమ్మరం చేయవలసిందిగా తైవాన్ అధ్యక్షుడు త్సాయింగ్ ఆదేశించారు. విపత్తు సమయంలోనే ప్రజలు ధైర్యసాహసాలతో ఉండాలని ఆమె ప్రజలను కోరారు. బాధితులకు సహాయం చేసేందుకు చైనా సహాయబృందాలను పంపేందుకు సిద్ధమయ్యింది.

జర్మనీలో సంకీర్ణానికి ఒప్పందం



బెర్లిన్ : జర్మనీలో ఎట్టకేలకు సంకీర్ణ ప్రభుత్వం ఏర్పాటు చేసేందుకు పాలక, ప్రధాన ప్రతిపక్షం మధ్య బుధవారం ఒప్పందం కుదిరింది. ఇందుకోసం 24 గంటలపాటు తుదిదశ చర్చలు జరిగాయని జర్మనీ వార్తాసంస్థ డిపిఎ తెలిపింది. ఛాన్సలర్ ఏంజిలా మర్కెల్ నాయకత్వం వహిస్తున్న కన్సర్వేటివ్ పార్టీ సీడీయు, ప్రధాన మధ్యేవాద వామపక్ష పార్టీ సోషల్ డెమొక్రటిక్ పార్టీల మధ్య సుదీర్ఘ చర్చలు జరిగాయి. సీడీయు దానికి సన్నిహితంగావుండే క్రిస్టియన్ సోషల్ యూనియన్, ఎస్‌డిపిలు ఆటంకంగావున్న అన్ని సమస్యలపైన చర్చించి ఒక నిర్ణయానికి వచ్చినట్టుగా డిపిఎ వార్తాసంస్థ తెలియజేసింది. సోషల్ డెమొక్రాట్లకు విదేశాంగ, కార్మిక, ఆర్థిక శాఖలు లభించే అవకాశం ఉంది. ఈ శాఖలు గత 8 ఏళ్లుగా ఏంజిలామర్కెల్ పరిధిలోనే ఉన్నాయి. సెప్టెంబర్ 24న ఎస్‌డిపి ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఈ ఒప్పందం కుదురుతున్నది. కొత్త ప్రభుత్వం ఏర్పడిన తరువాత కూడా ఎన్నికలలో పోటీ చేసేందుకు సంబంధించిన అంశాలపై స్పష్టత రావలసివుంటుంది. సోషల్ డెమొక్రటిక్ పార్టీలో 4,60,000 మంది సభ్యులున్నారు. వీరంతా కలిసి పార్టీ ప్రధాన కార్యదర్శి, అధ్యక్షుడు తదితర ప్రధానమైన పోస్టులకు అభ్యర్థులను ఎన్నుకోవలసి వుంటుంది. గతంలో సంకీర్ణ ప్రభుత్వం ఏర్పాటుకు మర్కెల్ చేసిన ప్రయత్నాలన్నీ విఫలం కావడంతో దాదాపు 3 నెలలకుపైగా దేశంలో ప్రభుత్వం లేకుండా పోయింది. ప్రధానంగా సోషల్ డెమొక్రటిక్ పార్టీ నాయకుడు మార్టిన్‌షుల్జ్ కలిసిరాకపోవటం మూలంగానే ఒక ఒప్పందం ఇంతకాలం కుదరలేదు.

ఉ. కొరియాపై కఠిన ఆంక్షలు



టోక్యో : ఉత్తరకొరియాపైన అత్యంత కఠినమైన తీవ్రమైన ఆంక్షలను విధించే అవకాశం ఉందని అమెరికా ఉపాధ్యక్షుడు మైక్‌పెన్స్ తెలిపారు. జపాన్ ప్రధానమంత్రి షింజొఅబేతో కలిసి పెన్స్ మాట్లాడారు. అయితే ఎలాంటి ఆంక్షలు విధిస్తామన్న అంశం ఆయన ప్రకటించలేదు. ఒలింపిక్స్ క్రీడలవెనుక దాక్కోవటం కుదరదని పెన్స్ అన్నారు. ఉత్తరకొరియా పూర్తిగా అణ్వస్త్రరహితంగా రూపొందేవరకు జపాన్‌తో సహా తమ మిత్రదేశాలన్నీ గరిష్టంగా ఆదేశంపై ఒత్తిడి చేస్తాయని ఆయన అన్నారు. బాలిస్టిక్ క్షిపణుల ప్రయోగం శాశ్వతంగా ఆగిపోవాలని ఆయన కోరారు. పెన్స్ మంగళవారం రాత్రి ఇక్కడికి చేరుకున్నారు. శుక్రవారం సియోల్‌లో ప్రారంభంకానున్న ఒలింపిక్స్ క్రీడలకు ఆయన హాజరుకానున్నారు. టోక్యో చేరుకునేముందు ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఉత్తరకొరియా ఒలింపిక్స్ క్రీడలను అడ్డుపెట్టుకుని తన కార్యక్రమాలను కొనసాగించేందుకు కుదరదని అన్నారు. సియోల్ ఒలింపిక్స్‌లో పాల్గొనేందుకు ఉత్తరకొరియా భారీ క్రీడా బృందాన్ని పంపుతున్నది. ఉత్తర, దక్షిణ కొరియా క్రీడాకారులు ఒకే పతాకంకింద ఒలింపిక్స్ ప్రారంభం సందర్భంగా మార్చ్ జరపనున్నారు. ఈ ఒలింపిక్స్‌ను శాంతి ఒలింపిక్స్‌గా రెండు కొరియాలు భావిస్తున్నాయి.

బ్రెగ్జిట్‌పై మంత్రివర్గ కమిటీ ఏర్పాటు

లండన్ : బ్రెగ్జిట్‌పై ఈయూతో తదుపరి చర్చలు జరిపేందుకు బ్రిటన్ ప్రధానమంత్రి థెరిసామె వార్‌కేబినెట్ పేరుతో సీనియర్ మంత్రులతో కూడిన కమిటీని ఏర్పాటు చేశారు. సంక్లిష్టంగా ఉన్న సమస్యలను చర్చించి ఒక నిర్ణయానికి వచ్చేందుకు ఈ కమిటీ పనిచేస్తుంది. ఛాన్సలర్ ఫిలిప్‌హమ్మండ్, హోంశాఖమంత్రి అంబర్‌రడ్, వాతావరణ శాఖామంత్రి మైఖేల్‌గోవ్, విదేశాంగమంత్రి బోరిస్‌జాన్సన్‌లు ఈ వార్ క్యాబినెట్‌లో సభ్యులుగా ఉంటారు. ఈయూ నుంచి వైదొలగిన తర్వాత ఆ దేశాలతో బ్రిటన్ సంబంధాలు ఎలా ఉండాలన్న అంశంపై కూడా ఈ కమిటీ చర్చిస్తుంది. ఈయూతో జరిగే చర్చల్లో ఉత్తర ఐర్లాండ్ సరిహద్దు సమస్య, వలస సమస్యను కూడా చేరుస్తారని తెలుస్తోంది. బుధవారం వార్ క్యాబినెట్ సమావేశం అనంతరం గురువారం ఉదయం కూడా సమావేశమై ఈయూతో భవిష్యత్తులో వాణిజ్య సంబంధాలనుగురించి చర్చిస్తారు. ఈయూతో ఒప్పందం వారంలో కుదరవచ్చునని ప్రభుత్వవర్గాలు తెలియజేస్తున్నాయి. వార్ కేబినెట్‌కి ఉపసంఘంగా కేబినెట్ ఆఫీసు కార్యదర్శి డేవిడ్ లిడింగ్‌టన్, వాణిజ్య కార్యదర్శి గ్రెక్‌క్లార్క్, బ్రెగ్జిట్ రూపకల్పన చేసిన లియాంఫాక్స్ తదితరులు ఉంటారు. వీరికి సహాయంగా ఉత్తర ఐర్లాండ్ మంత్రి కరెన్‌బ్రాడ్లీ, రక్షణశాఖ మంత్రి గవిన్‌విలియంసన్ కూడా ఉంటారు. త్వరలో బ్రెగ్జిట్‌పైన ఒప్పందం కుదిరే అవకాశం కోసం చూస్తున్నామని క్లార్క్ తెలిపారు. ఉభయపక్షాలు అన్ని అంశాలపైన చర్చించేవరకు ఒప్పందాన్ని గురించి ఏమీ చెప్పలేమని ఆయన బీబీసీ రేడియో-4 టుడే ప్రోగ్రాంలో మాట్లాడుతూ అన్నారు. ఈయూతో వైదొలగే చివరిదశ అనేక సమావేశాల ద్వారా మాత్రమే కలుగుతుందని ఆయన చెప్పారు. బ్రిటన్ కస్టమ్స్ యూనియన్‌నుంచి కూడా వైదొలిగే అవకాశం ఉందని ప్రభుత్వ వర్గాలు తెలియజేస్తున్నాయి. మాజీ ఛాన్సలర్ కెన్‌క్లార్క్ మాట్లాడుతూ ఈయూతో కస్టమ్స్ యూనియన్‌లో ఏదోఒక రూపంలో కొనసాగడం మంచిదని హౌస్‌ఆఫ్‌కామన్స్ మెజారిటీ సభ్యులు భావిస్తున్నట్టుగా చెప్పారు.

సిరియా నుంచి సైన్యాన్ని ఉపసంహరించాలి

అమెరికాను కోరిన టర్కీ అధ్యక్షుడు ఎర్డొగన్



అంకారా : సిరియాలోఉన్న తమ సైన్యాన్ని అమెరికా ఉపసంహరించుకుని తిరిగి తమ దేశానికి తీసుకువెళ్లాలని టర్కీ అధ్యక్షుడు రిసెప్‌టయిప్ ఎర్డొగన్ కోరారు. ప్రాంతీయ ప్రభుత్వాలకు వ్యతిరేకంగా అమెరికా పనిచేస్తున్నదని ఎర్డొగన్ ఆరోపించారు. అమెరికాకు రకరకాల లెక్కలుంటాయని పార్లమెంటులో పాలక ఎకెపి పార్టీ ఎంపీలనుద్దేశించి మాట్లాడుతూ అన్నారు. ఇరాక్ నుంచి ఆఫ్ఘనిస్తాన్ వరకు తమ దళాలను వెనక్కు పిలిపిస్తామని పెంటగాన్ వెల్లడించిన తరువాత ఎర్డొగన్ పైవిధంగా సూచించారు. ఆయా దేశాల్లో తాము విజయం సాధించామని అమెరికా చెప్పుకున్నది. సిరియానుంచి దాయిష్ ఉగ్రవాదులను తరిమివేసినట్టు పెంటగాన్ పేర్కొంది. అక్కడ విజయం సాధించిన తరువాత ఇంకా మీ దళాలు అక్కడ ఎందుకు ఉన్నాయని ఎర్డొగన్ ప్రశ్నించారు. కుర్దిష్ ప్రజారక్షణ యూనిట్లకు పెంటగాన్ ఇంకా తన మద్దతును కొనసాగించడంపై తీవ్రంగా విమర్శించారు. గతంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చెప్పినదానికి ఇప్పుడు చేస్తున్నదానికి పొంతన లేకుండా ఉన్నదని, ఇప్పటికైనా వారికి మద్దతు ఇవ్వటం, ఆయుధాలివ్వటం మానుకోవాలని ఎర్డొగన్ సూచించారు. సిరియాలో పరిస్థితులు గతం కంటె మెరుగైన తరువాత అక్కడి కుర్దిష్ దళాలను అణచివేసే పేరుతో ఇటీవల టర్కీ అఫ్రిన్ నగరంపై దాడులు చేస్తున్నది. తమ సరిహద్దుల్లో ఏకాకిగావున్న అఫ్రిన్‌లో గెరిల్లా దళాలు వుంటూ తమకు ఇబ్బంది కలిగిస్తున్నాయని టర్కీ ఆరోపిస్తున్నది. సిరియా సైనిక దళాలు ఇసిస్ ఉగ్రవాదుల చెరలోవున్న 29 పట్టణాలను, గ్రామాలను విముక్తి గావించింది. అయితే ఈశాన్య ప్రాంతంలోని హమా రాష్ట్రంలో ఇంకా కొన్ని ప్రదేశాలలో ఇసిస్ ఉగ్రవాదులు ఉన్నారు. సిరియా, రష్యా సైనిక దళాలు తాజాగా వైమానికదాడులు నిర్వహిస్తున్నాయని ఈ దాడుల్లో డజన్లమంది చనిపోయారని బ్రిటన్ నుంచి పనిచేస్తున్న సిరియా మానవ హక్కుల పరిశీలక సంస్థ తెలియజేసింది.

కౌలు కబ్జా

(మొదటిపేజీ తరువాయి)

సీఆర్డీఏ కార్యాలయంలో మాయం కావటం మరింత అనుమానానికి తావిస్తోంది. రాజధానిగా అమరావతి ప్రాంతాన్ని ప్రకటించిన నాటి నుంచి పూర్తి స్థాయి అధికారాలు సీఆర్డీఏకి అప్పగించారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఎమ్మార్వో, వీఆర్వో పాత్రను పూర్తిగా తగ్గించేశారు. ఈ క్రమంలో సీఆర్డీఏ అధికారులు ఇష్టానుసారం వ్యవహరిస్తూ అక్రమాలకు తెర తీశారు.

అంతా అయిపోయాక...

లేని భూములు ఉన్నట్లు సృష్టించి మూడేళ్ల కౌలు ఇచ్చి అంతా జరిగిపోయిన తర్వాత విచారణ జరిపిస్తామంటూ సీఆర్డీఏ అధికారులు చెప్పటం సర్వత్రా విమర్శలకు తావిస్తోంది. అసలు భూమి ఉన్నదో లేదో పరిశీలించాల్సిన సీఆర్డీఏ డిప్యూటీ కలెక్టర్ ఎక్కడా పర్యవేక్షణ కనబరుస్తున్న దాఖలాలు కనిపించటం లేదు. మందడంలో జరిగిన భూస్కామ్‌లో అధికారుల పర్యవేక్షణ పూర్తిగా కొరవడింది. అసలు భూమి ఉన్నదీ లేనిదీ పరిశీలించాల్సిన అధికారులు నిర్లక్ష్య వైఖరి కనబరుస్తున్నారు. పైగా లంక భూముల విషయంలో అప్రమత్తంగా వ్యవహరించాల్సిన అధికారులు ఆ దిశగా చర్యలు చేపడుతున్న దాఖలాలు లేవు. కంప్యూటర్ ఆపరేటర్ వల్ల ఇంత భారీ కుంభకోణం జరిగిందని సీఆర్డీఏ అధికారులు చెప్పటం మరింత అనుమానాలు కలిగిస్తోంది. దీనిపై డిప్యూటీ కలెక్టర్ సాధన మాట్లాడేందుకు నిరాకరించగా, అంతకుముందు ఉన్న డిప్యూటీ కలెక్టర్ విధులు నిర్వహిస్తున్న సమయంలో ఈ భూస్కామ్ జరిగినట్లు తెలుస్తోంది. కంప్యూటర్ ఆపరేటర్‌పై నింద వేస్తున్నా...అతని ఒక్కడి వల్ల అయ్యే పని కాదని స్పష్టమవుతోంది. ఇందులో ఎవరి పాత్రలు ఉన్నాయి అనేది ఆసక్తికరంగా మారింది. నిష్పక్షపాత విచారణ జరిగితే కానీ నిజాలు బయటికి రావని రాజకీయ పార్టీల నేతలు వ్యాఖ్యానిస్తున్నారు.

గతంలోనూ మందడంలోనే..

వెలగపూడి సచివాలయానికి కూతవేటు దూరంలో గల మందడం గ్రామంలో ఈ కుంభకోణం జరిగింది. గతంలోనూ ఇదే తరహా స్కామ్ జరిగింది. అప్పట్లో సంచలనమైన ఈ కేసులో పోలీసులు పలువురిని అరెస్టు చేశారు. అప్పట్లో రైతుల సంతకాలు ఫోర్జరీ చేసి కౌలు డబ్బులు కాజేశారు. ఆ కేసులోను పాత గుంటూరుకి చెందిన నిందితులే ఉండటం విశేషం. మొత్తం 16 లక్షల రూపాయలు జమ చేసిన అనంతరం అనుమానం వచ్చిన అధికారులు పోలిసులను ఆశ్రయించారు. వెంటనే స్పందించిన పోలీసులు నిందితులని అదుపులోకి తీసుకొని ఎనిమిది లక్షల సొమ్ము రికవరీ చేసి.. మమ అనిపించారు. అంత జరిగినా పాఠాలు నేర్చుకోని సీఆర్డీఏ అధికారులు ఏ మాత్రం తమ పద్ధతి మార్చుకోపోగా మరో స్కామ్‌కి అవకాశం కల్పించారు. ఇదే మాదిరిగా గతంలోనూ మంగళగిరి, నీరుకొండ, ఇతర సీఆర్డీఏ కార్యాలయాల్లో రైతుల భూముల విషయంలో అవకతవకలకి పాల్పడటం పోలీస్ స్టేషన్లను ఆశ్రయించిన ఘటనలు చోటుచేసుకున్నాయి. రైతులు ఇచ్చిన భూములలో కొంత భూమిని రికార్డులలో లేకుండా చేసి వాటిని మరొకరి పేరుపై చూపించి స్వలాభాలకు పాల్పడ్డ ఘటనలు ఉండటం అప్పట్లో రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. రాజధాని భూములు తరుచూ వివాదాల్లో ఉండటం సర్వ సాధారణంగా మారింది. భవిష్యత్తులో మరెన్ని వివాదాలు, చీకటి కోణాలు వెలుగులోకి వస్తాయో అనేది సర్వత్రా చర్చనీయాంశంగా మారింది.

విచారణ కమిటీ...

భూస్కామ్‌పై సీఆర్డీఏ కమిషనర్ చెరుకూరి శ్రీధర్ స్పందిస్తూ భూ అక్రమదారులు, కబ్జాకోరులపై క్రిమినల్ కేసులు నమోదు చేయించనున్నట్లు చెప్పారు. సీఆర్డీఏ అదనపు కమిషనర్ సగిలి షన్మోహన్ అధ్వర్యంలో విచారణ కమిటీ వేశామని అన్నారు. త్వరలోనే నివేదిక వస్తుందని, అనంతరం బాధ్యులపై క్రిమినల్ చర్యలు తీసుకుంటామన్నారు. కంప్యూటర్ ఆపరేటర్ ఆధ్వర్యంలో రికార్డులు ఒకేరోజు తారుమారు చేశారని చెప్పారు. 30 రోజుల పనిని త్వరగా పూర్తి చేయటం, రెవెన్యూ రికార్డుల్లో లేని గౌస్ ఖాన్ పేరుతో కుంభకోణానికి పాల్పడటం చట్టవ్యతిరేకమని చెప్పారు. డిప్యూటీ కలెక్టర్ లేదా డిప్యూటీ తహసీల్దార్, కాంపిటేటివ్ అథారిటీ ఎవరి పాత్ర ఉన్నా కఠిన చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు. పారదర్శకంగా రైతులకు ప్లాట్లు కేటాయిస్తున్నామన్నారు. ప్రతి పనిలో పారదర్శకత ఉండేలా సీఆర్డీఏ కార్యకలాపాలు నిర్వహిస్తున్నదని శ్రీధర్ వెల్లడించారు..

కబ్జా చేశారు : వెంకట్రావు

వాస్తవంగా ఈ భూమి మందడం గ్రామానికి చెందిన ఆలూరి వెంకట్రావు అనే రైతుది. వెంకట్రావుకి కరకట్ట వెంబడి మూడు ఎకరాల 84 సెంట్ల పొలం ఉంది. కరకట్ట రోడ్ నిర్మాణంలో 63 సెంట్లు ప్రభుత్వానికి ఇచ్చాడు. మిగిలిన రెండు ఎకరాల 21 సెంట్లు భూమిని అమ్ముకున్నాడు. అమ్మిన భూమి పోగా వెంకట్రావుకి 95 సెంట్ల పొలం ఉంది. రాజధాని ప్రకటించిన తరువాత తనకున్న 95 సెంట్ల భూమిని ల్యాండ్ పూలింగ్‌కి ఇచ్చాడు. మొదటి సంవత్సరం కౌలు తీసుకున్నాడు. తనకు క్యాన్సర్ వ్యాధి రావడంతో వైద్యం కోసం వేరే ప్రాంతానికి వెళ్లాడు. ఆరోగ్యం మెరుగు పడిన తరువాత స్వగ్రామానికి తిరిగి వచ్చాడు. సీఆర్డీఏ నుండి రావాల్సిన కౌలు కోసం సీఆర్డీఏ కార్యాలయానికి వెళ్లి అడుగగా, ఈ భూమి మీ పేరుమీద లేదు అని అధికారులు బదులిచ్చారు. అధికారుల సమాధానానికి వెంకట్రావు నివ్వెరపోయాడు. ఇలా ఎందుకు జరిగిందో చెప్పండని సీఆర్డీఏ ల్యాండ్ డైరెక్టర్ చెన్నకేశవరావుని వెంకట్రావు అడిగాడు. విచారణ జరపాలని చెన్నకేశవరావు అధికారులను ఆదేశించారు. మందడం సీఆర్డీఏ డిప్యూటీ కలెక్టర్ కేఈ సాధన, తనగోడు పట్టించుకోకుండా వదిలేశారని వెంకట్రావు ఆవేదన వ్యక్తం చేశారు. వెంకట్రావు 2.26 ఎకరాల పొలం కొన్న వారే 95 సెంట్ల పొలాన్ని కబ్జా చేశారని, నకిలీ పత్రాలు సృష్టించారని వెంకట్రావు తెలిపాడు. ఆ నకిలీ పత్రాలు సీఆర్డీఏ అధికారులకు ఇచ్చి..దర్జాగా కౌలు సొమ్ము అనుభవిస్తున్నారని వెంకట్రావు గోడు వెళ్లబుచ్చాడు. ఇదే తన జీవనాధారమని, తన వయస్సు 83 ఏళ్లని ఆవేదన చెందాడు. తన భూమి కోసం న్యాయ పోరాటం చేస్తానని చెప్పాడు.

రాజధానిలో మరో వర్సిటీ

(మొదటిపేజీ తరువాయి)

కొనియాడారు. నేడు చాలా యూనివర్సిటీలు వస్తున్నాయని, ప్రైవేటు యూనివర్సిటీల్లో అమృత యూనివర్సిటీ మొదటిదని, దేశంలోనే తొమ్మిదవ స్థానంలో ఉందన్నారు. ఏసియాలోనే అమృత యూనివర్సిటీ 168వ స్థానంలో నిలవడం సంతోషించదగిన విషయమన్నారు. ఆమె స్థాపించిన విశ్వవిద్యాలయం అమరావతి రాజధానిలో ఏర్పాటు చేయడం తనకెంతో సంతోషంగా ఉందన్నారు. అమృతా యూనివర్సిటీ ఏర్పాటుతో రాజధాని ప్రాంతానికే సరికొత్త శోభ రానుందన్నారు. రాజధానిలో అమృత యూనివర్సిటీకి 150 ఎకరాలు ఇచ్చామని, మరో 50 ఎకరాలు ఇచ్చేందుకు అంగీకరించామన్నారు. విశ్వవిద్యాలయంలో సైన్స్, ఇంజనీరింగ్, మేనేజ్‌మెంట్, హ్యూమనిటీస్ క్యాంపస్‌లు ఉంటాయన్నారు. ఇక విశ్వవిద్యాలయం వారు టెక్నాలజీని సమర్థవంతంగా వినియోగించుకుంటూ ముందుకుసాగనున్నారన్నారు. మరో ప్రక్క అమృత హెల్త్‌సిటీ క్యాంపస్‌లో 750 పడకల ఆసుపత్రి, 1500 పడకల మల్టీ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి, డెంటల్, ఫార్మసీ, నర్సింగ్, నేచురోపతి, ఆయుర్వేద, ఇంటిగ్రేటెడ్ హెల్త్ కళాశాలతో పాటు రీసెర్చ్ సెంటర్ ఏర్పాటు చేయనున్నారన్నారు. ఈ విశ్వవిద్యాలయంలో దాదాపు 45వేల నుంచి 50వేల మంది పిల్లలు చదువుకునే అవకాశం ఉందని, రానున్న విద్యాసంవత్సరం నుంచి తరగతులు ప్రారంభం అవుతాయన్నారు. ఇక ఇప్పటికే రాజధానిలో ఎస్‌ఆర్‌ఎం, విట్ విశ్వవిద్యాలయాలు పనులు ప్రారంభించాయని గుర్తు చేశారు. నూతన రాజధానిలో 9 సిటీలు రానున్నాయని, అందులో నాలెడ్జ్ సిటీ, హెల్త్‌సిటీ, ఫైనాన్స్ సిటీ, టూరిజం సిటీ, ప్రభుత్వ అడ్మినిస్ట్రేషన్ సిటీ, జస్టిస్ సిటీ, ఎలక్ట్రానిక్ సిటీ, స్పోర్ట్స్‌సిటీ, మీడియా అండ్ కల్చరల్ సిటీ ఉంటాయన్నారు. రాజధాని ప్రాంతంలో ఇంకా మంచి యూనివర్సిటీలను తీసుకువస్తున్నామన్నారు. భారతదేశంలోనే ఏ సిటీలో లేని విధంగా రాజధాని ప్రాంతంలో 14 నుంచి 15 మెడికల్ కళాశాలలు అమరావతిలో ఏర్పాటు కానున్నాయన్నారు. మెడికల్ కళాశాలల ఏర్పాటుతో రాజధాని హెల్త్ హబ్‌గా తయారుకావడంతో పాటు మెడికల్ టూరిజంగా అభివృద్ధి చెందనుందన్నారు. రాజధాని ప్రాంతంలో అయిదు నిమిషాల్లో ఆసుపత్రికి, 10 నిమిషాల్లో నడిచి కార్యాలయానికి, 15 నిమిషాల్లో పార్కుకు, సినిమా థియేటర్‌కు వెళ్లే విధంగా కృషి చేస్తున్నామన్నారు. మంగళగిరి, తెనాలి పట్టణాలను అనుసంధానం చేసి మెగాసిటీగా అభివృద్ధి చేస్తామన్నారు. రాష్ట్ర మంత్రులు కామినేని శ్రీనివాస్, పి నారాయణ, గంటా శ్రీనివాస్, ఎంఎల్‌సీ రామకృష్ణ, ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు, జెడ్పీ ఛైర్మన్ జానీమూన్, అమృత ఇనిస్టిట్యూట్ డైరెక్టర్ డాక్టర్ ప్రేమ్‌నాయర్, స్వామి అమృతా స్వరూపానంద పురి, డాక్టర్ వెంకట్‌రంగన్, బ్రదర్ సదాశివ చైతన్య, సీఆర్‌డీఏ కమిషనర్ చెరుకూరి శ్రీధర్, కలెక్టర్ కోనా శశిధర్. అర్బన్ ఎస్పీ విజయారావు, డీసీసీబీ ఛైర్మన్ ఎం వెంకటసుబ్బయ్య, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి గంజి చిరంజీవి, జెడ్పీటీసీ ఆకుల జయసత్య తదితరులు పాల్గొన్నారు.రాజధాని ప్రాంతాన్ని బ్లూ,గ్రీన్ సిటీగా అభివృద్ధి చేస్తామన్నారు.

విషం కక్కిన మోడీ..

(మొదటిపేజీ తరువాయి)

నిర్మించింది. అభివృద్ధి విషయంలో ప్రతిపక్ష నియోజకవర్గమా? మన నియోజకవర్గమా? అనే భేదం లేదు. ఖర్గే నియోజకవర్గం బీదర్‌లో వాజ్‌పేయి ప్రభుత్వం 1020 కిలోమీటర్ల మేర రైల్వేలైన్ నిర్మించింది... ఖర్గే రైల్వేమంత్రిగా ఉండి ఏం చేశారో చెప్పాలి' అని మోడీ డిమాండు చేశారు. ఇచ్చిన హామీల మేరకు ఈశాన్య రాష్ట్రాల్లో అభివృద్ధి పనులు ప్రారంభించాం. యూపీఏ కంటే తమ ప్రభుత్వమే అత్యధిక గ్రామాల్లో ఫైబర్‌నెట్ వ్యవస్థ ఏర్పాటు చేసింది. మోడీ వస్తే ఆధార్‌కు మంగళం పాడతారని ప్రతిపక్షం ప్రచారం చేసింది. ఆధార్ వ్యవస్థను బలోపేతం చేసే సరికి ఇప్పుడు ఆధార్‌ను వద్దంటోంది. సమతుల అభివృద్ధిని ప్రతిపక్షం ఇన్నాళ్లు సాధించలేకపోయింది. తాము చేసి చూపించామన్నారు. ప్రతిపక్షం కళ్లు మూసుకుని ఉన్నందునే ఉపాధి కల్పన పెరిగినా చూడలేకపోతోంది. కేరళ, పశ్చిమబెంగాల్, ఒడిశా, కర్ణాటకలో కోటి మందికి ఉపాధి కల్పించాం... కర్ణాటకలో ప్రభుత్వం ఎంతమందికి ఉపాధి కల్పించిందో కాంగ్రెస్ చెప్పాలని మోడీ ప్రశ్నించారు. అవినీతి, దళారి వ్యవస్థకు తాము కళ్లెం వేసినందుకు ప్రతిపక్షం బాధపడుతోందని ఎద్దేవా చేశారు. తమ హయంలో అతి పొడవైన సొరంగం, అత్యంత వేగవంతమైన రైళ్లు, గ్యాస్ పైప్‌లైన్లు వచ్చాయన్నారు. దేశంలో ఇప్పటికీ 20 కోట్ల మందికి విద్యుత్తు సరఫరా జరగటం లేదన్నారు. తమ ప్రభుత్వం విద్యుదుత్పాదన పెంచిందన్నారు. విద్యుత్తు సరఫరాలో 83 శాతం ప్రగతి సాధించామన్నారు. ఎల్‌ఈడీ బల్బుల పంపిణీతో రూ.15వేల కోట్లు ఆదా చేశామని మోడీ అన్నారు.

రాజ్యసభలోనూ....

రాజ్యసభలోనూ కాంగ్రెస్‌పై మోడీ దుమ్మెత్తిపోశారు. కాంగ్రెస్‌ను ఏకి పారేశారు. రాజ్యసభలో ఆయన మాట్లాడుతూ, "ఆయుష్మాన్ పథకాన్ని మీరు అమెరికా, బ్రిటన్ పథకాలతో పోల్చుతున్నారు. ఆ దేశాలకు, మనకు చాలా తేడా ఉంది. 50 ఏళ్లకు పైగా పరిపాలించిన మీరు చేసిందేమిటి. మా పథకాల మీద ఎల్లప్పుడూ సలహాలు, సూచనలు స్వీకరిస్తాం. ఈ దేశం కోసం, పేదల కోసమే మేము పనిచేస్తున్నది. బీజేపీపై అభాండాలు వేయడానికి ప్రయత్నిస్తూ... ఏకంగా ఈ దేశాన్నే అప్రతిష్టపాలు చేస్తున్నారు. గాంధీజీ కలలు కన్న స్వరాజ్యమే నేను కూడా కావాలనుకుంటున్నది. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత గాంధీజీ కాంగ్రెస్ అవసరం ఇక లేదన్నారు. నేను కూడా అదే చెబుతున్నాడు. గాంధీజీ చెప్పినట్లే.. మన దేశానికి కాంగ్రెస్ అవసరం లేదంటున్నాను. మేము నేమ్ చేంజర్స్ మాత్రమే.. గేమ్ చేంజర్స్ కాదు అని మీరు అన్నారు. కాని.. మేము అధికారంలోకి వచ్చిన తర్వాత మేము చేపట్టిన పథకాలు, అభివృద్ధి పనులను చూస్తేనే అర్థమవుతుంది.. మేము ఓ లక్ష్యంతో పరుగులు తీస్తున్నామని.. ఓ లక్ష్యం కోసం పని చేస్తున్నామని. కాంగ్రెసే ఆధార్ తీసుకొచ్చిందని చెబుతుంటుంది.. కాని.. 1998లో రాజ్యసభలో జరిగిన ఓ చర్చను ఇప్పుడు నేను గుర్తు చేయాలనుకుంటున్నాను. అప్పుడు ఎల్‌కే అద్వాని ప్రసంగంలోనే ఆధార్ మూలాలు ఉన్నాయి. అంటే.. ఆధార్‌కు అప్పట్లోనే పునాది పడిందనే విషయాన్ని మీరు గుర్తు పెట్టుకోవాలి' అని అన్నారు.

ప్రతిపక్షాలు వాకౌట్

లోక్‌సభలో ప్రధాని గంటన్నరపాటు ప్రసంగించిన తరువాత వామపక్షాల సహా ప్రతిపక్ష పార్టీలన్నీ వాకౌట్ ప్రకటించాయి. రాఫెల్ కుంభకోణం నుంచి ఏపీ విభజన సమస్యలపై ప్రతిపక్షం అడిగిన ఒక్క ప్రశ్నకు ప్రధాని సమాధానం ఇవ్వలేదని ప్రతిపక్షాలు ఆగ్రహం వ్యక్తం చేశాయి.

టీఎంసీ నాయకుడు కల్యాణ్ బెనర్జీ, కాంగ్రెస్ నేత రాజీవ్ సతవ్ మాట్లాడుతూ, తాము అడిగిన ఒక్క ప్రశ్నకూ ప్రధాని సమాధానం ఇవ్వలేదని, అందుకే తాము వాకౌట్ చేస్తున్నట్లు ప్రకటించారు. ఇదిలా ఉంటే, మోడీ ప్రసంగం ఆద్యంతం కాంగ్రెస్, వామపక్షాల సభ్యులు నినాదాలు చేశారు. రాఫెల్ కుంభకోణం, విశాఖకు రైల్వే జోన్, ఆంధ్రప్రదేశ్‌కు నిధులను కేటాయించాలని నినాదాల్లో డిమాండు చేశారు.

హామీల ఊసేలేదు

(మొదటిపేజీ తరువాయి)

ఏపీ సమస్యలను పట్టించుకోలేదన్నారు. తొలుత టీడీపీ నేత గాలి ముద్దుకృష్ణమ నాయుడి మృతికి సంతాపం తెలిపారు. విభజన సమయంలో యూపీఏ ఏపీకి న్యాయం చేయలేదని, ఈ విషయాన్ని తాను ప్రధాని మోడీకి అప్పుడు వివరించానని చెప్పారు. విభజన హామీల అమలుకు జేఏసీని ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని పవన్ అభిప్రాయపడ్డారు. వామపక్షాల బంద్‌కు మద్దతు ప్రకటించారు. రాష్ట్ర విభజన నేపథ్యంలో బీజేపీ తన మేనిఫెస్టోలోని అంశాలను నెరవేర్చాలని పవన్ కళ్యాణ్ అన్నారు. రాష్ట్ర విభజన శాస్త్రీయ పద్ధతిలో జరగలేదని, రాష్ట్రాన్ని యూపీఏ అడ్డగోలుగా విభజించిందన్నారు. ఇదే విషయాన్ని నాడు మోడీకి చెప్పి, మీరు న్యాయం చేయాలని కోరానని తెలిపారు. సాకులు చెప్పి హోదాను ప్యాకేజీగా మార్చారు, ఏపీకి అండగా ఉంటారనే ఎన్నికలకు ముందు మోడీతో కలిశానని చెప్పారు. హామీలపై తాను తొలి ఏడాది సంయమనం పాటించానని చెప్పారు. "ప్రస్తుతం టీడీపీ పైనా నమ్మకం పోతోంది, అవినీతి ఆరోపణల నేపథ్యంలో ఏపీ పరిస్థితి చూస్తుంటే టీడీపీపై బీజేపీకి నమ్మకం పోతోందన్నారు. టీడీపీ పైనా తనకు నమ్మకం పోతోందన్నారు. ఏపీలో అవినీతి ఎక్కువగా జరుగుతోందని సర్వేలు చెబుతున్నాయన్నారు. ప్రత్యేక హోదాను ఎవరూ పట్టించుకోలేదన్నారు. వైసీపీ తీరును కూడా పవన్ తప్పుబట్టారు. ఏపీకి న్యాయం జరిగేందుకు ఓ జాయింట్ యాక్షన్ కమిటీ ఏర్పాటు చేసి పోరాటం చేయాలన్నారు. అందరు ఓ ఫ్లాట్ ఫాం పైకి వచ్చి పోరాడితే బాగుంటుందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లో లోపాలు ఉన్నాయని చెప్పారు. 2014 ఎన్నికల సమయంలో నేను పోటీ చేసి ఉంటే ఈ రోజు బలమైన గొంతు తనకు ఉండేదని, ప్రజల పక్షాన తన వాణి వినిపించేవాడినేమో అని పవన్ అన్నారు. ఇటు శాసన సభలో, అటు పార్లమెంటులో సీట్లు గెలిచి ఏపీ కోసం గట్టిగా నిలదీసేవాడిని అన్నారు. ఈ విషయంలో (నాడు తాను పోటీ చేయకపోవడంపై) బాధపడుతున్నానని చెప్పారు. ప్రత్యేక హోదా కోసం లోక్‌సత్తా నేత జయప్రకాశ్ నారాయణ, ఉండవల్లి అరుణ్ కుమార్, ఇతర మేధావులతో కలిసి ముందుకు సాగుతామన్నారు. నాడు తెలంగాణ కోసం అందరూ కలిసి సభలను స్తంభింప చేశారన్నారు. ఏపీకి హామీల విషయంలో అలా కలిసి పోవడం లేదన్నారు. ప్లకార్డులతో పనులు జరగవన్నారు. జేఏసీ ఏర్పాటు చేస్తా, అధికార పార్టీతో సంబంధం లేకుండా ప్రత్యేక హోదా కోసం జేఏసీ ఏర్పాటు కావాలని పవన్ కళ్యాణ్ అన్నారు. "ప్రత్యేక ప్యాకేజీపై గందరగోళం ఉంది, పలువురు రకరకాలు చెబుతున్నారు. బీజేపీ చాలా ఇచ్చినట్టు చెబుతోంది. ఏమీ ఇవ్వలేదని టీడీపీ చెబుతోంది. ఇచ్చిన నిధులకు లెక్కలు అడుగుతుంటే ఏపీ ప్రభుత్వం రహస్యం పాటిస్తోందన్నారు. శాంతియుత ధర్నాలకు జనసేన మద్దతు ఉంటుందని చెప్పారు.

నేడు బంద్

(మొదటిపేజీ తరువాయి)

బంద్‌కు మద్దతునిచ్చాయి. వ్యాపారలావాదేవీలను నిలిపివేసి తమ నిరశన వ్యక్తం చేయాల్సిందిగా వ్యాపార,వాణిజ్య సంఘాల ప్రతినిధులు కోరుతున్నారు. బంద్‌ను పురస్కరించుకొని బుధవారం రాత్రి నుంచి ఎగుమతి, దిగుమతులను పూర్తి చేసుకొని 8వ తేదీన అన్ని లారీలు బంద్‌లో పాల్గొనాలని ఏపీ లారీ ఓనర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వైవీ ఈశ్వరరావు పిలుపునిచ్చారు. అలాగే బంద్‌కు ఏపీఎస్‌ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ నేతలు సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ఇంకా ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు జయంతి వెంకటేశ్వర్లు బుధవారం మద్దతు ప్రకటించారు. బంద్‌కు సహకరించాలని సంఘం సభ్యులు, అనుయాయులకు విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా ప్రైవేటు విద్యాసంస్థలతోపాటు పాఠశాలలు, కళాశాలలు స్వచ్ఛందంగా మూసివేయాలని విద్యార్థి, యువజన సంఘాల నాయకులు కోరారు. దీంతో ప్రైవేటు విద్యా సంస్థల యాజమాన్యాలు సెలవు ప్రకటించాయి. అలాగే అధికారులు కూడా పాఠశాలలు, కళాశాలలకు సెలవును ప్రకటించారు. బస్సులను నడపకూడదని ఏపీఎస్‌ఆర్టీసీ యాజమాన్యం నిర్ణయించడంతో బస్సులన్నీ డిపోలకే పరిమితం కానున్నాయి. బంద్ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా విజయవాడ సహా పలు నగరాలు, పట్టణాలు, జిల్లా కేంద్రాల్లో భారీగా పోలీసులను మోహరించారు.

12న 'డార్విన్‌కు క్షమాపణలతో'..

ప్రోగ్రెసివ్ ఫోరమ్ కృష్ణాజిల్లా ప్రధాన కార్యదర్శి బుడ్డిగ జమీందార్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: విజయవాడ ఐఎంఏ హాలులో ఈ నెల 12వ తేదీ సాయంత్రం 5.30 గంటలకు 'డార్విన్‌కు క్షమాపణలతో' అంశంపై కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని కృష్ణాజిల్లా ప్రోగ్రెసివ్ ఫోరమ్(ఏఐపీఎఫ్) ప్రధాన కార్యదర్శి బుడ్డిగ జమీందారు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.కృష్ణాజిల్లా ఏఐపీఎఫ్ ఆధ్వర్యాన డార్విన్ 210 జయంతిని పురస్కరించుకుని ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామన్నారు. ప్రముఖ హేతువాది గోగినేని బాబు ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రసంగిస్తారని, సభలో డ్వారిన్‌పై వీడియో ప్రదర్శన ఏర్పాటు చేస్తామని వివరించారు.

ఏపీ బీసీ స్టడీ సర్కిల్‌లో 'డీఎస్సీ' ఉచిత కోచింగ్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఏపీ బీసీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యాన డీఎస్సీ(ఎస్జీటీ, ఎస్ఏ) అభ్యర్థులకు ఉచిత కోచింగ్ ఇవ్వనున్నామని స్టడీ సర్కిల్ డైరెక్టరు ఆర్.యుగంధర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.ఈ శిక్షణకు బీసీ,ఎస్సీ,ఎస్టీ అభ్యర్థులు అర్హులని పేర్కొన్నారు.డీఈడీ, బీఈడీ చదివి డీఎస్సీకి దరఖాస్తు చేయబోయే అభ్యర్థులు శిక్షణకు అర్హులని వివరించారు.ప్రతిభ ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేస్తామని తెలిపారు.డీఎస్సీతోపాటు ఎస్‌బీఐ జూనియర్ అసోసియేట్స్, ఆర్ఆర్‌బీలకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నామని వివరించారు.ఎంపికైన అభ్యర్థులకు విజయవాడ గుణదలలోని బీసీ స్టడీ సర్కిల్ కార్యాలయంలో ఉచితంగా శిక్షణ ఇస్తామని తెలిపారు. పూర్తి వివరాలతో ఈ నెల 17లోగా 'ఏపీ బీసీ స్టడీ సర్కిల్, డోరు నంబరు-47-10-17, పులికట్ల స్ట్రీట్, గుణదల, విజయవాడ-520004' చిరునామాకు పంపాలని కోరారు. పూర్తి వివరాల కోసం బీసీ స్టడీ సర్కిల్ కార్యాలయం ఫోను నంబరు-0866 2454008'న సంప్రదించాలని తెలిపారు.



బెల్ట్ షాపులొద్దు : దినేష్ కుమార్

విశాలాంధ్ర-అమరావతి : ప్రభుత్వ హెచ్చరికలు పెడచెవినపెట్టి బెల్టు షాపులు నిర్వహించే వారిపై కఠిన చర్యలు తీసుకొని ఆయా షాపుల లైసెన్సులను రద్దుచేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి దినేష్ కుమార్ ఆదేశించారు. సచివాలయంలోని తన కార్యాలయంలో రాష్ట్రంలో బెల్ట్ షాపుల నిరోధంపై తీసుకుంటున్న చర్యల గురించి ఎక్సైజ్ అధికారులతో బుధవారం ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. బెల్ట్ షాపుల నిరోధానికి తీసుకుంటున్న చర్యలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా రాష్ట్ర ఎక్సైజ్ శాఖ ముఖ్యకార్యదర్శి డి.సాంబశివరావు సీఎస్ కు వివరించారు. గతేడాది జులై 18న రాష్ట్ర మంత్రి మండలి బెల్ట్ షాపులు మూసివేయాలని నిర్ణయించిన నాటి నుంచి నేటి వరకూ రాష్ట్ర వ్యాప్తంగా 8,827 కేసులు నమోదు చేశామన్నారు. 9,192 మందిని అరెస్టు చేయగా, 331 వాహనాలను సీజ్ చేశామన్నారు.

బెల్ట్ షాపులకు మద్యం సరఫరా చేసినట్లు గుర్తించిన 265 మద్యం షాపులను మూసివేయించామన్నారు. పరిష్కార వేదిక 1100 ద్వారా 7,649 ఫిర్యాదులు రాగా, 7,641 పరిష్కారాలు చూపామన్నారు. ఎక్సైజ్ శాఖ ప్రధాన కార్యాలయంలో ఉన్న టోల్ ఫ్రీ కంట్రోల్ నెంబర్‌కు వస్తున్న ఫిర్యాదులకు పరిష్కారాలు చూపుతున్నామన్నారు. బెల్ట్ షాపుల నిర్వహణలో ఎక్సైజ్ సిబ్బంది పాత్ర ఉంటే, వారిని విధుల నుంచి తొలగించాలని సీఎస్ ఆదేశించారు. సీజ్ చేసిన వాహనాలను ఎప్పటికప్పుడు వేలం వేయించి విక్రయించాలని, ప్రతి మూడు నెలలకొకసారి ఈ వేలం ఈ ప్రక్రియ చేపట్టాలన్నారు. బెల్లు షాపులకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున ప్రచారం చేసి, ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని సూచించారు. ఈ సమీక్షా సమావేశంలో డీజీపీ ఎం.మాలకొండయ్య, రాష్ట్ర ఎక్సైజ్ శాఖ ప్రత్యేక కమిషనర్ లక్ష్మీనృసింహం, డైరెక్టర్ ఆఫ్ ఎన్ ఫోర్స్ మెంట్ కె.వేంకటేశ్వరరావు, అడిషనల్ డైరెక్టర్ జనరల్ నరేష్ కమార్ గుప్తా పాల్గొన్నారు.

అవినీతిలో ఏపీ నంబరు ఒన్

మాజీ ఎమ్మెల్సీ సి.రామచంద్రయ్య

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: అవినీతిలో రాష్ట్రాన్ని నంబరు ఒన్‌గా మార్చారని, బడ్జెట్టులో అన్యాయంపై సీఎం చంద్రబాబు ఎందుకు నోరు మెదపట్లేదని కాంగ్రెస్ నాయకులు, మాజీ ఎమ్మెల్సీ సి.రామచంద్రయ్య ఎద్దేవా చేశారు.ఈ మేరకు బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. కేంద్ర బడ్జెట్టులో ఏపీకి జరిగిన అన్యాయంపై వివిధ రాజకీయ శ్రేణులు గళాలను గట్టిగా విన్పిస్తున్నారని పేర్కొన్నారు.రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా వున్న చంద్రబాబు నాయుడు ఇంతవరకూ ప్రజల ముంగిటకు వచ్చి..బడ్జెట్టులో నెలకొన్న అన్యాయంపై ఆయన స్పందించలేదని తెలిపారు.కేంద్రతో పోరాడుతున్నట్లు ప్రజల ముందు సీఎం నటిస్తున్నారని విమర్శించారు. రాష్ట్ర ప్రజల మనోభావాలకు సంబంధం లేనట్లుగా ఆయన వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు.

ఎక్సైజ్‌శాఖలో సమ్మెలు నిషేధం

విశాలాంధ్రబ్యూరో - అమరావతి : ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్‌శాఖలో ప్రభు త్వం సమ్మెను నిషేధించింది. ఆ శాఖలో పని చేస్తున్న ఉద్యోగులు సమ్మెలు చేయకూడదంటూ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి (పొలిటికల్) డీ సాంబశివరావు జీఓఆర్‌టీ నంబర్ 200ను బుధవారం జారీ చేశారు. ఎక్సైజ్ సర్వీసెస్, సబ్ క్లాజ్ (6), క్లాజ్ (ఏ), సెక్షన్ 2లో సబ్ సెక్షన్ (1) ప్రకారం సమ్మెలను నిషేధించినట్లు తెలిపారు. ఎక్సైజ్‌శాఖలో సమ్మె నిషేధం ఆరు నెలలపాటు అమలులో ఉంటుందని ఆయన పేర్కొన్నారు.

కమ్యూనిజం అజరామరం

- శ్రమజీవులు, కష్టజీవుల గుండెచప్పుడు
- హామీల అమలులో మోడీ విఫలం
- రాష్ట్రానికి బీజేపీ తీరని అన్యాయం
- అవినీతిలో కాంగ్రెస్‌ను మించిన టీడీపీ
- కష్టజీవులకు అధికారం రావాలి
- అంతిమలక్ష్యం రాజ్యాధికారమే
- సీపీఐ రాష్ట్రకార్యదర్శి కె.రామకృష్ణ



విశాలాంధ్ర బ్యూరో-కర్నూలు : కమ్యూనిజం అజరామరమని, శ్రమజీవులు, కష్టజీవులు ఉన్నంత కాలం కమ్యూనిస్టుపార్టీ వారికోసం పోరాడుతూనే ఉంటుందని సీపీఐ రాష్ట్రకార్యదర్శి కె రామకృష్ణ అన్నారు. సీపీఐ 22వ జిల్లా మహాసభలు నగరంలోని దేవీఫంక్షన్ హాలులో బుధవారం ప్రారంభమయ్యాయి. ముఖ్యఅతిథులుగా సీపీఐ రాష్ట్రకార్యదర్శి వర్గసభ్యులు పీజే చంద్రశేఖరరావు, పి హరినాథరెడ్డి, రాష్ట్రకార్యవర్గ సభ్యులు పి.రామచంద్రయ్య పాల్గొన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కె జగన్నాథం, ఎన్.రంగనాయుడు, ఏఐఎస్ఎఫ్ రాష్ట్రప్రధాన కార్యదర్శి జి.రంగన్న, మహిళా సమాఖ్య నాయకురాలు పి.గిడ్డమ్మ, రైతుసంఘం నాయకులు అయ్యప్పగౌడ్ అధ్యక్ష వర్గంగా వ్యవహరించగా రామకృష్ణ మహాసభలను ప్రారంభించారు. రామకృష్ణ మాట్లాడుతూ 2018 సంవత్సరాన్ని పోరాటాల సంవత్సరంగా మార్చాలని, అందుకు అందరూ సిద్ధంగా ఉండాలన్నారు. కమ్యూనిస్టు పార్టీ కష్టజీవుల పార్టీ అని, కష్టజీవులకు రాజ్యాధికారం రావాలన్నారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా పోటీ చేయడానికి అందరూ సిద్ధంగా ఉండాలన్నారు. యూపీఏ ప్రభుత్వం అన్ని రంగాల్లో విఫలంకావడం, మితిమీరిన కుంభకోణాలతో 2014లో బీజేపీ అధికారంలోకి వచ్చిందన్నారు. శుష్కవాగ్దానాలతో మోడీ ప్రజలను మోసగించారని రామకృష్ణ విమర్శించారు. విదేశాల్లో ఉన్న నల్లధనాన్ని వెనక్కు తెప్పిస్తానని, రైతులకు మద్దతు ధర కల్పిస్తామని, అధిక ధరలు తగ్గిస్తానని ఇచ్చిన హామీలు తుంగలో తొక్కారన్నారు. మోడీ అధికారంలోకి వచ్చిన తరువాత ఆర్ఎస్ఎస్, భజరంగదళ్, సంఘపరివార్‌శక్తులు దళిత, మైనారిటీలు, జర్నలిస్టులు, రచయితలు, కవులు, కళాకారులపై దాడులు చేస్తూ హత్యలు చేస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. గోరక్షణ సమితి పేరుతో 30 మందిని హత్య చేశారని, చనిపోయిన వారిలో 24 మంది ముస్లీంలు, ఆరుగురు దళితులున్నారు. విభజన తరువాత రాష్ట్రానికి కేంద్రం నుంచి ఎటువంటి సహాయ సహకారాలు అందడం లేదన్నారు. విభజన హామీలు, ప్రత్యేక హోదా, ఉత్తరాంధ్ర, రాయలసీమలకు ప్రత్యేక ప్యాకేజీ, హైకోర్టు ఏర్పాటు, పోలవరం, అమరావతిలో రాజధాని నిర్మాణానికి నిధులు ఇవ్వలేదన్నారు. బడ్జెట్‌లో నిధులు కేటాయించపోవడంపై సీఎం చంద్రబాబు సుప్రీంకోర్టుకు పోతానంటున్నారని, ఆయన జిల్లా కోర్టుకు కూడా పోరన్నారు. 8న వామపక్షాలు ఇచ్చిన బంద్‌కు వైసీపీ, కాంగ్రెస్ పార్టీలు, ట్రేడ్ యూనియన్, ప్రజాసంఘాలు, జర్నలిస్టు సంఘాలు మద్దతు ఇస్తున్నాయని, బంద్ విజయవంతం చేయాలని కోరారు. ఏపీకి జరిగిన అన్యాయంపై ఎంపీలు పార్లమెంటులో నిజాయతీగా పోరాడాలన్నారు. రాజకీయ నాటకాలు సరికాదని హితవు పలికారు. చంద్రబాబునాయుడు బంద్‌లో పాల్గొనాలని కోరారు. చంద్రబాబు చేతగాని తనం వల్లే నిధులు రావడం లేదన్నారు. ఎన్నడూ లేని విధంగా రాష్ట్రంలో అవినీతి పెరిగి పోయిందన్నారు. అవినీతిలో టీడీపీ ప్రభుత్వం కాంగ్రెస్‌పార్టీని మించి పోయిం దన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి కె.రామాంజనేయులు, జిల్లాకార్యవర్గ సభ్యులు, ప్రతినిధులు ఉన్నారు.

కేసీపీ కంపెనీ లీజు గడువు పొడిగింపు

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: కేసీపీ లిమిటెడ్‌కు సున్నపురాయి తవ్వకాలకు సంబంధించి లీజు గడువును మరో 50 సంవత్సరాలకు ప్రభుత్వం పొడిగించింది. ఈమేరకు పరిశ్రమలు, వాణిజ్యశాఖ కార్యదర్శి బి శ్రీధర్ జీవోను బుధవారం జారీ చేశారు. కృష్ణాజిల్లా జగ్గయ్యపేట మండలం ముక్తేశ్వరపురంలోని 368.35 హెక్టార్లలో ఉన్న సున్నపురాయి గనులను కేసీపీ లిమిటెడ్‌కు 30 ఏళ్లపాటు లీజుకు ఇచ్చారు. ఈ గడువు 2002 ఫిబ్రవరి 21వ తేదీతో ముగిసింది. ఈ గడువు 50 ఏళ్లపాటు పొడిగించాలాని గనులశాఖ నిర్ణయించింది. దీంతో ఈ సంస్థ 2050 ఫిబ్రవరి 20 వరకూ సున్నపురాయిని తవ్వుకునేందుకు అనుమతిని మంజూరు చేస్తున్నట్లు జీవోలో పేర్కొన్నారు.

ఆర్‌జీయూకేటీలకు రూ.50కోట్ల బడ్జెట్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్రంలోని రాజీవ్‌గాంధీ యూనివర్శిటీ ఆఫ్ నాలెడ్జీ టెక్నాలజీస్ (ఆర్‌జీయూకేటీ)లకు 2017-18 విద్యా సంవత్సరానికిగాను రూ.50కోట్ల బడ్జెట్టును రాష్ట్ర ప్రభుత్వం కేటాయించింది. ఈ మేరకు స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఆదిత్యనాథ్‌దాస్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. నూజివీడు, ఒంగోలు, శ్రీకాకుళంలోని ట్రిపుల్ ఐటీల నిర్వహణ కోసం నిధులను వినియోగిస్తారు. ఏపీ టెక్నికల్ ఎడ్యుకేషన్ చీఫ్ సెక్రటరీ చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు.

'ముద్దు' మృతికి రఘువీరారెడ్డి సంతాపం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: మాజీ మంత్రి, ఎమ్మెల్సీ గాలి ముద్దు కృష్ణమ నాయుడు (70) మృతికి ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు డాక్టర్ ఎన్.రఘువీరారెడ్డి తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు.ఈ మేరకు పీసీసీ రాష్ట్ర కార్యాలయం నుంచి బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రజలకు ఆయన చేసిన సేవలు మరువలేనివని గుర్తుచేశారు. ముద్దుకృష్ణమ నాయుడు ఆత్మకు శాంతి చేకూరాలని కోరారు. ఆయన మృతి పట్ల సంతాపం తెలిపారు.కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని ప్రకటించారు.

రాష్ట్రానికి తీరనిలోటు: కేవీపీ

సీనియర్ రాజకీయ నాయకులు, వివిధ హోదాల్లో రాష్ట్రానికి సేవలందించిన ముద్దు కృష్ణమనాయుడు మృతి..రాష్ట్రానికి తీరనిలోటని రాజ్యసభ సభ్యులు కేవీపీ రామచంద్రరావు తెలిపారు.ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు.ముద్దు మృతి పట్ల మాజీ ఎమ్మెల్సీ సి.రామచంద్రయ్య సంతాపాన్ని ప్రకటించారు.

ప్రధాని ఇంటిముందు ధర్నా చేయండి

ఎంపీలకు చలసాని శ్రీనివాస్ విజ్ఞప్తి

రాష్ట్ర బంద్‌కు సినీనటులు తరలిరావాలని పిలుపు



విశాలాంధ్ర బ్యూరో -ఏలూరు : కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి తీరని అన్యాయం జరిగిన నేపథ్యంలో ఎంపీలు రాజీనామా డ్రామాలతో సాధించేది ఏమి ఉండదనీ, మోడీ ఇంటి ముందు అరెస్టులకు వెనకాడకుండా ఆందోళనలు చేస్తేనే రాష్ట్రానికి న్యాయం జరుగుతుందని ప్రత్యేక హోదా, విభజన హామీల సాధన సమితి రాష్ట్ర కన్వీనర్ చలసాని శ్రీనివాస్ పేర్కొన్నారు. స్థానిక శ్రీకాశీ విశ్వేశ్వర కళ్యాణ మండపంలో సీపీఐ జిల్లా కార్యదర్శి దేగా ప్రభాకర్‌తో కలసి బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. బడ్జెట్‌లోనే ఏపీకి తీరని అన్యాయం చేశారన్నారు.రాష్ట్రానికి కేటాయించిన రూ.3670 కోట్లు ఏ మూలకు సరిపోవన్నారు. రాష్ట్ర రాజధానికి చెంబుడు నీళ్లు, గుక్కెడు మట్టి తెచ్చినప్పుడే మోడీ నయవంచనను చంద్రబాబు గుర్తించకపోవడం విచారకరమని అన్నారు. విభజన హామీల్లో సాధించుకోవాల్సిన అంశాలను గాలికి వదిలేసి ప్యాకేజీ భిక్ష కోసం కేంద్రం చుట్టూ మూడున్నరేళ్ల పాటు పడిగాపులు కాశారని అయినా రాష్ట్రానికి ఏమాత్రం ప్రయోజనం చేకూరలేదని అన్నారు. ఇప్పటికైనా ఎంపీలు మోడీ ఇంటి ముందు ఆందోళన చేసైనా నిధుల సాధనకు కృషి చేయకపోతే రాష్ట్రానికి ద్రోహం చేసిన వారిగా 34 మంది ఎంపీలు మిగిలిపోతారని అన్నారు . ఆంధ్రుల హక్కులు, ఆత్మగౌరవాన్ని కాపాడడం కోసం చంద్రబాబు నాయుడు బంద్ సందర్భంలో బయటకు రాకపోయినా రాష్ట్ర ప్రజల ఆకాంక్షలను తొక్కివేయకుండా పుట్టినగడ్డ రుణం తీర్చుకోవడానికి బంద్‌కు సంపూర్ణ మద్దతు ఇవ్వాల్సిన అవసరం ఉందని చలసాని శ్రీనివాస్ అన్నారు. రాష్ట్రం అపత్కాలంలో ఉన్న విషయాల్ని సినీనటులు చిరంజీవి, బాలకృష్ణ, తదితరులు గ్రహించి రోడ్డెక్కాల్సిన అవసరం ఉందన్నారు. విభజన హామీల సాధన సమితి జిల్లా అధ్యక్షులు ఎంబిఎస్ శర్మ, దేగా ప్రభాకర్ మాట్లాడుతూ ప్రత్యేక హోదా సాధన కోసం ఇప్పటికైనా ప్రజాసంఘాలు, రాజకీయ పార్టీలు నడుంబిగించి ఉద్యమానికి ఊపిరి ఊదాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నగర కార్యదర్శి కె కృష్ణమాచార్యులు, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి ఉప్పులూరి హేమశంకర్, సీపీఐ నగర కార్యదర్శి పుప్పాల కన్నబాబు, మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి గాళ్ల శారద తదితరులు పాల్గొన్నారు.

బంద్ విరమించండి...

పార్లమెంటులో పోరాడదాం....

వామపక్షాలకు మంత్రి అచ్చెన్నాయుడు వినతి



విశాలాంధ్ర అమరావతి : బంద్ విరమించండి, పార్లమెంటులో పోరాడదామని ప్రభుత్వం తరపున మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు వామపక్షాలకు విజ్ఞప్తి చేశారు. సచివాలయంలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ కేంద్ర బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్‌కు అన్యాయం జరిగిన విషయంలో బంద్ పిలుపుపై పునరాలోచన చేసి విరమించాలని, సమస్య న్యాయమైనదేనని అయినప్పటికీ ఈ అంశంపై పార్లమెంటులో కలసిరావాలని కోరారు. రాష్ట్రాభివృద్ధిపై ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రత్యేక దృష్టిపెట్టి ఒక స్థాయికి తీసుకువచ్చిన నేపథ్యంలో విభజన చట్టంలోని హామీలను ఒక పద్దతిప్రకారం సాధించుకోవాలన్నారు. ఈ అంశాన్ని పార్లమెంట్ లో లేవనెత్తడంలో జాతీయ స్థాయిలో టీడీపీ ఎంపీలు విజయం సాధించారన్నారు. నష్టాల్లో ఉన్న రాష్ట్రంలో బంద్ చేయడం వల్ల మనకే నష్టం జరుగుతుందన్నారు. వామపక్షాల సభ్యులు పార్లమెంటులో ఉన్నందున కేంద్రంపై ఢిల్లీలో పోరాడాలన్నారు. ఈ అంశంలో ప్రధాని కల్పించుకున్నప్పటికీ స్పష్టమైన హామీ ఇచ్చేవరకు తమ పోరాటం ఆగదని చెప్పారు. బంద్ వల్ల రాష్ట్రానికి నష్టమేకాకుండా, ప్రజలు ఇబ్బందులు పడతారని, అందువల్ల వామపక్షాలు, ఇతర పార్టీలు బంద్ పై పునరాలోచన చేసి విరమించాలని అచ్చెన్నాయుడు విజ్ఞప్తి చేశారు.



రైఫిల్ షూటింగ్‌లో ఏపీ పోలీసులకు పతకాల పంట

ఆక్టోపస్ పీసీకి గోల్డ్, రజత పతకాలు

300 మీటర్ల టీం విభాగంలో కాంస్యం

షూటర్లను అభినందించిన డీజీపీ మాలకొండయ్య

విశాలాంధ్రబ్యూరో - అమరావతి : మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌లో జరిగిన అఖిల భారత పోలీసు షూటింగ్ (స్పోర్ట్స్) చాంపియన్‌షిప్‌లో రాష్ట్ర పోలీసులు పతకాల పంట పండించారు. గత నెల 29వ తేదీ నుంచి ఈ నెల రెండో తేదీ వరకు బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్ (బీఎస్ఎఫ్) ఆధ్వర్యంలో సెంట్రల్ ఆర్మ్‌డ్ పోలీసు ఫోర్స్ (సీఏపీఎఫ్)ల మధ్య ఈ పోటీలు జరిగాయి. రాష్ట్ర జట్టుకు ఒక బంగారు, ఒక రజత, కాంస్య పతకం లభించాయి. 50 మీటర్ల వ్యక్తిగత ఫ్రీ రైఫిల్ ప్రోన్ షూటింగ్‌లో ఆక్టోపస్‌కు చెందిన కానిస్టేబుల్ ఎం కృష్ణా (పీసీ 1770) బంగారు పతకాన్ని సాధించారు. అలాగే 300 మీటర్ల వ్యక్తిగత బిగ్ బోర్ ఫ్రీ రైఫిల్ ప్రోన్‌లో రజత పతకాన్ని కైవసం చేసుకున్నాడు. 300 మీటర్ల ఫ్రీ రైఫిల్ షూటింగ్‌లో టీం ఈవెంట్‌లో గ్రేహౌండ్స్‌కు చెందిన పీవీ రవీంద్ర, ఆక్టోపస్‌కు చెందిన వై భరత్‌కుమార్, కృష్ణా జట్టు కాంస్య పతకాన్ని సాధించింది. ఈ సందర్భంగా గుంటూరు జిల్లా మంగళగిరిలోని పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో బుధవారం జరిగిన కార్యక్రమంలో డీజీపీ డాక్టర్ ఎం మాలకొండయ్య పతక విజేతలను ఘనంగా సత్కరించారు. రైఫిల్ షూటింగ్‌లో పతకాలు సాధించిన వారికి శాఖాపరంగా అన్ని రకాల ప్రోత్సాహాలు అందించేందుకు కృషి చేస్తానన్నారు. రైఫిల్ షూటింగ్‌లో పతకాలు సాధించటం వల్ల మరోసారి జాతీయస్థాయిలో రాష్ట్ర ప్రతిష్ట మరోసారి పెరిగిందన్నారు. రిబెటాలియన్స్ ఐజీ రాజీవ్ కుమార్ మీనా పతక విజేతలను అభినందించి తగిన ప్రోత్సాహం కోసం డీజీపీకి సిఫార్సు చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు డీజీపీ (శాంతి భద్రతలు) హరీష్‌కుమార్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సంస్థల ఆదాయ కేసులపై ప్రత్యేక దృష్టి

కొనుగోలు ధరలు తగ్గించేందుకు చర్యలు

మంత్రి కళా వెంకట్రావు



విశాలాంధ్ర-అమరావతి: విద్యుత్ శాఖ పరిధిలోని ఏపీట్రాన్స్‌కో, ఏపీ విద్యుత్ పంపిణీ సంస్థల విద్యుత్ కొనుగోలు ఒప్పందాల నియమ, నిబంధనలను పకడ్బందీగా అమలు చేసేందుకు కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని విద్యుత్ శాఖా మంత్రి కిమిడి కళావెంకట్రావు అధికారులను ఆదేశించారు. బుధవారం సచివాలయంలోని కార్యాలయంలో ఏపీ విద్యుత్ సంస్థల్లో కోర్టు కేసుల పురోగతి, విద్యుత్ కొనుగోలు ఒప్పందాలు (పీపీఏ) విండ్, సోలార్ విద్యుత్ తదితర అంశాలపై విద్యుత్ శాఖ అధికారులతో మంత్రి సమీక్షించారు. విద్యుత్ కొనుగోలు ఒప్పందాలకు (పీపీఏలు) సంబంధించి అప్పిలేట్ ట్రిబ్యునల్ ఢిల్లీ, ఏపీఈఆర్సీ, హైకోర్టు, సుప్రీం కోర్టుల్లో విచారణలో ఉన్న కేసుల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. విద్యుత్ సంస్థలకు ఆదాయం వచ్చే కేసుల పట్ల ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఏఓఆర్, సీనియర్ కౌన్సిల్‌తో సమన్వయం చేసుకొని ట్రాన్స్‌కో తరపున వాదనలు బలంగా వినిపించాలన్నారు. భవిష్యత్తులో టెండర్లు నియమావళి రూపొందించే సమయంలో ప్రాజెక్టు నిర్మాణం పూర్తి చేసే సమయాన్ని పొందుపర్చాలని, పీపీఏలో పేర్కొన్న విద్యుత్ కొనుగోలు ధర కంటే మార్కెట్లో విద్యుత్ ధర తక్కువ ఉంటే ఆ రేటు మాత్రమే చెల్లించేలా నిబంధనను చేర్చాలని మంత్రి ఆదేశించారు. విద్యుత్ కొనుగోలులో ధరలు తగ్గించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని, భవిష్యత్‌లో సాంప్రదాయేతర ఇంధన వనరులైన విండ్, సోలార్ విద్యుత్ ఉత్పత్తి పెరిగే అవకాశం ఉందని, దీంతో విద్యుత్ కొనుగోలు వ్యయం కూడా తగ్గే అవకాశం ఉందన్నారు. విద్యుత్ రంగంలో ఏపీ దేశానికి అన్ని విభాగాల్లో మార్గదర్శకంగా ఉందన్నారు. ఇంధన శాఖ సలహాదారు కె.రంగనాథం, ఏపీ ట్రాన్స్‌కో జేయండీ దినేష్ పరుచూరి, ఏపీ ట్రాన్స్‌కో న్యాయ సలహాదారు శివరావు, సీఈ ఐపీసీ రాజబాబు తదితరులు పాల్గొన్నారు.

నేడు రాష్ట్ర బంద్‌ను జయప్రదం చేయండి

పీసీసీ చీఫ్ డాక్టర్ ఎన్.రఘువీరారెడ్డి



విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: కేంద్ర బడ్జెట్టులో రాష్ట్రానికి జరిగిన అన్యాయాన్ని నిరసిస్తూ ఈ నెల 8న వామపక్షాలు తలపెట్టిన రాష్ట్ర బంద్‌కు సంపూర్ణ మద్దతు ప్రకటిద్దామని పీసీసీ చీఫ్ డాక్టర్ ఎన్.రఘువీరారెడ్డి పిలుపునిచ్చారు. పీసీసీ రాష్ట్ర కార్యాలయం నుంచి బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ, ఎన్డీయే ప్రభుత్వం ప్రవేశపెట్టిన చివరి బడ్జెట్‌లో రాష్ట్రానికి దారుణమైన అన్యాయం జరిగిందన్నారు. విభజన చట్టంలోని చట్టబద్ధమైన అంశాలకు కేటాయింపులు లేనందున ప్రజలు నిశ్చేష్టులయ్యారని,రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తామని నమ్మించిన 'మోడీ-బాబుల జోడీ'ని గెలిపించిన వారికి నిరాశే ఎదురైందని వాపోయారు. చంద్రబాబు తన స్వప్రయోజనాల కోసం కేంద్రం వద్ద ప్రదర్శించిన లొంగుబాటే కొంపముంచిందని, 5వ బడ్జెట్‌లో కేటాయింపులేమీ జరపకపోవడంతో చంద్రబాబు హడావుడి చేస్తున్నారని ఎద్దేవా చేశారు. ప్రతిపక్ష వైసీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కూడా బీజేపీతో లొంగిపోయారని, బడ్జెట్టుపై నోరు మెదిపే ధైర్యాన్ని ఆయన చేయలేకపోతున్నారని రఘువీరా వెల్లడించారు.

బంద్‌ను విజయవంతం చేద్దాం మాజీ ఎమ్మెల్సీ గిడుగు రుద్రరాజు

ప్రత్యేకహోదాతో పాటు విభజన బిల్లులోని అంశాలన్నీ అమలు చేయాలనే డిమాండ్లతో ఈ నెల 8న చేపట్టిన బంద్‌ను కాంగ్రెస్ శ్రేణులంతా విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్సీ గిడుగు రుద్రరాజు పిలుపు నిచ్చారు.ఈ మేరకు పీసీసీ రాష్ట్ర కార్యాలయం నుంచి బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. రాహుల్‌గాంధీ సైతం ఏపీకి న్యాయం చేయాలని కోరుతూ ప్రధానికి లేఖ రాశారని గుర్తుచేశారు.

ఆశలు ఆవిరి...

మోడీ ప్రసంగంపై ఆగ్రహజ్వాల

విభజన హామీలపై విపక్షాల పోరుబాట

విశాలాంధ్ర-అమరావతి : ఏపీ ప్రజల ఆశలు ఆవిరవుతున్నాయి. ఏపీకి అన్యాయం జరిగిందని. అందరినోట అదేమాట. తీర్చేవాడెవడో అర్థంకాక ఏపీలోని రాజకీయపక్షాలు, ప్రజలు జుట్టు పీక్కోవాల్సిన పరిస్థితి కన్పిస్తోంది. రాష్ట్ర ప్రయోజనాలు దెబ్బతిన్నాయని, విభజన హామీలు అమలు కాలేదని, బడ్జెట్ కేటాయింపుల్లో ప్రాధాన్యత లేదని అధికార తెలుగుదేశం పార్టీ సహా విపక్షాలన్నీ విమర్శిస్తున్నాయి. కేంద్ర ప్రభుత్వంపై పార్లమెంట్‌లో ప్రత్యక్ష పోరాటానికి దిగాయి. అన్యాయం జరిగిందని వైసీపీ, కాంగ్రెస్, జనసేన మండిపడుతున్నాయి. వామపక్షాలు ఏపీకి జరిగిన అన్యాయంపై నిరసనగా గురువారం బంద్‌కు పిలుపునిచ్చాయి. దీనికి పలు పార్టీలు మద్దతు పలికాయి. ఇంతవరకు బాగానే ఉంది. అయితే దేశంలో ఏ రాష్ట్రానికి ఇబ్బంది వచ్చినా తీర్చాల్సిన బాధ్యత ప్రధానమంత్రిదే. ప్రధాని హోదాలో ఉన్న నరేంద్రమోడీ బుధవారం లోక్‌సభలో రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలుపుతూ ఏపీకి అన్యాయం జరిగిందని చెప్పారు. దీనికి ప్రధాన కారణం కాంగ్రెస్ అంటూ నిందించారే తప్ప ఏపీ రాష్ట్ర ప్రయోజనాలకు కేంద్రం ఏమి చేయాలనుకుంటున్నదో స్పష్టతనివ్వలేదు. తెలుగుదేశం పార్టీ ఎంపీలు ఏపీ ప్రయోజనాల విషయంలో బుధవారం పార్లమెంట్ గేటు బయట ధర్నా చేసి ఆ తర్వాత ఉభయసభల్లో నిరసనలకు దిగారు. మోడీ సభలో ప్రసంగం ప్రారంభించిన తర్వాత తమ సీట్లలో కూర్చున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు టెలి కాన్ఫరెన్స్‌లో ఎంపీలతో మాట్లాడుతూ రాష్ట్రానికి న్యాయం జరిగే వరకు పోరాటంలో వెనక్కు తగ్గవద్దని, సస్పెన్షన్ చేసినా లెక్క చేయవద్దని సూచించారు. అయితే టీడీపీ సభ్యులు తమ సీట్లలో ఆశీనులవటం, మోడీ ప్రసంగాన్ని ఆలకించటం గమనించిన వారికి ఏమి జరిగిందో అర్థం కాక అయోమయంలో పడ్డారు. మోడీ గంటా నలభై నిమిషాల ప్రసంగంలో ఏపీకి అన్యాయం జరిగిందని, అందుకు కాంగ్రెస్‌వారే కారణమంటూ నిందించారే గానీ తన ప్రభుత్వం ఏమి చేస్తుందో చెప్పలేదు. ఓ వైపు టీడీపీతో పాటు ప్రతిపక్షపార్టీలు ఏపీకి న్యాయం చేయాలని ఆందోళనలు చేస్తుంటే మోడీ మాత్రం కాంగ్రెస్‌పై ఎదురుదాడికే మొగ్గు చూపారు.మోడీ ప్రసంగాన్ని పరిశీలిస్తే ఏపీకి న్యాయం చేసే ఉద్దేశం ఆయనకు ఉన్నట్టు కనిపించలేదు. మోడీ వ్యవహారశైలిని పలువురు ఆక్షేపిస్తున్నారు. మోడీతో ఏపీకి న్యాయం జరగదని రాజకీయ వర్గాల్లో అభిప్రాయం వ్యక్తమవుతోంది. తెలుగుదేశం విజ్ఞాపనలను, నిరసనలను మోడీ ఖాతరు చేయనట్లుగానే అర్థమవుతోంది. ఇదిలా ఉండగా జనసేన అధిపతి పవన్ కళ్యాణ్ కేంద్ర వైఖరిని తప్పుబట్టారు. కేంద్రం ప్రత్యేక హోదాకు బదులు ప్రత్యేక ప్యాకేజీ అంది, అది కూడా అమలుకాలేదు. 2014 ఎన్నికల్లో తమ పార్టీ పోటీ చేసి ఉంటే బాగుండేదని, పార్లమెంట్ సభ్యులు కేంద్రంపై ఆశించిన స్థాయిలో పోరాటం చేయటం లేదన్న అభిప్రాయాన్ని పరోక్షంగా వ్యక్తం చేశారు. బంద్‌కు మద్దతు తెలిపారు. ఇక వైసీపీ ఎంపీలు రాజ్‌నాథ్‌తో చర్చించి గాంధీ విగ్రహం వద్ద ప్లకార్డులతో నిరసనలు తెలిపి ప్రధాని ప్రసంగం సమయానికి సభ నుంచి వాకౌట్ చేశారు. ఇవన్నీ గమనిస్తుంటే ఎవరి వ్యూహాలు వారివిగా కన్పిస్తున్నాయి. కానీ కేంద్ర పెద్దలతో రాష్ట్రానికి చెందిన ప్రధాన పార్టీల నేతలు సత్సంబంధాలు కొనసాగిస్తున్నారన్న విమర్శలు ప్రజల్లో వ్యక్తమవుతున్నాయి. పార్లమెంట్ సాక్షిగా ఏపీ విషయంలో చేస్తున్న ప్రసంగాలు, చేపడుతున్న నిరసన కార్యక్రమాలు తెలుగు టీవీ సీరియల్స్‌ను తలపిస్తున్నాయని ప్రజలు భావిస్తున్నారు.

విశాలాంధ్ర
విజయవాడ, గురువారం 08, ఫిబ్రవరి 2018

సంపాదకీయం

'ఖాప్'పై సుప్రీం అస్త్రం

రాజ్యాంగం కల్పించిన పౌరుల ప్రాథమిక హక్కులను హరించే అనాగరిక సంప్రదాయాలు నేటికీ దేశంలోని కొన్ని ప్రాంతాల్లో రాజ్య మేలుతున్నాయి. అంతేకాదు, వ్యక్తి స్వేచ్ఛను, స్త్రీ, పురుషుల మధ్య సమాన హక్కులు, సమానవకాశాలను పురుష దురంహకార వ్యవస్థ తోసిపుచ్చుతూ పంచాయతీలు చేస్తున్నది. ప్రధానంగా కుటుంబాల పరువు ప్రతిష్ఠలు, కులాధిపత్యాల పేరిట యువతీయువకుల ప్రేమలను, వివాహాలను ససేమిరా అంగీకరించకపోగా, వారిని అమానుషంగా మట్టుబెడుతున్నది. మన రాజ్యాంగం ఏ వ్యక్తీ లేదా సమూహం ఇతరుల స్వేచ్ఛను హరించదాన్ని అనుమతించదు. ఆచరణలో దీన్ని అమలు చేయడానికి సవాలక్ష సమస్యలు, సవాళ్లు ఎదురవుతున్నాయి. ఈ నేపథ్యంలో తాజాగా సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు నేటి సమాజానికి దిక్సూచిగా నిలుస్తుందని చెప్పవచ్చు. ఈ విషయంలో పాలకుల నిర్లక్ష్యపు వైఖరిని కూడా న్యాయస్థానం ఎండగట్టింది. అనాగరిక సమూహాల అసమంజస నిర్ణయాలు, అరాచక శక్తుల ఆగడాలకు ఈ తీర్పు అడ్డుకట్టలాంటిదే. పరువు, కట్టుబాట్ల సాకుతో మారణకాండ సాగిస్తున్న ఖాప్ పంచాయితీలకు కళ్లెం వేసినట్లే. మేజర్లు అయిన యువతీయువకుల వివాహం విషయంలో జోక్యం చేసుకునే హక్కు ఎవరికీ లేదంటూ సర్వోన్నత న్యాయస్థానం ఇచ్చిన ఈ తీర్పు ప్రజోపకరమైనది, సామాజికహితంతో కూడినది. ముఖ్యంగా హర్యానా, పంజాబ్, ఉత్తరప్రదేశ్, ఇటీవల కాలంలో తెలంగాణలో ఖాప్ పంచాయతీల కారణంగా అనేక ఇక్కట్లను ఎదుర్కొంటున్న మహిళలకు ఇది రక్షణ కవచంలా ఉపయోగపడుతుంది. దయవంతి అనే యువతి కుటుంబసభ్యులు సుప్రీంకోర్టులో వేసిన హెబియస్ కార్పస్ పిటిషన్, పరువు హత్యలకు మూలమైన ఖాప్ పంచాయతీలపై శక్తివాహిని అనే సంస్థ వేసిన ప్రజాప్రయోజనాల వ్యాజ్యంపై సుప్రీంకోర్టు విచారణ జరిపి ఈ తీర్పునిచ్చింది. హర్యానాకు చెందిన జగదీశ్ అనే వ్యక్తి దయవంతిని గుజరాత్ నుంచి అపహరించారని ఆమె కుటుంబ సభ్యులు వేసిన పిటిషన్‌పై న్యాయస్థానం విచారణ చేసింది. ఆమెను పిలిపించి వాదనలు విన్నది. తన ఇష్టానుసారమే జగదీశ్‌తో ఉంటున్నట్లు దయవంతి చెప్పింది. దీంతో కోర్టు హెబియస్ కార్పస్ పిటిషన్‌ను కొట్టివేసి మైనార్టీ తీరిన మహిళకు నచ్చిన వ్యక్తిని వివాహం చేసుకొనే, ఇష్టం వచ్చిన చోట నివసించే స్వేచ్ఛ, హక్కు ఉన్నాయని న్యాయస్థానం తీర్పు చెప్పింది. అలాగే శక్తివాహిని వేసిన పిటిషన్‌పై విచారణ చేసిన దేశ అత్యున్నత న్యాయస్థానం, మేజర్లు అయిన యువతీయువకుల వివాహంలో జోక్యం చేసుకొనే హక్కు తల్లిదండ్రులకు, పెద్దలకు, సమాజానికి, ఖాప్ పంచాయితీలకు లేదని స్పష్టంచేసింది. వాస్తవానికి గతంలోనూ న్యాయస్థానాలు ఖాప్ పంచాయతీలపై వ్యతిరేక తీర్పులు ఇచ్చాయి. ఉత్తరభారతంలో ముఖ్యంగా హర్యానా, పంజాబ్, ఉత్తరప్రదేశ్, రాజస్థాన్, మధ్యప్రదేశ్‌లలో ఖాప్ పంచాయితీల ద్వారా కొందరు సమాంతర వ్యవస్థలను నిర్వహిస్తూ సమాజాన్ని మధ్యయుగాలకు తీసుకుపోయే ప్రయత్నం చేస్తున్నారు. ఈ పంచాయితీల పేరిట నిమ్న కులాల అమ్మాయిలను హతమారుస్తున్నారు. ఇటీవల కాలంలోనే ఈ పంచాయితీలు దక్షిణ భారతానికి పాకుతున్నాయి. ఖాప్ పంచాయతీలకు సుదీర్ఘ చరిత్ర ఉంది. ఏడో శతాబ్దం నుంచీ ఈ అరాచకం రాజ్యమేలుతున్నది. సామాజికాధిపత్యమే దీని లక్ష్యం. స్వాతంత్ర్యం వచ్చినా, కాలం ఎంతగా మారినా, సాంఘిక, ఆర్థిక పరిస్థితుల్లో ఎంతో మార్పు వచ్చినా ఈ దుస్సంప్రదాయం కొనసాగుతూనే ఉంది. దీన్ని కొన్నిచోట్ల పాలకులు సైతం సమర్థించడమే దీనికి కారణం. సామాజిక విలువలు, సంప్రదాయాల పరిరక్షణలో ఖాప్ పంచాయితీలు కీలక పాత్ర పోషిస్తున్నాయని హర్యానా ముఖ్యమంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్ చేసిన వ్యాఖ్యలే ఇందుకు నిదర్శనాలు.

ఆచారాలు, సంప్రదాయాలు... ఏవైనా మనిషి పురోగతికి, వ్యక్తి వికాసానికి దోహదపడాలి. ఇందుకు విరుద్ధమైనవి ఏవైనా వాటిని వ్యతిరేకించాల్సిందే, ఖండించాల్సిందే. ఈ విషయంలో ఒక అడుగు ముందుండాల్సిన ప్రభుత్వాలే వాటిని ప్రోత్సహిస్తే, బాసటగా నిలిస్తే ఆ సమాజాలు ఎలా ఉంటాయనడానికి నిదర్శనమే హర్యానా, పంజాబ్, ఉత్తరప్రదేశ్‌ల్లోని కొన్ని గ్రామాల్లో నెలకొన్న పరిస్థితులు. మహిళలు సెల్‌ఫోన్ వాడకూడదు. ఒంటరిగా బయటకు రాకూడదు. వస్తే తల మీద నుంచి వస్త్రం కప్పుకోవాలి. కొన్ని రకాల దుస్తులే ధరించాలి... ఇవన్నీ ఖాప్ పంచాయితీలు పెడుతున్న ఆంక్షలు. అంతేకాదు, యువతీ యువకులకు వారికి నచ్చినవారిని పెళ్లి చేసుకునే హక్కునూ ఇవి కాలరాస్తున్నాయి. ఈకాలంలోనూ ఇవేమి ఆంక్షలు అంటే? సగోత్రీకులు పెళ్లి చేసుకోరాదంటూ వాదిస్తాయి. ఈ కేసులో ఖాప్ పంచాయితీల తరఫు వాదించిన న్యాయవాది కూడా 1955నాటి హిందూ వివాహ చట్టంలోని సెక్షన్ 5 సగోత్రీకుల మధ్య వివాహబంధాన్ని నిషేధిస్తున్నదంటూ వివరించారు. ఇది ఏ మాత్రం వాస్తవం కాదు, కేవలం వర్గాధిపత్యం, కులాధిపత్యం పరిరక్షించుకోవడమే దీని వెనుక ఉన్న అసలు రహస్యం. పరువు హత్యల్లో సగోత్రం కేసులు మూడు శాతమే ఉండగా 72 శాతం కులాంతర వివాహాలు, ఒకశాతం మతాంతర వివాహాలు ఉండడం ఖాప్ పంచాయితీల అసలు గుట్టును బయటపెడుతున్నాయి. ఈ ఖాప్ పంచాయితీలను పాలకులు, రాజకీయ పార్టీలు సమర్థించడం లేదా ప్రోత్సహించడం వెనుక ఓట్ల రాజకీయం ఉంది. అందువల్లే రాజకీయ పక్షాలన్నీ ఖాప్ పంచాయితీలు నిర్వహించే బృందాల ముందు మోకరిల్లుతున్నాయి. ఈ విషయం సుప్రీంకోర్టు కూడా గ్రహించి ఉండొచ్చు. అందువల్లే సమాజంపై స్వారీ చేస్తున్న ఈ నానా రకాల బృందాల విషయంలో ఏం చేయాలన్న సూచన లిచ్చేందుకు సీనియర్ పోలీస్ అధికారులతో కమిటీని నియమించే అంశాన్ని పరిశీలిస్తామని చెప్పింది. కేంద్ర ప్రభుత్వం ఈ విషయమై రెండు వారాల్లో మార్గ దర్శకాలను తయారు చేస్తుందని అదనపు సొలిసిటర్ జనరల్ సుప్రీంకోర్టుకు తాజాగా విన్నవించారు.

రాజ్యాంగాన్ని నిక్కచ్చిగా అమలు చేయాల్సిన, పరిరక్షించాల్సిన పాలకులే ఇలా ఉంటే దేశం ఇంకేరీతిన బాగుపడుతుంది. ఇప్పటికైనా ప్రభుత్వాలు మేల్కోవాలి. సుప్రీం తీర్పుతోనైనా నాయకులు కళ్లు తెరవాలి. ఖాప్ పంచాయితీలను నిషేధించేందుకు నిర్ణయం తీసుకోవాలి. ఓ చట్టం చేయాల్సిన అవసరం ఉంది. అనాగరికమైన ఆంక్షలు, కట్టుబాట్ల నుంచి, ఖాప్ పంచాయితీల అమానుష చర్యల నుంచి సామాన్యులను ముఖ్యంగా నిమ్నజాతులు, బడుగు బలహీన వర్గాల మహిళలను కాపాడాలి. ఈ బాధ్యతలను ప్రభుత్వాలే తీసుకోవాలి. అందుకు సుప్రీం తీర్పు వారికి కనువిప్పు కలిగించాలి.. వారికి ఓ మార్గదర్శకం కావాలి.

చురక

ఏపీకి నిధుల కొరకు
ఎంపీలంతా నిరసన
అమలైతే మంచే మరి
హామీలన్నీ వరుసన

జగన్, చంద్రబాబుల
చిత్తశుద్ధి స్తోత్రం
మోడీగారి కిస్తున్న
మాటవరుస పత్రం

– వేల్పుల నారాయణ

అంతర్జాతీయం

లాటిన్ అమెరికాలో సిఐఏ కుట్రలు

బుడ్డిగ జమిందార్

'సిఐఏ ఇన్ అమెరికా శీర్షికతో సకూరా సౌండర్స్ జియో పొలిటికల్ మోనిటర్ పత్రికకు రాసిన వ్యాసంలో రెండవ ప్రపంచ యుద్ధం తర్వాత నుండి ఆర్థికంగా బలపడిన అమెరికా సామ్రాజ్యం లాటిన్ అమెరికా తనకు అనుకూలంగా లేని అనేక దేశాల ప్రభుత్వాలను కూలద్రోయటం, కూలదోయటానికి ప్రయత్నించటం చేస్తూనే ఉంది. తత్ఫలితంగానే ఇప్పటికీ దక్షిణ అమెరికా, మధ్య అమెరికా, కరేబియన్ దేశాల్లో అమెరికా వ్యతిరేకత స్పష్టంగా నరనరానా కనబడుతూనే ఉంటుంది. ఒకవైపు సామ్రాజ్యవాదం ప్రజలచే ఎన్నుకోబడిన ప్రభుత్వాలను కార్పోరేట్ల మెప్పుకోసం కూలుస్తున్నా మరోవైపు అమెరికా వ్యతిరేక ప్రభుత్వాలు పుడుతూనే ఉన్నాయి. ఈ కోవలో గత దశాబ్దంలో బ్రెజిల్, వెనిజులా, బొలీవియా, అర్జంటైనా, ఉరుగ్వే, చిలీవంటి చోట్ల ప్రగతిశీల వామపక్ష ప్రభుత్వాలు వచ్చాయి. లాటిన్ అమెరికాలో సిఐఏ జోక్యం చేసుకొన్న విధానాన్ని సకూరా సౌండర్స్ చర్చించారు.

1954 గ్వాటెమాల : ప్రజాస్వామ్యయుతంగా ఎన్నికకాబడిన జాకోబ్ అర్బెంజ్ ప్రభుత్వాన్ని అమెరికా యునైటెడ్ ఫ్రూట్ కంపెనీకి అనుకూలంగా కూలదోశారు. భూసంస్కరణల ద్వారా యునైటెడ్ ఫ్రూట్ కంపెనీ అక్రమ భూములను స్వాధీనం చేసుకోవటమే తప్పని అమెరికా భావించి, ఇప్పటికీ ఆ దేశంలో అశాంతికి కారణమైంది.

బ్రిటీషు గయానా (ప్రస్తుతం గయాన) 1953-64 : డా. చెద్దీజగన్ ప్రభుత్వాన్ని కూల్చింది చర్చిల్ ప్రభుత్వం. సోషలిస్టు భావాలు జగన్‌కు ఉండటమే కారణం. విపక్షాలకు ధన సహాయం చేసి అవినీతిని పెంచి, సమ్మెలు చేయించి సామ్రాజ్యవాద అనుకూల ట్రేడ్ యూనియన్లను నిర్మించి, రాజ్యాంగాన్ని మార్చి రెండవసారి ఎన్నికైన ప్రజా అభిమానపాత్రుడు జగన్‌ను అధికారం నుండి దింపింది.

1959 నుండి ఇప్పటివరకు క్యూబాలో : 1959లో క్యూబా విప్లవం తర్వాతకాలం నుండి అడుగడుగునా ప్రభుత్వ కార్యకలాపాల్ని సజావుగా సాగనీయకుండా అడ్డుకొంటోంది. బే ఆఫ్ పిగ్స్ ద్వారా తన ప్రయత్నాలు ఫలించలేదు. కాస్ట్రోపై 6 వందల సార్లకుపైగా హత్యాప్రయత్నాలు చేయగా చాకచక్యంగా తప్పించుకొన్నాడు. విప్లవయోధుడు చేగువేరాను హత్య చేయించింది. ఇప్పటికీ క్యూబాపై ఆర్థిక ఆంక్షల్ని కొనసాగిస్తూనే ఉంది.

ఈక్వెడార్ 1960-63 : ఈక్వెడార్ ప్రభుత్వంలోకి చొచ్చుకుపోయి ప్రైవేటు సంస్థల్ని, ఏజెన్సీల్ని రేడియోస్టేషన్లను స్థాపించింది. లెఫ్ట్ ఉద్యమాన్ని మితవాద శక్తులతోనూ, చర్చిల ద్వారా నీరుగార్చింది. కార్లోస్ అరొసెమారా క్యూబాతో బంధాన్ని వీడనందుకు మిలిటరీని ప్రోత్సహించి అమెరికా తిరుగుబాటును చేయించింది. 1964 ఎన్నికలను జరగనీయలేదు.

బ్రెజిల్ 1961-64 : బ్రెజిల్ లేబర్ పార్టీకి చెందిన జని యెడసిల్వా ప్రజాస్వామ్యంగా ఎన్నికైనా అమెరికా ఒత్తిడికి రాజీనామా చేయవలసి వచ్చింది. తన తదుపరి బాధ్యతల్ని స్వీకరించిన గౌలర్ట్‌ను కూడా కాదని 1964లో మిలిటరీతో తిరుగుబాటు చేయించింది. సామాజిక ఆర్థిక సంస్కరణలు, బహుళజాతి కార్పోరేట్ల లాభాలకు కళ్లెం వేయటం అమెరికాకు రుచించలేదు. అమెరికా టెలిఫోన్ – టెలిగ్రాఫ్ సంస్థలను జాతీయం చేయటంతో కోపం వచ్చింది. క్యూబా, మిగతా సోషలిస్టు దేశాలతో సంబంధాలను రద్దు చేసుకోమన్న అమెరికా సామ్రాజ్యవాద కోరికను కాదన్నందుకు మిలిటరీ తిరుగుబాటు చేసి 2 దశాబ్దాలపాటు మిలిటరీ పాలనతో బ్రెజిల్ ప్రజలకు నరకాన్ని చూపించింది.

1960 దశకం మధ్యలో పెరూ : పెరూ దేశంలో సిఐఏ శిక్షణా క్యాంపులను నిర్వహించింది. గొరిల్లా పోరాట దళాలను అణచివేయటానికి పెరూకు సహకరించింది.

డొమేనికన్ రిపబ్లిక్ 1963-65 : 1924 తర్వాత మొదటిసారిగా 1963లో ప్రజాస్వామ్యయుతంగా ఎన్నికైన అధ్యక్షుడు జువాన్ బోష్. తను విదేశీ పెట్టుబడులను నియంత్రించి దోపిడీలకు వ్యతిరేకంగా నిలిచాడు. 7 నెలలు తిరగకుండానే తన అధికారపీఠం నుండి మిలిటరీ యంత్రాంగం ద్వారా త్రోసేసింది సిఐఏ. 19 నెలల తర్వాత విప్లవం ద్వారా బోష్ తిరిగి అధికారంలోకి వచ్చాడు. ఈసారి అమెరికా ట్రూపులను పంపించింది. 1966 వరకు డొమెనికాలో ట్రూపులు ఉండి బోష్ వ్యతిరేక ప్రచారంచేసి, అరాచకాలను సృష్టించి ఎన్నికల్లో ఓడిపోయేవరకూ అమెరికా సామ్రాజ్యవాదం నిద్రపోలేదు.

ఉరుగ్వే 1964-70 : తుపమరోస్ గెరిల్లా ట్రూపులు కార్పోరేట్ అవినీతి, దోపిడీకి వ్యతిరేకంగా ఉద్యమించాయి. సిఐఏ అనుకూల ప్రభుత్వానికి తోడ్పడేందుకై మోంటో వీడియోలో పబ్లిక్ సేఫ్టీపేరిట ఇంటర్నేషనల్ డెవలప్‌మెంట్ ఏజెన్సీని స్థాపించి పోలీసులకు ప్రత్యేక శిక్షణను సిఐఏ యిచ్చింది. ఈ శిక్షణ ద్వారా థర్డ్ డిగ్రీ పద్ధతుల్లో హింసించటాన్ని శిక్షణ ఇచ్చి గెరిల్లా పోరాటాల్ని నీరుగార్చింది. తదనంతరకాలంలో గెరిల్లా నాయకుడు టబరే వాస్క్వెచ్ 9 సంవత్సరాల కారాగార జీవితానంతరం వామపక్ష నాయకునిగా అధికారం చేపట్టారు.



లాటిన్ అమెరికా రుధిరాన్ని ఆస్వాదిస్తున్న అమెరికా సామ్రాజ్యవాద డేగ

చిలీ 1964-1973 : ప్రగతిశీల సాల్వెడార్ అలెండీని పదవిలోకి రానీయకుండా చిలీ అధ్యక్షునిగా ఎన్నికకానీయకుండా సిఐఏ చేసిన ప్రయత్నాలన్నీ విఫలమైన తర్వాత ఆయన్ని పదవీచ్యుతుణ్ణి చేయటానికి అమెరికా ప్రయత్నించింది. అధికారులకు పదవుల ఎరచూపి, లంచాలతో ముంచెత్తి కిరాతక జనరల్ అగస్టోపినోచెట్‌ను తీసుకొచ్చి అలెండీ స్థానంలో కూర్చోబెట్టింది. అలెండీ మరణం తర్వాత 17 సంవత్సరాల మిలిటరీ పాలన చిలీలో కొనసాగింది.

బొలీవియా 1964-75 : 1952లో ప్రజా తిరుగుబాటుతో మిలిటరీ పాలనకు చరమగీతం పాడారు. నియంతృత్వాన్ని రూపుమాపి గనుల్ని జాతీయికరణచేసి భూసంస్కరణలు అమలుచేశారు. వెంటనే సీఐఏ రంగంలోకి దిగింది. స్కూల్ ఆఫ్ అమెరికా ఉద్భవించింది. 1964లో ప్రెసిడెంట్ విక్టోర్ పాజ్‌ను అధికారం నుంచి కూలదోసింది. క్యూబాతో సంబంధాలు రద్దుచేసుకోకపోవటమే కారణం. 2006లో బొలీవియన్ ఎవొ మొరేల్స్ అధికారం చేపట్టి మరలా అమెరికా వ్యతిరేక, కార్పోరేట్ వ్యతిరేక నిర్ణయాలు తీసుకొన్నాడు. బహుళజాతి కంపెనీల పక్కలో బల్లెంగా నిలిచాడు.

అర్జెంటైనా 1970 : ప్రపంచవ్యాప్తంగా ఎదురౌతున్న నిరసనలను లెక్కచేయక అర్జంటైనాలో మానవ హక్కులకు భంగం కలిగించారు. వామపక్ష ఉద్యమకారుల్ని థర్టీవార్ పేరిట అణచివేయటం, చంపించటం ప్రారంభమైంది. ప్రపంచ నిరసనలను లెక్కచేయక యు.ఎస్. విదేశాంగమంత్రి హెన్రీకిసింగర్ అర్జెంటైనా విదేశాంగ మంత్రి అగస్టోగ్యూజెట్టీకి మద్దతుపలికి 30వేల మంది సామాన్య పౌరులను, వామపక్ష కార్యకర్తలను చంపించటానికి లేదా కనబడనీయకుండా చేయటానికి కారణమైనారు.

నికరాగ్వా 1978-1990 : 1979లో సొమాజా నియంతృత్వాన్ని సాండినిస్టాలు తుదముట్టించారు. మరో క్యూబాగా నికరాగ్వా తయారవుతుందని భయంవేసింది. 1990లో అమెరికా జోక్యం చేసుకొని ఎన్నికల్లో సాండి నిస్టాలను ఓడించింది. అమెరికా అనుకూల ప్రభుత్వాన్ని తెచ్చుకొంది. ఆక్స్‌ఫామ్ సాండినిస్టాల దానియేల్‌ఒర్టేగా ప్రభుత్వాన్ని ఉద్దేశించి సాండినిస్టాల హయాంలో నికరాగువా ప్రభుత్వం స్థిరత్వంతో నిలకడగా ఉంటూ ప్రజల జీవన ప్రమాణాలు పెంచటంలో దేశాభివృద్ధికి పాటుపడింది అని కొనియాడింది.

హోండూరస్ 1980 : నికరాగువాలో కొంట్రా యుద్ధం జరుగుతున్నప్పుడు వేలాది అమెరికన్ ట్రూపులకు హోండూరన్‌ను స్థావరంగా ఏర్పరచుకొంది. రహస్యంగా కొంట్రాలకు ఆయుధాల్ని చట్టవిరుద్ధంగా సరఫరా అమెరికా చేస్తూ అక్కడనుండి ఇరాన్‌కు కూడా పంపించేది.

గ్రేనేడా 1979-1983 : 1979లో సోషలిస్టు సంస్కరణల మార్పుకోసం ఏర్పడిన ప్రభుత్వాన్ని 1983 నాటికి రీగన్ ప్రభుత్వం వశపర్చుకొని ఆక్రమించింది.

ఎల్‌సాల్వెడార్ 1980-92 : సుమారు 600కోట్ల దాలర్లను ఖర్చుచేసి ఎల్‌సాల్వెడార్ విప్లవాన్ని నీరుగార్చింది.

హైతీ 1987-94 : మొదట్లో 30 సంవత్సరాలు పాలించిన దువాలియర్ కుటుంబ నియంతృత్వానికి వ్యతిరేకంగా పోరాడిన అరిస్టెడ్‌కు మద్దతు తెలిపి, ఆ తరువాత అమెరికాకు అనుకూలంగా నడచుకోలేదని ఆయన్ని మిలిటరీ తిరుగుబాటుతో 1991లో దింపించింది. హైతీ ప్రభుత్వరంగ పరిశ్రమల ప్రైవేటీకరణకు అరిస్టెడ్ ఒప్పుకోనందుకే మిలిటరీ తిరుగుబాటు చేయించింది.

పనామా 1989 : బెర్లిన్ వాల్ కూలిన తర్వాత పనామాలో ఒకప్పటి అమెరికా మిత్రుడు మాన్యుయేల్ నొరీగాను వశపర్చు కోటానికి వేలాదిమందిని చంపి లక్షలాది మందిని నిర్వాసితులను చేసి రోడ్లపాలు చేసింది.

మెక్సికో, పెరూ, కొలంబియా : డ్రగ్స్‌ను అరికట్టటం పేరుతో మిలిటరీ సహాయాన్ని ఈ దేశాలకు అందిస్తోంది. ఆచరణలో ప్రతిపక్షాలను ఏరివేయటానికి, కమ్యూనిస్టులు, ప్రజాస్వామ్యవాదుల్ని అణచటానికి ఈ నిధులు ఉపయోగపడుతున్నాయి.

అమెరికన్ సామ్రాజ్యవాదం సిఐఏ రూపంలో చేసిన కుట్రల్ని కొన్నింటిని మాత్రమే చర్చించాం. ప్రపంచవ్యాప్తంగా అన్ని ఖండాల్లో ఆఫ్రికా, యూరప్, ఆసియా ఖండాల్లో సామ్రాజ్యవాదం హింసను ప్రేరేపించి కార్పొరేట్ అనుకూల ప్రభుత్వాన్ని స్థాపించింది. ఇవి పదుల సంఖ్యలో కాదు, వందల సంఖ్యలో ఉన్నాయి. తాజాగా సిరియా, ఎమెన్, పాలస్తీనా, ఆఫ్ఘనిస్తాన్, ఉత్తర కొరియా, వెనిజులా, లిబియా, లెబనాన్, ఉక్రెయిన్, మాల్దీవులు వంటి అనేక దేశాల్లో తన ఆగడాలకు అదుపులేకుండా పోతుంది. ప్రజాస్వామ్యాన్ని కోరుకొనే వామపక్ష ప్రగతిశీల ప్రజలంతా ఉద్యమించి సిఐఏ కుట్రలను సమిష్టిగా ఎదుర్కోవటం నేటి క్రియాశీలమైన అంశం.

వ్యాస రచయిత : ఆల్ ఇండియా ప్రోగ్రెసివ్ ఫోరం జాతీయ కార్యవర్గ సభ్యులు. సెల్ : 9849491969

వి-మెయిల్

సాయంలేదు మిత్రమా!

ఎట్టకేలకు కేంద్రాన్ని పాలిస్తున్న మిత్రుణ్ణి తెలుగుదేశం పార్టీ నిలదీస్తుంది 'నీ నుండి మాకు సాయం లేదు మిత్రమా' అంటూ. అంతకుముందు 28సార్లు రాష్ట్ర ముఖ్యమంత్రి హస్తిన పర్యటనలు చేశారు. సమస్యల చిట్టా పట్టుకొని.రాష్ట్రం తరఫున ప్రతిపక్షాలు, పౌర సమాజం, తమకి రావాల్సిన విభజన చట్టం హామీలు ఎలా ఉదాసీనత కు గురవుతున్నాయో వివిధ పద్దతుల్లో తెలియ బరుస్తూనే ఉన్నారు. ప్రతీసారీ కేంద్రం తాము చేస్తున్న,చేయాలనుకుంటున్న సాయం లెక్కలు వల్లె వెయ్యడం తప్ప, అందులో నికరంగా గ్రౌండ్ అయ్యింది ఏమాత్రమో చెప్పడం లేదు.ఎవరు ప్రశ్నించినా తెలుగుదేశం పార్టీ, రాజుని మించిన రాజభక్తి ని ప్రదర్శిస్తూ,మిత్రధర్మాన్ని అతిగా పాటించేది. అందుకు ఉదాహరణ హోదా బదులు ప్యాకేజీ ఇస్తామని కేంద్రం చెప్పడం, ఓహ్ అదే మహద్భాగ్యం అంటూ రాష్ట్రం తలూపడం.అదెట్లా అని అనుమానం వ్యక్తం చేసిన వాళ్ళని ఇద్దరూ కలిసి అవమానించడం.సరే గతం గతః.

మొదటి మాట.కేంద్రం ఒప్పుకున్న హామీలు కేవలం రాజకీయ హామీలు కావు. తమ దయాగుణం మేరకు కేంద్ర పాలకులు రాష్ట్రానికి విదిలించేవి,అనుగ్రహించేవి కావు. అవి రాష్ట్ర ప్రజలకు కేంద్రం పూచీ పడిన హక్కులు. సమాఖ్య ధర్మం అనుసరించి ఈ రాష్ట్రం పట్ల కేంద్రం అనుసరించవలసిన బాధ్యతలు.విభజన ద్వారా నష్టపోయిన ప్రాంతం పట్ల తీసుకోవాల్సిన అదనపు చర్యలివి.అందుకు అత్యున్నత పార్లమెంట్ నుండి ఆమోదం కూడా ఉంది.ప్రస్తుత పాలకపక్షం కూడా ఈ హక్కులపై ఏనాడూ తన అసంతృప్తిని వెలిబుచ్చలేదు. అసంబద్ధమని అనలేదు.

ఇక రెండో మాట. ఈ విభజన హక్కుల్ని దఖలు పరచడానికి మీనమేషాలు లెక్కించడం ఎందుకు?నిండా మునిగి పోతున్న వాడిని బయటకు లాగడానికి చెయ్యిస్తూ ముందుకు వస్తారా, ఘడియకో గడ్డిపరక అందిస్తూ ఉంటారా! కాలనిర్ణయం, ప్రణాళిక, అమలు లేకపోతే అభివృద్ధి సాధ్యమా! ఉదాహరణకు గిరిజన విశ్వవిద్యాలయం నిర్మాణానికి నాలుగేళ్ళ తర్వాత పది కోట్లు కేటాయించారు. నిర్వాసితులకు పరిహారం మాట తర్వాత, ప్రహరీ గోడ కట్టడానికైనా ఈ నిధులు సరిపోతాయా?ఈ స్పీడ్ లో వెళ్తే అది ఎప్పటికి సాకారం కావాలి?

హోదానో, ప్యాకేజీనో పరిశ్రమలకు ఊతం, కమిట్ అయిన మేరకు విద్యాలయాలు, వెనుక బడిన జిల్లాలకు బుందేల్ ఖండ్ తరహా ఆర్థిక సాయం, రాజధాని, పోలవరం, పెట్రో కారిడార్, స్మార్ట్ నగరాల నిర్మాణాలకు ఊతం, ఆర్థిక లోటు భర్తీ తదితర హామీలను తీర్చేందుకు కేంద్రం పక్కా ప్రణాళికతో ముందుకు రావాలి. అంతకు మించి ఆర్థిక వెసులుబాటు ఇవ్వాల్సిన చోట ఆ మాత్రం కూడా చేయకపోవడం రాజ్యాంగ విరుద్ధం. కేంద్రం మిత్రధర్మాలు, శత్రు ధర్మాలూ కాదు సమాఖ్య ధర్మం పాటించాలి. రాష్ట్రంలో అన్ని పక్షాలూ ఒకే గొంతు వినిపించాలి.

– డా.డి.వి.జి.శంకరరావు,
మాజీ ఎంపీ, పార్వతీపురం.

ఎరువుల ధరలు పెరగటం రైతులకు మరింత భారం

దాసరి ఆళ్వారస్వామి

మూలిగే నక్కపై తాటిపండు పడుతుందంటారు. "అన్నదాత"గా కీర్తింపబడే రైతు నెత్తిన మరింత బరువు మోపటానికి మిశ్రమ ఎరువుల ఉత్పత్తి సంస్థలు సిద్ధమై, ఆ మేరకు కేంద్ర ప్రభుత్వానికి సమాచారం కూడా పంపాయి. ఫిబ్రవరి 1 తర్వాత ఉత్పత్తయ్యే డి.ఏ.పి. (డై అమోనియం ఫాస్ఫేటు), ఇతర మిశ్రమ ఎరువుల ధరలు పెరగబోతున్నాయి. రైతు పండిస్తున్న పంటలకు గిట్టుబాటు ధర లభించక, రైతులు నష్టాల బారిన పడుతున్నారు. అరకొరగా నిర్ణయించిన మద్దతు ధరకు ధాన్యం కొనేవారు కరువయ్యారు. ఇలాంటి దశలో మళ్లీ మిశ్రమ ఎరువుల ధరలు పెరగటం రైతుకు నష్టం వ్యవసాయానికి హానికరమే! ఫిబ్రవరి 1 నుంచి మిశ్రమ ఎరవుల ధరలు పెంచుతున్నట్లు ఉత్పత్తి సంస్థలు కేంద్రప్రభుత్వానికి పంపిన సమాచారం మీడియాకు లీకయింది. వ్యాపారస్తులు తమవద్ద వున్న మిశ్రమ ఎరువులను నల్లబజారుకు తరలించేశారు. ప్రస్తుతం దాళ్వా నాట్లు పూర్తయి, ఎరువులు వేసే దశలో రైతులు వున్నారు. రైతు అవసరాలను ఆసరా చేసుకొని పెంచబోతున్న ధరలకే మిశ్రమ ఎరువుల స్టాకును అమ్మకం సాగించటానికి వ్యాపారులు సిద్ధమయ్యారు. వారిపై చర్యలు తీసుకోటానికి అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారు.

మన రైతాంగం వాడే ఎరువులు రెండు రకాలు. ఒకటి సూటి ఎరువులు. రెండు మిశ్రమ ఎరువులు. యూరియా, ఎ.యస్.యస్., సి.ఎ.యస్. లాంటివి సూటి ఎరువులు. డి.ఏ.పి, 17:17:17, 28:28:0 లాంటివి మిశ్రమ ఎరువులు. సూటి ఎరువుల్లో నత్రజని వుంటుంది. మిశ్రమ ఎరువుల్లో భాస్వరం, పొటాష్‌లాంటివి వివిధ మోతాదుల్లో ఉంటాయి. నత్రజని మాత్రమే కలిగిన సూటి ఎరువుల వాడకం వల్ల పైరుకు చీడ, పీడలు ఆశించి దిగుబడులు తగ్గుతాయి. కాబట్టి, మిశ్రమ ఎరువులనే వాడమని శాస్త్రవేత్తలు చాలాకాలంగా చెపుతున్నారు. వారి సూచనల ప్రకారం మిశ్రమ ఎరువులనే వాడటానికి రైతులు మొగ్గుచూపుతున్నారు. కీలెరిగి వాతపెట్టమన్నట్లు" రైతుల అవసరాలను గ్రహించిన ఎరువుల ఉత్పత్తి సంస్థలు మిశ్రమ ఎరువుల ధరలు పెంచటానికి సిద్ధమయ్యాయి. ఆ పెరుగుదల నామమాత్రంగా లేదు. సుమారు పదకొండు శాతం ఒక్కసారిగా ఎరువుల ధరలు పెరగటమంటే రైతుకు భరించలేని భారమే. ప్రస్తుతం డీఏపీ టన్ను ధర రూ. 24,753 మాత్రమే. ఫిబ్రవరి నుంచి రూ. 27,353లకు పెంచనుంది. 50 కిలోల బస్తాపై రూ. 130 పెరగనుంది. అలాగే మిగిలిన మిశ్రమ ఎరువుల ధరలు బస్తాకు రూ. 112 చొప్పున పెంచటానికి ఉత్పత్తి సంస్థలు సిద్ధమయ్యాయి.

రైతుకు లాభం చేకూర్చాలని, వ్యవసాయం లాభసాటిగా మారాలని



ప్రయత్నం చేస్తున్న తరుణంలో ఇలా మిశ్రమ ఎరువుల ధరలు పెరగటం ప్రభుత్వ వర్గాలకు కూడా మింగుడు పడటం లేదు. అలా అని ఎరువుల ధరలు పెరగకుండా ఆపే శక్తి కేంద్ర ప్రభుత్వానికి కూడా లేదనే చెప్పాలి. ఒక్క యూరియా ధర మినహా మరే ఎరువుల ధర నిర్ణయాధికారం కేంద్రానికి లేదు. 2009కి ముందే వాటి ధరల నిర్ణయాధికారం ఆయా ఉత్పత్తి సంస్థలకే దఖలుపరుస్తూ నిర్ణయం జరిగిపోయింది. అందుకే రైతాంగం 2010లో గడ్డు పరిస్థితినెదుర్కొన్నారు. ఆ ఏడాది ఏకంగా నాలుగుసార్లు ఉత్పత్తి సంస్థలు మిశ్రమ ఎరువుల ధరలు పెంచేసుకొన్నాయి. 2010లో 50 కిలోల డీఏపీ బస్తా ధర రూ. 486 మాత్రమే. 2012 నాటికి ఆ ధర రూ. 1260కి పెరిగిపోయింది. దాదాపు రెండు రెట్లు ధర పెరగడంతో రైతుల్లో కొనుగోలు శక్తి నశించిపోయింది. అమ్మకాలు పడిపోయాయి. నిల్వలు పెరిగిపోయాయి. ఆశకు పోయిన ఉత్పత్తి సంస్థల అత్యాశపై నీళ్లు చిలకరించినట్లయింది. అదే కాలంలో సేంద్రియ సాగువైపు రైతులు దృష్టి సారించారు. ఎరువుల వాడకం తగ్గుతుందని గమనించిన ఉత్పత్తి సంస్థలు పెంచిన ధరలను తగ్గించుకొంటూ వచ్చాయి. 2017 సెప్టెంబరులో 50 కిలోల డీఏపీ బస్తా ధర రూ. 1092. ప్రస్తుతం రూ. 1237గా వుంది. ఫిబ్రవరి 1 నుంచి అదే బస్తా రూ. 1367 కాబోతుంది.

మిశ్రమ ఎరువుల ధరలను నియంత్రించే శక్తి ఏ ప్రభుత్వానికీ లేదు. కనుచూపుమేరలో ఎన్నికలు కనిపిస్తున్నాయి. కాబట్టి ఎరువుల ధరలను నియంత్రించే ప్రయత్నాలు ఏ ప్రభుత్వం చేయదు. కోట్లమంది ఓటర్లుకన్నా, వేల సంఖ్యలో వున్న ఉత్పత్తి సంస్థల శ్రేయస్సే పాలకులకు ముఖ్యం. వారు ఎన్నికలకు అందించే చందాలు అంతకన్నా ముఖ్యం. కాబట్టి ఎరువుల ధరలను నియంత్రించే ప్రయత్నాలు జరగవుగాక జరగవు. ఎరువుల ధరలు పెరుగుతున్న దామాషాలో ఆ వ్యవసాయ ఉత్పత్తుల ధరలు పెరగాల్సిన అవసరం వుందన్న విషయం ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. అలా పెరిగినపుడే రైతుకు కొంచెం ఊరట. ఎరువుల ధరలు బారెడు పెరుగుతుంటే, వ్యవసాయ ఉత్పత్తుల ధరలు జానెడు కూడా పెరగకపోవటం గమనార్హం. 2010లో డీఏపీ బస్తా రూ. 486గా వునప్రుడు, ఏ గ్రేడ్ రకం ధాన్యం క్వింటాలు ధర రూ. 1030. 2018లో 50 కిలోల డీఏపీ బస్తా రూ. 1237లుగా వున్నప్పుడు, ధాన్యం క్వింటాలు ధర సుమారుగా రూ. 1400, డీఏపీ ధర 2019-2018 మధ్య కాలంలో రూ. 486 నుంచి రూ. 1237కి పెరిగితే, అదే సమయంలో ఆ ఎరువులు వాడి పండించిన ధాన్యం ధరలు రూ. 1030 నుంచి రూ. 1500 కు పెరగటం గమనార్హం. మిశ్రమ ఎరువుల ధరలు 254 శాతం పెరిగితే ధాన్యం ధర పెరిగింది 15 శాతం కన్నా తక్కువ. ఫిబ్రవరి నుంచి డీఏపీ ధర రూ. 130లు పెరగబోతుంది. ధాన్యం ధర మాత్రం 2019 ఖరీఫ్ వరకూ పెరిగే అవకాశం లేదు. 2019లో కనీస మద్దతు ధర ప్రకటించే వరకూ ప్రస్తుత ధరే కొనసాగుతుంది. ఆ ధరకు కూడా కొనుగోళ్లు జరగక రైతులు ఇబ్బంది పడుతున్నారు.

డీఏపీ తయారు చేయటానికి ఉపయోగించే 'పాస్ఫరిక్ ఆమ్లం" ధర పెరగటం వల్ల తమ ఉత్పత్తుల ధరలు పెంచవలసి వచ్చిందని ఉత్పత్తి సంస్థలు వివరణ కూడా ఇచ్చుకొంటున్నాయి. ఎరువుల ఉత్పత్తి వ్యయం తగ్గిన రోజుల్లో ఎరువుల ధరలు తగ్గించిన దాఖలాలు చరిత్రలో లేవు. పెరిగిన ధరలకు ఎరువులను కొనుగోలు చేసి, పండించిన ధాన్యం ధర కూడా పెంచాల్సిన బాధ్యత కేంద్రానిదే. కేంద్ర ప్రభుత్వం అలాంటి చర్యలు చేపట్టినపుడు రైతులకు కొంచెం వెసులుబాటుగా వుంటుంది. ఊరట లభిస్తుంది. వేల సంఖ్యలో వుండని ఎరువుల ఉత్పత్తి సంస్థలు తమకు నష్టం రాకుండా ఉండటం కోసం ధరలను పెంచుకొంటున్న దశలో కోట్లాది మంది రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించకపోతే, కోట్లాది మంది రైతులు నష్టపోవటం, అప్పులు తీర్చలేకపోవటం, అవమానాలు భరించలేక ఆత్మహత్యలకు పూనుకొంటున్న విషయం కూడా ప్రభుత్వం గుర్తించాలి.ఇప్పటికి వ్యాపారుల వద్ద వున్న నిల్వలను పాత ధరలకే అమ్మమని కృష్ణాజిల్లా కలెక్టరు బి. లక్ష్మీకాంతం సోమవారం ఉత్తర్వులివ్వటం గమనార్హం.

వ్యాస రచయిత : సీనియర్ జర్నలిస్టు,
సెల్: 9393818199



ఆకుపచ్చని తామర అందాలు!

విశాలాంధ్ర
బతుకు
The Life
గురువారం
08 ఫిబ్రవరి 2018

శిధిలావస్థ నుంచి సర్వాంగ సుందరంగా..!

మాతృదేవోభవ, పితృదేవోభవ, ఆచార్య దేవోభవ అన్నారు మన పెద్దలు. మన సమాజంలో తల్లిదండ్రుల తర్వాత స్థానం గురువుదే. ఈ ముగ్గురికే కాదు చదువుకున్న పాఠశాలకీ అంతే ప్రాధాన్యత ఇవ్వాలంటున్నారు గుంటూరులోని పాటిబండ్ల సీతారామయ్య హైస్కూల్ పూర్వ విద్యార్థులు. చెప్పడమే కాదు చేతల్లోనూ చూపిస్తున్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన బడిని శిథిలావస్థ నుంచి సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. జిల్లాలోనే ఎక్కడా లేని విధంగా ఈ స్కూల్‌లో సౌకర్యాలు కల్పించారు, మరిన్ని కల్పిస్తున్నారు. బడిని బాగుచేసిన సహృదయులుగా గుంటూరు జిల్లావాసుల నుంచి ప్రశంసలు అందుకుంటున్నారు.



పాటిబండ్ల సీతారామయ్య హైస్కూల్‌లో మైదానాన్ని అద్భుతంగా తీర్చిదిద్దిన దృశ్యం

ఇప్పుడూ పూర్వ విద్యార్థి సంఘాలు చాలానే కనిపిస్తున్నాయి. ఈ సంఘాలకు చెందినవారు తమకు తోచిన రీతిలో తమ స్కూలు కోసం అంతోఇంతో ఇస్తున్నారు. చేతనైనది ఏదో ఒకటి చేశామని అనిపించుకుంటున్నారు. కానీ గుంటూరు పాటిబండ్ల హైస్కూల్ పూర్వ విద్యార్థుల సంఘం మాత్రం ఇలా కాదు. తాము చదువుకున్న స్కూల్‌ను పూర్తిస్థాయిలో మార్చేందుకు కంకణం కట్టుకున్నారు. ఈ ప్రాంతంలోనే సకల సౌకర్యాలు ఉన్న పాఠశాలగా మార్చేందుకు నడుం బిగించారు. ఇందులో భాగంగా ఇప్పటికే ఈ పాఠశాలలో ఎన్నో మార్పులు తీసుకొచ్చారు. ఇందుకోసం పూర్వ విద్యార్థులంతా కలిసి రూ. 70 లక్షలు విరాళంగా ఇచ్చారు. తక్కువ ఫీజులు చెల్లించి చదువుకునేలా పేద విద్యార్థుల కోసం ఇంగ్లీష్ మీడియం స్కూల్‌ని ఏర్పాటు చేశారు.

హైస్కూల్ స్థాపన ఇలా...

ప్రముఖ సంఘసేవకులు పాటిబండ్ల సీతారామయ్య పేరుతో 1962వ సంవత్సరంలో పాటిబండ్ల సీతారామయ్య హైస్కూల్ ఏర్పాటైంది. దీన్ని సీతారామయ్య అన్నదమ్ములు పాటిబండ్ల రామస్వామి, పాటిబండ్ల శివలింగయ్య, పాటిబండ్ల మల్లిఖార్జునరావులు కలిసి స్థాపించారు. తొలుత దీన్ని అమరావతి రోడ్డులో ఉన్న రెండుగదుల షెడ్డులో ఆరంభించారు. తర్వాత 1964లో లక్ష్మీపురం ప్రాంగణంలోకి మార్చారు. ఇక్కడ పాఠశాల నిర్మించడానికి ప్రముఖులు వట్టికొండ రంగయ్య, మారుపూడి వీరయ్య, జస్టిస్ జాస్తి ఈశ్వరప్రసాద్‌లు స్థలాన్ని ఇచ్చారు. ఈ స్థలంతోపాటు ఉదారమైన దాతలు నుంచి విరాళాలు స్వీకరించి పాటిబండ్ల సీతారామయ్య పేరు మీద పాఠశాలను నిర్మించారు. తర్వాత కాలంలో ఇది ఎయిడెడ్ హైస్కూల్‌గా రూపాంతరం చెందింది. తొలిరోజుల్లో ఇక్కడ ఉన్న విద్యార్థులు కేవలం ఇరవై మందే. ఈ సంఖ్య ఇప్పుడు వెయ్యికి పైమాటే. ఒకటో తరగతి నుంచి పదోతరగతి వరకు ఉన్న ఈ స్కూల్లో 30 మంది సిబ్బంది పనిచేస్తున్నారు.

పూర్వవిద్యార్థుల సంఘం.... అభివృద్ధి పనులు

అర్థ శతాబ్దం పూర్తి చేసుకుని వజ్రోత్సవాల దిశగా ముందడుగు వేస్తున్న ఈ పాఠశాలలో చదువుకున్న విద్యార్థుల్లో చాలామంది ఇప్పుడు ప్రముఖ స్థానాల్లో ఉన్నారు. ఇంజినీర్లు, ఐఏఎస్, ఐపీఎస్, డాక్టర్లు, శాస్త్రవేత్తలు, పారిశ్రామికవేత్తలు, ఉద్యోగులుగా ఎంతో ఉన్నత స్థానాలకి ఎదిగారు. విదేశాల్లో స్థిరపడినవారూ ఉన్నారు. అమెరికా, కెనడా, ఫ్రాన్సు, ఆస్ట్రేలియా, మలేషియా, చైనా, జపాన్, ఐర్లాండ్, గల్ఫ్‌దేశాలలో కూడా స్థిరపడ్డారు. ఒంటబట్టిన చదువు, విలువలు వారిని మంచి పనికి పురికొల్పాయి. వీరంతా కలిసి ఇప్పుడు పూర్వవిద్యార్థుల సంఘంగా ఏర్పడ్డారు. తమకు విద్యాబుద్ధులు నేర్పి ఉన్నతస్థితికి తీసుకొచ్చిన పాఠశాల అభివృద్ధి కోసం కృషి చేస్తున్నారు. ఎక్కడో ఉన్న వీరంతా మాతృగడ్డపైన ఉన్న తమ పాఠశాలను మర్చిపోకుండా అభివృద్ధి బాటలు వేస్తున్నారు.

రూ. 70 లక్షలు విరాళం

ఈ పూర్వ విద్యార్థుల సంఘం ఏర్పడింది రెండేళ్ళ కిందటే గానీ చేసిన మంచి పనులు మాత్రం చాలానే ఉన్నాయి. 2016లో ఏర్పాటైన ఈ సంఘంలో ప్రస్తుతం వెయ్యి మంది సభ్యులు ఉన్నారు. వీరందరూ కలిసి దాదాపుగా రూ. 70లక్షలు విరాళాలు ఇచ్చారు. వీటితో పాటిబండ్ల సీతారామయ్య హైస్కూల్ కోసం కొత్త భవనాలను నిర్మించారు. ఫర్నీచర్ ఏర్పాటు చేశారు. క్రీడా మైదానాన్ని అద్భుతంగా తీర్చిదిద్దారు. అధునాతన కంప్యూటర్ లేబొరేటరీను ఏర్పాటు చేశారు. ఆడియో వీడియోతో కూడిన డిజిటల్ థియేటర్‌ను ఇచ్చారు. పాఠశాలలో ఉన్న అన్ని తరగతి గదులలో ఫ్యాన్లు, లైట్లు ఏర్పాటు చేశారు. విద్యార్థులకు మంచినీరు తాగేందుకు వీలుగా ప్రత్యేకంగా సౌకర్యాలు కల్పించారు. శిథిలస్థితిలో ఉన్న ప్రహరీగోడను తొలగించి కొత్త ప్రహరీ గోడను నిర్మించారు. పాఠశాల ప్రాంగణంలో పెద్దఎత్తున మొక్కలు నాటించారు. ఇలా అభివృద్ధి కార్యక్రమాలు నిరాటంకంగా కొనసాగుతున్నాయి. మరిన్ని విరాళాల సేకరణ, మరింత ఉత్సాహంగా అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగించేందుకు ఇతర దేశాలలో ఉన్న మిగిలిన పూర్వవిద్యార్థులను కూడా సంఘంలో సభ్యులుగా చేర్చేందుకు కృషిచేస్తున్నారు.



పూర్వవిద్యార్థులు అభివృద్ధి చేసిన తర్వాత గుంటూరులో పాటిబండ్ల సీతారామయ్య హైస్కూల్, ప్రాంగణంలో మొక్కలు



హైస్కూల్‌లోకి ప్రవేశద్వారం



అధ్యాపకులతో పూర్వవిద్యార్థులు

కార్పొరేట్ తరహాలో ఇంగ్లీషు మీడియం స్కూల్

ఇదే ప్రాంగణంలో పేద పిల్లల కోసం కార్పొరేట్ తరహాలో ఇంగ్లీషుమీడియం స్కూల్‌ను పూర్వవిద్యార్థుల సంఘం ఏర్పాటు చేసింది. కార్పొరేట్ స్కూల్‌లో లక్షలాది రూపాయలు చెల్లించలేని పేద విద్యార్థులకు ఇక్కడ అతితక్కువ ఫీజులకే ఇంగ్లీషుమీడియం విద్యను బోధిస్తున్నారు. పాటిబండ్ల సీతారామయ్య హైస్కూల్ కమిటీ సహకారంతో ఈ పని చేస్తున్నారు. విద్యార్థులకు క్రీడల్లో శిక్షణ ఇచ్చేందుకు ప్రత్యేకంగా కోచ్‌లను నియమించే యోచనా చేస్తున్నారు.

నాడు



నేడు



రూ. కోటి సేకరణకు ప్రణాళిక

ప్రస్తుతం పాటిబండ్ల సీతారామయ్య ఎయిడెడ్ హైస్కూల్‌లో ఉపాధ్యాయుల కొరత ఉంది. ప్రభుత్వం ఎయిడెడ్ ఉన్నత పాఠశాలలో పోస్టులను భర్తీ చేయకపోవడం వలన పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఇక్కడ ప్రైవేటు ప్రాతిపదికన ఉపాధ్యాయులను నియమించడం స్కూల్ కమిటీకి భారంగా ఉంది. ఈ నేపథ్యంలో పూర్వవిద్యార్థుల సంఘం కోటిరూపాయలు సమకూర్చాలని నిశ్చయించింది. దీన్ని కార్పస్‌ఫండ్‌గా ఉంచి దానిపైన వచ్చే వడ్డీతో ప్రైవేట్ ప్రాతిపదికన నియమించే ఉపాధ్యాయులకు జీతాలు ఇవ్వాలని ప్రణాళిక రూపొందిస్తోంది.

జి.రమేష్, గుంటూరు జిల్లా

సమష్టి కృషి



పాటిబండ్ల సీతారామయ్య హైస్కూల్‌లో చదివిన విద్యార్థులు అందరూ ఒక అసోసియేషన్‌గా ఏర్పాటు అయ్యేం. శిథిలస్థితిలో ఉన్న స్కూల్‌ను అభివృద్ధిపథంలోకి తీసుకొచ్చాం. దీన్ని మరింతగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నాం. ప్రపంచం నలుమూలలా ఉన్న పూర్వవిద్యార్థుల వివరాలను సేకరిస్తున్నాం. వారి నుంచి విరాళాలు సేకరించి స్కూల్‌ను జిల్లాలోనే ఒక ఉన్నతమైన స్కూల్‌గా తీర్చిదిద్దాలనుకుంటున్నాం. విద్యాబుద్ధులు నేర్పిన పాఠశాల అభివృద్ధికి కృషిచేయడం చాలా సంతోషంగా ఉంది. జీవితంలో ఎప్పుడూ చదువుకున్న స్కూల్‌ను, విద్యనేర్పిన గురువులను మర్చిపోకూడదు. దేశంలో ఎవరైనా విద్యాబుద్ధులు నేర్పిన పాఠశాల అభివృద్ధిలో భాగస్వామ్యులు కావాలి. అప్పుడే పాఠశాలలు అభివృద్ధిపథంలో ఉంటాయి. భవిష్యత్తులో ఈ పాఠశాల అభివృద్ధికి ఎన్నో కార్యక్రమాలు చేపడతాం

– పూర్వవిద్యార్థుల సంఘం అధ్యక్షులు మోదుగుల వాసుదేవరెడ్డి

త్వరలో వైబ్‌సైట్ ఆరంభం



త్వరలో పూర్వవిద్యార్థుల సంఘానికి సంబంధించిన వెబ్‌సైట్‌ను ఏర్పాటు చేయనున్నాం. ఈ వెబ్‌సైట్‌లో పేర్లు నమోదు చేసుకోవడం ద్వారా పూర్వవిద్యార్థులు సభ్యత్వం పొందవచ్చు. ఇప్పటికే చేసిన అభివృద్ధిప నులను ఆన్‌లైన్‌లో ఉంచి పూర్వవిద్యార్థులలో మరింత చైతన్యం తీసుకొస్తాం. నేను ఈ స్కూల్‌లో చదువుకున్న రోజుల్లో ఇందులో అడ్మిషన్ కోసం చాలా కష్టపడాల్సి వచ్చేది. జిల్లాలో దాదాపు ఇరవై, ముప్పై ఏళ్ళు పదోతరగతి ఉత్తీర్ణతలో అగ్రస్థానంలో నిలిచేది. ఉపాధ్యాయులు ఎంతో అంకితభావంతో విద్యాబోధన చేసేవారు. పాఠ్యాంశాలే కాకుండా నైతిక విలువలను కూడా బోధించి సమాజంలో ఉన్నతస్థానాలు అందుకునేలా తీర్చిదిద్దారు. ఇలాంటి పాఠశాల అభివృద్ధికి ఇంకా ఎంతో చేయాల్సి ఉంది. ఇందుకోసం పాఠశాల కమిటీ కూడా విశేషకృషి చేస్తోంది.

– పూర్వవిద్యార్థుల సంఘం కార్యదర్శి కొడాలి నాగమల్లేశ్వరరావు











ఇండోర్ ప్లాంట్ డెకరేషన్స్!

గృహాలంకరణలో పచ్చని మొక్కలదీ ప్రధాన పాత్రే. స్వచ్ఛమైన గాలి, పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెరుగుతున్న నేపథ్యంలో ఈ విషయం మీద దృష్టి పెడుతున్నవారి సంఖ్యా ఎక్కువవుతోంది. పైగా వచ్చేది వేసవికాలం. ఈ నేపథ్యంలో ఇండోర్ ప్లాంట్స్ గురించిన ఆలోచన మరింత ఎక్కువవుతుంది. ఈ మొక్కల పెంపకం, అలంకరణలోనూ ప్రత్యేకత చూపించాలనుకునేవారి కోసమే ఈ డిజైన్స్.



అతడు-ఆమె

67

జరిగిన కథ

ఉర్వశి అందీ: "అయితేనేం! మీ ఖాయిదాకింద - కత్తులూ కఠార్లూ అంత పరిశుభ్రంగా స్టెరిలైజు చేసేస్తున్నామాట !"

అన్నయ్య అన్నాడు : "అభ్యంతరమేమి? నేను సంవత్సరానికి అధమం నూరు హెర్నియాలేనా శస్త్రం చేస్తాను - నోటి నుంచి సిగరెట్టు తియ్యకుండానే. వొక్కటికూడా ఇంతవరకు చీము పట్టలేదు."

"పట్టితే?" అంది ఊర్వశి. "పట్టితే ఏముంది? వాడి ఖర్మం. గుండె ఆగిపోయి వూపిరి ఆడక చచ్చిపోయాడని కాగితం వ్రాసి యిస్తాం. అంతేకదండీ వడివేలుగారూ?" అన్నాడు అన్నయ్య - అందరూ ఫక్కున నవ్వు !

ఉర్వశి అంది : "డాక్టరుగారూ! మీరీమధ్య యేదో గొప్ప కపాలశస్త్రం చేశారని పత్రికల్లో చదివేమండి. యేమి అద్భుతం!"

(నిన్నటి సంచిక తరువాయి)

"అద్భుతం అని మెల్లగా అంటారు! ఇప్పుడు మేం వైద్యులం బుర్రలు తీసి బుర్రలు పెడుతున్నాం - వకీళ్లలాగు!" అన్నాడు అన్నయ్య. డాక్టర్లూ, వారి భార్యలు పడి నవ్వేరు.

అన్నయ్య ఈమధ్యనే జర్మనీ వెళ్లొచ్చాడు. అంచేత "హిట్లరుని చూశారా - డాక్టరుగారూ?" అని అందరూ అడగడమే. "చూడడమేమిటి? ఆ యూనిఫారమూ మెడల్సు అద్దుపటకా వేసుకుంటే సాక్షాత్తు శుక్లాంబరుడై యగ్నోపవీతం వేసుకుని కౌస్తుభమణిమయ మయూరహారములు ధరించిన విష్ణుమూర్తి దర్శనమే! ఎదుట అతను ప్రత్యక్షం అవుతే-ఆ సూర్య తేజస్సుకీ, బ్రహ్మవర్చస్సుకీ నిలబడగలమండీ? సమ్మోహ నాస్త్రమేగా!" అన్నాడు అన్నయ్య.

"ఓహోహో! ఏం అదృష్టం అండీ మీది - అంతటి మహాను భావుడి దర్శనం లభించడం!" అన్నారు. స్త్రీలందరూ ఒక్క గొంతుకతో. స్త్రీలేమిటి - అందరమున్నూ.

"వైద్యశాస్త్ర పరిశోధన అంటే జర్మనీదేకదండీ అగ్రతాం బూలం?" అంది మిసెస్సు వెబ్లాకు.

అందుమీద మజుందారు : "హిట్లరు తల్చుకుంటే ఏదీ కాదండీ! ఇక్కడ ఎనాటమీ చెబుదాం అంటే కళేబరాలే దొర్కకపోయె? ఇహ పరిశోధన ఎలా చస్తుంది?" అన్నాడు.

"ఉగ్రనరసింహమూర్తిలాగు హిట్లరు ఛత్రచామ రాలలో సింహాసనం మీద కూర్చుని ఏకఛత్రాదిపత్యం ఏలుతుంటే కళేబరాలకి కొదవేమిటండీ! నిండు ప్రాణాలతో వున్న యూదులమీదనే వైద్యశాస్త్ర పరి శోధనలు చెయ్యమని ఫర్మానా జారీచేసేశాడు!" అన్నాడు అన్నయ్య. అందరం "ఓహోహో" అంటే 'ఓహోహో" అన్నాం.

అన్నయ్య అందుకున్నాడు : "అంతేనా హిట్లరు చేసింది? ఆ చీడ పురుగుల సంతానం వృద్ధికాకుండా - వాళ్ళని యేకంగా జీవచ్ఛవాలని చేసెయ్యమని ఫత్వా మంజూరు చేశాడు!"

"వెబ్లాక్ అన్నాడు : పీడ వదిలిపోయింది ప్రపం చానికి. ఒక్క దెబ్బతోనే శాస్త్ర పరిశోధన - యూదుల నాశనం. ఏమి రాజకీయవేత్తండి!" "ప్రచండమార్తాం డుడండీ! అలా దయా దాక్షిణ్యం లేనివాడు మనదేశంలో కూడా ఒకడు బయలుదేరాలండీ" అన్నాడు కనక సుందరం వడివేలు. "దేశద్రోహులని చీల్చిచెండాడి త్రాహి త్రాహి అనిపించే వాడొక్కడున్నాడు కాబట్టే మనం ఇంకా ఇక్కడ నిలబడి వుండగలిగేం !" అంది లేడీ అయ్యంగారు. పుండరీకాక్షుడుగారు అన్నారు : "అలాంటి చండశాసనుడు మనకి కూడా రావాలి! సాక్షాత్తు విష్ణుమూర్తి అవతారమే గనుక అతను వైరిపై శంఖుచక్రగదా ఖడ్గచ్ఛాపములను ప్రయోగించినా తప్పులేదు." "హిట్లర్‌కి జై!" అంది ఊర్వశీ. అందరం "జై!" అన్నాం.

వరదన్ భార్య అంది : "రామలక్ష్మణులలాగు అన్నదమ్ములు మీరిద్దరూ - ఒకరు 'అనాయాశ మరణం వినా దైన్యెనజీవనం' లోకానికి ప్రసాదిస్తున్నారు" అంది. "అవునండీ! మావాడు క్లయింట్లకి ముదనష్టపు ఆస్తులు సంపాదించిపెట్టి "వినా దైన్యెన జీవనా'నికి ఉపాధి కల్పిస్తున్నాడు నా చేతి మాత్ర వైకుంఠయాత్ర



అని నేను రోగులకి 'అనాయాస మరణం' కలుగజేస్తున్నాను" అన్నాడు అన్నయ్య. "డాక్టరుగారూ! మీరు అన్నింటికి హాస్యమే చూస్తారండీ!" అంది ఊర్వశీ.

అన్నయ్యన్నాడు : "ఆ వ్యాధి కుదిరేది కాదులెండి. రోగి దగ్గర డబ్బున్నంతవరకూ చికిత్స చేయడమే మన ధర్మం కదా! అయినా డై ఎదిల్ బీటాప్రొపెనిల్ - బసోపెరిన్ - అయొడైడు - నూరు గ్రెయినుల ఇంజక్షన్ ఇస్తే - రెండు గంటలకి ఒక పర్యాయం వచ్చి పదిహేను నిముషాలు ఉండే బాధ - నాలుగు గంటలకొకసారి వచ్చి అరగంట వుండి తగ్గిపోతుంది. నేను బి.ఎం.జి.లో వ్రాశాను చదవండి" అన్నాడు.



డాక్టర్ వుప్పల లక్ష్మణరావు

"యమ్.ఎల్.జే.లోనా?"అనిఅడిగేము మేము వకీళ్ళం అందరం అప్రయత్నంగా.

"బైరాగి చిటికెలు తీసి అట్టేపెట్టండి: చవక మందులమీదే గిట్టుబాటు! ప్రియం మందులిచ్చి రోగులనేం తిని బతకమంటారు? అసలీ రోగానికి చికిత్సే లేదులెండి. అయినా - విటమిన్సు - ఎక్సుప్లస్ - వై మాత్రలు కొత్తవి వచ్చాయి - అవి యిస్తురూ, పలుగులతో పొడిచే బాధల్లా దబ్బలంపోట్లకిందికి మారిపోతుందీ! అన్నాడు మజుందారు.

అన్నయ్య : అంతెందుకండి! నేనేం చేశానను కున్నారు? మరో వెయ్యి రూపాయలు వాడిదగ్గరనుంచి పుచ్చు కుని - జర్మనీవాడు కొత్త మందు కనిపెట్టాడు - 'విషమిన్ - గరళన్' అని - అది పది చుక్కలు ఇచ్చేసరికి - బాధనుంచి వొకసారే విముక్తి అయ్యాడు. నా ఉపకారం వల్ల అతనికి ఉత్తర క్షణంలో అనాయాస మరణం ప్రాప్తించింది!" అన్నాడు.

... ఒక్కమాటు అందరం నిశ్చలం - అంతా నిశ్శబ్దం - అయిపోయింది... రోగానికి మందులేదు. బాధకి చికిత్స లేదు. వైద్యుని ఉపకారం - బాధనుంచి విముక్తి అనాయాస మరణం... విషప్రయోగమా? ఖూనీకేసా? న్యాయసమ్మతమైన హత్యా ధర్మశాస్త్రం అంగీకరిస్తుందా?... అందరం గాభరా పడ్డాం. అన్నయ్య మాత్రం చెక్కు చెదరకుండా నవ్వుతున్నాడు. ఒక్క నిమిషమే.. కాని నాకొక యుగం అనిపించింది....

ఊర్వశీ మాత్రం అందరికంటే ముందు కుర్చీలోనుంచి లేచి అందరికీ షాంపేను అందించింది. అమృత బిందువులు! దాంతో మళ్ళీ యధాప్రకారం - నవ్వులు - నృత్యం - ప్రారంభం!

నాలుగు డ్యాన్సులు అయ్యాక లేడీ అయ్యంగారు; " డాక్టరు చింతామణిగారూ! అంతర్గత ఎలెక్ట్రిక్కు కిరణాల చికిత్సంటే మీ అభిప్రాయం ఏమిటండీ?" అంది. "అభిప్రాయం ఏమిటీ? రోగులూ వైద్యులు కూడా ఎలెక్ట్రిక్కు- ఎలెక్ట్రిక్కు అని రామస్మరణం చేస్తుంటే. మొన్న కౌన్సిలు మెంబరుగారి భార్య "డాక్టరుగారూ! కడుపునొప్పిగా వుంది. ఎలెక్ట్రిక్ కార్డియల్ కావాలండీ!" అంటూ నా దగ్గర కొచ్చింది. నేనీ రామస్మరణలో పడి ఆవిడ దేహస్థితి మర్చిపోయి నాలుగు రోజులు 'బేరియం మీలు' ఇచ్చాను. తరువాత ఫోటో తీద్దాం అని అప్పుడు జ్ఞాపకం వచ్చి - రెండు మోతాదులు ఎలెక్ట్రిక్ కార్డియల్ యిచ్చి - ఎందుకేనా ఆవిడ తృప్తికోసం మూడుమాట్లు ఫిల్ములేని ఎక్సరే ఫోటో దగ్గర నిలబెట్టాను. మరి ఆరు నెలలకల్లా నిక్షేపంలాగు మొగ చిన్నవాడిని కన్నది. ఆవిడా, ఆవిడ పెనిమిటి కూడా 'డాక్టరు చింతామణిగారు ఎక్సురే వైద్యం చేసి పుత్రదానం చేసారని అందరితోనూ అతి గొప్పగా చెప్పుకున్నారు" అన్నాడు. అందరం నవ్వి గగ్గోలు చేసేశాం.

ఇంటికొచ్చాక అన్నయ్య అడిగేడు : "ఎవరురా తమ్ముడూ ఊర్వశీ మిత్రా? మంచి చమత్కారంగా మాట్లాడిందీ! నన్ను గేలం వేసి లాగేసింది. వలలో పడిపోతానేమోఅని భయం వేసిందిరా! అన్నిసార్లు ఆవిడతోనే వాల్టుజ్ - షిమ్మీ - ఛార్లెస్టన్నూ - టేంగో- రుంబా డ్యాన్సు చేశాను! వశీకరణం వుందా యేమిటిరా ఆ స్త్రీ దగ్గర? నువ్వు మాత్రం జాగ్రత్తగా వుండేం చిదంబరం! నీజన్మ నక్షత్రం రేవతి మూడోపాదం. రాహు కేతువులు తొమ్మిదింట గురుణ్ణి చూస్తున్నారు. నీ జన్మలగ్నం సింహం. పదింట చంద్రుడు నీకు అశుభుడు. ఈ అమావాస్య వెళ్ళేవరకూ ఆవిడ కంటపడకుండా జాగ్రత్తగా పోతూండు" అన్నాడు అన్నయ్య.

"ఎన్నికలలో నిలబడమన్నావా?"అని అన్నయ్యని సలహో చేశాను. "ఇండిపెండెంటు పక్షాన్ని నిలబడి గెలుస్తానని ధైర్యం వుంటేనే నిలబడు. గెలిచేక - ఏ పక్షంలో నీకు లాభకరంగా వుంటుందో ఆ పక్షంలో చేరడానికి చిక్కువుండదు. ఇంతకీ - ఈ విషయంలో మరదలు పిల్ల యెలాగు చెపితే అలాగు చెయ్యి. నే నెప్పుడూ ఉద్యోగ విషయంలో మీ వదినె నోటిమీదే నడుస్తూంటాను" అన్నాడు అన్నయ్య.

రైలెక్కుతూ : "తమ్ముడూ! నాన్న యెప్పుడూ అనేవాడురా 'పెళ్లాం సలహాతోనే యే పనేనా చెయ్యి. రాబట్టవలసిన చోటల్లా అణా పైసలతో రాబట్టు. గోచార ఫలమూ అష్టమి శనీ చూచు కుంటూ నడుచుకో' అని. నేను నీకిచ్చే సలహో కూడా అదే. మరదలు పిల్లకి, పాపాయికీ ఆశీర్వచనాలురా యేం! మీ వదినెని చాలా చాలా అడిగినట్టు చెబుతానులే!" అన్నాడు.

తాజా : ఊర్వశి ఇప్పుడే వచ్చి వెళ్లిపోయింది.

"శాస్త్రిగారూ! ఎన్నికలలో నిలబడ్డం గురించి యేం నిర్ణ యించారు? నేను మాపక్షం వారితో మాట్లాడేను. ఖర్చులు మావాళ్ళే భరాయించేటట్టు వ్రాయించి తీసుకువచ్చా. ఒక్కమాట మాత్రం మీతో చెప్పాలి" అని దగ్గరకొచ్చి నా చెవిలో "తవా ష్యర్థం; మమాష్యర్థం ఇక మీరు సంయంటే సంయే!" అంది ఊర్వశి.

అన్నయ్య సలహో జ్ఞప్తికి తెచ్చుకున్నా. తర్వాత లెక్కపెట్టా... ఈవేళ ఉత్తరాషాఢ! ఓహో మనకి విపత్తార. అందులోనూ ప్రథమ పాదం. చిత్తినీ జాతి స్త్రీ ఘోరవిపత్తు మూడేటట్టుంది! ఇప్పుడు మనం ముందుజాగ్రత్త యెంత పడ్డా మన చేతి డబ్బు వదలక మానదు. తనవంతుకి మొదటే నా దగ్గర అణా ముక్కమీద వ్రాయించుకుంటుందేమో కూడాను! అసలు నేను ఎన్నికలలో నిలబడతాననడమే శాంతానికి ఆగ్రహ కారణం అయింది. శాంతం సలహాలే ఉత్తమం.

- ఇంకా వుంది.

భారత విదేశాంగశాఖ నూతన కార్యదర్శిగా ఎవరు నియమితులయ్యారు ?


- జమ్మూకాశ్మీర్‌లో శ్రీనగర్, లేహ్‌ల మధ్య ప్రయాణ కాలాన్ని మూడున్నర గంటల నుంచి 15 నిముషాలకు తగ్గించే ఏ సొరంగ మార్గ నిర్మాణానికి కేంద్ర మంత్రిమండలి ఆమోదం తెలిపింది ?
  - జోజిలా పాస్ సొరంగ మార్గం
- శిశువులపై దుమ్ము- సూక్ష్మ రేణువుల ప్రభావాన్ని అధ్యయనం చేయడానికి పాకే రోబోను తయారుచేసింది ఎవరు ?
  - అమెరికాలోని పర్డ్యూ శాస్త్రవేత్తలు
- న్యాయవ్యవస్థను దూషించిన కేసులో ఈజిప్టు మాజీ అధ్యక్షుడు మొహమ్మద్ మోర్సీకి అక్కడి న్యాయస్థానం ఎన్ని సంవత్సరాల జైలుశిక్ష విధించింది ?
  - మూడు సంవత్సరాలు
- పాకిస్థాన్‌తో అంతర్జాతీయ, పాక్ ఆక్రమిత సరిహద్దుల వద్ద ఎన్ని బంకర్లను నిర్మించాలని కేంద్రప్రభుత్వం నిర్ణయించింది ?
  - 14,460 బంకర్లు
- ఇండోనేషియాలోని బాలీ ద్వీపంలో ఉన్న 'గునుంగ్ అగుంగ్' అగ్నిపర్వతాన్ని హైదరాబాద్‌కు చెందిన వ్యక్తి అధిరోహించారు. ఆయన ఎవరు ? **- పెద్దినేని సాయితేజ**
- భారత జాతీయ భద్రతా డిప్యూటీ సలహాదారుగా కేంద్రప్రభుత్వం ఎవరిని నియమించింది ?
  - రాజీందర్ ఖన్నా
- ఐదు మ్యాచ్‌ల యాషెస్ సిరీస్‌ను 4-0తో కైవసం చేసుకున్న జట్టు ఏది ?
  - ఆస్ట్రేలియా
- సుప్రీంకోర్టు న్యాయమూర్తులుగా ఎవరి పేర్లను కేంద్రప్రభుత్వానికి సిఫారసు చేస్తూ కొలీజియం నిర్ణయం తీసుకుంది ?
  - సీనియర్ న్యాయవాది ఇందు మల్హోత్రా, ఉత్తరాఖండ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ కె.ఎం.జోసెఫ్
- ప్రభుత్వరంగ బ్యాంకులను (పీఎస్‌బీ) గట్టెక్కించే దిశగా బాండ్ల జారీ ద్వారా ఎన్ని రూ.కోట్ల మేర అదనపు మూలధనాన్ని సమకూర్చే ప్రతిపాదనకు లోక్‌సభ 2018 జనవరి 4న ఆమోదం తెలిపింది ? **- రూ.80,000 కోట్లు**
- భారత్‌లో జరిగే ఏకైక ఏటీపీ టోర్నీ టాటా ఓపెన్‌లో పురుషుల సింగిల్స్ ఛాంపియన్‌గా నిలిచింది ఎవరు ?
  - ఫ్రాన్స్ టెన్నిస్ ఆటగాడు గైల్స్ సిమోన్
- హిమాచల్‌ప్రదేశ్‌లోని కర్సోగ్ తహసీల్ సప్నోత్ గ్రామానికి చెందిన మహిళకు ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌ఓ) 2018 క్యాలెండర్‌లో చోటు దక్కింది. ఆమె పేరు ఏమిటి ?
  - గీతావర్మ
- మూడు దశాబ్దాల ఫొటోగ్రఫీ, పెయింటింగ్‌లో తెలంగాణ ముద్రను ప్రదర్శిస్తున్న జి.భరత్ భూషణ్‌కు ఏ విశ్వవిద్యాలయం 2016 ఏడాదికి గాను విశిష్ట పురస్కారం ప్రకటించింది ?
  - తెలుగు విశ్వవిద్యాలయం
- దేశంలో అత్యంత వేగవంతమైన సూపర్ కంప్యూటర్‌ను కేంద్ర శాస్త్ర, సాంకేతికమంత్రి హర్షవర్ధన్ పుణెలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ట్రోపికల్ మెటరాలజీ (ఐఐటీఎం)లో ప్రారంభించారు. ఆ కంప్యూటర్ పేరు ఏమిటి ?
  - ప్రత్యూష్
- భారత పర్యటన సందర్భంగా ప్రధాని నరేంద్రమోడీకి నెతన్యాహు ఒక ప్రత్యేకమైన కానుక అందజేశారు. ఆ బహుమతి ఏది ?
  - నీటిలోని లవణాలు తొలగించి శుద్ధిచేసే గాల్-మొబైల్ వాటర్ డీసాలినేషన్ అండ్ ప్యూరిఫికేషన్ ప్లాంట్‌గల జీపు
- అత్యంత ప్రతిష్టాత్మక 'సిసిల్ బీ డీమెల్లే' అవార్డు



ఈసారి ఎవరికి లభించింది ?
  - ఓప్రావిన్‌ఫ్రే
- ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లో ఏటా అందించే 'రంగినేని ఎల్లమ్మ' సాహిత్య పురస్కారానికి 2017 సంవత్సరానికిగాను ఎవరు ఎంపికయ్యారు ?
  - సుంకిరెడ్డి నారాయణరెడ్డి
- తెలంగాణ ప్రభుత్వం ఏర్పడిన తరువాత తొలి ఎస్సీ, ఎస్టీ కమిషన్ ఏర్పడింది. ఈ కమిషన్ చైర్మన్‌గా ఎవరు నియమితులయ్యారు ?
  - ఎర్రోళ్ల శ్రీనివాస్
- 2018 సంవత్సరానికిగాను అమెరికన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఏరోనాటిక్స్ అండ్ ఆస్ట్రోనాటిక్స్ (ఏఐఏఏ) సంస్థ అసోసియేట్ ఫెలోగా భారత్ నుంచి ఎవరు ఎంపికయ్యారు ?
  - డీఆర్‌డీఎల్‌కు చెందిన శాస్త్రవేత్త డాక్టర్ ప్రకాశ్ చంద్ జైన్
- సిక్కిం ప్రభుత్వ ప్రచారకర్తగా ఎవరిని నియమిస్తున్నట్లు ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి పవన్‌కుమార్ చామ్లింగ్ ప్రకటించారు ?
  - ప్రముఖ సినీ సంగీత దర్శకుడు ఎ.ఆర్.రెహ్మాన్‌ను
- భారత సంతతికి చెందిన ప్రవాస పార్లమెంటేరియన్ల మొట్టమొదటి సదస్సు 2018 జనవరి 9,10 తేదీల్లో ఎక్కడ జరిగింది ?
  - ఢిల్లీ
- భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ 2018 జనవరి 12న ఉపగ్రహ వాహక నౌక పీఎస్‌ఎల్‌వీ- సీ40 ద్వారా ఎన్ని ఉపగ్రహాలను విజయవంతంగా అంతరిక్షంలో నిర్దేశిత కక్ష్యలోకి ప్రవేశపెట్టింది ?
  - 31 ఉపగ్రహాలు
- బ్రిటన్ తొలి మహిళా సిక్కు ఎంపీని ప్రతిపక్షంలో మంత్రి (షాడో మినిస్టర్)గా లేబర్‌పార్టీ నేత జెరెమీ కార్బిన్ నియమించారు. ఆమె పేరు ఏమిటి ?
  - ప్రీత్‌కౌర్ గిల్
- భారత విదేశాంగశాఖ నూతన కార్యదర్శిగా ఎవరు నియమితులయ్యారు ?
  - సీనియర్ దౌత్యవేత్త విజయ్ కేశవ్ గోఖలే
- మనుషులు, జంతువులపై తీవ్ర ప్రభావం చూపుతున్నందున కేంద్రప్రభుత్వం ఎన్ని రకాల పురుగు మందులపై నిషేధం విధిస్తూ తాజాగా గెజిట్ నోటిఫికేషన్ జారీచేసింది ?
  - 18 రకాల పురుగుమందులు
- నాటి సిక్కుల ఊచకోతకు సంబంధించి మూసివేసిన 186 కేసుల పర్యవేక్షణకు కొత్తగా ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని (సిట్) సుప్రీంకోర్టు 2018 జనవరి 11న ఏర్పాటు చేసింది. దీనికి ఎవరు నేతృత్వం వహిస్తారు ?
  - ఢిల్లీ హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ ఎస్.ఎన్.ధింగ్రా

కరెంట్ ఎఫైర్స్ బిట్‌బ్యాంక్

- రియాద్‌లో జరిగిన ప్రపంచ ర్యాపిడ్ చెస్ ఛాంపియన్‌షిప్ - 2017లో విజేతగా నిలిచింది ఎవరు ?
  - భారత గ్రాండ్‌మాస్టర్ విశ్వనాథన్ ఆనంద్
- కోల్‌కతాలో 2018 జనవరి 5న పశ్చిమ బెంగాల్ ప్రభుత్వ అధికారిక చిహ్నాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ఆవిష్కరించారు. అయితే ఈ చిహ్నాన్ని ఎవరు రూపొందించారు ?
  - పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ
- అగస్టా వెస్ట్‌లాండ్ కుంభకోణం కేసులో హెలికాప్టర్ తయారీ సంస్థ ఫిన్ మెకానికా సంస్థ మాజీ సీఈఓను ఇటలీ కోర్టు నిర్దోషిగా ప్రకటించింది. ఆయన పేరు ఏమిటి ?
  - గుసెప్పె ఒర్సి
- ప్రస్తుతం ప్రపంచం ఎదుర్కొంటున్న పలు సమస్యలు, సవాళ్లకు పరిష్కారాలు కనుగొనేందుకుగాను 'రైజినా డైలాగ్' పేరిట



సదస్సును ఏ సంవత్సరం నుంచి భారత విదేశాంగ శాఖ, అబ్జర్వర్ రీసెర్చ్ ఫౌండేషన్ (ఓఆర్‌ఎఫ్)లు ప్రతి ఏడాది సంయుక్తంగా నిర్వహిస్తున్నాయి ?
  - 2016
- ప్రతిష్టాత్మక హాప్‌మన్ కప్‌లో సహచరురాలు బెలిండా బెన్సిచ్‌తో కలిసి రోజర్ ఫెదరర్ ఎన్నేళ్ల తర్వాత స్విట్జర్లాండ్‌కు టైటిల్ అందించాడు ?
  - 17 ఏళ్ల తరువాత
- ఆసియాన్- భారత్ ప్రాంతీయ ప్రవాసీ భారతీయ దివస్ 2018 జనవరి 6, 7 తేదీల్లో ఎక్కడ జరిగింది ?
  - సింగపూర్
- నాబార్డ్ (నేషనల్ బ్యాంక్ ఫర్ అగ్రికల్చర్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్) మూలధనాన్ని రూ.5,000 కోట్ల నుంచి ఎన్ని రూ.కోట్లకు పెంచడానికి వీలు కల్పిస్తున్న బిల్లుకు 2018 జనవరి 4న పార్లమెంట్ ఆమోదం తెలిపింది ?
  - రూ.30,000 కోట్లు
- బీహార్‌లోని దేవ్‌గఢ్ ఖజానా కార్యాలయం నుంచి పశుగ్రాసం కొనుగోలు నిమిత్తం రూ.89.27 లక్షలను తప్పుడు పత్రాలతో తీసుకోవడానికి సంబంధించి ఆర్జేడీ అధినేత లాలూప్రసాద్ యాదవ్‌కు సీబీఐ ప్రత్యేక న్యాయస్థానం 2018 జనవరి 6న ఎన్నేళ్ల కారాగార శిక్ష విధించింది ?
  - మూడున్నరేళ్లు
- ఒక టెస్టుమ్యాచ్‌లో అత్యధిక క్యాచ్ (పది)లు అందుకున్న భారత వికెట్ కీపర్‌గా రికార్డు సృష్టించింది ఎవరు ?
  - సాహా
- ఇజ్రాయెల్ ప్రధానమంత్రి బెంజమిన్ నెతన్యాహు 2018 జనవరి 14-19 తేదీల మధ్య ఆరురోజులపాటు భారత్‌లో అధికారిక పర్యటన జరిపారు. అయితే ఇజ్రాయెల్ ప్రధాని భారత్‌లో పర్యటించడం ఎన్నేళ్ల తరువాత ఇదే తొలిసారి ?
  - 15 ఏళ్లు
- డబ్ల్యూటీఏ ఆక్లాండ్ క్లాసిక్ టెన్నిస్ టోర్నీలో మహిళల సింగిల్స్ టైటిల్‌ను ఎవరు కైవసం చేసుకున్నారు ?
  - జూలియా జార్జెస్ (జర్మనీ)
- తెలంగాణ రియల్ ఎస్టేట్ రెగ్యులేటరీ అథారిటీ (రెరా) నియంత్రణాధికారిగా ఎవరు నియమితులయ్యారు ?
  - రాజేశ్వర్ తివారి
- రియాద్‌లో జరిగిన ప్రపంచ బ్లిట్జ్ ఛాంపియన్‌షిప్-2017లో విజేతగా నిలిచింది ఎవరు ?
  - మాగ్నస్ కార్ల్‌సన్ (నార్వే)
- కాసాని కృష్ణ ముదిరాజ్ స్మారక జాతీయ సీనియర్ కబడ్డీ ఛాంపియన్‌షిప్‌లో పురుషుల, మహిళల విభాగంలో విజేతలుగా నిలిచిన జట్లేవి ?
  - మహారాష్ట్ర, హిమాచల్‌ప్రదేశ్
- టీ20ల్లో రెండో అత్యంత వేగవంతమైన (32 బంతులు) సెంచరీ చేసిన ఆటగాడిగా రికార్డు నెలకొల్పింది ఎవరు ?
  - ఢిల్లీ కీపర్, బ్యాట్స్‌మన్ రిషభ్ పంత్
- కేంద్రప్రభుత్వ ప్రతిష్టాత్మక సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఇరిగేషన్, పవర్ (సీబీఐపీ) అవార్డు దేనికి దక్కింది ? **- తెలంగాణ ట్రాన్స్‌కో**
- బ్రిటిష్ ఓపెన్ జూనియర్ స్క్వాష్ టోర్నమెంట్‌లో విజేతగా నిలిచింది ఎవరు ?
  - సామ్ టాడ్ (ఇంగ్లాండ్)
- ప్రీమియర్ బ్యాడ్మింటన్ లీగ్ (పీబీఎల్) మూడో సీజన్‌లో విజేతగా నిలిచిన జట్టు ఏది ?
  - హైదరాబాద్ హంటర్స్
- రంజీట్రోఫీలో విజేతగా నిలిచిన జట్టు ఏది ?
  - విదర్భ
- 'ది మాస్టర్ ఆఫ్ నన్' టీవీ సిరీస్‌లో సంగీతం/ హాస్యం కేటగిరీలో ఉత్తమ నటనకుగాను ప్రతిష్టాత్మక 'గోల్డెన్ గ్లోబ్' పురస్కారం ఎవరికిలభించింది ?
  - భారత సంతతి నటుడు అజీజ్ అన్సారీ
- భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) నూతన చైర్మన్‌గా ఎవరు నియమితులయ్యారు ?
  - ప్రముఖ శాస్త్రవేత్త కె.శివన్
- అంతర్జాతీయ టీ 20 క్రికెట్‌లో మూడు సెంచరీలు చేసిన తొలి బ్యాట్స్‌మన్‌గా రికార్డు సృష్టించింది ఎవరు ?
  - న్యూజీలాండ్‌కు చెందిన కోలిన్ మున్రో
- ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి చైర్మన్‌గా రాష్ట్రప్రభుత్వం ఎవరిని నియమించింది? **- బీఎస్‌ఎస్ ప్రసాద్**
- తెలంగాణ అటవీశాఖ ప్రధాన సంరక్షణాధికారి పి.కె.ఝా 2018ని ఏ సంవత్సరంగా ప్రకటించారు ?
  - అటవీ అగ్నిప్రమాద నివారణ సంవత్సరం

కేంద్ర జాబితాలోని కొన్ని ముఖ్యమైన అంశాలను పేర్కొనండి ?

భారత సమాఖ్య వ్యవస్థ బిట్‌బ్యాంక్

- అధికార విభజనకు సంబంధించి రాజ్యాంగంలో ఎన్ని జాబితాలు ఉన్నాయి ?
  - మూడు. కేంద్ర జాబితా, రాష్ట్ర జాబితా, ఉమ్మడి జాబితా
- భారత రాజ్యాంగాన్ని 'సమాఖ్య లక్షణాలు కల ఏక కేంద్ర వ్యవస్థ'గా అభివర్ణించడానికి కారణమేమిటి ?
  - భారత రాజ్యాంగం సమాఖ్య లక్షణాలను కలిగి ఉన్నప్పటికీ బలమైన కేంద్రప్రభుత్వ ఏర్పాటుకు వీలు కల్పించడం వలన
- భారత రాజ్యంగంలోని సమాఖ్య లక్షణాలు ఏవి ? **- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య అధికార విభజన, లిఖిత రాజ్యాంగం, స్వతంత్ర న్యాయవ్యవస్థ, కొన్ని రాజ్యాంగ సవరణల్లో రాష్ట్రాల అనుమతిని గ్రహించడం మొదలైనవి**
- భారత రాజ్యాంగం ప్రకారం రాష్ట్రపతి, గవర్నర్లు ఏ తరహా కార్యనిర్వహణ అధికారాలను కలిగి ఉంటారు ? **- శాసన కార్యనిర్వహణాధికారాలు**
- భారత రాజ్యాంగంలో సమాఖ్య అనే పదాన్ని ఎన్నిసార్లు వాడారు ?**- ఒక్కసారి కూడా వాడలేదు**
- రాజ్యాంగ సవరణకు సంబంధించి భారత రాజ్యాంగం ఎటువంటి స్వభావాన్ని కలిగి ఉంది ?
  - భారత రాజ్యాంగం సవరణకు సంబంధించి దృఢ, అదృఢ లక్షణాలను కలిగి ఉంది
- సమాఖ్య లక్షణాలను పరిరక్షించే నిమిత్తం భారతదేశం ఏ తరహా న్యాయవ్యవస్థను ఏర్పరిచింది ?
  - భారత రాజ్యాంగం ఏకీకృత, స్వతంత్ర న్యాయ వ్యవస్థను ఏర్పరిచింది
- కేంద్ర జాబితాలో ప్రస్తుతం ఎన్ని అంశాలు ఉన్నాయి ? **- 100 అంశాలు**
- కేంద్ర జాబితాలో ఎటువంటి అంశాలను పొందుపరిచారు ?
  - దేశ ఐక్యతను పెంపొందించే అంశాలను కేంద్ర జాబితాలో పొందుపరిచారు
- అధికార విభజనకు సంబంధించిన మూడు జాబితాలు రాజ్యాంగంలోని ఏ షెడ్యూల్‌లో ఉన్నాయి ? **- 7వ షెడ్యూల్‌లో**
- కేంద్ర జాబితాలోని కొన్ని ముఖ్య అంశాలను పేర్కొనండి ?
  - రక్షణ, సైన్యం, ఆయుధాలు, అణుశక్తి, విదేశీ వ్యవహారాలు, యుద్ధం- శాంతి, పౌరసత్వం, రైల్వేలు, తంతి తపాలా శాఖలు, టెలిఫోన్లు, బ్యాంకింగ్, బీమా, ఎన్నికలు, సుప్రీంకోర్టు, హైకోర్టులు మొదలైనవి.
- కేంద్ర జాబితాలోని అంశాలపై శాసనాలు చేసే పూర్తి అధికారం ఎవరికి ఉంటుంది ?
  - పార్లమెంట్‌కు
- రాష్ట్ర జాబితాలోని అంశాలపై శాసనాలు చేసే పూర్తి అధికారం ఎవరికి ఉంటుంది ?
  - రాష్ట్ర శాసనసభకు
- రాష్ట్ర జాబితాలో అంశాలను పొందుపరచడానికి తీసుకొన్న ప్రాతిపదిక ఏది ?
  - స్థానిక ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని రాష్ట్ర జాబితాను రూపొందించారు
- రాష్ట్ర జాబితాలోని కొన్ని ముఖ్య అంశాలు ఏవి ?
  - పోలీసు, న్యాయపాలన, వ్యవసాయం, ఆరోగ్యం, నీటిపారుదల, పంచాయతీరాజ్ మొదలైనవి
- ప్రస్తుతం రాష్ట్ర జాబితాలో అంశాలు ఎన్ని ?
  - 66 అంశాలు
- ప్రస్తుతం ఉమ్మడి జాబితాలోని అంశాలు ఎన్ని?
  - 47
- ఉమ్మడి జాబితాలోని కొన్ని ముఖ్యమైన అంశాలను పేర్కొనండి ?
  - సామాజిక, ఆర్థిక ప్రణాళికలు, కార్మిక సంక్షేమం, కార్మిక సంఘాలు, విద్యుత్, వారసత్వం, వివాహ విషయాలు, విడాకులు, ట్రస్టులు, విద్య, వార్తాపత్రికలు, పుస్తకాలు, ముద్రణ, జనాభా నియంత్రణ, అడవుల పరిరక్షణ మొదలైనవి



- అవశిష్ట అధికారాలు అంటే ఏమిటి ?
  - కేంద్ర, రాష్ట్ర, ఉమ్మడి జాబితాలలో పేర్కొనని అధికా రాలను అవశిష్ట అధికారాలు అంటారు.
- అవశిష్ట అధికారాలకు సంబంధించి శాసనాలు చేసే అధికారం ఎవరికి ఉంటుంది ?
  - కేంద్రప్రభుత్వానికి
- 'అవసరాన్ని బట్టి (భారతదేశం) ఇది ఏక కేంద్ర రాజ్యాంగానూ, సమాఖ్య రాజ్యాంగాను వ్యహరించు రాజ్యవ్యవస్థ' అని ఎవరు పేర్కొన్నారు ?
  - డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్
- 'భారతదేశం ముఖ్యంగా ఏకరాజ్యమే. అందుగల సమాఖ్య లక్షణాలు కేవలం నామమాత్రమైనవే' అని ఎవరు పేర్కొన్నారు ? **- కె.సి.వేర్**
- 'భారతదేశం అనేక ఏకరాజ్య లక్షణాలు కలిగి ఉన్నందున అది అర్ధసమాఖ్య రాజ్యమే కాని పూర్తి సమాఖ్య రాజ్యం కాదు' అని ఎవరు పేర్కొన్నారు ?
  - డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్
- భారత రాజ్యాంగ నిర్మాతలు భారతదేశాన్ని 'రాష్ట్రాల యూనియన్'గా పేర్కొనటంలోని ఉద్దేశాలు ఏమిటి ? **- భారతదేశం కొన్ని ప్రాంతాల స్వచ్ఛంద కలయిక వల్ల ఏర్పడలేదు. భారతదేశంలోని ఏ రాష్ట్రానికి కూడా దేశం నుంచి విడిపోయే అధికారం లేదు**
- భారతదేశంలో అత్యున్నత అవార్డు అయిన భారతరత్నను 1954లో ప్రకటించగా, దానిని స్వీకరించిన తొలి భారతీయుడు ?
  - సి.రాజగోపాలాచారి
- పీఠికను భారత రాజ్యాంగానికి 'కీ-నోట్'గా అభివర్ణించింది ఎవరు ? **- ఎర్నెస్ట్ బార్కర్**
- భారత జాతీయ కాంగ్రెస్‌కు రాజ్యాంగ పరిషత్‌లో ప్రాతినిధ్యం వహించిన ముగ్గురు ప్రముఖుల పేర్లను పేర్కొనండి ?
  - జవహర్‌లాల్ నెహ్రూ, సర్దార్ వల్లభాయ్ పటేల్, డాక్టర్ రాజేంద్రప్రసాద్
- భారత జాతీయ కాంగ్రెస్ ఎప్పుడు ఏ సమావేశంలో 'సంపూర్ణ స్వరాజ్యమే' ఏకైక లక్ష్యంగా ప్రకటించింది ?
  - 1929 డిసెంబర్ 29న లాహోర్‌లో
- ఆంగ్లో ఇండియన్ల తరపున రాజ్యాంగ పరిషత్‌లో ఎవరు ప్రాతినిధ్యం వహించారు ?
  - ఫ్రాంక్ ఆంథోనీ
- 'సాధార పరిస్థితులలో సమాఖ్య వ్యవస్థగాను, అసాధారణ పరిస్థితులలో ఏకకేంద్ర వ్యవస్థగాను భారత ప్రభుత్వం పనిచేస్తుంది' అని వ్యాఖ్యానిం చింది ఎవరు ? **- సర్ ఐవర్ జెన్నింగ్స్**
- రాజ్యాంగం ఒకటవ ప్రకరణలో మనదేశం పేరు ఏమని ఉన్నది ? **- భారత్, ఇండియా**
- రాజ్యాంగంలోని 3 నిబంధన ప్రకారం 'ప్రస్తుతం ఉన్న రాష్ట్రాల సరిహద్దులను మార్చుచేసే అధికారం ; ప్రస్తుతమున్న రాష్ట్రాలను రద్దుచేసే అధికారం, కొత్త రాష్ట్రాలను ఏర్పాటుచేసే అధికారం, మరియు రాష్ట్రాల పేర్లను మార్పుచేసే అధికారం' ఎవరికి కలదు ? **- పార్లమెంట్‌కు**
- రాజ్యాంగంలోని 3వ నిబంధనకు సంబంధించిన బిల్లులను ఎవరి అనుమతిపై పార్లమెంట్‌లో ప్రవేశపెట్టవచ్చు ? **- రాష్ట్రపతి అనుమతితో**
- భారత రాజ్యాంగ పరిషత్తుకు సలహాదారుగా వ్యవహరించింది ఎవరు ? **- బి.ఎన్.రావు**
- రాజ్యాంగ పరిషత్తులో ప్రాథమిక హక్కుల సబ్ కమిటీకి అధ్యక్షత వహించిందెవరు ?
  - జె.బి.కృపలానీ
- భారత రాజ్యాంగ పరిషత్ కార్యదర్శిగా ఎవరు ఎన్నికయ్యారు ? **- హెచ్.వి.ఆర్.అయ్యంగార్**

విశాలాంధ్ర బిజినెస్

సెన్సెక్స్	నిఫ్టీ	బంగారం (విజయవాడ)	బంగారం (విశాఖపట్నం)	వెండి (విజయవాడ)	వెండి (విశాఖపట్నం)	డాలరు Vs రూపాయి
-113.23 ▼	-21.55 ▼	-100 ▼	29,250	-600 ▼	42,837	64.12
34,082.71	10,476.70	28,800	ప్రొద్దుటూరు 28,870	39,200	ప్రొద్దుటూరు 42,529	
		22 క్యారెట్లు, 10 గ్రాములు	22 క్యారెట్లు, 10 గ్రాములు	కిలో (రూపాయల్లో)	కిలో (రూపాయల్లో)	

టాప్ గెయినర్స్ (సెన్సెక్స్)

కంపెనీ	ప్రస్తుత ధర	మార్పు (శాతాల్లో)
కోల్ ఇండియా	297.85	7.20
ఓఎన్‌జీసీ	189.80	4.15
బీహెచ్ఇఎల్	933.95	1.80
టాటామోటార్స్	210.65	2.15
ఏషియన్ పేయింట్స్	1,121.00	10.15

టాప్ లూజర్స్ (సెన్సెక్స్)

కంపెనీ	ప్రస్తుత ధర	లాస్ (శాతాల్లో)
భారతీ ఏయిర్‌టెల్	429.85	-8.90
విప్రో	289.45	-5.45
ఎక్స్‌బ్యాంక్	333.20	-5.35
లార్సెన్	1,332.65	-21.35
హెచ్‌డీఎఫ్‌సీ	1,871.40	-26.05

విదేశీమారకం విలువ (ఫారెక్స్)

కరెన్సీ	రూ.విలువ క్రి.ముగింపు	రూ.విలువ ప్ర.ముగింపు
డాలర్	64.06	64.12
యూరో	79.77	79.39
పౌండ్	89.94	89.34
ఆస్ట్రేలియా డాలర్	50.77	50.49
సింగపూర్ డాలర్	48.64	48.64

బులియన్

బంగారం (10 గ్రాములు)	22 క్యారెట్లు రూ.	24 క్యారెట్లు రూ.
హైదరాబాద్	28,870	30,877
చెన్నై	28,890	30,898
బెంగళూరు	28,700	30,695
ముంబై	30,010	32,096
విజయవాడ	28,800	31,150
విశాఖపట్నం	29,250	31,909
ప్రొద్దుటూరు	28,870	30,310
ముడి చమురు		69.58

వడ్డీరేట్లు యథాతథం

- రెపోరేటు 6శాతం, రివర్స్‌రెపోరేటు 5.7 శాతం
- నిరాశకు గురైన సామాన్యప్రజానీకం



న్యూఢిల్లీ: పెరుగుతున్న రిటైల్ ద్రవ్యోల్బణం, ముడి చమురు ధరలు నియంత్రించేందుకు కీలక వడ్డీరేట్లలో ఎటువంటి మార్పులు చేయలేదని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రకటించింది. బుధవారం ఆర్‌బీఐ గవర్నర్ ఉర్జిత్ పటేల్ అధ్యక్షతన జరిగిన ద్రవ్య పరపతి విధాన సమీక్షా సమావేశం సందర్భంగా రెపోరేటును 6.0 శాతంగా, రివర్స్ రెపోరేటును 5.75శాతంగా ఉంచుతున్నట్లు ప్రకటించింది. ఆర్‌బీఐ తాజా నిర్ణయంతో గృహ, వాహన రుణాలపై నెలసరి వాయిదాలు తగ్గుతాయనుకున్న వారికి నిరాశే ఎదురైంది. మానిటరీ పాలసీ సభ్యుల్లో ఆరుగురిలో ఐదుగురు వడ్డీరేట్లను యథాతథంగా ఉంచేందుకు ఓటేయగా ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మైఖేల్ పాత్ర మాత్రం వడ్డీరేట్లు పెంపునకు ఆమోదం తెలిపినట్లు తెలుస్తోంది .ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆఖరి పరపతివిధానసమీక్షా సమావేశం ఇది. ఏడవ పే ప్యానల్ అమలు, అంతర్జాతీయంగా నెల కొన్న అనిశ్చిత పరిస్థితి, ముడిచమురు ధరల పెరుగుదల, కస్టమ్స్ డ్యూటీ పెరుగుదల, 2017-18 సంవత్సరానికి ద్రవ్యలోటు 3.5 శాతానికి పెరగడం. 2018-19 సంవత్సరంలో అంచనాలకు మించి ద్రవ్యలోటు పెరుగుదలను సూచించడం ఇత్యాది అంశాలతో వడ్డీరేట్లను యథాతథంగా ఉంచినట్లు విశ్లేషకులు అంచనా వేశారు. చివరిసారిగా గత ఏడాది ఆగస్టులో రెపోరేటును 6.25 శాతం నుండి 6శాతానికి తగ్గించారు.

నవంబరులో 4.88 శాతంగా ఉన్న రిటైల్ ద్రవ్యోల్బణం డిసెంబరులో 5.21 శాతం నమోదై 17నెలల గరిష్టానికి చేరింది. దీనిపై ఆర్‌బీఐ ఆందోళన వ్యక్తం చేసింది. దీనిని 4శాతానికి తగ్గించాలని ఆర్‌బీఐ ప్రయత్నించినప్పటికీ సాధ్యపడ లేదు. రెండేళ్ల క్రిందట ఇదే కాలానికి 3.41శాతంగా ఉంది.బడ్జెట్‌లో గ్రామీణప్రాంతాలు, ఆరోగ్యంపై భారీగా ఖర్చు చేయనున్నట్లు ప్రభుత్వం ప్రకటించిన నేపథ్యంలో ద్రవ్యోల్బణం మరింత పెరిగే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. మార్చి 31తో ముగియనున్న ప్రస్తుత ఆర్థిక సంవత్సరం వృద్ధి రేటు 6.6శాతం లక్ష్యంగా ప్రకటించింది. అంతకుముందు ఆర్థికసంవత్సరంలో వృద్ధిరేటు 6.7శాతంగా నమోదైంది. 2018-19 సంవత్సరానికి వృద్ధిరేటు మరింతగా పెరిగి 7శాతం నుండి 7.5 శాతానికి చేరుకోవచ్చునని పేర్కొంది.

కోలుకున్నా... మళ్లీ నష్టాలే...

సెన్సెక్స్ 114, నిఫ్టీ 21పాయింట్లు నష్టం



ముంబయి: దేశీయ మార్కెట్లు బుధవారం వరుసగా ఏడవ సెషన్‌లో లాభనష్టాల్లో వూగిసలాడి చివరకు నష్టాల్లో ముగిశాయి. గత రెండు రోజుల్లో వరుస నష్టాల్లో కల్లోలాన్ని సృష్టించిన సూచీలు ఆర్‌బీఐ పరపతి విధాన సమీక్ష సమావేశంలో తీసుకున్న నిర్ణయాలతో మదుపర్లు తీవ్ర జాగరూకతతో వ్యవహరించారు. ఫలితంగా లాభాల్లో ట్రేడింగ్ ప్రారంభమైనప్పటికీ నష్టాల్లో ముగిసాయి. మార్కెట్ చివరి గంటలో నష్టాల్లో నమోదయ్యాయి. మంగళవారం తీవ్ర నష్టాల్లో ముగిసిన అమెరికామార్కెట్లు కోలుకున్నాయి. ఈ ప్రభావం దేశీయ మార్కెట్లపై కూడా పడినట్లేపడినా సెన్సెక్స్ 113.23 పాయింట్ల నష్టంతో 0.33 శాతంతో 34,082..71 వద్ద నిఫ్టీ 21.55 పాయింట్ల నష్టంతో 0.21 శాతంతో 10,476.70 వద్ద స్థిరపడ్డాయి. సెక్టరల్ సూచీల్లో మిడ్‌కాప్, స్మాల్‌కాప్ సూచీలు 0.43శాతం 1.95శాతం లాభాల్లో ముగిసాయి. బ్యాంకింగ్ స్టాక్స్ 125 పాయింట్లతో 29,072 పాయింట్లు నష్టపోయాయి. బిఎస్ఇ ఆయిల్, గ్యాస్ సూచీలు 260 పాయింట్లతో అత్యధికంగా 15,692 వద్ద ముగిసాయి. బిఎస్ఇ కన్స్యూమర్ డ్యూరబుల్స్ సూచీ మరో ప్రధానలబ్ధిదారుగా 175 పాయింట్లతో 20,895 పాయింట్లు లాభపడింది. బిఎస్ఇ లబ్ధిదారులు సెంచురీ ప్లైబోర్డ్స్, చంబల్ ఫెర్టిలైజర్స్, రెయిన్‌ఇండస్ట్రీస్ నమోదయ్యాయి. బిఎస్ఇ టోటల్ టర్నోవర్ రూ.4382.22 కోట్లుకాగా గత సెషన్‌లో రూ.5349.37 కోట్లుగా నమోదైంది. నాట్కోఫార్మా 8.06శాతం, వక్రాంజి 5శాతం, రెడింగ్టన్ ఇండియా 4.48శాతం బిఎస్ఇ ప్రధాన నష్టదారులుగా నమోదయ్యారు. 1987 స్టాక్స్ సానుకూలంగా నమోదుకాగా, 787 నష్టాల్లో నమోదయ్యాయి. కోల్ ఇండియా, ఓఎన్‌జిసి,ఆసియన్ పెయింట్స్.సెన్సెక్స్ ప్రధాన లబ్ధిదారులుగా ఉన్నారు. భారతి ఎయిర్‌టెల్, విప్రో, ఎల్‌అండ్‌టి అత్యధికంగా నష్టపోయారు. సిప్లా 4.81శాతం లాభంతో 0.73శాతం పెరిగింది. అంతర్జాతీయ మార్కెట్లు: ఆసియమార్కెట్లు మిశ్రమంగా స్పందించాయి. షాంఘై కాంపోజిట్ ఇండెక్స్ 1.82 శాతం, హాంగ్‌సేంగ్ 0.89శాతం, నిక్కీ అండ్ తైవాన్ టిసెక్ 50 ఇండెక్స్ 147పాయింట్లతో 10.551 వద్ద నమోదుకాగా, నిక్కీ 0.16శాతం పెరిగి 21.645 వద్ద ముగిసింది. యూరోపియన్ స్టాక్ మార్కెట్లు నష్టాలనుండి కోలుకున్నాయి. లండన్ ఎఫ్‌టిఎస్ఇ 100 1శాతం లాభంతో 7,209.47పాయింట్లు లాభంతో ముగిసింది. ఫ్రాంక్‌ఫర్ట్ డిఏఎక్స్ 30 ఇండెక్స్ 0.6 శాతంతో 12,466.1 పాయింట్లు, పారిస్ సిఏసి 40 0.4 శాతంతో 5,184.08 పాయింట్లు లాభపడింది. అమెరికా మార్కెట్లు పుంజుకోవడంతో యూరోపియన్ మార్కెట్లు బలపడేందుకు సహకరించిందని విశ్లేషకులు అంచనావేసారు.



తగ్గిన బంగారం, వెండి ధరలు

న్యూఢిల్లీ: బంగారం ధరలు దేశీయంగా స్వల్పంగా తగ్గాయి. అంటే రూ.50లు తగ్గి 10గ్రాముల బంగారం ధర రూ.31,550లు పలికింది. స్థానిక ఆభరణాల వర్తకుల నుండి డిమాండ్ తగ్గడంతో బంగారం ధరలుతగ్గుముఖం పట్టినట్లు బులియన్ వర్తకులు వెల్లడించారు. వెండి ధర రూ.650లు తగ్గి కేజీ వెండి ధర రూ.39,350లు పలికింది. నాణేల తయారీదారులు, పారిశ్రామికవేత్తల నుండి డిమాండ్ తగ్గడం ప్రధాన కారణంగా ఉంది.అంతర్జాతీయంగా బంగారం ధరలు 1.14శాతం తగ్గి ఔన్స్ 1323.70 డాలర్లు పలికింది. వెండి ధర 0.54శాతంతో 16.62 డాలర్లు చేరింది. దేశ రాజధానిలో 99.9 శాతం మరియు 99.5శాతం బంగారం ధర రూ.50లు తగ్గి రూ.31,550 మరియు రూ.31,400 లు పలికింది. గత రెండు రోజుల్లో బంగారం రూ.350లు లాభపడింది.

ద్రవ్యోల్బణం.. 5.1శాతం..

ఆర్‌బీఐ అంచనా

ముంబై: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం చివరి త్రైమాసికంలో రిటైల్ ద్రవ్యోల్బణం 5.1శాతానికి పెరిగే అవకాశముందని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అంచనా వేస్తోంది. చమురు ధరల పెరుగుదల, ప్రభుత్వ ఉద్యోగాల జీతాల పెంపు వల్లే ద్రవ్యోల్బణం పెరిగే అవకాశముందని బుధవారం జరిగిన ద్రవ్య పరపతి విధాన సమీక్షలో ఆర్‌బీఐ పేర్కొంది. 2018-19 ఆర్థిక సంవత్సరం తొలి అర్ధభాగం లోనూ ద్రవ్యోల్బణం 5.1 నుంచి 5.6శాతం వరకు ఉండే అవకాశముందని అభిప్రా యపడింది. అంతర్జాతీయ చమురు ధరలు పెరగడంతో దేశవ్యాప్తంగా జనవరిలో పెట్రోల్, డీజిల్ ధరలు వేగంగా పెరిగాయి. వీటన్నింటినీ పరిగణనలోకి తీసుకుంటే నాలుగో త్రైమాసికంలో ద్రవ్యోల్బణం 5.1శాతం వరకు ఉండే అవకాశముంది' అని ఆరవ ద్వైమాసిక విధాన సమీక్ష సమావేశంలో ఆర్‌బీఐ పేర్కొంది. అయితే 2018-19 ఆర్థిక సంవత్సరం రెండో అర్ధభాగంలో మాత్రం ఇది 4.5 నుంచి 4.6 శాతానికి తగ్గొచ్చని తెలిపింది. అటు వినియోదారుల ధరల సూచీ(సీపీఐ) ఆధారిత ద్రవ్యోల్బణం లోనూ స్వల్ప మార్పు లు జరగొచ్చని అంచనా వేస్తోంది.

రెస్టారెంట్‌కెళితే జేబుకు చిల్లే...



న్యూఢిల్లీ : రెస్టారెంట్లు ప్రజల జేబులకు చిల్లులు పెడుతున్నాయి. వారాంతంలో రెస్టారెంట్‌కు వెళ్లడం అత్యంత ఖరీదైన వ్యవహారంగా మారింది. పలు వంటది నుసులపై 5 శాతం కస్టమ్స్ డ్యూటీతో పాటు దిగుమతి చేసుకునే ఆహారంపైనా ఈ వడ్డింపుతో ధరలు భారమవుతాయని రెస్టారెంట్ చైన్స్ పేర్కొన్నాయి. వంటల్లో ఉపయోగించే ఆలివ్ ఆయిల్, ఆముదం, సీసేమ్ నూనెలపై కస్టమ్స్ డ్యూటీ 20 నుంచి 35 శాతం పెరిగింది. ఇతర ఆహార తయారీకి ఉపయోగించే పదార్థా లపై గతంలో 30 శాతంగా ఉన్న లెవీని బడ్జెట్‌లో 50 శాతానికి పెంచారని రెస్టారెంట్ యజమానులు ఆవేదన చెందుతున్నారు. వంట దినుసులను దిగుమతి చేసుకునే హోటల్స్, రెస్టారెంట్లు ఈ పన్ను దెబ్బకు భయపడిపోతున్నాయి. పెరిగిన పన్నులతో తాము వినియోగదారులపై భారం మోపక తప్పదని కైలిన్ రెస్టారెంట్ చైన్ మేనేజింగ్ డైరెక్టర్ సౌరవ్ ఖనిజో చెప్పారు. కస్టమ్స్ సుంకం పెంచడంతో పాటు జీఎస్‌టీ కింద ఇచ్చే ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్‌ను తొలగించడం తమ లాభాలపై పెను ప్రభావం చూపుతుందని రెస్టారెంట్ యజమా నులు గగ్గోలు పెడుతున్నారు. ఓ మాదిరి రెస్టా రెంట్లు సైతం వంట దినుసులను విదేశాల నుంచి దిగుమతి చేసుకుంటున్న క్రమంలో వీటిపై కస్టమ్స్ డ్యూటీ పెంచడంతో చివరికి వినియోగదారులపై భారం పడుతుందని రెస్టారెంట్ ఓనర్లు అంటున్నారు.

సంస్థల పనితీరుకే ప్రాధాన్యం..

- ఆరోగ్య శాఖలో కాంట్రాక్టు ఉద్యోగులకు 50 శాతం మేర జీతాల పెంపు..
- మంత్రి గంటా, కామినేని శ్రీనివాసరావు



విశాలాంధ్ర అమరావతి : సీఆర్డీఏలో భూములకు విలువ పెరగడంతో ఆయా సంస్థలు గత పనితీరును పరిశీలించి భూములు కేటాయిస్తున్నట్లు మంత్రి గంటా శ్రీనివాసరావు తెలిపారు.సచివాలయంలోని మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో రాష్ట్ర మంత్రులు కాలవ శ్రీనివాసులు, కామినేని శ్రీనివాస్, నారాయణ, జవహర్ తో కలిసి మంత్రి గంటా శ్రీనివాసరావు మాట్లాడారు. ఇంత వరకూ ఎన్ని సంస్థలకు భూములు కేటాయించాం... వాటిలో ఆయా సంస్థల సేవలు ప్రారంభమయ్యాయా? లేదా? అని సమీక్షించనున్నామన్నారు. సేవలు ప్రారంభించని సంస్థలకు నోటీసులు జారీ చేయాలని మంత్రి వర్గ ఉప సంఘంలో నిర్ణయం తీసుకున్నట్లు మంత్రి తెలిపారు. కొత్తగా 8 విద్యా సంస్థలతో పాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థలకు భూములు కేటాయించినట్లు ఆయన తెలిపారు. పలు విద్యా సంస్థలకు, ప్రభుత్వ రంగ సంస్థలకు భూముల కేటాయింపుపై ఆర్థికమంత్రి యనమల రామకృష్ణుడు అధ్యక్షతన మంత్రి వర్గ ఉప సంఘం సమావేశం నిర్వహించిందన్నారు. ఈ సమావేశంలో దేశ, అంతర్జాతీయ స్థాయి విద్యా సంస్థలకు డే స్కాలర్స్, రెసిడెన్సీ ఆధారంగా 3, 4, 5, 8 ఎకరాల చొప్పున భూములు కేటాయించామన్నారు. భూములు కేటాయించిన విద్యా సంస్థల్లో చిన్మయ్ మిషన్ స్కూల్, స్కాటిస్ హై ఇంటర్నేషనల్ స్కూల్, రేయాన్ గ్లోబల్ స్కూల్, పొడార్ స్కూల్, గ్లండెల్ అకాడమీ, హెరిటేజ్ ఎక్స్ పెరమెంటల్ లెర్నింగ్ స్కూల్, సద్భావన, గ్లోబల్ ఇండియన్ ఇంటర్నేషనల్ స్కూల్స్ ఉన్నాయని మంత్రి తెలిపారు. వాటితో సీబీఐ, ఇందిరా గాంధీ ఓపెన్ యూనివర్శిటీ, ఇండియన్, ఆర్మీ, విదేశీ భవన్, స్టేట్ ఫోరెనిక్స్ సైన్స్ లేబొరేటరీ, ఇండియా మెట్రోలజీ డిపార్టుమెంట్ భారత్ పెట్రోల్ కార్పొరేషన్ సంస్థలకు భూములు కేటాయించామన్నారు. బ్యాంకులకు రూపొందించిన నిబంధనలను అనుసరించి, యూనియన్ బ్యాంకు, ఇండియన్ బ్యాంకుకు భూములు కేటాయించామన్నారు. ట్రాన్స్ కోకు సంబంధించి సబ్ స్టేషన్ ఏర్పాటుకు కూడా స్థలం కేటాయించామన్నారు.

వైద్యశాఖ కాంట్రాక్టు ఉద్యోగులకు 50 శాతం జీతాలు పెంపుదల...

వైద్య శాఖలో వివిధ విభాగాల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులకు 50 శాతం మేర జీతాలు పెంచనున్నట్లు రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి కామినేని శ్రీనివాస్ తెలిపారు. దీంతో ఆ శాఖలోని 19,325 కాంట్రాక్టు ఉద్యోగుల జీతాలు పెరుగుతాయి. ప్రభుత్వంపై అదనంగా రూ.219.24 కోట్లు భారం పడుతుందన్నారు. రూ.12 వేల కంటే తక్కువ జీతం తీసుకున్నవారికి 50 శాతం మేర జీతం పెంచాలని నిర్ణయించామన్నారు. డైరెక్టర్ ఆఫ్ హెల్త్, ఫ్యామిలీ వెల్ఫేర్ ఉద్యోగులకు రూ.32.30 కోట్లు, ఏపీవీవీపీ ఉద్యోగులకు రూ.11.33 కోట్లు, ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ ఉద్యోగులకు రూ.9.38 కోట్లు, ఆయూష్ ఉద్యోగులకు రూ.41 లక్షలు, డీఎంఈ ఉద్యోగులకు రూ.16.68 కోట్లు, ఎస్.హెచ్.ఎం ఉద్యోగులకు రూ.149.14 కోట్లు జీతాల రూపంలో చెల్లించనున్నామన్నారు. పీజీ, మెడికల్ పీజీ, పీడీ డిప్లమో, సూపర్ స్పెషాల్టీ కోర్సులు చదివే విద్యార్థులకు రెండేళ్లుగా రావాల్సిన ఉపకార వేతనాలతో పాటు ప్రస్తుత ఉపకార వేతనాలను చెల్లిస్తామని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి వెల్లడించారు. పీజీలకు ఎంతమేర ఉపకార వేతనాలు ఇవ్వాలనే దానిపై కొత్తగా పే కమిటీ ఏర్పాటు చేయనున్నామన్నారు. సీనియర్ రెసిండెంట్లకు రూ.7 కోట్ల మేర జీతాల చెల్లింపునకు జీవో జారీ చేశామన్నారు. వారికి జీతాల పెంపుదలకు ఆర్థిక శాఖకు ప్రతిపాదనలు పంపినట్లు మంత్రి తెలిపారు. ఈ మంత్రి వర్గ ఉప సంఘం సమావేశంలో మంత్రులు కాలవ శ్రీనివాసులు, గంటా శ్రీనివాసరావు పాల్గొన్నట్లు మంత్రి కామినేని శ్రీనివాస్ తెలిపారు.

బడ్జెట్ పై మంత్రుల కామెంట్స్ ..

విశాఖ రైల్వే జోన్ సాధిస్తాం..గంటా

విశాఖ రైల్వే జోన్ సాధించి తీరుతామని మంత్రి గంటా శ్రీనివాసరావు స్పష్టం చేశారు. బడ్జెట్ లో ఏపీకి జరిగిన అన్యాయంపై తమ పార్టీ ఎంపీలు పార్లమెంట్ లో నిరసన వ్యక్తం చేస్తున్నారన్నారు.

మెట్రోకు నిధులు రాబడతాం ...నారాయణ

రాష్ట్ర పునర్విభజన చట్టంలో పేర్కొన్న విధంగా విశాఖ, విజయవాడ మెట్రో రైల్వే ప్రాజెక్టుల నిధులు రాబట్టుతామని రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పి.నారాయణ తెలిపారు.

సోము వీర్రాజు వ్యాఖ్యలపై సంబంధంలేదు..కామినేని

ఎమ్మెల్సీ సోము వీర్రాజు వ్యాఖ్యలపై తనకు సంబంధం లేదని, ఆయననే అడగాలని మంత్రి కామినేని అన్నారు. తమ పార్టీ రాష్ట్ర అధ్యక్షుని సూచన మేరకు మిత్రధర్మం పాటిస్తున్నానని స్పష్టం చేశారు.మిత్రపక్షంపై కాకుండా ప్రతిపక్షంపై విమర్శలు చేయాలని తమ పార్టీ రాష్ట్ర శాఖ సూచించందన్నారు. మిత్రపక్షంపై ఏమైనా ఆరోపణలు చేయాలనుకుంటే పార్టీ అంతర్గం సమావేశంలో మాట్లాడాలని తమ పార్టీ రాష్ట్ర శాఖ అధ్యక్షులు స్పష్టం చేశారని మంత్రి కామినేని శ్రీనివాస్ తెలిపారు.

విజ్ఞానం

డయాబెటిస్‌తో

కాటరాక్ట్ రెట్టింపయ్యే అవకాశం



డయాబెటిస్ ఉన్న 45 నుండి 54 ఏళ్ల వయసున్నవారిలో కాటరాక్ట్ రెట్టింపయ్యే అవకాశం ఉందని తాజా అధ్యయనంలో వెల్లడైంది. బ్రిటన్‌లోని ఆంగ్లియా రస్కిన్ యూనివర్సిటీ అధ్యయనవేత్తలు చేపట్టిన పరిశోధనలో 40ఏళ్ల పైబడినవారిలో ప్రతి 1000 మందిలో 20.4 శాతం కాటరాక్ట్ ఉన్నట్లు గుర్తించారు. సాధారణ వ్యక్తుల్లో 45 నుండి 54 వయసుఉన్న 1000 మందిలో 10.8శాతం మాత్రమే కాటరాక్ట్ వ్యాధి ఉన్నట్లు తెలుస్తోంది. డయాబెటిస్ ఉన్న 45 నుండి 49ఏళ్ల వయసువారిలో కాటరాక్ట్‌కు గురైనవారు 4.6 రెట్లు ఎక్కువకాగా, 50 నుండి 54 ఏళ్ల వయసువారిలో సాధారణ వ్యక్తులకన్నా 5.7రెట్లు ఎక్కువగా కాటరాక్ట్‌కు గురైనట్లు తెలుస్తోంది. ప్రపంచవ్యాప్తంగా కాటరాక్ట్ ప్రధానంగా అంధత్వానికి దారితీస్తోంది. డయాబెటిక్ మాక్యులోపతి సాధారణ వ్యక్తులకన్నా డయాబెటిక్ రోగుల్లో ఆరింతలు ఎక్కువగా ఉందని తెలుస్తోంది.

దీర్ఘకాలిక వ్యాధులతో కేన్సర్ రిస్క్...



దీర్ఘకాలిక వ్యాధులతో కేన్సర్ వచ్చే అవకాశాలు ఉన్నాయి. దీర్ఘకాలంగా ఉన్న హైపర్‌టెన్షన్ , గుండె వ్యాధులు, డయాబెటిస్ వ్యాధులు నూతనంగా కేన్సర్‌లోకి దింపే అవకాశాలు ఉండగా, మూడు వంతులు పైగామరణాలు వీటివల్లనేనని తెలుస్తోంది. 2015లో ప్రపంచవ్యాప్తంగా 71శాతం మరణాలు ఈ దీర్ఘకాలిక వ్యాధుల వల్ల నేనని నమోదైంది. ముఖ్యంగా కార్డియోవాస్కులార్ వ్యాధులు, దయా బెటిస్, మూత్ర పిండాల వ్యాధులు, శ్వాసకోసవ్యాధుల ద్వారా వచ్చే కేన్సర్‌వల్లనేనని గ్లోబల్ బర్డెన్ ఆఫ్ డిసీసెస్ స్టడీ 2015 లాన్సెట్‌లో వెల్లడించింది. జీవితకాలాన్ని ఈ దీర్ఘకాలిక వ్యాధులు మరింతగా తగ్గిస్తున్నాయని వెల్లడైంది. పురుషుల్లో జీవితకాలాన్ని 13.3 ఏళ్లు, మహిళల్లో 15.9 ఏళ్లు ఈ వ్యాధులు ముందస్తు మరణాలకు దారితీస్తున్నట్లు తెలుస్తోంది. శారీరక వ్యాయామం 40శాతం వ్యాధులను దీర్ఘకాలిక వ్యాధులను తగ్గిస్తుంది. స్మోకింగ్, శారీరక వ్యాయామం లేకపోవడం, పండ్లు, కూరగాయలు తక్కువగా తీసుకోవడం, ఆల్కాహాల్ వినియోగం కేన్సర్‌కు దారితీసి తద్వారా మరణాలకు కారణమవుతోందని హ్యూస్టన్‌లోని టెక్సాస్ యూనివర్సిటీ వెల్లడించింది. దీనికిగాను సుమారు 405,878 స్త్రీ,పురుషులపై చేసిన అధ్యయనంలో ఈ విషయం వెల్లడైంది. జీవనవ్య వహారశైలితోపాటు ఎనిమిది దీర్ఘకాలిక వ్యాధులు కేన్సర్‌కు దారితీసినట్లు వెల్లడైంది.

అరోమా థెరఫీతో ప్రయోజనాలు



విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్: వాతావరణంలో వస్తున్న మార్పులు, చలికాలంలో చర్మం, శిరోజాల పరిరక్షణకు తగు జాగ్రత్తలు తీసుకోవాలని బ్లాసమ్ కొచ్చర్ గ్రూప్ ఆఫ్ కంపెనీ అధ్యక్షురాలు డా.బ్లాసమ్ కొచ్చర్ సూచించారు. నిత్య జీవితంలో ఆరోమా థెరపీ, ఉప యుక్త తైలాలను వినియోగించడం, బ్లాసమ్ కొచ్చర్ ఆరోమా మ్యాటిక్ ఉత్పత్తుల ద్వారా కలిగే ప్రయోజనాలను వివరించారు. అరోమా థెరఫీలో ఔషధ మొక్కలు, పండ్లు, పువ్వుల నుంచి తీసిన తైలాన్ని వినియోగిస్తామ న్నారు. కాచిగూడలో జరిగిన బ్యూటీ ప్రొఫెషనల్స్ సదస్సు జరిగింది. ఈ సదస్సుకు ముఖ్యఅతిథిగా విచ్చేసిన కొచ్చర్ మాట్లాడుతూ ఆరోమా థెరఫీతో కలిగే ప్రయోజనాలు, మనస్సు, శరీరంపై ప్రభావం చూపే చికిత్సలు, ఉప యుక్త తైలాల వినియోగంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కంపెనీ మేనేజర్ జలెందరాచారి, ప్రతినిధులు సంగీత, కౌశవన్ పాల్గొన్నారు.

మాల్యా రుణాలపై రికార్డులు లేవు

సీఐసీకి కేంద్ర ఆర్థిక శాఖ సమాధానం



న్యూఢిల్లీ: పలు బ్యాంకులకు వేలకోట్లు ఎగనామం పెట్టి విదేశాలకు పారిపోయిన విజయ్ మాల్యా రుణాలకు సంబంధించి కేంద్ర ఆర్థిక శాఖ దిమ్మ తిరిగే సమాధానం చెప్పింది. మాల్యాకు సంబంధించి తమ వద్ద ఎలాంటి రికార్డులు లేవని బొం కింది. ఈ విషయాన్ని ఆ శాఖే కేంద్ర సమాచార కమిషన్(సీఐసీ)కి చెప్పింది. సమాచార హక్కు దరఖాస్తుదారుడి ఫిర్యాదుపై ఆర్థిక శాఖను సీఐసీ ప్రశ్నించగా.. పైవిధంగా సమాధానం వచ్చింది. మాల్యా రుణాల వివరాలు కావాలంటూ రాజీవ్ కుమార్ ఖరే అనే వ్యక్తి సమాచార హక్కు చట్టం ద్వారా ఆర్థికశాఖకు దరఖాస్తు చేశారు. ఆ వివరాలు తాము ఇవ్వలేమని ఆర్థికశాఖ పేర్కొంది. వ్యక్తిగత భద్రత, దేశ ఆర్థిక ప్రయోజనాలపై ప్రభావం చూపే వివరాలు ఇవ్వకుండా ఆర్టీఐ చట్టంలో కొన్ని మినహాయింపులు ఉన్నాయని తెలిపింది. దీంతో రాజీవ్ సీఐసీని ఆశ్రయించారు. దీనిపై సీఐసీ ప్రశ్నించగా.. మాల్యా రుణాల రికార్డులేవీ తమ వద్ద లేవని ఆర్థిక శాఖ నిర్లజ్జగా చెప్పింది. దరఖాస్తుదారుడు కోరుతున్న సమాచారం ఆయా బ్యాంకులు లేదా రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా వద్ద ఉండొచ్చని తెలిపింది. ఆర్థిక శాఖ సమాధానంపై సీఐసీ అసంతృప్తి వ్యక్తం చేసింది. చట్టప్రకారం.. ఇది అస్పష్టమైన, అస్థిరమైన జవాబు అని పేర్కొంది. వెంటనే రాజీవ్ దరఖాస్తును సంబంధిత పబ్లిక్ అథారిటీకి బదిలీ చేయాలని సూచించింది. మాల్యా వివరాలు తమ వద్ద లేవని చెబుతున్న ఆర్థికశాఖ... గతంలో ఈ వివరాలను పార్లమెంట్‌లో ప్రస్తావించింది.

20పైసలు కోలుకున్న రూపాయి

న్యూఢిల్లీ: దేశీయ కరెన్సీ రూపాయి బుధవారం బల పడింది. డాలర్‌తో రూపాయి మారకపు విలువ 20 పైసలు పెరిగి 64.04 వద్ద ప్రారంభమైంది. అంతర్జాతీ యంగా విదేశీ కరెన్సీలతో డాలర్ బలహీనపడటంతో పాటు, దేశీయ ఈక్విటీ మార్కెట్లలో ప్రారంభ లాభాలు రూపాయికి మద్దతునిచ్చాయి. అంతర్జాతీయ మార్కెట్ల ప్రభావంతో రూపాయి మరింతగా లాభపడే అవకాశాలు కనిపిస్తున్నట్లు తెలుస్తోంది.. మరోవైపు ఆర్‌బీఐ వడ్డీరేట్లపై అంచనాల నేపథ్యంలో బ్యాంకింగ్ సెక్టార్‌లోని లాభాలు కూడా రూపాయి విలువకు మద్దతు నిస్తున్నాయి. అటు అంతర్జాతీయ సానుకూల సంకేతాలతో దేశీయ స్టాక్‌మార్కెట్లు 200 పాయింట్లకు పైగా ఎగిశాయి. అయితే ఇవాల్టి ఆర్‌బీఐ పాలసీ రివ్యూ ఈక్విటీ మార్కెట్లకు, రూపాయికి కీలకం కానుంది. శుక్రవారం రూపాయి 17 పైసలు నష్టపోయి 64.24 వద్ద ఏడు వారాల కనిష్టస్థాయిని నమోదు చేసింది.

ఐదుగురు ఐఐటీ పూర్వవిద్యార్థుల వినూత్న ఆలోచనస్టార్టప్స్‌కు మొబైల్ సర్వీస్ సొల్యూషన్స్ వంద సంస్థలకు ఒకేసారి సేవలు అందించేంత సామర్థ్యం మూడేళ్లలోనే సత్తా చాటిన క్లిక్ ల్యాబ్సిన్న, స్టార్టప్ సంస్థలకు ఉపయుక్తం.

దేశ పరిస్థితులు సరికొత్త సంస్థల స్థాపనకు, అనువుగా మారుతున్నాయి. అయితే.. కొత్త సంస్థల వ్యవస్థాపకులకు పెట్టుబడి సమకూర్చుకోవడం పెను భారంగా మారుతోంది. ఇప్పటికే నెలకొల్పిన సంస్థలకు.. అదనపు పెట్టుబడులను సమకూర్చుకోవడం పెద్ద కష్టమేమీ కాదు. అయితే.. సరికొత్త ఆలోచనలతో.. నూతన ఆవిష్కరణలతో సంస్థలు స్థాపించాలని, మార్కెట్‌ను ఓ కుదుపు కుదిపేయాలని భావించే వారికి పరిస్థితులు ఏమాత్రం అనుకూలించడం లేదు. దుమ్మురేపే ఆలోచనలతో వచ్చే వారికి మూలధన కొరతను దృష్టిలో ఉంచుకొని.. వారికి ప్రధాన అవరోధంగా మారుతున్న సాంకేతికత సమస్యను తీర్చడమే ధ్యేయంగా... క్లిక్ ల్యాబ్స్ ఏర్పాటైంది. సమర్ శింగ్లా, "క్లిక్ ల్యాబ్స్" సంస్థను స్థాపించారు. ప్రారంభించింది మొదలు.. వినియోగదారుడి మొబైల్ నే లక్ష్యంగా చేసుకుని పనిచేస్తోంది.

స్టార్టప్ మొబైల్ యాప్స్‌లో సంచలనం

క్లిక్ ల్యాబ్స్



ప్రస్తుతం ఈ సంస్థ, స్టార్టప్స్/ ఎంవిపి సొల్యూషన్స్, మొబైల్ గేమ్స్, ఎంటర్ ప్రైస్ మొబిలిటీ, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ అనే నాలుగు విభాగాల్లో పనిచేస్తోంది. చండీగఢ్ కేంద్రంగా పనిచేస్తున్న ఈ సంస్థ వ్యాపార విస్తరణ బృందం శాన్ ఫ్రాన్సిస్కోలో పనిచేస్తోంది. "క్లిక్ ల్యాబ్స్" అత్యంత నిష్ణాతులైన 150 మంది ఉద్యోగులతో పని చేస్తున్న సంస్థ. వీరంతా కేవలం మూడేళ్లలో.. మొబైల్స్ కోసం వందకుపైగా విజయవంతమైన సరికొత్త అప్లికేషన్స్, ఆటలు సృష్టించిన ఘనాపాఠీలు.

'క్లిక్ ల్యాబ్ సంస్థ భారతీయ ఆర్థిక రంగంలో తన వంతు భాగస్వామ్యాన్ని కలిగి ఉండడాన్ని నేను పరిశీలస్తున్నాను. వంద సంస్థలను ప్రారంభించేందుకు అవసరమైన సాంకేతిక మౌలికాంశాలు ఈ కంపెనీ వద్ద ఉన్నాయి' అని సమర్ తెలిపారు. ఢిల్లీ ఐఐటీలో సమర్‌తో కలిసి చదువుకున్న చిన్మయ్ అగర్వాల్, పరాగ్ జైన్, రోహిత్ గోయల్, సంజయ్ థాకర్‌లు కలిసి క్లిక్ ల్యాబ్స్‌ను నెలకొల్పారు.

ఢిల్లీ ఐఐటీ, యూనివర్సిటీ ఆఫ్ మేరీ ల్యాండ్‌లలో చదువుకున్న సమర్, వ్యాపార రంగంలో తనదైన ముద్ర వేసుకుంటూ వస్తున్నారు. దేశంలోని కోళ్ల పరిశ్రమ అభివృద్ధికి సరికొత్త సాంకేతికతను అందించేందుకు సమర్ భారత్ తిరిగొచ్చాడు. పౌల్ట్రీ రంగానికి ఉపకరించే ప్రాడిజీ ఫుడ్స్‌ను ఆవిష్కరించాడు. ఇవాళ కోళ్ల పెంపకం దారులు, సంప్రదాయ దాణా స్థానంలో సోయాను వినియోగించడం వెనుక సమర్ కృషి ఉందనడంలో సందేహం లేదు. ఏడాది తర్వాత, ప్రాడిజీ ఫుడ్స్‌లోని ఎక్కువ షేర్లను అమ్మేసి.. వచ్చిన మొత్తంతో క్లిక్ ల్యాబ్స్‌ను ప్రారంభించాడు.

పీటర్ థీల్ వ్యక్తీకరించిన ప్రపంచీకరణ సిద్ధాంతమంటే సమర్‌కు ఎంతో ఇష్టం. ఫ్లిప్ కార్ట్ గానీ, జోమాటో గానీ, లేదూ.. ఓలా క్యాబ్స్ కానీ.. ఏదైనా భారతీయ మార్కెట్లను ఒక ఊపు ఊపాయి అంటే... ప్రాశ్చ దేశాల్లో విజయవంతమైన థీల్ ప్రపంచీకరణ సిద్ధాంతపు ప్రాథమిక సూత్రమే కారణమని సమర్ సమ్ముతారు. ఏదైనా సరికొత్త ఆలోచనను వాణిజ్య పరంగా, సమర్థతతో ఒక దేశంలో అమలు చేస్తే.. దాన్ని ప్రపంచంలోని ఇతర ప్రదేశాల్లోనూ అమలు చేయడం అనివార్యమని సమర్ విశ్వాసం. భారత దేశం మిశ్రమ మార్కెట్. ఏదైనా కొత్తదనాన్ని ఆహ్వానించి ఆదరించాలంటే కొంత సమయం పడుతుంది. అందుకే.. వ్యాపార విధానాలను కూడా ఇక్కడి వారికి అనువుగా మలచాల్సిన అవసరం ఉంటుంది.

సంస్థ భవిష్యత్తు ప్రణాళికలు

రాకర్ ఇంటర్నెట్ విధానంలో.. వంద కొత్త సంస్థలను ప్రోత్సహించాలన్న ఆలోచన ఉంది. అయితే గతానుభవాల రీత్యా రిస్క్‌ని దృష్టిలో ఉంచుకొని ఆచితూచి అడుగేస్తున్నారు. "చైనాలోని థెన్సెంట్, లేదూ దక్షిణాఫ్రికాలోని నాస్పర్స్ తరహాలో, దేశంలో సమాచార సమ్మేళనాన్ని ఆవిష్కరించాలని భావిస్తున్నాము. ప్రతి ఇంటా ఒకరైనా వ్యాపారి ఉండేలా.. కనీసం బిలియన్ జీవితాలను స్పృశించాలని లక్ష్యంగా నిర్ణయించుకున్నాము." అని సమర్ తెలిపారు.

క్లిక్ ల్యాబ్స్ మిగిలిన సంస్థల కన్నా ఎలా భిన్నమైంది..?

'అసలు మేము అనుసరిస్తున్న విధానమే మమ్మల్ని ఇతరులకన్నా భిన్నంగా నిలుపుతోంది. మేము దృష్టి కేంద్రీకరిస్తున్న అంశాలు.. మాకంటూ ప్రత్యేకమైన మార్కెట్‌ను, ఉత్పత్తి బృందాన్ని ఏర్పాటు చేశాయి. మేము, మా ప్రత్యేకతను ఉపయోగించి.. బి2బి కి భిన్నంగా.. బి2సిలో ఉత్పత్తి వ్యయాన్ని తగ్గించే ఐపిని ఆవిష్కరించాము' అని సమర్ చెప్పారు. 'జగ్నూను ఇదే సాంకేతిక ఆధారంగా రూపొందించాము. ఇది ట్యాక్సీ హాక్ సొల్యూషన్స్‌కు లాభాలు తెచ్చిపెట్టింది. క్లిక్ ల్యాబ్స్ రూపొందించిన ఈ సాఫ్ట్‌వేర్ సొల్యూషన్... ట్యాక్సీ సంస్థలకు, నగర పాలక సంస్థలకు, ఉబర్ తదితర కొత్త సంస్థల పోటీని తట్టుకోవడానికి ఎంతగానో ఉపయోగపడింది' అని సమర్ వివరించారు.

సబ్సిడీ విధానంలో... వైఫై, 3జి, 4జి లేదా ఎల్టీఈ లాంటి మొబైల్ నెట్‌వర్క్ ద్వారా సంగీతాన్ని అందించే పేటెంట్‌ను సొంతం చేసుకున్న బూంబాటిక్స్ సింక్ సంస్థ.. తాజాగా ఎస్4ఎం సిరీస్‌ను వెలువరించింది. వోట్ ఛాట్ కూడా ఇదే బాటలో ఆవిష్కృతమైంది. ఇది బ్రెజిల్ కు చెందిన పెట్టుబడిదారుల నుంచి దాదాపు రెండున్నర లక్షల అమెరికన్ డాలర్లను సమీకరించింది.

ఈ-చదువుల రేసులో

దూసుకెళ్తున్న ఎలక్ట్రికల్ ఇంజినీర్లు



పిల్లల చదువులపై తల్లిదండ్రులు పడే టెన్షన్ అంతా ఇంతా కాదు. వారు బాగా చదువుతారా లేదా అన్నది వారిష్టం..! కానీ వారికి చదువుల పరంగా ఏ లోటూ రాకుండా చూసే విషయంలో తల్లిదండ్రులు ఏ మాత్రం రాజీపడటం లేదు. నేటి పోటీ ప్రపంచంలో తమ పిల్లలు రేసులో ఉండాలంటే అప్ టు డేట్ గా ఉండాలని తల్లిదండ్రులు కూడా ఆశిస్తున్నారు. అందుకోసం ఏ విషయంలోనూ రాజీ పడటం లేదు. ఇలాంటి ఆధునిక తల్లిదండ్రులకు ఆసరాగా నిలుస్తున్న స్టార్టప్ "ఎడ్యు అవేక్"

పిల్లల చదువులు నేర్పిన వ్యాపారం

మార్టిన్ పాల్, శరవణన్ లక్ష్మణన్ ఇద్దరూ ఎలక్ట్రికల్ ఇంజినీర్లు. పద్నాలుగేళ్లుగా కదుపులో చల్ల కదలకుండా ఉద్యోగం చేసుకుంటూ కుటుంబంతో సంతోషంగా గడుపుతున్నారు. అయితే ఓ సందర్భంలో వీరికి అనుకోని కష్టం ఎదురయింది. తమ పిల్లల్ని స్కూళ్లలో జాయిన్ చేసే సమయంలో వారికి కావాల్సిన పుస్తకాలు, వస్తువుల కోసం కారులో పెట్రోల్ అయిపోయే వరకూ తిరిగారు. అయినా లాభం లేదు. ఆన్ లైన్‌లో ప్రయత్నించినా ప్రయోజనం పెద్దగా కనిపించలేదు. ఎంతగా వెదికినా పెద్ద పెద్ద ఈ-కామర్స్ సైట్లలో కొద్దో గొప్పో కనిపించే విద్య సంబంధిత ఐటమ్స్ తప్ప... వారికేం దొరకలేదు. ఉన్నవాటితో పిల్లల్ని ఎలాగోలా సంతృప్తి పరిచినా వారికి మాత్రం అదే ఆలోచనలతో నిద్రలేకుండా పోయింది.

అయితే ఈ వీరి ఆలోచనలు తమ పిల్లలకు కావాల్సిన పుస్తకాలు, వస్తువుల దగ్గరే ఆగిపోతే "ఎడ్యూ అవేక్" పుట్టి ఉండేదే కాదు. తాము ఇంత సమయం వెచ్చించి ఇంత తిరిగినా కావాల్సినవీ పూర్తి స్థాయిలో దొరకలేదు. మరి దేశవ్యాప్తంగా ఉన్న తల్లిదండ్రులందరికీ అదే పరిస్థితి కదా..? అన్నదే వీరి ఆలోచన. మరి వీరి కష్టాలు తీర్చే స్టార్టప్‌తో తమ కెరీర్‌కి కొత్త టచ్ ఇస్తే ఎలా ఉంటుందన్నదే వీరికి నిద్రలేకుండా చేసిన ఆలోచన.

ఆలోచనతోనే ఆచరణ

వీరి ఆలోచన... పరిశోధన.. కార్యాచరణ అన్నీ రోజుల్లోనే పూర్తయిపోయాయి. తాము పడ్డ బాధలు దాదాపు ప్రతి తల్లిదండ్రి పడుతున్నారని గ్రహించారు. వెంటనే అందరికీ ఆన్ లైన్ లో చదువులకు సంబంధించిన సమగ్ర వస్తువులు దొరికేలా ఎడ్యుఅవేక్.కామ్ కు రూపకల్పన చేశారు. టెక్ట్స్, రిఫరెన్స్ బుక్స్, ఎడ్యుకేషనల్ డీవీడీలు, జనరల్ నాలెడ్జ్ కిట్స్.. ఇలా విద్యార్థికి సంబంధించి.. స్కేల్ నుంచి జామెట్రీ బాక్స్ వరకు, పలకల నుంచి టెన్త్ నాన్ డీటేల్డ్ బుక్స్ వరకు.. బ్యాగ్ నుంచి సాక్సుల వరకు ఏదైనా సరే దొరికేలా తమ స్టార్టప్‌ను డిజైన్ చేశారు.

తల్లిదండ్రులు, స్కూళ్లు, సబ్జెక్ట్ ఎక్స్ పర్ట్స్, రీటైల్ వినియోగదారులందర్నీ సమన్వయపరుస్తూ ఒకే గూటికి చేర్చారు. స్కూళ్లు, తల్లిదండ్రులు ఎవరైనా ఎలాంటి విద్యాసంబంధిత వస్తువునైనా బల్క్‌గా సైతం ఎడ్యుఎవేక్ నుంచి కొనుగోలు చేయవచ్చు. రచయితలు, ట్యూటర్స్, ఇతర ప్లాట్ ఫాముల్లో సేవలు అందించే ఎడ్యుకేషనల్ స్టార్టప్స్, పుస్తక విక్రేతలు ఇలా అందరికీ ఎడ్యుఅవేక్ ఓ ప్లాట్ ఫామ్‌ను ఏర్పాటు చేసింది.

కేవలం స్కూళ్ల ప్రారంభ సమయంలోనే తల్లిదండ్రులు ఈ టెన్షన్ ఉంటుందనుకోవడం సరి కాదంటున్నారు వీరు. విద్యాసంవత్సరం మధ్యలో సైన్స్ ఒలింపియాడ్, చీూజు ఎగ్జామ్ వంటి వాటి కోసం బుక్‌షాపుల వైపు పరుగులు పెట్టక తప్పదు. 2014లో ప్రారంభమైన ఈ స్టార్టప్ జోరందకుంది.

ఆదాయానికి మార్గాలెన్నో..!

ఎడ్యూఎవేక్ ను పూర్తిగా ఈ-కామర్స్ తరహాలోనే తీర్చిదిద్దారు ఈ ఇద్దరు మిత్రులు. ప్రైవేటు విద్యాసంస్థలతో ఒప్పందాలు కుదుర్చుకుంటున్నారు. B2C మోడల్ అంటే డైరెక్ట్‌గా తయారీ దారుల నుంచే వినియోగదారులకు అమ్మకాలు జరిపే విధానాన్ని కూడా ఇటీవలే లాంఛ్ చేశారు. దాదాపుగా 1200 ఉత్పత్తుల్ని ఈ పద్ధతిలో అమ్మేం దుకు తయారీదారులతో ఒప్పందాలు చేసుకున్నారు. DIY యాక్టివిటీ కిట్లు, బొమ్మలు, స్కూల్ స్టేషనరీస్, పుస్తకాలు, పజిల్ బుక్స్, గేమ్స్, కాంపిటీటీవ్ ఎగ్జామ్ గైడ్లు ఇలా సమస్తం అందుబాటులోకి తెచ్చారు. 'B2C వెబ్ సైట్‌ను కొద్ది నెలల్లోనే 12వేల మంది చూశారు. 200 మంది రిజిస్ట్రేషన్లు చేసుకు న్నారు. ఇదంతా ఎలాంటి డిజిటల్ మార్కెటింగ్ లేకుండానే జరిగింది. మేము ప్రధానంగా జనవరి నుంచి మే వరకు మార్కెట్‌పై ప్రత్యేకంగా దృష్టి పెట్టాం. బల్క్ ఆర్డర్స్‌ను స్కూళ్ల నుంచి భారీగా ఈ సమయంలోనే పొందగలం' అని శరవణన్ తెలిపారు. అమ్మకం దారులు, తయారీదారులు, స్కూళ్లతో ఒప్పందాలు, అడ్వర్‌టైజ్‌మెంట్లు ద్వారా ఇప్పటికీ సంతృప్తికర స్థాయిలో ఆదాయాన్ని ఎడ్యూఅవేక్ పొందుతోంది. నాస్కామ్ రిపోర్ట్ ప్రకారం 190 స్టార్టప్‌లు ఎడ్యుకేషన్ విభాగంలో పనిచేస్తున్నాయి. 2017 కల్లా ఇండియా ఆన్ లైన్ మార్కెట్ 40 బిలియన్ డాలర్లకు చేరుకోనుంది. చాలా స్టార్టప్‌లో ఏవో కొన్ని విభాగాల్లో మాత్రమే సేవలు అందిస్తున్నాయి. ఎడ్యుఅవేక్ మాత్రం ఆ పరిమితులను అధిగమించిందని వీరు చెబుతున్నారు.

'మేజర్ ఈ-కామర్స్ కంపెనీల్లో విద్యా సంబంధిత వస్తువులు దొరుకు తాయి. కానీ వాటినే స్పెషలైజ్ చేసిన బీటూసీ మోడల్ ఈ-కామర్స్ కంపెనీలు దాదాపుగా లేవు. ఇక బీటూబీ మార్కెట్‌లో మాకు పోటీ లేదు' అని ఎడ్యూఅవేక్ కో ఫౌండర్ మార్టిన్ వివరించారు.

ఆశావాహ ప్రణాళికలు

ఈ-చదువుల రేసులో పరుగందుకుంటున్న ఎడ్యూఅవేక్.. కొద్ది రోజుల్లో మొబైల్ అప్లికేషన్ విడుదల చేసేందుకు ఏర్పాట్లు చేసుకున్నారు. 2017 చివరికల్లా 500 మంది అమ్మకం దారులతో, 4000 ఉత్పత్తుల్ని అందుబాటులోకి తేవాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ప్రపంచంలోనే అత్యుత్తమమైన సర్వీసులును ఎడ్యుటెక్ రంగంలో అందించాలన్నదే తమ లక్ష్యమని మార్టిన్, శరవణన్ పట్టుదలగా చెబుతున్నారు. ప్రస్తుతం ఎడ్యుఎవేక్... దేశంలో ఉన్న స్కూళ్లు ఎదుర్కొంటున్న టీచర్ల సమస్యపై దృష్టి కేంద్రీకరించింది. దీన్ని పరిష్కరించేందుకు తమ ఆలోచనలకు పదును పెడుతున్నారు. తమదైన ఆలోచనలతో ఎడ్యూటెక్ రంగంలో ప్రత్యేకమైన ముద్ర వేసేందుకు సిద్ధమవుతున్నారు.

ఈ వారంలో మూడు సినిమాల విడుదల

ఈ వారాంతంలో 3 సినిమాలు థియేటర్లలోకి వస్తున్నాయి. మెగా హీరోలు సాయిధరమ్ తేజ్, వరుణ్ తేజ్ నటించిన సినిమాలతో పాటు సీనియర్ నటుడు మోహన్ బాబు నటించిన గాయత్రి సినిమా థియేటర్లలోకి వస్తున్నాయి. మెగా హీరో సాయిధరమ్ తేజ్ నటించిన చిత్రం ఇంటిలిజెంట్. దర్శకుడు వీవీ వినాయక్, తేజూ కాంబోలో ఇదే మొదటి సినిమా. ఖైదీ నంబర్ 150 లాంటి ఘన విజయం సాధించిన తర్వాత వినాయక్ ఈ సినిమా చేయడంతో ఇంటిలిజెంట్‌పై అందరి దృష్టి పడింది. సి.కల్యాణ్ నిర్మించిన ఈ సినిమాలో లావణ్య త్రిపాఠి హీరోయిన్. ఈ శుక్రవారం ఫిబ్రవరి 9 ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది.





ఇంటిలిజెంట్‌తో పాటు థియేటర్లలోకి వస్తోంది గాయత్రి. హై-ఎండ్ ఎమోషన్స్‌తో వస్తున్న ఈ సినిమాలో కలెక్షన్ కింగ్ మోహన్‌బాబు ప్రధానపాత్ర పోషించారు. యంగ్ మోహన్‌బాబుగా మంచు విష్ణు నటించాడు. శ్రియ, నిఖిలా విమల్ రెండు కీలక పాత్రలు పోషించారు. మదన్ దర్శకత్వం వహించిన ఈ సినిమా ఫిబ్రవరి 9న భారీఎత్తున విడుదల కానుంది. ఇంటిలిజెంట్, గాయత్రి సినిమాలు వచ్చిన 24 గంటల వ్యవధిలో థియేటర్లలోకి వస్తోంది తొలి ప్రేమ. ఫిదా లాంటి బ్లాక్ బస్టర్ తర్వాత వరుణ్ తేజ్ నుంచి వస్తున్న సినిమా ఇది. వెంకీ అట్లూరి ఈ సినిమాతో దర్శకుడిగా పరిచయమౌతున్నాడు. బీవీఎస్ఎన్ ప్రసాద్ నిర్మించిన ఈ సినిమాలో రాశి ఖన్నా హీరోయిన్. ట్రయిలర్‌కు ఇప్పటికే మంచి స్పందన రావడం ఈ సినిమాకు ప్లస్ పాయింట్. తమన్ ఈ సినిమాకు సంగీతం అందించాడు.

హిజ్రాగా స్టార్ హీరో

కొన్ని పాత్రలు చేయాలంటే చాలా గట్స్ ఉండాలి. ముఖ్యంగా నెగెటివ్ యాంగిల్‌లో ఉన్న పాత్రలని చేసేందుకు స్టార్ హీరోలు సిద్ధం కావడం కాస్త ధైర్యం చేస్తున్నారనే చెప్పవచ్చు. తమిళంలో విజయ్ సేతుపతికి చాలా క్రేజ్ ఉంది. తెలుగు ప్రేక్షకులకు కూడా ఈ పేరు బాగా సుపరిచితం అయి ఉంటుంది. మెగాస్టార్ 151వ చిత్రం సైరాతో విజయ్ సేతుపతి టాలీవుడ్‌కి ఎంట్రీ ఇస్తున్నాడు. ఈ చిత్రంలో బ్రిటీష్ వారి దగ్గర సిపాయిగా పనిచేసే భారతీయుడిగా విజయ్ కనిపిస్తాడని సమాచారం. అసలు విషయానికి వస్తే విజయ్ సేతుపతి తమిళంలో పలు చిత్రాలలో భిన్న ప్రయోగాలు చేశాడు. తాజాగా సూపర్ డీలక్స్ అనే సినిమా కోసం మగువగా నటించాడు. ఎరుపు రంగు చీరలో .. బొట్టుపెట్టుకుని సాంప్రదాయబద్ధంగా కనిపిస్తున్న విజయ్ సేతుపతి ఈ చిత్రంలో ట్రాన్స్‌జెండర్‌గా కనిపించనున్నాడని తెలుస్తోంది. ఈ పాత్ర పేరు శిల్ప కాగా, ఎక్కువ మేకప్ లేకుండా లేడీ గెటప్‌లో ఈ మాస్ హీరో ఒదిగిపోయిన తీరు అందరినీ ఆశ్చర్యానికి గురి చేస్తోంది. విజయ్ సేతుపతికి హిజ్రా మేకప్ వేస్తున్న ఫొటోలు విడుదల కావడంతో అవి సామాజిక మాధ్యమాల్లో హల్‌చల్ చేస్తున్నాయి. గత కొన్ని రోజులుగా ఈ సినిమా చెన్నైలో షూటింగ్ జరుపుకుంటోంది. చిత్రంలో విజయ్ సేతుపతి, ఫహద్ ఫాజిల్, సమంత, మిష్కిన్, రమ్యకృష్ణ, గాయత్రి, భగవతి పెరుమాల్ వంటి పెద్ద తారాగణం నటిస్తోంది. ఈ సినిమాకు కుమారరాజా దర్శకత్వం వహిస్తున్నారు. నలన్ కుమారస్వామి, మిష్కిన్, నీలన్ శేఖర్‌లు కుమారరాజాతో కలిసి స్క్రీన్ ప్లే రాశారు. యువన్ శంకర్‌రాజా సంగీతం సమకూర్చుతున్నారు. బీఎస్ వినోద్, నీరవ్‌షాలు సినిమాటోగ్రాఫర్లుగా వ్యవహరిస్తున్నారు.



మెగా అల్లుడు సినిమా షూటింగ్ మొదలైంది

మెగాస్టార్ చిరంజీవి అల్లుడు కల్యాణ్ దేవ్ హీరోగా ఓ సినిమా ఇప్పటికే ప్రారంభమైన విషయం తెలిసిందే. వారాహి చలనచిత్ర బ్యానర్‌పై సాయి కొర్రపాటి నిర్మిస్తున్న ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ హైదరాబాద్‌లో ప్రారంభమైంది. కాలేజ్ బ్యాక్ డ్రాప్ లో నడిచే లవ్ స్టోరీగా ఈ సినిమా రానుంది. మూవీలో కల్యాణ్ దేవ్ సరసన మాళవిక నాయర్ హీరోయిన్‌గా నటించనుంది. సెంథిల్ ఈ సినిమాకు సినిమాటోగ్రాఫర్. రాకేష్ శశి దర్శకత్వం వహిస్తున్నాడు. తణికెళ్ల భరణి, మురళీ శర్మ, సత్యం రాజేష్ ముఖ్యపాత్రలు పోషిస్తున్న ఈ సినిమాకు ఇంకా పేరుపెట్టలేదు. యోగేష్ ఈ సినిమాకు సంగీత దర్శకుడు.

ధనుష్ దర్శకత్వంలో నాగార్జున



ఓ వైపు హీరోగా సినిమాల్లో నటిస్తూనే మరోవైపు డైరెక్టర్‌గా అంతే సక్సెస్ ఫుల్‌గా కరియర్‌ని ప్లాన్ చేసుకుంటున్నాడు ధనుష్. రీసెంట్ గా 'పాపాండి' సినిమాతో, క్రిటిక్స్ ప్రశంసలు సైతం పొందిన ధనుష్, ఇప్పుడు తన దర్శకత్వంలో 2వ సినిమా ప్లాన్ చేస్తున్నాడు. అయితే ఈ సినిమాలో నాగార్జున నటిస్తున్నాడనే టాక్ టాలీవుడ్‌లో హీట్‌ని జెనెరేట్ చేస్తుంది. ఫిల్మ్ మేకర్స్ నుండి ఇప్పటి వరకు అఫీషియల్ కన్ఫర్మేషన్ అయితే రాలేదు కానీ ధనుష్, ఈ సినిమాను 2 లాంగ్వేజెస్‌లో ఒకేసారి తెరకెక్కించే ఆలోచనలో ఉన్నట్టు తెలుస్తోంది. శ్రీ తెనాండల్ ఫిలిమ్స్ బ్యానర్‌లో తెరకెక్కనున్న ఈ భారీ బడ్జెట్ మూవీ ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ ప్రాసెస్‌లో ఉంది. ఈ సినిమా గురించి మరిన్ని అప్ డేట్స్ తెలియాలంటే ఇంకొన్ని రోజులు వెయిట్ చేయాల్సిందే.

విశాలాంధ్ర సినిమా

'శైలజా రెడ్డి అల్లుడు' ఫ్రెండ్‌గా వెన్నెల కిశోర్



మహానుభావుడు లాంటి మంచి హిట్ తరువాత మారుతి ప్రస్తుతం నాగ చైతన్యతో సినిమాను చేస్తోన్న సంగతి తెలిసిందే. ఇటీవల ప్రారంభం అయిన ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ హైదరాబాద్ పరిసర ప్రాంతాలో జరుగుతోంది. కాలేజీ నేపథ్యంలో జరిగే ప్రేమకథగా ఈ సినిమాను తెరకెక్కిస్తున్నాడు దర్శకుడు మారుతి. అను ఇమ్మాన్యుల్ హీరోయిన్‌గా నటిస్తోన్న ఈ సినిమాను సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ సంస్థ నిర్మిస్తోంది. ఈ సినిమాలో పాపులర్ కమెడియన్ వెన్నెల కిశోర్ హీరో ఫ్రెండ్ పాత్రలో కనిపిస్తున్నాడు. చాలా సినిమాల్లో వెన్నెల కిషోర్ నటించినప్పటికీ ఈ సినిమాలో అతడి పాత్రకు మంచి ప్రాధాన్యం ఉందని సమాచారం. గోపి సుందర్ సంగీతం అందిస్తున్న ఈ సినిమాకు 'శైలజా రెడ్డి అల్లుడు' అనే టైటిల్ పరిశీలనలో ఉంది.

నితిన్ సరసన నందిత శ్వేత

ప్రస్తుతం నితిన్ 'శతమానంభవతి' ఫేమ్ సతీష్ వేగేశ్నతో కలిసి 'శ్రీనివాస కళ్యాణం' అనే సినిమా చేయనున్న సంగతి తెలిసిందే. ఈ చిత్రంలో నితిన్‌కు జోడీగా కన్నడనటి, నిఖిల్ సూపర్ హిట్ చిత్రం 'ఎక్కడికి పోతావు చిన్నవాడ'తో తెలుగు తెరకు పరిచయమైన నందిత శ్వేత నటించనుందని వినికిడి. నిఖిల్ సినిమాలో ఈమె నటనకుగాను ప్రేక్షకులు, విమర్శకులు మంచి మార్కులే వేశారు. ఆ చిత్రం తరవాత ఆమెకు మంచి ఆఫర్లు తలుపు తట్టాయి. సతీష్ వేగేశ్న కూడా 'ఎక్కడికిపోతావు చిన్నవాడ', నందిత శ్వేత నటించిన ఇతర తమిళ చిత్రాల్లో ఆమె నటనను చూసి ఆమెను నితిన్‌కు జోడీగా తీసుకోవాలని నిర్ణయించుకున్నారట. అయితే ఈ విషయంపై ఇంకా అధికారిక ప్రకటన వెలువడలేదు. ఈ చిత్రాన్ని ప్రముఖ నిర్మాత దిల్ రాజు నిర్మిస్తున్నారు.





కూతురి పెళ్లి వార్తలపై స్పందించిన తల్లి



వరుస సినిమాలతో బిజీగా ఉంది శ్రియ శరణ్. ఫిబ్రవరి 9 న రిలీజ్ కానున్న గాయత్రి సినిమాలోను ముఖ్యపాత్రను పోషిస్తున్న శ్రియ.. నటనకు ఎక్కువ అవకాశం ఉన్న పాత్రలతో కెరియర్‌ను ప్లాన్ చేసుకుంటోంది. ఇదిలా ఉంటే ఈ మధ్య సోషల్ మీడియాలో శ్రియ త్వరలో పెళ్లి చేసుకోనుందనే వార్త సంచలనం సృష్టించింది. అయితే ఈ పుకార్లపై స్పందించింది శ్రియ తల్లి నీరజ. ప్రస్తుతం శ్రియ పూర్తి దృష్టి అంతా కెరీర్‌పైనే ఉందని ఆమె స్పష్టం చేసింది. కుమార్తె పెళ్ళి విషయంలో వస్తున్న న్యూస్ పూర్తిగా పుకార్లేనని స్పష్టంచేసింది.. మరికొన్ని రోజుల్లో రాజస్థాన్‌లో జరగనున్న తన ఫ్రెండ్ పెళ్లి కోసం శ్రియ నగలతో పాటు డ్రెస్ డిజైనింగ్ చేయించుకున్న మాట వాస్తవమే, కానీ అది తన పెళ్లి కోసం కాదని చెప్పింది నీరజ. 'ఇష్టం' సినిమాతో తెలుగు సినిమాల్లోకి వచ్చి.. అతి తక్కువ కాలంలోనే స్టార్ హీరోయిన్‌గా ఎదిగిన శ్రియ.. ఇప్పటికీ యువతకు అభిమాన హీరోయిన్‌గా కొనసాగుతోంది. ప్రస్తుతం సెట్స్ పై ఉన్న వీర భోగ వసంత రాయలు సినిమాలో ముఖ్యపాత్రను పోషిస్తోంది శ్రియ.

మోడీ ప్రధానేనా.. : శివసేన



న్యూఢిల్లీ : నరేంద్రమోడీ ఈ దేశానికి ప్రధానమంత్రి అనే విషయాన్ని మర్చిపోయారని శివసేన వ్యాఖ్యా నించింది. మోడీ బుధవారం లోక్‌సభలో చేసిన ప్రసంగంపై మిత్రపక్షం శివసేన తనదైన శైలిలో స్పందించింది. ప్రధానిగా బాధ్యతలు చేపట్టి నాలుగేళ్లు గడిచినా మోడీ ఇంకా మారలేదని, ఆయన కళ్లుతెరవాల్సిన సమయం ఆసన్నమైందని శివసేన ఎంపీ మనీషా కాయండే వ్యాఖ్యానించారు. కాంగ్రెస్‌కు ప్రత్యామ్నాయంగానే ప్రజలు మోడీని ఎన్నుకున్నారని ఆమె గుర్తు చేశారు. మోడీ నుంచి ప్రజలు సంక్షేమ పథకాలు కోరుకుంటున్నారని, కాంగ్రెస్ పార్టీపై విమర్శలు కాదని ఆమె హేళన చేశారు. కాంగ్రెస్ నాయకుడు శశిథరూర్ స్పందిస్తూ మోడీ మంచి మాటకారని, కానీ పార్లమెంట్‌లో ఆయన ప్రసంగం అర్ధసత్యాలు, వక్రీకరణలతో సాగిందని కేంద్ర మాజీ మంత్రి శశి థరూర్ అన్నారు.

మాజీ ఆర్మీ మేజర్ ఆత్మహత్య



న్యూఢిల్లీ: సైన్యంలో విశేష సేవలందించి రిటైరైన మాజీ మేజర్ ఒకరు ఆత్మహత్య చేసుకోవడం మొహాలీలో కలకలం రేపింది. మజ్ అమర్‌దీప్ సింగ్ (60) ఈ అఘాయిత్యానికి పాల్పడడం వెనుక అనారోగ్యమే కారణమని తెలుస్తోంది. పదో తరగతి చదువుతున్న కూతురుతో పాటు భార్య పరిణీత్ కౌర్ మార్కెట్‌కు వెళ్లగానే... ఆయన తన ఇంట్లో ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు వెల్లడించారు. వారు ఇంటికి తిరిగిరాగానే తలుపులు తెరిచి ఉండడం చూసి ఇంట్లోకి వెళ్లారు. అమర్‌దీప్ ఉరివేసుకుని కనిపించడంతో చుట్టుపక్కల వారిని పిలిపించి ఆస్పత్రికి తరలించారు. అప్పటికే ఆయన మృతిచెందినట్టు వైద్యులు నిర్ధారించారు. తన భర్త కిడ్నీ వ్యాధితో బాధపడు తున్నారనీ... వాకర్ సాయంతోనే నడిచేవారని పరిణీత్ కౌర్ పేర్కొన్నారు. ప్రస్తుతం చండీఘర్‌లోని పీజీఐఎంఆర్‌లో చికిత్స పొందుతున్న ఆయన... అనారోగ్య కారణంగా తీవ్ర మనోవేదనకు గురవుతున్నారని తెలిపారు.

1500 మంది ఐఏఎస్‌ల కొరత : కేంద్రం



న్యూఢిల్లీ : దేశంలో 1500 మంది ఐఏఎస్ అధికారుల కొరత ఉందని కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ బుధవారం లోక్‌సభకు వివరించారు. 2017, జనవరి 1 నాటికి మొత్తం 6500 మందిని నియమించాల్సి ఉండగా, 5004 మంది మాత్రమే నియమితులైనట్టు చెప్పారు. 1496 ఖాళీలున్నాయని ఆయన లిఖిత పూర్వకంగా తెలిపారు. రాష్ట్రాలవారీగా ఆయన వివరాలను వెల్లడించారు. ఉత్తర ప్రదేశ్‌లో 621మందికి 515 మంది ఉన్నారన్నారు. బీహార్‌లో 342 మందికి 243 మంది, పశ్చిమ బెంగాల్‌లో 359కి 277 మంది, మధ్యప్రదేశ్‌లో 439కి 341మంది, కేరళ్‌లో 231కి 150మంది, తమిళనాడులో 376కి 289మంది, రాజస్థాన్‌లో 313కి 243 మంది, జార్ఖండ్‌లో 215కి 144 మంది, హర్యానాలో 205కి 155మంది, గుజరాత్‌లో 297కి 241మంది, హిమాచల్ ప్రదేశ్‌లో 147 మంది అధికారులకు 115 మంది ఉన్నట్టు తెలిపారు.

అలాగే జమ్మూకాశ్మీర్‌లో మొత్తం 137 మందికి 91మంది, నాగా లాండ్‌లో 94కి 67మంది, సిక్కిమ్‌లో 48కి 37మంది, తెలంగాణలో 208కి 130మంది, పంజాబ్ లో 221కి 182 మంది, చత్తీస్‌గఢ్ లో 193కి 154 మంది అధికారులు ఉన్నట్టు సింగ్ వివరిం చారు. ఐఏఎస్ అధికారుల ప్రత్యక్ష నియామక సంఖ్య ఆరేళ్లుగా 180కి పెరిగినట్టు తెలిపారు. ఇతర రాష్ట్రాల వివరాలనూ ఆయన తన సమాధానంలో వెల్లడించారు.

ఆక్రోశానికి అవమానం...!

- విభజన హామీలు ప్రస్తావించని మోడీ
- ఏపీ ఎంపీల ద్వంద్వ వైఖరి
- రాష్ట్రానికి తీరని అన్యాయం



న్యూఢిల్లీ : లోక్‌సభ సాక్షిగా... తెలుగు ప్రజల ఆత్మ గౌరవాన్ని, టీడీపీని కీర్తించిన ప్రధాని నరేంద్రమోడీ... ఆంధ్రుల ఆక్రోశాన్ని కనీసం పట్టించుకోలేదు. విభజన నేపథ్యంలో జరిగిన అన్యాయంలో గళమెత్తిన ఏపీ ఎంపీల ఆందోళనను బేఖాతరు చేశారు. బడ్జెట్‌లో అన్యాయం, పోలవరం ప్రాజెక్టు, ప్రత్యేక ప్యాకేజీ, విశాఖ రైల్వే జోన్, కడప ఉక్కు ఫ్యాక్టరీ సహా విభజన చట్టంలోని ఏ ఒక్క హామీపైనా మోడీ పెదవి విప్పలేదు. మిత్రపక్షం టీడీపీ ఆందోళనను అసలు పట్టించుకోలేదు. ఏం చేస్తారో చేసుకోండన్నట్టు వ్యవహరించారు. ఏపీ సమస్యను సభ సాక్షిగా దారి మళ్లించి కాంగ్రెస్ పార్టీపై ఎదురుదాడి చేశారు. కేవలం కాంగ్రెస్ కారణంగానే ఏపీకి అన్యాయం జరిగినట్టు సభను పక్కదోవ పట్టించారు. పార్లమెంటు సాక్షిగా విభజన హామీలను నెరవేర్చటంలో తాము విఫలం కావటానికి కాంగ్రెస్సే కారణమంటూ ఏకరువు పెట్టారు. మరోవైపు అటు టీడీపీ, ఇటు వైసీపీ ఎంపీల ద్వంద్వ వైఖరితో పార్లమెంటు సాక్షిగా రాష్ట్రానికి మళ్లీ తీరని అన్యాయం జరిగింది. మూడు రోజులుగా సభలో నినాదా లతో హోరెత్తించిన ఎంపీలు... రాష్ట్రపతికి ధన్య వాదాలు తెలపటానికి మోడీ నిలబడగానే...టీడీపీ ఎంపీలు తోక ముడిచారు. సభలో ఏమాత్రం లొంగవద్దని, అవసరమైతే మోడీ ప్రసంగాన్ని అడ్డుకోవాలని టీడీపీ అధినేత, ఏపీ సీఎం చంద్రబాబు బుధవారం ఉదయం తమ ఎంపీలను ఆదేశించారు. కానీ, టీడీపీ ఎంపీలు ఇందుకు విరుద్ధంగా సభలో వ్యవహరించారు. ఇక వైసీపీ ఎంపీలు కూడా తమ ద్వంద్వ వైఖరి ప్రదర్శించారు. వెల్‌లో నినాదాలు చేసిన వైసీపీ ఎంపీలు ప్రధాని ప్రసంగానికి సిద్ధపడగానే వాకౌట్ పేరిట సభ నుంచి నిష్క్రమించారు. ఈ స్థితిలో కాంగ్రెస్ ఎంపీలు ఆందోళనకు దిగారు. అంతే..కాంగ్రెస్‌ను లక్ష్యంగా చేసుకుని మోడీ సభలో చెలరేగిపోయారు. వాజ్‌పేయి హయాంలో మూడు రాష్ట్రాలు విభజిస్తే ఎలాంటి వివాదాలు రాలేదని.. కాంగ్రెస్ పార్టీ ఒక్క రాష్ట్రాన్ని విభజిస్తే నాలుగేళ్లుగా సమస్యలు కొనసాగుతూనే ఉన్నాయన్నారు. అవిభాజ్య ఆంధ్రప్రదేశ్‌ను కాంగ్రెస్ విభజించిన తీరు వల్లే ఇన్నేళ్లయినా సమస్యలు అలాగే ఉన్నాయన్నారు. 'తెలంగాణ ప్రజల మనోభావాలకు అనుగుణంగా ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటుకు మేం మద్దతు పలికాం. వాజ్‌పేయి ప్రభుత్వం దీర్ఘ దృష్టి కారణంగా మూడు రాష్ట్రాలను విభజించినా ఎలాంటి సమస్యలు ఉత్పన్నం కాలేదు. ఎవరి వాటాలు వారికి ఇచ్చారు. కానీ ఆంధ్రప్రదేశ్ విషయంలో అలా జరగలేదు. రాజకీయ లబ్ధి కోసం పార్లమెంటు తలుపులు మూసివేసి విభజన బిల్లు ఆమోదింపజేసుకున్నారు. నామ మాత్రపు ప్రతిపక్షం, ప్రసార మాధ్యమాలపై నియంత్రణతో కాంగ్రెస్ ఇష్టా రాజ్యంగా వ్యవహరించింది. తమ నిర్వాకాలు బయటకు రాకుండా కాంగ్రెస్ పార్టీ ఇష్టారీతిగా ప్రవర్తించింది. కేవలం ఎన్నికల్లో లబ్ధి పొందటానికే రాష్ట్రాన్ని విభజించారు. అప్పుడు వారు చేసిన తప్పుల వల్లనే ఈనాడు ప్రతిపక్షంలో కూర్చున్నారు. ప్రజాస్వామ్యం గురించి మాట్లాడే అర్హత కాంగ్రెస్ పార్టీకి లేదు. హైదరాబాద్‌లో ఏపీ దళిత సీఎం అంజయ్యను రాజీవ్‌గాంధీ అవమానించారు. నీలం సంజీవరెడ్డిని కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా అవమానించింది. ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రెస్ చేసిన రాజకీయ అరాచకాలు ఎన్నెన్నో... వీరా ఏపీ గురించి మాట్లాడేది. ఆంధ్రా నాయకులను తీవ్రంగా అవమానిం చారు. తెలుగు ప్రజల ఆత్మగౌరవం కాపాడేందుకే తెలుగుదేశం పార్టీ ఆవిర్భవించింది. దీనికోసమే తెలుగు ప్రజల ఆరాధ్య దైవం ఎన్టీఆర్ సినిమాలు వదిలి రాజకీయ ప్రవేశం చేశారు. కర్ణాటక ఎన్నికలు లేకుంటే ఆంధ్రప్రదేశ్ విభజన గురించి మల్లికార్జున ఖర్గే మాట్లాడేవారా?' అని మోడీ ఎదురుదాడి చేశారు. అంతక ముందు టీడీపీ ఎంపీల ఆందోళనను విరమించేందుకు హోంమంత్రి రాజ్‌నాథ్ సింగ్ బుధవారం ఉదయం ఏపీ సీఎంకు ఫోన్ చేశారు. విభజన చట్టంలోని హామీలపై ప్రధాని సానుకూలంగా ఉన్నారని, బుధ,గురువారాల్లో పరిష్కార మార్గం చూపుతామన్నారని చంద్రబాబుకు రాజ్‌నాథ్ వివరించారు. లోక్‌సభ, రాజ్యసభలో టీడీపీ ఎంపీలు సంయమనం పాటించాలని, ఎంపీలు ఆందోళన విరమించేలా చూడాలని చంద్రబాబును రాజ్‌నాథ్ కోరారు. 'ప్రధాని మోడీ ఈ విషయం మీకు చెప్పమన్నారు. నేను కూడా మీకు హామీ ఇస్తున్నా' అంటూ చంద్రబాబుతో రాజ్‌నాథ్ మాట్లాడారు. దీనిపై స్పందించిన చంద్రబాబు ఏపీకి జరిగిన అన్యాయంపై ప్రజలు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారని, రాష్ట్ర ప్రయోజనాలు, ప్రజాభిప్రాయం మేరకే ఎంపీలు ఆందోళన నిర్వహిస్తున్నారని, తమ పార్టీ ఎంపీలతో మాట్లాడి చెబుతానని రాజ్‌నాథ్‌తో అన్నారు. ఈ స్థితిలో మోడీ నోటి నుంచి ఏదో ఒక హామీ వస్తుందని కోటి ఆశలతో ఎదురు చూసిన చంద్రబాబుకు భంగపాటు తప్పలేదు. మోడీ ప్రసంగాన్ని అడ్డుకునేంత రీతిలో ఎంపీలు ఆందోళన చేయటం బీజేపీ సర్కారు చరిత్రలో తొలిసారి కావటం విశేషం. కానీ, అంతలోనే ఎంపీలు జావగారి పోవటంతో రాష్ట్రానికి అన్యాయం తప్పలేదు.

మూడేళ్లలో 108 మంది జర్నలిస్టుల హత్య



న్యూఢిల్లీ : దేశవ్యాప్తంగా 2015-17 మధ్య కాలంలో 108 మంది జర్నలిస్టులు హత్యలకు గురైనట్టు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి హన్స్‌రాజ్ అహిర్ రాజ్యసభకు వివరించారు. జర్నలిస్టులపై దాడులకు సంబంధించి 90 కేసులు నమోదైనట్టు తెలిపారు. జాతీయ క్రైం రికార్డ్స్ బ్యూరో (ఎన్‌సీఆర్‌బీ) డేటా ప్రకారం 2017లో జర్నలిస్టులపై దాడులకు సంబంధించి 15 కేసులు నమోదుకాగా 26 మంది అరెస్టు అయ్యారన్నారు. గతేదాదిలో 22 మంది ఒక్క రాజస్థాన్‌లోనే అరెస్టు అయ్యారని, వారిపై మూడు కేసులున్నాయని, త్రిపురలో మూడు కేసుల్లో ఒకరు అరెస్టు అయినట్టు చెప్పారు. 2016లో మొత్తం 47 కేసుల్లో 41 మంది అరెస్టు కాగా ఒక్క మధ్యప్రదేశ్‌లోనే 41 కేసుల్లో 12 మంది అరెస్టు అయ్యారన్నారు. 2016లో ఆంధ్రప్రదేశ్‌లో జర్నలిస్టులపై దాడులకు సంబంధించి ఆరు కేసులు నమోదు కాగా తొమ్మిది మంది అరెస్టు అయ్యారని, త్రిపురలో ఐదు కేసుల్లో నలుగురు అరెస్టు అయ్యారని చెప్పారు. 2015లో 28 కేసుల్లో 41 మంది అరెస్టు అయ్యారన్నారు. అయితే మీడియావారిపై దాడుల వెనుక ఏదేని సంస్థ లేదా సంస్థల ప్రమేయం ఉన్నదా లేదా అన్నది హోంశాఖకు సమాచారం లేదని మంత్రి అహిర్ తెలిపారు.

పోలీసు ఖాళీలు ఏ 4.43 లక్షలు

దేశవ్యాప్యంగా సుమారు 4.43 లక్షల పోలీసు పోస్టులు ఖాళీగా ఉన్నట్టు అహిర్ తెలిపారు. బ్యూరో ఆఫ్ పోలీసు రీసెర్చి అండ్ డెవలప్‌మెంట్ డేటా ప్రకారం 2017, జనవరి 1 నాటికి అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో 4,43,524 పోస్టులు ఖాళీగా ఉన్నట్టు తెలుస్తోందని చెప్పారు. అధికారిక నియామకాల సంఖ్య 19,88,295గా ఆయన తెలిపారు. 'నియామకం అన్నది నిరంతర ప్రక్రియ. పోలీసు సిబ్బంది కొరతకు సంబంధించినంత వరకు పదవీవిరమణలు, రాజీనామాలు, మరణాలు, విధుల నుంచి బహిష్కరణ వంటి పలు అంశాల నేపథ్యంలో ఈ ఖాళీలు ఏర్పడ్డాయి' అని మంత్రి లిఖితపూర్వకంగా వివరించారు.

బీజేపీ టీవీగా మార్చొద్దు..

విపక్షాల మండిపాటు
'బ్లాక్‌అవుట్'పై విచారణకు డిమాండు

న్యూఢిల్లీ : రాజ్యసభ టీవీలో తృణమూల్ కాంగ్రెస్ సభ్యుడు డెరెక్ ఓ బ్రెయిన్ ప్రసంగాన్ని కొన్ని నిమిషాల పాటు నిలిపివేయడంపై బుధవారం విపక్షాలు మండి పడ్డాయి. ఆర్ఎస్‌టీవీని బీజేపీ టీవీగా మార్చొద్దంటూ బీజేపీని ఉద్దేశించి వ్యాఖ్యానించాయి. డెరెక్ ప్రసంగాన్ని నిలిపివేయడంపై విచారణ జరిపించాలని డిమాండు చేశాయి. ఈ వ్యవహారంపై ఎగువసభలో డెరెక్ మాట్లాడుతూ 'నేను మీ రక్షణను కోరుతున్నాను. ఈ రోజు రాజ్యసభలో మాట్లాడాను. అయితే నేను తొలి నాలుగైదు నిమిషాలు మాట్లాడినది రాజ్యసభ టీవీలో ప్రసారం కాలేదు. నేను విపక్ష సభ్యుడ్ని.. మీరు మాకు రక్షణ కల్పించాలి' అని అన్నారు. సభాపతిగా ఉన్న బీజేపీ నేత సత్యనారాయణ జతియా స్పందిస్తూ 'దీనిపై విచారణ జరిపిస్తాం.. మీకు వివరాలను అందజేస్తాం' అని బదులిచ్చారు. ఈ అంశాన్ని తేలికగా తీసుకోవద్దని శాసనసభలో ప్రతిపక్ష నేత గులాం నబీ ఆజాద్ అన్నారు. ప్రత్యక్ష ప్రసారమైనా... వార్తాప్రసారమైనా అన్ని రాజకీయ పార్టీలకు ఒకే విధంగా ప్రాధాన్యత లభించాలని. ఈ విషయాన్ని టీవీఛానల్ గమనించాలని ఆయనన్నారు. ముందురోజు ఛానల్ న్యూస్ బులిటెన్‌లో 98శాతం బీజేపీ అధ్యక్షుడు అమిత్‌షా ఎగువసభలో చేసిన ప్రసంగమే ఉన్నట్టు ఆజాద్ తెలిపారు. 'ఇది రాజ్యసభ టీవీ. దీన్ని బీజేపీ టీవీగా మార్చొద్దు. నిన్న ఈరోజు (వార్తలు / కవరేజి)పై విచారణ జరిపించాలి' అని సభకు సూచించారు. ట్రజరీ బెంచీలనుద్దేశించి మాట్లాడుతూ ' మీకు మీడియా ఉంది... మీ సొంత పార్టీ (బీజేపీ)కి సంబంధించినది... అలాంటప్పుడు రాజ్యసభ/ లోక్‌సభ టీవీలను సొంత మీడియాగా ఎందుకు మారుస్తున్నారు' అని ఆజాద్ ప్రశ్నించారు. దీంతో జతియా స్పందిస్తూ ఈ అంశాన్ని చైర్మన్ ఎం.వెంకయ్యనాయుడు దృష్టికి తీసుకువెళ్లాల్సిందిగా ఆయనకు సూచించారు. డెరెక్ మాట్లాడుతూ 'ఇది పార్లమెంటులో అత్యంత అత్యవసర పరిస్థితి. మొదటి 5నిమిషాలపాటు, మోడీని, అమిత్‌షాలను విమర్శించాను. ఇక్కడ యాదృచ్ఛికం ఏమిటంటే అదే ప్రసారం కాలేదు' అని అన్నారు. ఇలాంటి ప్రమాదక పరిస్థితులు, విపక్షపై గళం వినిపించాలని విపక్ష నేతలందరూ ఉమ్మడిగా నిర్ణయించినట్టు తెలిపారు.

కాశ్మీర్‌లో పరిస్థితి విషమం

న్యూఢిల్లీ : జమ్మూ-కాశ్మీర్‌లో పరిస్థితి తీవ్రంగా దిగజారిపోయిందని కాంగ్రెస్ పార్టీ ఆందోళన వ్యక్తం చేసింది. శ్రీనగర్ ఆస్పత్రి నుంచి అరెస్టు అయిన లష్కరే తోయిబా (ఎల్ఈటీ) తీవ్రవాది తప్పించుకుపోయిన ఘటనను కాంగ్రెస్ పార్టీ రాజ్యసభలో ప్రస్తావించింది. సభ జీరో అవర్‌లో ప్రతిపక్ష నాయకుడు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత గులాంనబీ ఆజాద్ మాట్లాడుతూ, ఒక్క శ్రీనగర్‌లో మాత్రమే కాదు, జమ్మూ-కాశ్మీర్ రాష్ట్రం మొత్తం పరిస్థితి దిగజారిపోయిందని చెప్పారు. గత దశాబ్ది కాలంతో పోల్చుకుంటే రాష్ట్రంలో పరిస్థితి బాగుందని ఒక పక్క ప్రభుత్వం చెప్పుకుంటున్నప్పటికీ, వాస్తవ పరిస్థితి అందుకు పూర్తి భిన్నంగా ఉందని తెలిపారు. నిన్నటి రోజున జైలు అధికారుల కస్టడీ నుంచి 22 సంవత్సరాల మహ్మద్ నవీద్ ఝట్ అలియాస్ అబూ హంజాల తప్పించుకు పోయాడని చెప్పారు. నవీద్ అనుచరులు ఆయనకు ఎస్కార్టుగా ఉన్న వారిపై కాల్పులు జరిపి ఆయనను తప్పించా రన్నారు. వైద్యపరీక్షల కోసం నవీద్‌ను శ్రీనగర్‌లోని శ్రీ మహారాజా హరి సింగ్ ఆసుపత్రికి తీసుకువెళుతుండగా ఈ ఘటన జరిగింది. పాకిస్థాన్ జాతీయుడు అయిన నవీద్‌ను 2014లో అరెస్టు చేశారు. నవీద్‌ను పౌర ఆసుపత్రికి ఎందుకు తీసుకు వెళ్లారు, సైనిక ఆసుపత్రికి ఎందుకు తీసుకు వెళ్లలేదని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం, కేంద్రం, దేశం బాగోలేదని చెప్పడానికి ఈ ఘటన తార్కాణంగా ఆజాద్ పేర్కొన్నారు. "ఇటువంటి పరిస్థితి పునరావృతం కాకుండా ప్రభుత్వం జాగురూ కతతో ఉండాలి" అని అన్నారు. జమ్మూ-కాశ్మీర్‌లో దిగజారుతున్న పరిస్థితిపై పార్లమెంట్ ప్రస్తుత లేదా తదుపరి సమావేశాలలో చర్చించాలని ఆజాద్ డిమాండు చేశారు. కాశ్మీరీ పండిట్‌లు తిరిగి రాష్ట్రానికి వచ్చే విధంగా వాతావరణాన్ని సృష్టించేందుకు చర్చల క్రమాన్ని ప్రారంభించాలని వివేక్ కె. తంఖా కోరారు.

పరిశీలనలో ఎంటీఎన్ఎల్ పునరుద్ధరణ

లోక్‌సభలో మంత్రి మనోజ్ సిన్హా వెల్లడి



న్యూఢిల్లీ : ప్రభుత్వ నిర్వహణలోని ఎంటీఎన్ఎల్‌ను పునరుద్ధరించే పథకాన్ని తీవ్రంగా పరిశీలిస్తున్నట్టు ప్రభుత్వం ప్రకటించింది. ఖాతా దారుల ఆధారిత టెలికం ఆపరేటర్లను మెరు గుపరిచేందుకు వివిధ చర్యలను చేపడుతున్నట్టు కేంద్ర మంత్రి మనోజ్ సిన్హా బుధవారం తెలిపారు. లోక్‌సభ ప్రశ్నోత్తరాల సమయంలో అనుబంధ ప్రశ్నలకు మంత్రి సమాధానం ఇస్తూ, 4జీ సేవలను అందజేయడం ప్రారంభించేందుకు ఎంటీఎన్ఎల్, బీఎస్ఎన్ఎల్‌లను సన్నద్ధం చేసే విషయాన్ని కూడా ప్రభుత్వం పరిశీలిస్తోందని చెప్పారు. తన నెట్‌వర్క్ సామర్థ్యాన్ని, సేవల నాణ్యతను మెరుగుపరిచేందుకు, మార్కెట్ వాటాను పెంచేందుకు ఎంటీఎన్ఎల్ వివిధ చర్యలను చేపడుతోందని కూడా తెలిపారు. 3జీ నెట్‌వర్క్ విస్తరణ, ప్రస్తుతం ఉన్న బ్రాడ్‌బ్రాండ్ నెట్‌వర్క్ మోడ్‌ను డిజిటల్ సబ్‌స్క్రైబర్ లైన్ అసైంక్రోనియస్ మోడ్ (డీఎస్ఎల్ఏఎం)తిరిగి ఏర్పరచటం కూడా ఇందులో ఉందని చెప్పారు. ఎంటీఎన్ఎల్ పునరుద్ధరణ పథకాన్ని ప్రభుత్వం తీవ్రంగా పరిశీలిస్తోందని సిన్హా తెలిపారు. ఇందుకు తీసుకుంటున్న చర్యలను మంత్రి ఏకరువుపెట్టారు. "కనీస ప్రత్యామ్నాయ పన్ను విధించిన తరువాత చెల్లించాల్సిన మొత్తం చెల్లించేందుకు ఎంటీఎన్ ఎల్‌కు రూ. 492.26 కోట్ల మేర ఆర్థిక మద్దతును కల్పించ నున్నది" అని సిన్హా వెల్లడించారు. బీఎస్ఎన్ఎల్ మార్కెటింగ్ వాటా కేరళలో బాగా వుందని చెప్పారు. బీఎస్ఎన్ఎల్ కనుక 4జీ సేవలను ప్రారంభిస్తే రాష్ట్రంలో ఈ సేవలను ప్రారంభించిన మొట్ట మొదటి టెలికం ఆపరేటర్ బీఎస్ఎన్ఎల్ అవుతుందని చెప్పారు.


ఆధార్ డేటా భద్రతకు ఢోకాలేదు : రవిశంకర్ ప్రసాద్

న్యూఢిల్లీ : అధార్ డేటా పూర్తిగా సురక్షితమని, ఎటువంటి ఉల్లంఘన జరగలేదని కేంద్ర ఐటీ మంత్రి రవిశంకర్ ప్రసాద్ తెలిపారు. అధార్ కోసం నిక్షిప్తం చేసిన సమాచారం భద్రంగా ఉందని దేశ ప్రజలలో మెజారిటీ సంఖ్యలో విశ్వసిస్తున్నారని చెప్పారు. ఇప్పుడు 120 కోట్ల మంది దేశ ప్రజలకు ఆధార్ నంబర్లు ఉన్నాయని, 57 కోట్ల మంది బ్యాంకు ఖాతాలతో ఆధార్‌ను అనుసంధానం చేసుకున్నారని తెలిపారు. ఈ విధంగా చేయడం వల్ల కొంతమంది అసాంఘిక శక్తులకు రూ. 57,000 కోట్లు చేరకుండా కాపాడగలిగామని చెప్పారు. ఆధార్‌ను పకడ్బందీగా రూపొందించామని, అత్యున్నత స్థాయిలో డేటా భద్రత, సమగ్రత ఉన్నదని మంత్రి చెప్పారు. "యూఐడీఏఐ న్యాయపరంగా తగినది. సంస్థాగతమైనది, యూఐడీఏఐలో నిల్వ చేసిన డేటా భద్రత కోసం సాంకేతిక చర్యలు చేపట్టాం" అని లోక్‌సభ ప్రశ్నోత్తరాల సమయంలో రవిశంకర్ ప్రసాద్ చెప్పారు. అనుబంధ సంస్థలు, ఎకో-సిస్టమ్ భాగస్వాములను కూడా డేటా రక్షణ చర్యలు తప్పనిసరిగా చేపట్టాలని ఆదేశించినట్టు తెలిపారు. "అత్యున్నత స్థాయిలో డేటా భద్రత, ప్రైవసీ కాపాడాల్సిన అవశ్యకతను ప్రభుత్వం అత్యున్నతస్థాయిలో గుర్తించింది. ఇందుకోసం అవసరమైన సాంకేతిక పరిజ్ఞానాన్ని, మౌలిక సదుపాయాలను సమకూరుస్తుంది" అని చెప్పారు.

నాగా ఎన్నికల్లో కాంగ్రెస్ - ఎన్‌పీఎఫ్ జట్టు

న్యూఢిల్లీ : నాగాలాండ్ ఎన్నికల్లో ఎన్‌పీఎఫ్‌తో కాంగ్రెస్ జట్టుకట్టే అవకాశాలు ఉన్నట్లు పార్టీ వర్గాలు వెల్లడిస్తున్నాయి. ఫిబ్రవరి 27న నాగాలాండ్ అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. 60 శాసనసభ సీట్లలో రాష్ట్ర అధికార పార్టీ ఎన్‌పీఎఫ్ 58 సీట్లలో పోటీ చేస్తామని ప్రకటిం చింది. నూతన పార్టీ నాగాలాండ్ డెమాక్రటిక్ ప్రోగ్రెసివ్ (ఎన్‌డీపీపీ)తో బీజేపీ ఇప్పటికే జట్టుకట్టి, 20 సీట్లలో అభ్యర్థులను ఖరారు చేసింది. మాజీ ముఖ్యమంత్రి నీఫియో ఎన్‌డీపీపీని స్థాపించారు. ఈ పార్టీ అభ్యర్థులు 40 అసెంబ్లీ సీట్లలో పోటీ చేస్తున్నారు. ఎన్నికల నామినేషన్లు దాఖలు చేయడానికి గురువారం చివరిరోజు కాగ, ఉపసంహరణ ఈనెల 12తో ముగుస్తుంది. మంగళవారం వరకు ఎన్‌పీఎఫ్, బీజేపీ,ఎన్‌డీపీపీ, జేడీ(యూ)కు చెందిన 22 మంది అభ్యర్థులు తమ నామినేషన్లను దాఖలు చేశారు. రాష్ట్రంలో గిరిజన సమస్యల పరిష్కారం కోసం వారం క్రితం కాంగ్రెస్‌తో సహా అన్ని పార్టీలు సంయుక్తంగా ఎన్నికల్లో పాల్గొనాలని నిర్ణయించుకున్నాయి.

పృథ్వీ 2 మిస్సైల్ పరీక్ష విజయవంతం



బాలాసోర్ (ఒడిశా) : స్వదేశీ సాంకేతికత తో రూపొందించిన పృథ్వీ 2 క్షిపణిని శాస్త్రవేత్తలు విజయవంతంగా పరీక్షించారు. ఈ మధ్యశ్రేణి ఖండాంతర క్షిపణిని ఒడిశాలోని బాలాసోర్‌లో మిలట్రీ విజయవంతంగా పరీక్షించిందని రక్షణ రంగ అధికార ప్రతినిధి వెల్లడించారు. 350 కిమీ లక్ష్యాన్ని చేరుకునే ఈ క్షిపణిని కాంప్లెక్స్ 3 నుంచి మొబైల్ లాంచర్ ద్వారా బుధవారం 11.35 గంటలకు పరీక్షించారు. నిర్ధేశిత లక్ష్యాలను సాధించడంతో ఈ పరీక్ష సంపూర్ణంగా విజయవంతం అయిందన్నారు. అగ్ని 5, తర్వాత జనవరి 18న అగ్ని 1 క్షిపణిని ఒడిశా కోస్తా తీరంలోని కలాం ద్వీపం నుంచి మంగళవారం పరీక్షించారు. 500 నుంచి 1000 కేజీల వార్ హెడ్స్‌ను మోసుకెళ్లే సత్తా పృథ్వీ 2 కు ఉంది. అత్యవసర సమయాల్లో సన్నద్ధత దృష్ట్యా ఆర్మీలోని స్ట్రాటెజిక్ ఫోర్స్ కమాండ్ (ఎస్ఎఫ్‌సీ), రక్షణ పరిశోధన, అభివృద్ధి సంస్థ (డీఆర్‌డీఓ) సంయుక్తంగా ఈ క్షిపణిని పరిశీలించాయని రక్షణ శాఖ వెల్లడించింది. 2016 నవంబరు 21న రెండు క్షిపణులను విజయవంతంగా పరీ క్షించగా, 2017 జూన్ 2న వాటికి చివరి పరీక్ష చేపట్టారు. 2003లో రక్షణ దళాలు 9 మీటర్ల ఎత్తున్న సింగిల్ స్టేజ్ ద్రవ ఇంధన పృథ్వీ 2ను ఇంటిగ్రేటెడ్ గైడెడ్ మిస్సైల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం (ఐజీ ఎండీపీ) ఆధ్వర్యంలో డీఆర్‌డీఏ అభివృద్ధి చేసి పరీక్షించిందని రక్షణ శాఖ వెల్లడించింది.

రోడ్డు ప్రమాదంలో మోడీ భార్యకు గాయాలు

జైపూర్ : రాజస్థాన్‌లోని చిత్తోర్‌ఘర్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ భార్య జశోదాబెన్‌కు స్వల్ప గాయాలయ్యాయి. ఈ ప్రమాదంలో ఆమె బంధువు మృతిచెందినట్టు పోలీసులు తెలిపారు. ట్రక్కు-కారు ఢీకొట్టడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుందని తెలిపారు. కోటలో ఒక వేడుకలో పాల్గొని చిత్తోర్‌ఘర్‌కు కారులో తిరిగివస్తుండగా ఈ ప్రమాదం జరిగిందని చెప్పారు. కారులో జశోదాబెన్‌తో పాటు ప్రయాణిస్తున్న మరో నలుగురూ గాయపడ్డారని తెలిపారు. యశోద బంధువు బసంత్ భాయి మోడీ (67) చికిత్స పొందుతూ మృతిచెందినట్టు తెలిపారు.

గూఢచర్యం కేసు నుంచి మాజీ అధికారికి విముక్తి

న్యూఢిల్లీ : 1987 గూఢచర్యం కేసులో ప్రభుత్వ మాజీ సీనియర్ అధికారి ఎన్‌డబ్ల్యూ నీరూకర్‌ను నిర్దోషిగా ఢిల్లీ కోర్టు విడుదల చేసింది. కేంద్రంలో ఎలక్ట్రానిక్స్ విభాగంలో సలహాదారుగా పనిచేసిన నెరూకర్, మరొక వ్యక్తి పై మోపబడిన అభియోగాలను రుజువు చేయడంలో సీబీఐ విఫలమవ్వడంతో వీరికి కోర్టు ఈ కేసు నుంచి విముక్తి కల్పించింది. భద్రతకు సంబంధించిన విషయాలు లీక్ చేస్తున్నట్టు ఢిల్లీలోని కొరియర్ కంపెనీ వీరిపై ఇచ్చిన ఫిర్యాదు మేరకు సీబీఐ 1987 ఏప్రిల్ 17న కేసు నమోదు చేసింది.

మరో 68 మందిపై అన్నాడీఎంకే బహిష్కరణ వేటు

చెన్నై : అన్నాడీఎంకే తిరునల్వేలీ శాఖ నుంచి మరో 68 మంది ఆఫీసు బేరర్లు బుధవారం బహిష్కరణకు గురయ్యారు. ఆర్‌కే నగర్ ఉపఎన్నిక జరిగిన నాటి నుంచి నిరసనకారులపై పార్టీ బహిష్కరణ వేటు కొనసాగిస్తోంది. పార్టీ సిద్ధాంతాలు, భావాలకు వ్యతిరేకంగా పనిచేస్తూ పార్టీని అప్రతిష్టపాలు చేస్తున్న కారణంగా తిరునల్వేలి అర్బన్ పార్టీలో 68 మంది ఆఫీసు బేరర్లను బహిష్కరిస్తున్నట్టు అన్నాడీఎంకే నేతలు పనీర్‌సెల్వం, కె.పళనిస్వామి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఎమ్మెల్యేగా వివేక్ ప్రమాణం

జైపూర్ : రాజస్థాన్‌లోని మండల్‌ఘర్ శాసనసభా నియోజకవర్గానికి ఇటీవల జరిగిన ఉప ఎన్నికలో విజయం సాధించిన కాంగ్రెస్ పార్టీకి చెందిన వివేక్ ధకడ్ ఎమ్మెల్యేగా బుధవారం ప్రమాణస్వీకారం చేశారు. స్పీకర్ కైలాశ్ మేఘ్వాల్ ఆయన చేత ఉదయం 11 గంటలకు ప్రమాణం చేయించారు. దీనితో 200 మంది సభ్యులు గల అసెంబ్లీలో కాంగ్రెస్ పార్టీ బలం 25కి పెరిగింది. రాష్ట్రంలోని మండల్‌ఘర్ అసెంబ్లీ, అజ్మీర్, అల్వార్ లోక్‌సభా నియోజకవర్గాలకు జనవరి 29న జరిగిన ఉప ఎన్నికలలో పాలక బీజేపీ ఘోరపరాజయం పాలైంది.

కేజ్రీవాల్‌పై అక్రమ కేసు బనాయింపు : ఆప్

న్యూఢిల్లీ : గోవాలోని బీజేపీ పాలక ప్రభుత్వం కేజ్రీవాల్‌పై అక్రమంగా కేసు బనాయించిందంటూ ఆప్ దుయ్యబట్టింది. ఆ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల అధికారులను ఒత్తిడికి గురిచేసి కేజ్రీవాల్‌పై వారితో ఎఫ్ఐఆర్ దాఖలు చేయించిందని ఆరోపించింది. గత ఏడాది గోవా శాసనసభ ఎన్నికల సందర్భంలో లంచానికి సంబంధించిన ఆరోపణలపై కేజ్రీవాల్‌పై ఫిర్యాదు నమోదైంది. దీనికి సంబంధించి మాప్సాలోని జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ ఫస్ట్ క్లాస్ (జేఎంఎఫ్‌సీ) ఆయనకు నోటీసులు జారీ చేసింది. దీనికి సంబంధించిన కేసు విచారణ గురువారం జరగనుంది.

కోర్టుకు మరో నలుగురు ఆప్ ఎమ్మెల్యేలు

న్యూఢిల్లీ : లాభదాయక పదవులు చేపడుతున్నారన్న కారణంతో ఎన్నికల కమిషన్ (ఈసీ) అనర్హత విధించడాన్ని సవాలు చేస్తూ మరో నలుగురు ఆప్ ఎమ్మెల్యేలు ఢిల్లీ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ క్రమంలో ఎమ్మెల్యేల పిటిషన్లపై బదులివ్వాలని వాటిపై విచారణ చేపట్టిన సందర్భంలో సంజీవ్ కన్నా, చందేర్ శేఖర్‌లతో కూడిన ధర్మాసనం ఈసీకి నోటీసు జారీ చేసింది. అనర్హత విధించడాన్ని సవాలు చేస్తూ ఇప్పటికే మరో ఎనిమిది మంది ఆప్ ఎమ్మెల్యేలు దాఖలు చేసిన పిటిషన్‌పై ఈసీ ఇంతవరకూ బదులివ్వలేదని న్యాయవాది అమిత్‌శర్మ కోర్టుకు తెలిపారు.

వసుంధర రాజేను తప్పించండి

న్యూఢిల్లీ : రాజస్థాన్‌లో ఈ ఏడాది శాసనసభ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి వసుంధరా రాజే, రాష్ట్ర పార్టీ చీఫ్ అశోక్ పర్నమిలను తప్పించి వారి స్థానాల్లో వేరే వారిని భర్తీ చేయాలని కోట జిల్లా ఓబీసీ వింగ్ అధ్యక్షుడు అశోక్ చౌదరి పార్టీ అధ్యక్షుడు అమిత్‌షాకు లేఖ రాశారు. సీఎం పై రాష్ట్ర ప్రజలు అసంతృప్తితో ఉన్నారని, పర్నమి ఆమె వద్ద బానిస అని పేర్కొన్నారు. వీరి వల్ల పార్టీ నష్టపోతున్నట్టు లేఖలో తెలిపారు. రాష్ట్రంలో ఇటీవల జరిగిన ఉపఎన్నికలో బీజేపీ రెండు లోక్‌స్థానాలను, ఒక శాసనసభ స్థానాన్ని కోల్పోయింది.

సచివాలయం ముందు యువకుడి ఆత్మహత్యాయత్నం

ముంబై : మహారాష్ట్రలో సచివాలయం ఎదుట బుధవారం 32 ఏళ్ల వ్యక్తి ఆత్మహత్యాయత్నం చేశాడని పోలీసు అధికారులు తెలిపారు. అహ్మద్‌నగర్‌లోని నేవేస్ ప్రాంతానికి చెందిన అవినాష్ షేత్ మహారాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఎంపీఎస్‌సీ) పరీక్షల్లో తప్పినట్టు తెలియడంతో మనస్తాపంతో ఆత్మహత్యా యత్నం చేసినట్టు చేశాడని చెప్పారు. వ్యవసాయ విభాగంలో అసిస్టెంట్ పోస్టుకు 2013 ఎంపీఎస్‌సీ జరిగిన పరీక్షలు రాసాడని చెప్పారు. పరీక్షలు తాను బాగా రాశానని, పరీక్ష పేపర్లను మరొక్కసారి పరిశీలించాలంటూ షేత్ తరచూ అధికారులను కలుస్తూనే ఉన్నాడని, వాళ్లు పట్టించుకోకపోవడంతో చివరికి ఆత్మహత్యాయత్నం చేసినట్టు తెలిపారు.

కార్యకర్తలతో రాహుల్ సమావేశం

న్యూఢిల్లీ : వివిధ రాష్ట్రల పార్టీ ప్రతినిధులు, కార్యకర్తలతో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ న్యూఢిల్లీలో అక్బర్‌రోడ్డులోని ఏఐసీసీ కార్యాలయంలో బుధవారం సమావేశమయ్యారు. ఢిల్లీ, రాజస్థాన్, కర్ణాటకలతోపాటు విధ రాష్ట్రాల కు చెందిన పార్టీ ప్రతినిధులతో ఉదయం 9.15 గంటలకు సమావేశం నిర్వహించినట్టు పార్టీ వర్గాలు తెలిపాయి. పార్టీ మాజీ అధ్యక్షురాలు సోనియాగాంధీ సీడబ్ల్యూసీ సమావేశం, పార్టీ వ్యవస్థాపక దినోత్సవం సందర్భం తర్వాత మూతపడిన ఏఐసీసీ కార్యాలయంలోని పార్టీ అధ్యక్షుడి కార్యాలయం ప్రతినిధులతో సమావేశం సందర్భంగా మళ్లీ సందడిగా మారింది.

ప్రముఖ ఆయుర్వేద కంటి వైద్య నిపుణుడు కన్నుమూత

కోచి : కేరళలో ప్రముఖ ఆయుర్వేద కంటి వైద్య నిపుణుడు డాక్టర్ ఎన్‌పీ నంబూర్తి (68) అస్వస్థతతో ప్రైవేటు ఆసుపత్రిలో బుధవారం మృతిచెందినట్లు ఆయన కుటుంబసభ్యులు తెలిపారు. ఆయనకు భార్య, నలుగురు సంతానం ఉన్నారు. కోత్తట్టుకులంలో శ్రీధరీయం ఆయుర్వేద ఆసుపత్రి, పరిశోధన కేంద్రం మేనేజింగ్ డైరక్టర్‌గా సేవలందించారు. ఈ సంస్థను 1999లో ఆయన తన నివాసంలో ప్రారంభించారు.

లష్కరే కేసులో హవాలా ఆపరేటర్ అరెస్టు

న్యూఢిల్లీ : పాకిస్తాన్ ఉగ్రవాద సంస్థ లష్కర్-ఏ-తోయిబాతో సంబంధాలున్న మరొక హవాలా ఆపరేటర్‌ను అరెస్టు చేసినట్టు జాతీయ దర్యాప్తు సంస్థ అధికార ప్రతినిధి బుధవారం తెలిపారు. ఈ కేసులో అరెస్టు అయిన వారిలో అబ్దుల్ సామద్ ఐదవ వ్యక్తని, ఆయన్ని మంగళవారం ఢిల్లీలోని హరిద్వార్‌లో అరెస్టు చేసి కోర్టు ముందు హాజరుపరిచినట్టు తెలిపారు. ఆయన్ని కోర్టు అరు రోజుల కస్టడీకి తరలించిందని తెలిపారు. సామద్ ఉత్తరాఖండ్‌లో హరిద్వార్ జిల్లాలో బుక్కనపూర్‌కు చెందిన వ్యక్తని చెప్పారు.

88 మైనింగ్ కంపెనీలు రద్దు

న్యూఢిల్లీ : గోవాలో 88 కంపెనీలకు ఇనుము తవ్వకాల లీజులను సుప్రీంకోర్టు రద్దు చేసింది. ఆయా కంపెనీలకు ఇనుము తవ్వకాల లీజుల రెండవసారి పునరుద్ధరణకు సంబంధించిన పిటిషన్‌ను తోసిపుచ్చింది. తాజాగా పర్యావరణ క్లియరెన్స్‌ను మంజూరు చేయాలని కేంద్రం, గోవా ప్రభుత్వాన్ని కోర్టు ఆదేశించింది. చట్ట ప్రకారం మైనింగ్ తవ్వకాల లీజులను తాజాగా మంజూరు చేయాలని, రెండవసారి ఆయా కంపెనీలకు రెండవసారి లీజుల పునరుద్ధరణ వీలుకాదని కోర్టు స్పష్టం చేసింది.

రాజ్యసభలో సిక్కుల ఊచకోత అంశం

న్యూఢిల్లీ : 1984 సిక్కు వ్యతిరేక అల్లర్ల బాధితులకు న్యాయం చేయాలని రాజ్యసభలో శిరోమణి అకాలీదళ్ (ఎస్ఏడీ) బుధవారం కోరింది. ఆ అల్లర్లలో వందమందికిపైగా సిక్కులు హత్యకు గురయ్యారు. కాంగ్రెస్ పార్టీ ఎంపీ జగదీష్ టైట్లర్ ఈ అల్లర్లకు సూత్రధారి అని ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. ఈ అంశం ఈ రోజు రాజ్యసభలో ప్రస్తావనకు వచ్చింది. ఎస్ఏడీ సభ్యులు సుఖ్‌దేవ్ సింగ్ ధిండ్సా (ఎస్ఏడీ) 267వ నిబంధన క్రింద నోటీసు ఇచ్చారు. అయితే ఛైర్మన్ ఎం. వెంకయ్యనాయుడు ఈ నోటీసును జీరో అవర్‌కు సంబంధించిందిగా మార్పుచేశారు.

విశాలాంధ్ర
విశాఖపట్నం, గురువారం 08, ఫిబ్రవరి 2018

ఏసీబీకి పట్టుబడిన ఫారెస్ట్ సెక్షన్ అధికారి



విశాలాంధ్ర-కాకినాడ : తూర్పుగోదావరి జిల్లా కాకినాడలో ఫారెస్ట్ రేంజ్ కార్యాలయ సెక్షన్ అధికారి ఎం.గౌతమ్ వరప్రసాద్ ఏసీబీ అధికారులకు పట్టుబడ్డాడు. గౌతమ్‌వరప్రసాద్ జనవరిలో పిఠాపురంలోని పార్థసారథి టింబర్‌డిపోలో తనిఖీలు నిర్వహించి లోపాలు ఉన్నాయి కార్యాలయానికి వచ్చి కలవాలని యజమాని పార్థసారథికి సూచించాడు. అయితే కొద్ది రోజుల తరువాత డిపోను సీజ్ చేశాడు. దీంతో టింబర్‌డిపో యజమాని అనేక సార్లు ఫారెస్ట్ సెక్షన్ అధికారి వద్దకు వెళ్లినప్పటికీ ఫలితం లేకపోగా, కేసు నమోదు చేయకుండా ఉండాలంటే రూ.20వేలు ఇవ్వాలని డిమాండ్ చేశాడు. పదేపదే తిరిగి విసిగిపోయిన టింబర్‌డిపో యజమాని పార్థసారథి ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. ఏసీబీ అధికారుల సూచనల మేరకు కాకినాడ రూరల్ రమణయ్యపేట ఇందిరాకాలనీలోని ఫారెస్ట్ సెక్షన్ అధికారి ఇంటివద్దకు వెళ్లి రూ.20వేలు ఇస్తుండగా ఏసీబీ సీఐ ఎం.సుధాకర్‌రావు ఆకస్మిక దాడి నిర్వహించి పట్టుకున్నారు. పట్టుబడ్డ వరప్రసాద్‌పై కేసు నమోదు చేసి విజయవాడ ఏసీబీ కోర్టుకు తరలిస్తున్నట్టు ఏసీబీ సీఐ తెలిపారు.



ముస్లింలకు రూ.లక్ష పెళ్లికానుక

విశాలాంధ్ర-ఏఎస్‌పేట : ముస్లింల వివాహ సమయంలో వారి తల్లిదండ్రులకు పెళ్లికానుకగా దుల్హన్ పథకం ద్వారా లక్ష రూపాయలు అందజేస్తామని వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హామీ ఇచ్చారు. ప్రజాసంకల్పయాత్రలో భాగంగా బుధవారం నెల్లూరు జిల్లా సంగం నుంచి ఏఎస్‌పేట మండలం హసనాపురం జువ్వలగుంటపల్లి గ్రామాల వరకు పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మేకపాటి గౌతమ్‌రెడ్డి పర్యవేక్షణలో మండల కన్వీనర్ పందిళ్లపల్లి సుబ్బారెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల మహిళ కన్వీనర్ బోయిళ్ల పద్మజారెడ్డి, ప్రముఖ ఇంజనీర్ చెంచురెడ్డి ఆధ్వర్యంలో వేలాది మంది ప్రజలు పాదయాత్రలో పాల్గొన్నారు. సంగం మండలం దాటిన కొరిమెర్ల ప్రాంతంలో జగన్‌కు నాయకులు ఘనస్వాగతం పలికారు. హసనాపురంలో ముస్లిం మైనార్టీలతో మైనార్టీ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ముస్లిం నాయకులు, మతపెద్దలు మాట్లాడుతూ ముస్లింలకు నాలుగు శాతం రిజర్వేషన్ ఇచ్చి సహకరించింది వైఎస్ రాజశేఖర్‌రెడ్డి అని గుర్తు చేశారు. అదే విధంగా ప్రస్తుతం ముస్లింలు అనేక విధాలుగా ఇబ్బందులు పడుతున్నారని, ముస్లింలకు అండగా నిలవాలని కోరారు. ఈ సందర్భంగా జగన్‌మోహన్‌రెడ్డి మాట్లాడుతూ ఎన్నికలలో అనేక వాగ్దానాలు చేసి చంద్రబాబునాయుడు గెలిచిన అనంతరం రాష్ట్ర ప్రజలను మోసం చేశారన్నారు. రాజకీయాల్లో ఉండే నాయకులు మూడు గుణాలు కలిగి ఉండాలని, వాటిలో సిన్సియారిటీ, నిజాయతీ, విశ్వసనీయత అవసరమన్నారు. ఎన్‌టీఆర్‌ను కూడా వదలకుండా వెన్నుపోటు పొడిచిన నాయకుడు చంద్రబాబు అన్నారు. గత నాలుగేళ్లలో మైనార్టీల కోసం ఒక్క పని కూడా చేయలేదన్నారు. మైనార్టీ నిరుద్యోగులకు రూ.5 లక్షల వడ్డీ లేని రుణాలు ఇస్తామని చెప్పి ఇంతవరకు ఇవ్వని ఘనత ఆయనదే అన్నారు. రాజకీయాల్లో మార్పు కోసం నిజాయతీతో గెలిచిన నాయకులు పని చేయాలని కోరారు. ఏపీకి కేంద్ర ప్రభుత్వం ఎలాంటి ప్రత్యేక నిధులు కేటాయించకపోయినా బాబు ఏమీ చెప్పడం లేదన్నారు. మీడియా ముందు మాత్రం చిటపటలాడడం ప్రజలను తప్పుదోవ పట్టించేందుకేనన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం ప్రతి పేదవాడు ఉన్నత చదువులు చదివేందుకు అన్ని వసతులు కల్పిస్తామన్నారు. ముస్లింల ఇమామ్‌లు, మౌజాన్‌లకు రూ.10వేలు జీతం ఇస్తామని, మసీదుల పునరుద్ధరణకు నిధులు కేటాయిస్తామన్నారు. అగ్రిగోల్డ్ సంస్థలో నష్టపోయిన వారికి తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం రూ. 1100 కోట్లు 80 శాతం మందికి తిరిగి చెల్లించి మేలు చేకూర్చే విధంగా చూస్తామన్నారు. ఈ సందర్భంగా ముస్లిం మైనార్టీలు జగన్‌మోహన్‌రెడ్డికి శాలువాలు కప్పి పూలమాలలతో సన్మానించారు. అధికారం చేపట్టి ముఖ్యమంత్రి కావాలని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం స్థానిక బస్టాండ్ సెంటర్లోని వైఎస్సార్ విగ్రహానికి జగన్ పూలమాలలు వేశారు. ఈ కార్యక్రమంలో ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి గౌతమ్‌రెడ్డి, జెడ్పీ చైర్మన్ బొమ్మిరెడ్డి రాఘవేంద్రారెడ్డి, పలువురు ఎమ్మెల్యేలు, ఎఎస్‌పేట మండల కన్వీనర్ పందిళ్లపల్లి సుబ్బారెడ్డి, మండల మహిళ కన్వీనర్ బోయిళ్ల పద్మజారెడ్డి, ఇంజనీర్ చెంచురెడ్డి, పలుగ్రామాల నాయకులు, ముస్లిం మైనార్టీ నాయకులు పాల్గొన్నారు.

నల్లమల అడవుల్లో నక్సల్స్ డంప్ లభ్యం



విశాలాంధ్ర-ఆత్మకూరు(కె) : కర్నూలుజిల్లా ఆత్మకూరు మండలం లోని నల్లమల అటవీ ప్రాంతంలో బుధవారం రాత్రి పోలీసులు నక్సల్స్ డంప్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఆత్మకూరు డివిజన్ డీఎస్పీ మాధవ్ రెడ్డి తన సహచర అధికార బృం దంతో కలిసి ఆత్మకూరు మండలం నాగలూటి గూడెం నుండి ఉత్తరం వైపు ఒక కిలోమీటరు దూరంలో సోదాలు నిర్వహించగా అక్కడ పాతబడిన నక్సల్ డంప్‌ను గుర్తించారు. ఒక ప్లాస్టిక్ డ్రమ్ములో గ్రనేడ్‌లు, వాటికి సంబంధించిన స్ప్రింగులు, సేఫ్టీ పిన్నులు, స్ట్రైకర్లు, 40 జిలెటిన్ స్టిక్‌లను స్వాధీనం చేసుకున్నారు. క్రైమ్ నంబరు 17-2018 యుఎస్ 5 ఆఫ్ ఇఎస్ యాక్టు క్రింద కేసు నమోదు చేశారు.

రోడ్డుప్రమాదంలో చిన్నారి మృతి-11 మందికి గాయాలు

విశాలాంధ్ర-పెద్దదోర్నాల : శ్రీశైలం ఘాట్‌రోడ్డులో అతి వేగంగా వస్తున్న వాహనం చెట్టుకు ఢీకొనడంతో చిన్నారి మృతి చెందగా ముగ్గురికి తీవ్రగాయాలు, 8 మందికి స్వల్పగాయాలైన ఘటన శ్రీశైలం ఘాట్‌రోడ్డులోని తుమ్మలబైలు వద్ద బుధవారం ఉదయం జరిగింది. బొలారో మ్యాక్స్‌లో ఇమ్మిగనూరు మండలం, గుడికల్లు గ్రామానికి చెందిన వీరు శ్రీశైలం వెళ్లి దైవదర్శనం చేసుకొని తిరుగు ప్రయాణంలో దోర్నాల వచ్చే మార్గంలో తుమ్మలబైలు దాటిన తరువాత రెండు కిలోమీటర్ల దూరంలో డ్రైవర్ అతివేగంగా వస్తూ చెట్టును ఢీకొనడంతో చిన్నారి హిందు (2) అక్కడికక్కడే మృతి చెందింది. అందులో ప్రయాణిస్తున్న చలువాది నల్లన్న, పెద్దయ్య, బాలరవిలకు తీవ్ర గాయాలయ్యాయి. బాలరంగయ్య, చలువాది రవికుమార్, చలువాది నాగేష్, బాలసురేంద్ర, బాలనాగవీర, బాలతిమ్మక్క, బాలరం గన్నకు స్వల్ప గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం 108 వాహనంలో దోర్నాల ప్రభుత్వ వైద్యశాలకు, మెరుగైన వైద్యంకోసం కర్నూలు వైద్యశాలకు తరలించారు. డ్రైవర్ బోయ వన్నూరప్ప ప్రమాదం జరిగిన వెంటనే తప్పించుకున్నాడు. పాప తల్లి ఉరుకుందమ్మకు ఒక్కగానొక్క కూతురు కావడంతో ఆమె వేదన వర్ణనాతీతం. సమాచారం అందిన వెంటనే మార్కాపురం డీఎస్పీ ఎన్వీ రామాంజనేయులు, దోర్నాల ఎస్ఐ రామకోటయ్య, పోలీసు సిబ్బంది హుటాహుటిన ఘటనా స్థలికి వెళ్లి పరిస్థితిని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అంతర్జాతీయ కరాటేలో కోటబొమ్మాళి విద్యార్థినికి రజతం



విశాలాంధ్ర-కోటబొమ్మాళి : విశాఖలోని రాజీవ్‌గాంధీ స్టేడియంలో ఈ నెల 2 నుండి 4వ తేదీ వరకూ ఇండియాతో సహా శ్రీలంక, బంగ్లాదేశ్, భూటాన్, నేపాల్, సౌదీ అరేబియా, ఇంగ్లాండ్ దేశాల మధ్య అంతర్జాతీయ కరాటే పోటీలు జరిగాయి. ఈ పోటీలో శ్రీకాకుళం జిల్లా కోటబొమ్మాళి గ్రామానికి చెందిన జాహ్నవి ప్రతిభ కనబరిచి రజత పతకాన్ని కైవసం చేసుకుంది. తొమ్మిదేళ్ళలోపు బాలికల నుంచి కటాఫ్ విభాగంలో ఇండియా తరపున పాల్గొని, శ్రీలంక గ్రాండ్ మాస్టర్ సిరిచేల కృపాలిస్ చేతులమీదుగా ఈ పతకాన్ని అందుకుంది. మాస్టర్ కేశవ్ సోటాకాన్ విభాగం తరపున కరాటే మాస్టర్ ఎస్. గౌతమ్ ఆధ్వర్యంలో ఈ బాలిక శిక్షణ పొందింది. ఈ పోటీల్లో ఏడు దేశాలకు చెందిన క్రీడాకారులు పాల్గొన్నప్పటికీ రజత పతకం సాధించిన సెయింట్ క్లారెట్ విద్యార్థిని జాహ్నవిని ఆ స్కూల్ ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు అభినందించారు.

నటుడు సర్వేశ్వరరావు మృతి



విశాలాంధ్ర - విశాఖపట్నం : సినీ, రంగ స్థల నటులు వై.సర్వేశ్వరరావు (64) బుధవారం తెల్లవారుజామున విశాఖలోని సెవెన్‌హిల్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందారు. ఆయన గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారని కుటుంబసభ్యులు తెలిపారు. స్టార్ మేకర్ ఎల్.సత్యానంద్ సోదరుడిగా సుపరిచితులైన సర్వేశ్వరరావు రంగస్థల నటుడిగా ప్రత్యేక గుర్తింపు పొందారు. 1985లో కలెక్టరేట్‌లోని ఎన్జీవో క్లబ్‌లో ప్రదర్శించిన 'అడవి దివిటీలు' నాటికలో ఆయన నటనకు మంచి పేరొచ్చింది. ఈ నాటకాన్ని 51 రోజుల పాటు దిగ్విజయంగా ప్రదర్శించారు. ఇదే వేదికపై బొమ్మలాటను 120 రోజులు ప్రదర్శించి రికార్డు సృష్టించారు. సర్వేశ్వరరావు సముద్రం, సింధూరం, శ్రీఆంజనేయం, పవన్‌కల్యాణ్ నటించిన తమ్ముడు చిత్రంలో ప్రత్యేక పాత్రలో నటించారు. దాదాపు 20 చిత్రాలకు పైగా నటించి మెప్పించారు. సర్వేశ్వరరావు విశాఖలోని రామాటాకీస్ సమీపాన గల శ్రీనగర్ కాలనీలో నివాసముంటున్నారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఆయన మృతికి నాటక సంఘం, రంగస్థల నటులు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

ఆస్తిపన్ను మదింపునకు ఏయూ సహకారం

- ఏయూతో జీవీఎంసీ ఎంఓయూ
- జీఐఎస్ ద్వారా డిజిటల్ మ్యాపింగ్‌కు శ్రీకారం
- ఇప్పటికే పూర్తయిన ఏరియల్ సర్వే
- మరో రెండు నెలల్లో పూర్తి నివేదిక



విశాలాంధ్ర-విశాఖసిటీ : జీవీఎంసీ ఆస్తిపన్నులు మరిన్ని గుర్తించేందుకు ఏయూ సహకారం తీసుకోనుంది. దీంతో జీవీఎంసీ ఆస్తి పన్ను ఆదాయం రెట్టింపు కానుంది. వివిధ రంగాలకు శాస్త్ర, సాంకేతిక, మేధో సహకారాన్ని అందిస్తూ వస్తున్న ఆంధ్ర విశ్వవిద్యాలయం మరో ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టుకు తన సహకారం అందించనుంది. ఈ మేరకు ఇప్పటికే మహా విశాఖ నగరపాలక సంస్థ (జీవీఎంసీ) ఏయూతో ఒక ఒప్పందం కూడా చేసుకుంది. ఈ ఒప్పందం ప్రకారం విశాఖ నగరంలో ఉన్న నివాసిత భవనాలు, వాణిజ్య సముదాయాలు, ఖాళీ స్థలాలు ఎన్ని ఉన్నాయి ఎక్కడెక్కడ ఉన్నాయో పూర్తి వివరాలు డిజిటల్ పటం ద్వారా అందించడమే లక్ష్యం. విశాఖ నగరంలో ఉన్న 650 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో ఉన్న ప్రాంతాన్ని సవివరంగా ఒక నివేదిక ద్వారా ఏయూ అధికారులు జీవీఎంసీకి అందిస్తారు. తద్వారా ఆస్తిపన్నులు సులువుగా అధికారులు మదింపు చేసుకుని మహా విశాఖ నగరపాలక సంస్థకు ఆదాయాన్ని పెంచనున్నారు.

స్థలాలు ఎలా గుర్తిస్తారు?

ఈ ఒప్పందం ప్రకారం జియో ఇన్ఫర్మేషన్ సిస్టమ్ (జీఐఎస్) సాంకేతికతను వినియోగించుకుంటారు. దీని కోసం అత్యాధునిక విధానాల ద్వారా సర్వే చేసి డిజిటల్ పటాలు తయారు చేసి ప్రాంతాల వారీగా జీవీఎంసీకి నివేదిక ఇస్తారు. దీనిపై వర్సిటీలోని జియో ఫిజిక్స్ విభాగం, సెంటర్ ఫర్ స్టడీ ఆన్ బే ఆఫ్ బెంగాల్ ఆచార్యులు ప్రొఫెసర్ పి.అప్పారావు ఆధ్వర్యంలో నిపుణులు సేవలందిస్తున్నారు.

పూర్తయిన ఏరియల్ సర్వే

ఈ ప్రక్రియకు సంబంధించి ఒక విమానం తీసుకుని ఏరియల్ డిజిటల్ ఫొటోగ్రఫీ ద్వారా డిజిటల్ కెమేరాలు విని యోగించి డిజిటల్ పటాలు తయారు చేశారు. కానీ విశాఖలో నౌకాదళ స్థలాలు, రక్షణ రంగాలకు సంబంధిం చిన రక్షిత ప్రాంతాలు ఉండడంతో ఆయా పటాలను రక్షణ రంగ అధికారుల వద్దకు పంపారు. ఇప్పటికే రక్షణ రంగ అధికారుల అనుమతితో సర్వే చేసిన ఏయూ అధికారులు రక్షణ రంగ స్థలాల పటాలను పరిశీలనకు ఆయా అధికారులకు పంపారు. వారు పరిశీలించి రక్షిత ప్రాంతాలు గుర్తించి వాటిని మినహాయిస్తే మిగతా స్థలాలపై పూర్తి నివేదిక తయారుచేసి జీవీఎంసీ అధికారులకు అందిస్తారు.

సవివర నివేదికకు ప్రణాళిక

ఈ ఎంఓయూ ప్రకారం విశాఖలో మొత్తం 650 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణానికి సంబంధించి పూర్తి నివేదిక తయారు చేయనున్నా ప్రత్యేకంగా మాత్రం నగరంలోని జోన్-2 ప్రాంతంలో మాత్రం నివాసిత ప్రాంతాలు, వాణిజ్య సముదాయాలు, విద్యుత్, డ్రైనేజ్, వాటర్, లైటింగ్ తదితర పూర్తి సమాచారాన్ని నివేదిక రూపంలో తయారు చేయనున్నారు. దీనికి సంబంధించి నగరంలో కొన్ని టీమ్‌లుగా విద్యార్థులను ఏర్పాటు చేసి డోర్ టు డోర్ కూడా సర్వే కూడా పూర్తి చేశారు. రక్షణ రంగ అధికారులు ఆయా రక్షిత ప్రాంతాలకు సంబంధించి పటాలు మినహాయించే పని ఏయూ అధికారులకు అప్పగిస్తూ మరో రెండు నెలల సమయంలో పూర్తి నివేదిక జీవీఎంసీ అధికారులకు అందజేయడానికి సిద్ధంగా ఉన్నారు. ఇది అమలులోకి వస్తే దేశంలో ఇప్పటికే జీఐఎస్ సాంకేతికతను వినియోగించుకున్న నగరాల జాబితాలో విశాఖ కూడా చేరనుంది. స్మార్ట్ సిటీగా రూపాంతరం చెందుతున్న విశాఖలో ఈ తరహా సేవలు ముమ్ముందు మరిన్ని రానున్నాయని ఈ సందర్భంగా నిపుణులు వెల్లడించారు.

'సిరివెన్నెల'కు నాగభైరవ అవార్డు

11న నెల్లూరులో ప్రదానం



విశాలాంధ్ర బ్యూరో -నెల్లూరు : సుప్రసిద్ధ కవి నాగభైరవ కోటేశ్వర రావు స్మారక అవార్డుకు ప్రఖ్యాత సినీకవి సిరివెన్నెల సీతారామశాస్త్రి ఎంపికయ్యారు. ఈ ప్రతిష్ఠాత్మక అవార్డును ఈ నెల 11వ తేదీన నెల్లూరులోని టౌన్ హాల్లో జరిగే నాగభైరవ అవార్డు పండుగ సభలో సిరివెన్నెల సీతారామశాస్త్రికి ప్రదానం చేయనున్నారు. ఈ అవార్డు కింద రూ. 25,000 నగదు పారితోషికం, సత్కారం ఉంటాయి. 2009లో ప్రారంభించబడిన ఈ అవార్డును ప్రముఖ సాహితీవేత్తలు మల్లెమాల సుందరరామిరెడ్డి, శ్రీనివాసాచార్య, రసరాజు, తనికెళ్ళ భరణి, అద్దేపల్లి రామ్మోహనరావు, సుద్దాల అశోక్ తేజ, గొల్లపూడి మారుతీరావు, రావి రంగారావులకు ప్రదానంచేశారు. డా. నాగభైరవ అధ్యాపక సత్కారానికి ప్రముఖ సాహితీవేత్త, విశ్రాంత అధ్యాపకులు కాళిదాసు పురుషోత్తం ఎంపికయ్యారు. డా. నాగభైరవ సాహితీపురస్కారానికి విజయ్ కోగంటి, గుంటూరు రచించిన ఇలా రుప్పదామా రంగులు వచనకవితా సంపుటి ఎన్నికైంది. విజేతకు రూ.5,000 నగదు పారితోషికం, సత్కారం ఉంటాయి. నాగభైరవ స్ఫూర్తి అవార్డుకు ఎంపిక కాబడినవారు.. నెల్లూరు వంజ వాక సతీష్ రెడ్డి, మార్కాపురం కొండపోగు బి.డేవిడ్ లివింగ్‌స్టన్, విజయన గరం పి.లక్ష్మణరావు, ఏలూరు కాట్రగడ్డ లక్ష్మీ నరసింహం, విజయవాడ ఆవాల శారద. ఈ స్ఫూర్తి అవార్డుకు రూ. 1000 నగదు పారితోషికం, సత్కారం ఉంటాయి.

ఉద్యమాలు చేయను..సలహాలివ్వగలను



విశాలాంధ్ర-రాజమహేంద్రవరం సిటీ : ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేకహోదా సాధించేందుకు గాను జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ చొరవ చూపడం అభినందనీయమని, అయితే తాను ఉద్యమాలు చేయలేనని, సలహాలు, సూచనలు ఇవ్వగలనని మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్ కుమార్ పేర్కొన్నారు. తూర్పుగోదావరిజిల్లా రాజమహేంద్రవరంలోని విజేత వీడియోస్‌లో బుధవారం రాత్రి విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పవన్ కళ్యాణ్‌కు రాష్ట్రానికి ఏదైనా చేయాలనే తపన ఉందని, ప్రస్తుతం రాష్ట్రం ఉన్న పరిస్థితుల్లో అన్ని పక్షాలతో కలిసి జేఏసీని తయారుచేస్తే బాగుంటుందన్నారు. పవన్‌కళ్యాణ్ తనను కలుస్తానని చెప్పారని, అయితే తాను హైదరాబాద్‌లో ఈ నెల 11న కలుస్తానని చెప్పానన్నారు. పవన్ కళ్యాణ్ ఆలోచన తెలిశాక మాత్రమే మాట్లాడతానన్నారు. అందరినీ కలుపుకొని వెళితే అంతకంటే కావాల్సింది ఇంకేముంటుందన్నారు. ఈ సమావేశంలో పొడిపిరెడ్డి అచ్యుత దేశాయ్, అల్లుబాబి తదితరులు పాల్గొన్నారు.

మార్చి 5న రైల్వే మంత్రి ఇంటిముందు ధర్నా

- 24న భాగస్వామ్య సదస్సు ఎదుట నిరసన
- ఏపీజేఎఫ్ రౌండ్‌టేబుల్ సమావేశంలో వక్తల నిర్ణయం



విశాలాంధ్ర - విశాఖపట్నం : విశాఖకు రైల్వేజోన్ ప్రకటించాలని డిమాండ్ చేస్తూ మార్చి 5న రైల్వేమంత్రి ఇంటిముందు ధర్నా నిర్వహించాలని ఏపీజేఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించిన రౌండ్‌టేబుల్ సమావేశం నిర్ణయించింది. అదేవిధంగా ఈ నెల 24 నుంచి మూడు రోజులపాటు విశాఖలో జరిగే భాగస్వామ్య సదస్సు ఎదుట నిరసనలు చేపట్టాలని నిర్ణయించారు. విశాఖకు ప్రత్యేక రైల్వేజోన్ ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఆంధ్రప్రదేశ్ జర్నలిస్ట్ ఫోరం ఆధ్వర్యంలో వివిధ రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలతో రౌండ్ టేబుల్ సమావేశాన్ని బుధవారం ఉదయం విశాఖలోని డైమండ్ పెరల్ హోటల్‌లో నిర్వహించారు. ఏపీజేఎఫ్ జిల్లా అధ్యక్షులు ఎస్ఎస్ శివశంకర్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో పాల్గొన్న సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ ఉత్తరాంధ్ర ప్రాంత వాసులకు ప్రత్యేక రైల్వేజోన్ ఏర్పాటయితే ఉపాధి అవకాశాలు పెరుగుతాయన్నారు. ఉత్తరాది రాష్ట్రాల్లో రైల్వేజోన్ల కోసం ప్రత్యేక రైళ్ళకోసం అక్కడి ప్రజలు, పార్టీలు ఉద్యమాలు చేస్తే పార్టీలకతీతంగా అన్ని వర్గాలు, ప్రభుత్వ, పోలీసు యంత్రాంగం వారికి సహకరిస్తారన్నారు. కానీ మన దగ్గర మాత్రం ఉద్యమం చేయకముందే పోలీసులు, ప్రభుత్వం అడ్డుకోవడానికి యత్నిస్తున్నాయని ఆరోపించారు. వైసీపీ నగర అధ్యక్షులు మళ్ల విజయప్రసాద్ మాట్లాడుతూ విశాఖ రైల్వేజోన్ సాధనకోసం జరిగే ప్రతి పోరాటానికి తమ మద్దతు ఉంటుందని తెలిపారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న టీడీపీ ప్రభుత్వ వైఖరి వల్లే రాష్ట్రా నికి అన్యాయం జరుగుతోందని ఆరోపించారు.

ఏపీజేఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు కృష్ణాంజనేయులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్‌కు తీరని అన్యాయం చేసిందని ఆరోపించారు. బడ్జెట్‌లో మొండిచేయి చూపించిన కేంద్రవైఖరికి నిరసనగా ఎంపీలందరూ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ప్రజా పోరాటాల ద్వారానే మన హక్కులు సాధించుకోగలమని స్పష్టంచేశారు. విశాఖ ప్రత్యేక రైల్వేజోన్, విభజన చట్ట హామీల కోసం ఏపీజేఎఫ్ ముందుండి ఉద్యమాన్ని నడిపిస్తుందని చెప్పారు. ఈ రౌండ్ టేబుల్ సమావేశంలో ఏయూ రిజిస్ట్రార్ ఉమామహేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే ద్రోణంరాజు శ్రీనివాస్. ఏపీజేఎఫ్ జిల్లా కార్యదర్శి ఈశ్వర చౌదరి, రాష్ట్ర ఉపాధ్యక్షులు శ్రీరామ్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు బి.రవికాంత్, వైఎస్ఆర్ కాంగ్రెస్ నేతలు కొయ్యప్రసాద్‌రెడ్డి, పక్కి దివాకర్, తోటరాజీవ్, సీపీఐ నగర కార్యదర్శి ఎం.పైడిరాజు, జిల్లా కార్యవర్గ సభ్యులు డి.మార్కం డేయులు, సీపీఎం నగర కార్యదర్శి గంగరాం, బీజేపీ జిల్లా కార్యదర్శి ఎల్లపు ఈశ్వరరావు, సీనియర్ నేత ప్రకాష్‌రెడ్డి, లోక్‌సత్తా నాయకులు ఎంవీఎస్ఎస్. మూర్తి, జాప్ కేంద్ర కమిటీ సభ్యులు ఎస్ఎస్ఆర్ పాల్గొన్నారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

విశాలాంధ్ర-లింగాల : వ్యవసాయానికి చేసిన అప్పులు తీర్చలేక రైతు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన కడప జిల్లా లింగాల మండలంలో బుధవా రం చోటుచేసుకుంది. వైఎస్ఆర్ కడప జిల్లా లింగాల మండలం కామసముద్రం గ్రామానికి చెందిన రైతు రామాంజనేయరెడ్డి తనకున్న నాలుగెకరాల పొలంలో వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో చీనీ చెట్ల పెంపకం చేపట్టారు. గత ఏడాది తీవ్ర కరవు పరిస్థితులు నెలకొనడంతో చీనీ చెట్లను కాపాడు కునేందుకు లక్షలాది రూపాయలు ఖర్చు చేశాడు. కానీ చీనీ చెట్లను బతికించుకునేందుకు శతవిధాలా కృషి చేశాడు. వర్షాలు వచ్చే వరకు చీనీచెట్లను కాపాడుకోవడానికి ఆర్థికప రమైన సమస్యలు ఎదురయ్యాయి. దీంతో చెట్లను కాపాడు కోలేకపోయాడు. ఎండిన చెట్లను నరికివేసి తదుపరి సాగుకు మరింత అప్పు చేశాడు. లక్షలాది రూపాయలు ఖర్చు చేసినా పంటలు చేతికి అందక పోవడంతో అసలు, వడ్డీ కలిపి ఆ రైతుకు పెనుభారమయ్యాయి. అప్పులు తీర్చే మార్గం లేక జీవితంపై విరక్తి చెందిన రైతు రామాంజనేయరెడ్డి విషగుళికలు తిని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. భార్య శకుంతలకు సింహాద్రిపురం మండలం అంకాలమ్మ గూడూరుకు వెళ్లి వస్తానని చెప్పి బుధవారం ఇంటి నుంచి బయలుదేరాడు. మార్గమధ్యంలో విషగుళికలు మింగిన తర్వాత తాను ఆత్మహత్య చేసుకుంటున్నానంటూ భార్యకు ఫోన్ చేశాడు. వెంటనే భార్య, బంధువులు ఘటనాస్థలికి చేరుకున్నారు. వైద్యం కోసం రామాంజనే యరెడ్డిని కడపకు తరలిస్తుండగా మార్గ మధ్యంలో మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. మృతుడికి కుమార్తె, కుమారుడు ఉన్నారు. కుమార్తెకు వివాహం కాగా, కుమారుడు ఇంజ నీరింగ్ చదువుతున్నాడు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మల్లికార్జునరెడ్డి తెలిపారు.

ముగ్గురు మిలీషియా సభ్యుల లొంగుబాటు



విశాలాంధ్ర-నర్సీపట్నం : గాలికొండ ఏరియా కమిటీకి చెందిన ముగ్గురు మిలీషియా సభ్యులు బుధవారం విశాఖ జిల్లా నర్సీపట్నం ఏఎస్పీ ఆరిఫ్ హాఫీజ్ ఎదుట లొంగిపోయారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఏఎస్పీ మాట్లాడుతూ గెమ్మెలి లింగు, కొర్రా బంగారాజు, గెమ్మెలి శివయ్య 2013 నుంచి గాలికొండ మావోయిస్టు దళానికి మిలీషియా సభ్యులుగా పనిచేశారని అన్నారు. మావోయిస్టు కార్యకలాపాలతో విసుగుచెందిన వీరు ఆ దళం నుండి బయటకు వచ్చి జనజీవన స్రవంతిలో కలిసిపోయేందుకు నిశ్చయించుకున్నామని చెప్పారు. అయితే మావోయిస్టుల నుండి తమకు ప్రాణభయం ఉండటంతో ఈ ముగ్గురు స్వచ్ఛందంగా లొంగిపోయినట్టు చెప్పారు. ఈ విషయంలో కొయ్యూరు సీఐ ఉదయభాస్కర్, ఎస్సై డి.శ్రీనివాస్ ఎంతో చాకచక్యంగా వ్యవహరించారని ప్రశంసించారు. మావోయిస్టులకు సహకరిస్తున్న మిలీషియా సభ్యులు లొంగిపోవా లని వారిపై ఎటువంటి వేధింపులు గానీ, కేసులు గానీ ఉండవని, అంతేకాక ప్రభు త్వం నుంచి రావాల్సిన అన్ని సౌకర్యాలు కల్పిస్తామని ఏఎస్పీ ఆరీఫ్ హాఫీజ్ చెప్పారు.

మనస్తాపంతో అగ్రిగోల్డ్ బాధితుడు మృతి

విశాలాంధ్ర - చిలకలూరిపేట : అగ్రిగోల్డ్ సంస్థ మోసానికి మరో బాధితుడు బలయ్యాడు. గుంటూరుజిల్లా చిలకలూరిపేట పట్టణంలోని సుగాలీకాలనీకి చెందిన బి.రాంసింగ్‌నాయక్ (65) రిక్షా నడిపి కుటుంబాన్ని పోషిస్తుంటాడు. రోజు సంపాదనలో కొద్దికొద్దిగా అగ్రిగోల్డ్‌లో పొదుపు చేశాడు. 2015 జనవరి నాటికి అతనికి రూ.70 వేలు సంస్థ నుంచి రావాల్సి ఉంది. అయితే అగ్రిగోల్డ్ సంస్థ బోర్డు తిప్పేయటంతో ఒక్క పైసా కూడా రాలేదు. తీవ్ర మనస్తాపానికి గురైన రాంసింగ్‌నాయక్ ఏజెంట్ల చుట్టూ తిరుగుతూ, డబ్బులు వస్తాయని నమ్మకంతో ఎదురుచూశాడు. ప్రభుత్వం సైతం పెద్దగా పట్టించుకోకపోవటం, డబ్బులు వస్తాయని నమ్మకం సడలటంతో దిగులుచెందాడు. ఇద్దరు కుమారులు వివాహాలై వేరే ప్రాంతంలో ఉండటంతో భార్యతో కలిసి ఉంటున్నాడు. మానసిక ఆరోగ్యం క్షీణించి మంచాన పడి బుధవారం మృతి చెందాడు. రాంసింగ్‌నాయక్ మృతి సమాచారం తెలుసుకున్న సీపీఐ ఏరియా కార్యదర్శి సీఆర్ మోహనరావు, అగ్రిగోల్డ్ కస్టమర్స్, ఏజెంట్ల సంఘం జిల్లా అధ్యక్షుడు మంత్రు నాయక్‌లు బాధిత కుటుంబాన్ని పరామర్శించి మృతదేహానికి నివాళులర్పించారు.

గుప్త నిధుల తవ్వకాల్లో బయల్పడిన శివలింగాలు



విశాలాంధ్ర - తుగ్గలి : కర్నూలుజిల్లా తుగ్గలి మండల పరిధిలోని చెన్నంపల్లి కోటలో గుప్త నిధుల కోసం అధికారులు కొన్ని రోజులుగా తవ్వకాలను కొనసాగిస్తున్నారు. బుధవారం నాటి తవ్వకాల్లో నాలుగు శివలింగాలు బయటపడ్డాయి. గుంత లోపలి భాగంలో పురాతనమైన గోడ బయటపడింది. ఆ గోడ మధ్య భాగంలో మట్టి కుండ బయట పడింది. ఈ కుండలో చెదలు పట్టిన మట్టి ఉంది. ఈ గోడ సొరంగ మార్గానికి చేరువలో ఉండవచ్చుననే అనుమానంతో అధికారులు తవ్వకాలను ముమ్మరం చేశారు. 60 రోజులుగా తవ్వకాలు కొనసాగిస్తున్నారు. ఈ కోటలో గుప్తనిధులున్నాయా, లేక అధికారులు పనులు మానేసి ఈ కోటలోనే మకాం వేయడానికి ఈ తవ్వకాలు నిర్వహిస్తున్నారా అని ప్రజలు చర్చించుకుంటున్నారు. పూర్వం రాజులు పరిపాలించిన తర్వాత ఈ ప్రాంతాన్ని బ్రిటీష్‌వారు పరిపాలించారు. ఆ కాలంలోనే ఈ నిధిని తీసుకువెళ్ళిఉండవచ్చు కదా, ఈ అధికారుల హడావిడి ఎందుకో అంతు చిక్కని రహస్యం. ప్రభుత్వ ఆదేశాల మేరకు తవ్వకాలను కొనసాగిస్తున్నామని వారు చెబుతున్నారు. చాలా చోట్ల నిధులున్నట్లు ప్రచారాలు జరుగుతూనే ఉన్నాయి. ఆ ప్రాంతాలలో తవ్వకాలు జరిపించకుండా ఈ కోటలో తవ్వకాలు జరిపించడం ఏమిటని ప్రజలు చర్చించుకుంటున్నారు. ఈ కోట ప్రతి రూపాలు భావి తరాలకు అందించకుండా ఈ అధికారులు శిథిలావస్థకు చేర్చే ప్రయత్నాలు కొనసాగిస్తున్నారు. భావితరాలకు ఈ ప్రాంతాన్ని రాజులు పాలించారని చెప్పుకొనేందుకు ఆనవాళ్లు కూడా కనిపించకుండా అధికారులు చేస్తున్నారు.

10న రాష్ట్రవ్యాప్తంగా ఉద్యోగుల మహాధర్నా : అశోక్‌బాబు

విశాలాంధ్ర-విజయవాడ(గాంధీనగర్): ఉద్యోగుల సమస్యలను పరిష్కరించకుంటే ఆందోళనలను మరింత తీవ్రతరం చేస్తామని ఉద్యోగ సంఘాల జేఏసీ చైర్మన్ పి.అశోక్‌బాబు హెచ్చరించారు. విజయవాడలోని ఏపీ ఎన్‌జీఓ అసోసియేషన్ రాష్ట్ర కార్యాలయంలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో అశోక్ బాబు మాట్లాడుతూ సీపీ ఎస్ విధానం రద్దుపై గతంలో మండలస్థాయిలో ధర్నాలు నిర్వహించామని, ఈ నెల 10న ఉ.10 గంటల నుండి మ.2 గంటల వరకు 13 జిల్లా కేంద్రాల్లో ధర్నా కార్యక్రమం పెద్ద ఎత్తున చేపడుతున్నామన్నారు. సీపీఎస్‌లో వెసులుబాటు విధానాలను కాకుండా పూర్తిస్థాయిలో పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని, ప్రభుత్వ ఉద్యోగాలు చేరడంలో భవిష్యత్తుకు భరోసాతో పాటు పెన్షన్ వస్తుందనే ఉద్యోగాలలో చేరతారని, ప్రైవేట్ ఉద్యోగాల వైపు ఆసక్తి కనబరచరన్నారు. ఈ నెల 25న ఆంధ్రప్రదేశ్ జేఏసీ ఆధ్వర్యంలో భవిష్యత్ కార్యాచరణ రూపుదిద్దుతామన్నారు. ఏపీజేఏసీ జనరల్‌బాడీ సమావేశంలో భవిష్యత్



నిర్ణయాలను ప్రకటిస్తామన్నారు. ఏపీజేఏసీ వైస్ చైర్మన్ బండి శ్రీనివాసరావు, జనరల్ సెక్రటరీ ఎన్ చంద్ర శేఖరరెడ్డి, కో-చైర్మన్ యు కుళ్ళాయప్ప, కార్యదర్శి ఎ.వి.నరసింహారావు, ఉపాధ్యక్షులు కె.కె.వి భాస్కర రావు, మహిళా ప్రతినిధులు పి.వి.ఎల్.ఎస్ రత్న, ఎం.రాజ్యలక్ష్మీ, కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల సంఘం సమైక్య జనరల్ సెక్రటరీ డి.ఎ.ఎస్.వి ప్రసాద్, ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు జి.హృదయరాజు, ప్రధాన కార్యదర్శి పి.పాండురంగా వరప్రసాద్, ఫ్యాప్టో చైర్మన్ పి.బాబురెడ్డి, ఎస్టీయూ ప్రెసిడెంట్ సి.హెచ్ జోసఫ్ సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

బంద్‌కు మద్దతు ప్రకటించండి

సీఎం చంద్రబాబుకి సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ లేఖ

విశాలాంధ్ర బ్యూరో- విజయవాడ : రాష్ట్రానికి 44 మాసాలుగా కేంద్ర ప్రభుత్వం చేస్తున్న అన్యాయానికి, కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి అతితక్కువ నిధుల కేటాయింపులకు నిరసనగా ఈ నెల 8న వామపక్షాలు చేపట్టిన రాష్ట్ర బంద్‌కు తెలుగు దేశం పార్టీ తరపున సంపూర్ణ మద్దతు ప్రకటించాలని కోరుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబుకు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ బుధవారం లేఖ రాశారు. ఆయన లేఖలో పేర్కొన్న వివరాలిలా ఉన్నాయి. బంద్‌ను ఇప్పటికే ప్రధాన ప్రతిపక్ష పార్టీలైన వైసీపీ, కాంగ్రెస్ పార్టీలు బలపరిచాయి. రాష్ట్ర వ్యాప్తంగా జర్నలిస్టు సంఘాలు, ప్రజాసంఘాలు, ట్రేడ్ యూనియన్లు, విద్యార్థి, యువజన సంఘాలు, లారీ యజమానుల సంఘం, ముస్లిం ఐక్యవేదిక, ఉత్తరాంధ్ర చర్చా వేదిక, రాయలసీమ ప్రజా సమితి, ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య సంఘం తదితర సంఘాలన్నీ బంద్‌కు మద్దతు ప్రకటించి ప్రత్యక్షంగా పాల్గొంటున్నాయి. ఈ నేపథ్యంలో తెలుగుదేశం పార్టీ బంద్‌కు మద్దతు ప్రకటించడం ద్వారా రాష్ట్ర ప్రజలందరూ కేంద్ర నిర్లక్ష్యవైఖరికి నిరసన తెలియ చేసినట్లుంటుందని ఆ లేఖలో పేర్కొన్నారు. మన పక్కనే ఉన్న తమిళనాడు రాష్ట్రంలో అతి చిన్న సమస్యలపై కూడా అధికార, ప్రతిపక్ష పార్టీలు ఒకేరీతిగా స్పందిస్తున్నాయి. మన రాష్ట్రంలో అలాంటి పరిస్థితి కనపడకపోవడం విచారకరం. బడ్జెట్‌లో జరిగిన అన్యాయానికి, విభజన హామీలు నెరవేర్చనందుకు కేంద్రంపై ఉమ్మడిగా పోరాటం చేయాల్సిందిపోయి తెలుగుదేశం, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలు రెండూ ఒకరిపై ఒకరు దుమ్మెత్తి పోసుకోవడం సరి కాదు. అందుకు ఇది సమయం కాదు. సాక్షాత్తూ ముఖ్యమంత్రిగా ఉన్న మీరే రాష్ట్రాభివృద్ధి విషయంలో ప్రతిపక్ష పార్టీల సహకారం కోరకుండా ఏకపక్షంగా వ్యవహరించడం సరైనది కాదు. కేంద్ర బడ్జెట్ పట్ల రాష్ట్ర ప్రజల అభిప్రాయాలను, ఆకాంక్షలను కేంద్ర ప్రభుత్వానికి తెలియజేయడానికి ఇది సరైన సమయంగా భావించి బంద్‌కు సంపూర్ణ మద్దతు తెలపాలి" అని ఆ లేఖలో చంద్రబాబును రామకృష్ణ కోరారు.



అన్యాయంపై ప్రధానిని నిలదీయాలి : సీపీఐ

విశాలాంధ్ర - కర్నూలు సిటీ : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆర్థిక బడ్జెట్‌లో రాష్ట్రానికి జరిగిన అన్యాయంపై రాష్ట్రానికి చెందిన 26 మంది లోక్‌సభ సభ్యులు, 11 మంది రాజ్యసభ సభ్యులు ప్రధాన మంత్రి నరేంద్రమోడీని నిలదీయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ కోరారు. నగరంలోని దేవీ ఫంక్షన్‌హాల్ వద్ద రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వీజే చంద్రశేఖరరావు, హరనాథరెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పి.రామచంద్రయ్య, రాష్ట్ర సమితి సభ్యులు పి.భీమలింగప్పలతో కలిసి రామకృష్ణ మీడియాతో మాట్లాడుతూ చంద్రబాబు వైఖరివల్లే రాష్ట్రానికి తీవ్ర అన్యాయం జరుగుతున్నదని, ఇప్పటికైనా చంద్రబాబు నాయుడు రాజకీయాలు మానుకోవాలని సూచించారు. రాష్ట్రంలో బంద్ అక్కర్లేదని, ఢిల్లీలో చేయాలన్న అన్నవిధంగా చంద్రబాబు వ్యవహరిస్తున్నారని, ఢిల్లీలో గాంధీ విగ్రహం ఎదుట ఫోటోలకు ఫోజులు ఇవ్వడం తప్ప టీడీపీ ఎంపీలు సాధించింది ఏమి లేదన్నారు.

వర్సిటీ కాంట్రాక్టు ప్రొఫెసర్ల సమస్యలపై కమిటీ

నెలరోజుల్లోగా నివేదికకు ఆదేశం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్రంలోని వివిధ విశ్వవిద్యాలయాలు, డిగ్రీ కళాశాలల్లో కాంట్రాక్టు పద్ధతిన పనిచేస్తున్న అసిస్టెంట్ ప్రొఫెసర్లు, లెక్చరర్ల సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం ఓ కమిటీ నియమించింది. ఈ మేరకు బుధవారం స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఆదిత్యనాథ్ దాస్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ కమిటీలో రిటైర్డు ఐఏఎస్ అధికారి సీబీఎస్ వెంకటరమణ, జేఎన్‌టీయూ (కాకినాడ) మాజీ వీసీ అల్లం అప్పారావు, ఎస్‌వీయూ-తిరుపతి మాజీ వీసీ ఎన్.ప్రభాకర్‌రావు, ఉన్నత విద్యాశాఖ మండలి(ఏపీఎస్‌సీహెచ్‌ఇ) కన్వీనర్‌ను నియమించారు. రాష్ట్ర వ్యాప్తంగా విశ్వవిద్యాలయాల్లో ఏళ్ల తరబడి నుంచి కాంట్రాక్టు పద్ధతిలో అసిస్టెంటు ప్రొఫెసర్లు పనిచేస్తున్నారు. వారందర్నీ క్రమబద్ధీకరించాలంటూ వివిధ రూపాల్లో ఆందోళనలు నిర్వహించారు. కొత్తగా ఉద్యోగాల భర్తీలో చోటు కల్పించాలని మానవ వనరుల శాఖ మంత్రి గంటా శ్రీనివాసరావుకు విన్నవించారు. విశ్వవిద్యాలయాల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్ల పోస్టుల భర్తీకి ప్రభుత్వం రంగం సిద్ధం చేసింది. ఈ పోస్టులు భర్తీ చేస్తే కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్లంతా రోడ్డున పడతారు. అభ్యర్థుల విన్నపాల్ని దృష్టిలో వుంచుకుని నలుగురితో కమిటీని నియమించింది. నెల రోజుల్లోగా నివేదిక ఇవ్వాలని వారికి సూచించింది. కమిటీ సభ్యుల నివేదిక ఆధారంగా కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్ల కొనసాగింపుపై ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుంది.



ఇసుక అక్రమ రవాణాపై ఉక్కుపాదం : సీఎస్

విశాలాంధ్ర-అమరావతి : రాష్ట్రంలో ఇసుక, గ్రానైట్ అక్రమ రవాణాను అడ్డుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి దినేష్ కుమార్ ఆదేశించారు. ప్రజలకు ఉపాధి, పరిశ్రమలు ముడి సరుకు, ప్రభుత్వానికి ఆదాయం గ్రానైట్ మైనింగ్ లక్ష్యం కావాలని ఆయన స్పష్టం చేశారు. సచివాలయంలోని తన కార్యాలయంలో గనులు, భూగర్భశాఖాధికారులతో బుధవారం ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రజలకు లబ్ధి కలుగజేయడంతో పాటు ఇసుక అక్రమ రవాణాను అడ్డుకోడానికే ప్రభుత్వం ఇసుక పాలసీ తీసుకొచ్చిందన్నారు. జిల్లా కలెక్టర్ల అధ్యక్షతన ఏర్పాటైన జిల్లాస్థాయి కమిటీలు సూచించిన ధరలకే ఇసుక విక్రయాలు జరుగుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. రాష్ట్రంలో పలు ప్రాంతాల నుంచి ఇసుకను అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయని, వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని దినేష్ కుమార్ ఆదేశిస్తూ, వారి వాహనాలను కూడా సీజ్ చేయాలన్నారు. ఇసుక అక్రమ రవాణాలో అధికారుల పాత్ర ఉంటే, వారిని ఉపేక్షించ వద్దని సూచించారు. రాష్ట్ర అవసరాలకు భిన్నంగా గ్రానైట్ ఇతర రాష్ట్రాలకు తరలిపోవడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. రెండేళ్ల నుంచి గ్రానైట్ మైనింగ్ ద్వారా రాష్ట్ర ప్రభుత్వానికి వచ్చిన ఆదాయాన్ని నెలల వారీగా ఆదాయపు వివరాలు అందజేయాలని అధికారులను సీఎస్ ఆదేశించారు. ఈ సమీక్షా సమావేశంలో రాష్ట్ర గనులు, భూగర్భశాఖ కార్యదర్శి శ్రీధర్, జాయింట్ డైరెక్టర్లు నరసింహారెడ్డి, నాగరాజు, కోటేశ్వరరావు, పుల్లయ్య, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రం నెత్తిన రైల్వే భారం

- 12 ఆర్‌ఓబీ, 15 ఆర్‌యూబీలకు పచ్చజెండా
- రూ. 1000 కోట్లకు పైగా నిధుల అవసరం
- మూడేళ్లలో ఒక వంతెన మాత్రమే పూర్తి
- అధికారులకు సమస్యగా మారిన భూసేకరణ



విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: ఎంకి పెళ్లి సుబ్బి చావుకొచ్చిన చందంగా అసలే ఆర్థిక సమస్యలతో సతమతమవుతున్న రాష్ట్ర ప్రభుత్వానికి రైల్వే ప్రాజెక్టులు గుదిబండగా మారాయి. రైల్వేకు సంబంధించిన ప్రాజెక్టుల పూర్తికోసం రాష్ట్ర ప్రభుత్వం తన వంతు వాటాగా దాదాపు రూ. 1000 కోట్లు భరించాల్సిన పరిస్థితి నెలకొంది. రాష్ట్రంలో వివిధ రైలు మార్గాలపై రోడ్డు ఓవర్ బ్రిడ్జి (ఆర్‌ఓబీ), రోడ్డు అండర్ బ్రిడ్జి (ఆర్‌యూబీ)ల నిర్మాణాల కోసం ఈ మొత్తం అవసరం కానుంది. గత మూడేళ్ల కాలంలో మంజూరైన 9 ఆర్‌ఓబీలలో ఒక్కటి మాత్రమే పూర్తి కాగా నిధుల కొరతతో మిగిలిన 8 వంతెనల పనులు నత్తనడకన సాగుతున్నాయి. 105 ఆర్‌యూబీ పనులు పూర్తయి వినియోగంలోకి వచ్చాయి. ఈ నేపథ్యంలో తాజాగా ప్రకటించిన రైల్వే బడ్జెట్‌లో రాష్ట్రానికి మరో 12 ఆర్‌ఓబీలు, 15 ఆర్‌యూబీలను ఆ శాఖ మంజూరు చేసింది. మొత్తం రూ. 703 కోట్ల వ్యయం కానున్న ఈ 27 వంతెనలకు రైల్వేశాఖ వాటా రూ. 310 కోట్లు కాగా, రాష్ట్ర ప్రభుత్వ వాటా రూ. 393 కోట్లుగా ఉంది. ఇప్పటికే వివిధ దశల్లో వంతెనల నిర్మాణాలకే రూ. 600 కోట్ల వరకూ కావలసి ఉండగా, కొత్తగా మంజూరైన వంతెనలకు రూ. 393 కోట్లు కలిపి మొత్తం సుమారు రూ. వెయ్యి కోట్లను సమకూర్చుకోవాల్సి ఉంది. తన వాటాకు సంబంధించిన నిధులతో రైలు మార్గానికి ఇరువైపులా పిల్లర్లతోపాటు పైభాగంలో రహదారిని నిర్మించి ఇవ్వడంతో రైల్వేశాఖ పనైపోతుంది. అయితే పై వంతెనకు రెండువైపుల నుంచి అప్రోచ్ రోడ్డుతో మిగిలిన భాగంలో వంతెనను నిర్మించవలసిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉంది. ఆయా మార్గాలకున్న ప్రాధాన్యాన్ని బట్టి రెండు నుంచి నాలుగు వరుసల్లో ఆర్‌ఓబీలను నిర్మిస్తున్నారు. ఇందుకు అవసరమైన భూమిని సేకరించడం ఆయా జిల్లా రెవెన్యూశాఖలకు సమస్యగా మారింది. లెవెల్ క్రాసింగ్‌ల వద్ద ఆర్‌ఓబీ, ఆర్‌యూబీ నిర్మాణాలను చేపట్టడంతో ఆయా నగరాలు, పట్టణాలు, గ్రామాల్లో నివాస ప్రాంతాలు, పంట పొలాలను రహదారుల కోసం సేకరించాల్సి ఉంటుంది. చాలా చోట్ల భూముల ధరలు ఆకాశాన్ని తాకుతుండడంతో భారీగా పరిహారాన్ని చెల్లించుకోవడం ప్రభుత్వానికి భారంగా ఉంటోందని రెవెన్యూ అధికారులు పేర్కొంటున్నారు. మరికొన్ని ప్రాంతాల్లో అయితే అసలు భూములను ఇచ్చేందుకు యజమానులు ముందుకు రావడంలేదని, దీంతో రైల్వేవాటాగా వంతెన పూర్తయి ఏళ్లు గడుస్తున్నా.. రాష్ట్ర వాటా నిర్మాణాలు పెండింగ్‌లో ఉండిపోతున్నాయని చెబుతున్నారు.

వంద వంతెనలకు రైల్వే ప్రతిపాదనలు : దక్షిణ మధ్య రైల్వే పరిధిలో మొత్తం వంద కొత్త ఆర్‌ఓబీ, ఆర్‌యూబీల నిర్మాణానికి సంబంధించిన ప్రతిపాదనలను అధికారులు రైల్వేబోర్డుకు సమర్పించారు. ఈ బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్‌కు 27, తెలంగాణకు 11 వంతెనలు మంజూరైనట్లు ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో రైల్వే జీఎం వినోద్‌కుమార్ యాదవ్ తెలిపారు. వివిధ సెక్షన్లలో కాపలా ఉన్న లెవెల్ క్రాసింగ్‌లతోపాటు కాపలా లేని లెవెల్ క్రాసింగ్‌ల వద్ద ఎక్కువగా ప్రమాదాలు చోటు చేసుకుంటున్న నేపథ్యంలో రైల్వేశాఖ గత కొన్నేళ్లుగా రక్షణ, భద్రతలను మరింత పటిష్టం చేసేందుకు చర్యలు చేపట్టిన విషయం తెలిసిందే. గత బడ్జెట్‌లో రైలు మార్గాలు, సిగ్నలింగ్ వ్యవస్థలను పటిష్ట పరిచేందుకు ఏటా రూ. 20 వేల కోట్ల చొప్పున ఐదేళ్లపాటు లక్ష కోట్ల రూపాయలను 'జాతీయ రైలు భద్రత నిధి'కి సమకూర్చనున్నట్లు కేంద్ర ఆర్థికశాఖమంత్రి అరుణ్‌జైట్లీ ప్రకటించారు. దీనితోపాటు 2020 నాటికి బ్రాడ్‌గేజ్ మార్గాల్లో ఉన్న కాపలాలేని లెవెల్ క్రాసింగ్‌లను అంచెలంచెలుగా తొలగిస్తామన్నారు.

రోడ్డు మార్గంలో వెళ్లే వారికి రక్షణ కల్పించే చర్యల్లో భాగంగా కాపలాలేని లెవెల్ క్రాసింగ్‌లను గత కొన్నేళ్లుగా తొలగిస్తూ వాటి స్థానంలో ఆర్‌ఓబీ, ఆర్‌యూబీలతోపాటు సబ్‌వేలను ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటి వరకూ 27 కాపలా ఉన్న క్రాసింగ్‌లను శాశ్వతంగా తొలగించారు. మరో 184 కాపలాలేని క్రాసింగ్‌ల వద్ద కాపలా ఏర్పాటు చేయడం, వాటి వద్ద వంతెనల వంటి నిర్మాణాలను చేపడతున్నారు. ఆర్‌ఓబీ నిర్మాణం ఒక విధంగా వ్యయంతో కూడుకున్నదే అయినప్పటికీ ప్రమాదాల నివారణకు ఇదొక్కటే మార్గమని రైల్వే అధికారులు పేర్కొంటున్నారు. ఈ విధానంలో రాష్ట్రాలపై భారం పడుతున్నప్పటికీ భవిష్యత్తులో రవాణా వేగవంతం కావడం ద్వారా ఆయా రంగాలు త్వరితగతిన అభివృద్ధి చెందగలవన్న ఆశాభావాన్ని వ్యక్తం చేస్తున్నారు.

నూరుశాతం ఎల్‌ఈడీ లైట్లలో దక్షిణ మధ్య రైల్వే ఫస్ట్



దేశంలోనే నూరుశాతం ఎల్‌ఈడీ కాంతులను వెదజల్లిన మొదటి జోన్‌గా దక్షిణ మధ్య రైల్వే రికార్డు సృష్టించింది. ఇంధనపొదుపు చర్యల్లో భాగంగా అన్ని రైల్వేస్టేషన్లు, రైల్వే కార్యాలయాల్లో ఎల్‌ఈడీ బల్బులను ఏర్పాటు చేయాలని రైల్వేశాఖ ఆదేశించింది. ఇందులో భాగంగా జోన్లలోని మొత్తం 733 రైల్వేస్టేషన్లలో వివిధ రకాల వాట్‌లతో కూడిన 75,681 ఎల్‌ఈడీ బల్బులను అధికారులు అమర్చారు. జోన్ మొత్తంలో అన్ని రైల్వేస్టేషన్లు మంగళవారానికి ఎల్‌ఈడీ వెలుగులతో కళకళలాడాయి. ఎల్‌ఈడీ బల్బులను అమర్చడం ద్వారా ఏడాదికి రూ. 270 కోట్ల విలువ చేసే 32 లక్షల యూనిట్ల విద్యుత్‌ను ఆదా చేయగలుగుతామని దక్షిణ మధ్య రైల్వే జీఎం వినోద్‌కుమార్ యాదవ్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రధానంగా సికింద్రాబాద్ డివిజన్‌లో 8.8 లక్షల యూనిట్లు, హైద్రాబాద్‌లో 3.5 లక్షల యూనిట్లు, విజయవాడలో 8.1 లక్షల యూనిట్లు, గుంతకల్‌లో 6 లక్షల యూనిట్లు, గుంటూరులో 2.9 లక్షల యూనిట్లు, నాందేడ్ డివిజన్‌లో 2.7 లక్షల యూనిట్ల విద్యుత్ సంవత్సరానికి ఆదా కాగలదన్నారు.

డివిజన్ల వారిగా ఈ వివరాలు ఇలా ఉన్నాయి.

డివిజన్	స్టేషన్ల సంఖ్య	ఆదా ఏడాదికి (రూ.)
విజయవాడ	158	68,00,00
సికింద్రాబాద్	162	74,00,000
హైద్రాబాద్	100	30,00,000
గుంతకల్	157	51,00,000
గుంటూరు	76	24,00,000
నాందేడ్	80	23,00,000

స్పేస్‌ఎక్స్ భారీ రాకెట్ ప్రయోగం

(మొదటిపేజీ తరువాయి)

ఆస్ట్రోనాట్లను నింగిలోకి పంపుతుంది. అయితే ఈ సారి ఓ ప్రైవేటు కంపెనీ ఈ స్పేస్ సెంటర్ నుంచి ఫాల్కన్ హెవీ అనే భారీ రాకెట్‌ను ప్రయోగించింది. దీనిని నమ్మలేకపోతున్నట్లు ప్రయోగం అనంతరం ఎలన్ మస్క్ తెలిపారు. శక్తివంతమైన రాకెట్‌ను ప్రభుత్వ స్పేస్ ఏజెన్సీ కాకుండా.. ఓ ప్రైవేటు సంస్థ నింగిలోకి పంపడం ఇదే తొలిసారి. అత్యంత భారీ పేలోడ్‌ను ఆ రాకెట్ మోసుకెళ్లినట్లు మస్క్ తెలిపారు. 64 టన్నుల పేలోడ్‌ను మోసుకువెళ్లే తరహాలో ఈ రాకెట్‌ను డిజైన్ చేశారు. డెల్టా ఫోర్ హెవీ రాకెట్ కన్నా ఫాల్కన్ హెవీ రెట్టింపు బరువైనది. ఆ రాకెట్ కన్నా తక్కువ ఖర్చుతోనే దీన్ని తయారు చేశారు. రాకెట్‌లో స్పేస్‌ఎక్స్ సంస్థ నిర్మించిన ఎరుపు రంగు ఎలక్ట్రిక్ స్పోర్ట్స్ టెస్లా కారు ఉన్నది. దాంట్లో ఆ కంపెనీ తయారు చేసిన స్పేస్‌షూట్ ధరించిన ఓ స్టార్‌మ్యాన్ బొమ్మ కూడా ఉంది. ఆ కారు సూర్యుడి చుట్టూ పరిభ్రమిస్తుందని అంచనా వేస్తున్నారు. రాకెట్ సక్సెస్‌తో మస్క్ మరింత ఆనందం వెలిబుచ్చారు. మార్స్ గ్రహానికి మనుషులను పంపాలనుకుంటున్న తన కల నెరవేరే అవకాశం ఉందని వ్యాఖ్యానించారు. ఛాన్సుందన్నారు. శక్తివంతమైన రాకెట్లు తయారు చేయడానికి ఈ ప్రయోగం చాలా ఉపయోగపడుతుందన్నారు. స్పేస్ రేస్‌లో కొత్తతరం మొదలైందన్నారు. అతి భారీ ఫాల్కన్ హెవీ రాకెట్‌లో మొత్తం 27 ఇంజిన్లు ఉన్నాయి. మొత్తం మూడు బూస్టర్లలో ఆ ఇంజిన్లను అమర్చారు. ప్రస్తుతం ఉన్న రాకెట్ల కన్నా.. ఫాల్కన్ హెవీ ఎక్కువ బరువును మోసుకువెళ్తుంది.

ఎంపీల వెనకడుగు.. (మొదటిపేజీ తరువాయి)

కాంగ్రెస్ పార్టీకి చెందిన కేవీపీ రామచంద్రరావును ఒక రోజు సస్పెండ్ చేశారు. రాజ్యసభ వ్యవహారాలు మూడు రోజులుగా సక్రమంగా నడవకపోవటంతో ఆగ్రహం చెందిన వెంకయ్య ప్రజా సమస్యలపై చర్చ జరగకుండా చేస్తే తగిన పరిణామాలు ఉంటాయని ఎంపీలను హెచ్చరించారు. రాజ్యసభలో ప్రజా సమ స్యలపై చర్చలు జరగాలే తప్ప రాజకీయాలు చేస్తూంటే చూస్తూ ఊరుకోనని గట్టి వార్నింగ్ ఇచ్చారు. కేవీపీ రామచంద్రరావు రోజూ వెల్‌లోకి వచ్చి ఈ విధంగా చేయటం వల్ల సభకు తీవ్రమైన ఆటంకం కలుగుతున్నదని కాంగ్రెస్ పార్టీ ఫ్లోర్ లీడర్లు వెంటనే ఆయనను నియంత్రించాలని గులాంనబీ ఆజాద్‌కి సూచించారు. టీడీపీ, వైసీపీ పార్లమెంటరీ పార్టీ నాయకులను కూడా కేంద్ర మంత్రులు గట్టిగా హెచ్చరించినట్లు సమాచారం. దీంతో ఆంధ్రప్రదేశ్ ఎంపీలు ఆందోళన విషయంలో కొంత వెనక్కి తగ్గినట్లు సమాచారం. కేంద్రంతో పెట్టుకుంటే అనేక ఇబ్బందులు పడాల్సి వస్తుందని ఆలోచనలోపడ్డారని తెలిసింది. ఎంపీల్లో ఎక్కువ మంది వ్యాపారులు ఉన్న నేపథ్యంలో వారి వ్యాపారాలకు భంగం వాటిల్లుతుందనే భయం కూడా ఉంది. ఈడీ, ఐటి, సీబీఐ వంటి సంస్థలను తమపైకి పంపించినా ఆశ్చర్య పోనవసరం లేదని ఏపికి చెందిన ఒక ఎంపీ పేర్కొన్నారు. కేంద్రం సీబీఐని అడ్డుపెట్టుకుని ప్రతిపక్షాలను బ్లాక్ మెయిల్ చేస్తున్న విధంగానే తమను కూడా బెదిరిస్తున్నదని చెప్పారు. ఒకవైపు రాజ్యసభ ఎంపీలపై సస్పెన్షన్, లోక్‌సభ ఎంపీలకు బెదిరింపులు చూస్తుంటే ఎంపీల గొంతు నొక్కేందుకు కేంద్రం ప్రయత్నం చేస్తున్నదని హస్తినరాజకీయ వర్గాలు చెబుతున్నాయి. పార్లమెంటు బడ్జెట్ సమావేశాల తొలి దశ శుక్రవారంతో ముగియనుండగా రెండు రోజుల పాటు తూతూ మంత్రం ఆందోళన చేసి చేతులు దులుపుకోవాలని ఎంపీలు భావిస్తున్నట్లు తెలిసింది. బుధవారం లోక్‌సభ లోపల, బయట కూడా ఎంపీలు కేవలం మొక్కు బడిగా మాత్రమే ఆందోళనలు చేయటం కనిపించింది. వైసీపీకి చెందిన కేవలం ఐదుగురు ఎంపీలు మాత్రమే ఆందోళనకు హాజరయ్యారు. టీడీపీ ఎంపీలు కూడా కొంత మంది ఆందోళనకు డుమ్మా కొట్టారు. రెండు రోజులు నామమాత్రంగా ఆందోళన చేసి మమ అనిపించుకుంటే సరిపోతుందిలే అని ఎంపీలు భావిస్తున్నారని తెలిసింది. టీడీపీ ఎంపీల డిమాండ్లకు తాము మద్దతు ఇస్తున్నట్లు లోక్ సభలో టీఆర్‌ఎస్ ఎంపీ జితేందర్ రెడ్డి పేర్కొనటం విశేషం. ఒకవైపు ఎక్కడ కోల్పోయామో అక్కడ నుంచే పొందాలని టీడీపీ నేత ఏపీ సీఎం చెబుతుండగా, ఎంపీల వెన్నులో భయం పట్టుకుంటోంది. ఇప్పటికే టీడీపీ ఎంపీలపై కేంద్రం నిఘా పెట్టినట్లు తెలిసింది.

ఆందోళన విరమిస్తేనే సహకారం

విశాలాంధ్రబ్యూరో -న్యూఢిల్లీ: పార్లమెంటులో ఆందోళన చేస్తున్న వైసీపీ ఎంపీలు బుధవారం న్యూఢిల్లీలో కేంద్ర హోంశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌ను కలిసి ఏపీ సమస్యలపై చర్చించారు. ప్రత్యేక హోదాతో పాటు విభజన చట్టం హామీలు అమలు చేయాలని ఆయనను కోరారు. ఈ భేటీలో ఎంపీలు వైవీ సుబ్బారెడ్డి, విజయ సాయి రెడ్డి, వరప్రసాద్, అవినాష్ రెడ్డి, మిథున్‌రెడ్డిలు పాల్గొన్నారు. పార్లమెంటు సజావుగా జరిగేందుకు సహకరిస్తేనే తాము సహకరి స్తామని లేదంటే మేం చేయాల్సింది చేస్తామని రాజ్‌నాథ్ ఘాటుగా ఎంపీలకు చెప్పినట్లు సమాచారం. కేంద్ర మంత్రితో సమావేశం తర్వాత ఎంపీలు మీడియాతో మాట్లాడుతూ, ఏపీ ప్రజల కష్టాలను ఆయనకు వివరించామని, ప్రత్యేక హోదా, రైల్వే జోన్, పోలవరం, దుగ్గరాజపట్నం, కడప స్టీల్ ప్లాంట్ వంటి అంశాలను మంత్రి దృష్టికి తీసుకువచ్చామన్నారు. టీడీపీ డ్రామాలాడుతోందని , తమ డిమాండ్లపై రాజ్‌నాథ్ సానుకూలంగా స్పందించారని చెప్పారు. బడ్జెట్ సమావేశాల్లోపు విభజన హామీలపై స్పష్టత ఇవ్వాలని రాజ్‌నాథ్‌ని డిమాండు చేసినట్లు వైసీపీ ఎంపీలు తెలిపారు. రాష్ట్రానికి జరుగుతున్న అన్యాయంపై వారు రెండోరోజు కూడా తమ ఆందోళనను కొనసాగించారు. బుధవారం ఉదయం లోక్‌సభ ప్రారంభం కాగానే వైసీపీ ఎంపీలు వెల్‌లోకి దూసుకెళ్లి స్పీకర్ పోడియాన్ని చుట్టుముట్టి ఏపీకి తగిన న్యాయం చేయాలంటూ నినాదాలు చేశారు. మరోవైపు రాజ్యసభలో విజయసాయిరెడ్డి సైతం విభజన చట్టంలోని హామీలన్నీ అమలు చేయాలంటూ కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీశారు.

రాజ్యసభలో వెనక్కి తగ్గిన కేవీపీ

రాజ్యసభలో నిరసన తెలుపుతున్న ఎంపీ కేవీపీ , చైర్మన్ వెంకయ్య ఆదేశానుసారం వెనక్కి తగ్గారు.

వైసీపీ ఎంపీలతో రాజ్‌నాథ్

ఓ వైపు ఆర్థికశాఖ మంత్రి అరుణ్ జైట్లీ ప్రకటనతో టీడీపీ ఎంపీలు కూడా వెనక్కి తగ్గటం కనిపించింది. రాజ్యసభలో ఏపీకి న్యాయం చేయాలని డిమాండు చేస్తూ కేవీపీ రామచంద్రరావు ప్లకార్డుతో పోడియం వద్ద నిరసన తెలిపారు. అయితే వెంటనే స్పందించిన రాజ్యసభ చైర్మన్ వెంకయ్య నాయుడు ఇది సరైన విధానం కాదని, ఈరోజు కేవీపీని అనుమతిస్తే రేపు మరొకరు ఇలా నిరసన చేపడతారని దీంతో సభను సజావుగా నడపలేనని, వాయిదా వేస్తానని వెంకయ్య హెచ్చరించారు. కేవీపీని తన సీట్లో కూర్చునేలా చూడాలని కాంగ్రెస్ పార్టీ ఎంపీలని చైర్మన్ వెంకయ్య కోరారు. సభలో ఇలాంటి చర్యలకు సహకరించబోమని వెంకయ్య నాయుడుకి గులాం నబీ ఆజాద్ వివరణ ఇచ్చుకున్నారు. నిబంధన 255 కింద ఎంపీ కేవీపీ తన హాజరును ఉప సంహరించుకొని, సభ నుంచి నిష్క్రమించాలని చైర్మన్ ఆదేశించారు.

అన్యాయం జరిగిన చోటే ఆందోళన : ఆనందబాబు

విశాలాంధ్ర అమరావతి : రాష్ట్రానికి అన్యాయం జరిగిన పార్లమెంట్ వద్దే ఆందోళన చేపట్టాలని వామపక్షాలుకు మంత్రి ఆనందబాబు పిలుపునిచ్చారు. బుధవారం సచివాలయంలో మంత్రి మాట్లాడుతూ ప్రధాన మంత్రి, కేంద్ర ఆర్థిక మంత్రి ఇచ్చిన హామీలను అమలు చేయాలని అడగటం ఏపీ హక్కన్నారు. ఈ విషయంలో రాష్ట్రాన్ని విడదీసిన పార్టీలకు బాధ్యత ఉందని గుర్తు చేశారు. ఎన్డీఏలో టీడీపీ భాగస్వామిగా ఉన్నా ఆందో ళనలు చేయడంలో వెనకాడేది లేదని స్పష్టం చేశారు. ఏపీలో నిరసన తెలియజేసి ఢిల్లీలో కలిసి ఆందోళన చేస్తే ప్రయోజనం ఉంటుందని వివరిం చారు. మంచి మనసుతో ఆలోచించి బంద్ పిలుపు విరమించుకోవాలని ఆనందబాబు వామపక్షాలను కోరారు.

అంతర్రాష్ట్ర దొంగలముఠా అరెస్టు

విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్: అంతర్రాష్ట్ర దొంగల ముఠాను ఎల్బీనగర్ పోలీసులు పట్టుకున్నారు. ఎనిమిది మంది ముఠా సభ్యుల నుంచి రూ.4లక్షల నగదు, నాలుగు సెల్‌ఫోన్లు, 10కిలోల నికిలీ బంగారు గొలుసులను స్వాధీనం చేసుకున్నట్టు డీసీపీ వెంకటేశ్వరరావు విలేకరులకు తెలిపారు. గుజరాత్‌కు చెందిన ఈ ముఠా మహారాష్ట్రలో స్థిరపడిందని, పక్కా ప్రణాళిక ప్రకారం వేర్వేరు రాష్ట్రాలకు వెళ్లి అక్కడ ప్రజలను బురిడీ కొట్టిస్తుంటుందన్నారు. ఆయా నగరాల్లో శివారు ప్రాంతాల్లో ఇల్లు అద్దెకు తీసుకొని, పొరుగువారితో పరిచయాలు పెంచుకొని, ఆపై కిరాణా షాప్, బట్టలషాప్ యజమానులని, ఆర్ఎంపీ డాక్టర్లకు శఠగోపం పెట్టి ఉడాయిస్తారని డీసీపీ చెప్పారు.

మహిళల కోసం 'సాధికారమిత్ర'

విశాలాంధ్ర అమరావతి : మహిళా సాధికారత కోసం వారు ఎంపిక చేసుకున్న రంగంలో శిక్షణ ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. ప్రతి కుటుంబం నెలకు రూ.10వేల ఆదాయం సంపాదించే దిశలో స్వయం సహాయక సంఘాలను బలోపేతం చేయనుంది. దీనికోసం ప్రత్యేకంగా 'సాధికార మిత్ర' వ్యవస్థను రూపొందించింది. స్వయం సహాయక సంఘాలలో సభ్యత్వంతో సంబంధంలేకుండా ప్రతి 35 కుటుంబాలు ఒక క్లస్టర్‌గా ఏర్పాటు చేసి, దానికి ఓ సాధికార మిత్రను నియమించారు. వీరు ప్రభుత్వానికి-ప్రజలకు మధ్య సంధానకర్తలుగా వ్యవహరిస్తారు. రాష్ట్రంలో మొత్తం 4,70,070 సాధికారమిత్ర క్లస్టర్ల ద్వారా 5,86,157 కుటుంబాలకు ప్రయోజనం కలిగించాలన్నది ప్రభుత్వ లక్ష్యం. రాష్ట్రంలో175 నియోజక వర్గాలకు ప్రత్యేక గుర్తింపు సంఖ్యలు కేటాయిస్తారు. సాధికార మిత్రగా ఎంపికైన ప్రతి ఒక్కరికీ యూనిక్ ఐడీ కేటాయించడంతోపాటు గుర్తింపు కార్డు కూడా ఇస్తారు. ప్రభుత్వ పథకాలు, వాటి విధి విధానాలు, ప్రయోజనాలు, తదితర అంశాలలో వారికి ప్రత్యేక శిక్షణ ఇస్తారు. రాష్ట్రంలో ప్రస్తుతం 9,01,567 స్వయం సహాయక బృందాల(సెల్ఫ్‌హెల్ప్ గ్రూపులు)ల్లో 90.81లక్షల మంది సభ్యులు ఉన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో7.11 లక్షల గ్రూపుల్లో 71.75 లక్షల మంది ఉండగా,పట్టణ ప్రాంతాల్లో 1.91 లక్షల గ్రూపుల్లో 19.06 లక్షల మంది ఉన్నారు. ఈ గ్రూపుల్లో అట్టడుగు వర్గాలకు చెందిన చెంచు, యానాది వంటి కులాల మహిళలు కూడా ఉన్నారు. 99.47 శాతం మంది అంటే 90,33,342 మంది సభ్యుల ఆధార్ సమాచారాన్ని అనుసంధానం చేశారు. ఈ గ్రూపులను బ్యాంకు ఖాతాలతో జతపరచడంతో మహిళలు స్వయం ఉపాధి ద్వారా ఆదాయాన్ని సంపాదిస్తున్నారు. చంద్రన్న చేయూత మూలధన పెట్టుబడి పథకం కింద ఒక్కో సభ్యురాలికి రూ.10,000 చొప్పున మొత్తం పది వేల కోట్ల రూపాయలు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. మహిళా సంఘాల ద్వారా అమలు అవుతున్న ఊరూరా పశుగ్రాస క్షేత్రాలు, పండ్లతోటలు,ఎవెన్యూ ప్లాంటేషన్ తదితర కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. రహదారులకు ఇరువైపులా మొక్కల పెంపకం చేపట్టడంతో పాటు నర్సరీలు ఏర్పాటు చేసే బాధ్యతను కూడా స్వయం సహాయక సంఘాల సభ్యులకు అప్పగించనున్నారు. ఇప్పటికే పేదల కుటుంబ ఆదాయాలు పెంచేందుకు తీసుకున్న చర్యల్లో భాగంగా4,90,000 స్వయం సహాయక సంఘాల సభ్యులకు చిరు వ్యాపారాలు చేసుకునేందుకు 'స్త్రీనిధి' ద్వారా రూ.1,200 కోట్ల అందజేశారు. 67,84,602 మంది సభ్యులకు రూ.576.62 కోట్ల వడ్డీ లేని రుణాలు ఇచ్చారు. 'ఉన్నతి' పథకం కింద 38,600 ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు రూ.153.93 కోట్లు ఆర్థిక సాయం చేశారు. 'పసుపు-కుంకుమ' పథకం కింద రెండు విడతల్లో 82,85,000 మంది సభ్యులకు ఒకొక్కరికి రూ.6 వేల చొప్పున రూ. 4,971 కోట్లు అందించారు. అంతే కాకుండా సాధికార మిత్ర ద్వారా కూడా అవకాశం ఉన్న అన్ని మార్గాల్లో రాష్ట్రంలోని మహిళలందరికీ ఉపాధి అవకాశాలను మెరుగుపరచాలన్న దృఢ సంకల్పంతో ప్రభుత్వం చర్యలు చేపట్టింది.

సెంచరీతో కదం తొక్కిన మ్యాక్స్‌వెల్

టీ20 మ్యాచ్‌లో ఇంగ్లండ్‌పై ఆసీస్ విజయం



హోబర్ట్: ఇంగ్లండ్-ఆస్ట్రేలియా మధ్య ముక్కోణపు సిరీస్‌లో భాగంగా బుధవారం జరిగిన టీ20 మ్యాచ్‌లో ఆసీస్ విధ్వంసకర బ్యాట్స్‌మన్ గ్లెన్ మ్యాక్స్‌వెల్ సెంచరీతో కదం తొక్కాడు. బంతితో, బ్యాట్‌తో రాణించి సత్తా చాటాడు. లక్ష్య ఛేదనలో మొదటి ఓవర్లోనే రెండు వికెట్లు కోల్పోయిన ఆసీస్‌ను మ్యాక్స్ వెల్ (103, 58 బంతుల్లో, 10 ఫోర్లు, 4 సిక్సర్లు) వేగవంతమైన సెంచరీ సాధించి గట్టెక్కించాడు. దీంతో ఇంగ్లండ్ విసిరిన 156 పరుగుల లక్ష్యాన్ని ఆస్ట్రేలియా18.3 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి అధిగమించింది. ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేపట్టిన ఇంగ్లండ్ నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 155 పరుగులు చేసింది. ఇంగ్లండ్ బ్యాట్స్‌మన్ మాలన్(50, 36 బంతుల్లో, 2 సిక్సర్లు, 5 ఫోర్లు) రాణించగా, మిగతావారు తక్కువ స్కోర్లకే వెనుదిరిగారు. ఆసీస్ బౌలర్లలో మ్యాక్స్‌వెల్‌కు 3, అగర్‌కు 2 వికెట్లు దక్కాయి. అనంతరం బ్యాటింగ్ చేపట్టిన ఆసీస్‌ను ఇంగ్లండ్ బౌలర్ డేవిడ్ విల్లీ మొదటి ఓవర్లోనే దెబ్బతీశాడు. డేవిడ్ వార్నర్(4) వికెట్ల వెనక దొరికిపోగా, క్రిస్ లిన్ డకౌట్ అయ్యాడు. క్లిష్ట సమయంలో క్రీజులోకి వచ్చిన మ్యాక్స్‌వెల్ ఎడాపెడా బౌండరీలు బాదుతూ స్కోరును ముందుకు నడిపించాడు. ఈ క్రమంలోనే తన కెరీర్‌లో రెండో టీ20 సెంచరీని నమోదు చేశాడు. బౌలింగ్‌లో 3 వికెట్లు, బ్యాటింగ్‌లో సెంచరీ చేసిన మాక్స్‌వెల్ 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్' గా ఎంపికైనాడు.



సిరీస్ మనదే

దక్షిణాఫ్రికాను చిత్తుగా ఓడించారు..

కింబెర్లీ: ఐసీసీ ఉమెన్స్ ఛాంపియన్‌షిప్‌లో భాగంగా దక్షిణాఫ్రికా మహిళల క్రికెట్ జట్టుతో జరుగుతున్న మూడు వన్డేల సిరీస్‌ని భారత్ జట్టు కైవసం చేసుకుంది. కింబెర్లీ వేదికగా బుధవారం జరిగిన రెండో వన్డే మ్యాచ్‌లో భారత మహిళా క్రికెటర్లు బౌలింగ్, బ్యాటింగ్‌లో ఆల్‌రౌండ్ ప్రతిభ కనబర్చి దక్షిణాఫ్రికాను చిత్తు చేశారు.178 పరుగుల తేడాతో భారత మహిళ జట్టు అవలీలగా విజయం సాధించింది. తొలుత టాస్ గెలిచిన దక్షిణాఫ్రికా ఫీల్డింగ్ ఎంచుకుంది. బ్యాటింగ్‌కు దిగిన భారత్ నిర్ణీత 50 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 302 పరుగులు సాధించింది. భారత ఓపెనర్ స్మృతి మంధాన(135) విధ్వంకర బ్యాటింగ్‌తో జట్టు భారీ స్కోరు సాధించేందుకు దోహదపడింది. 303 పరుగుల విజయలక్ష్యంతో బరిలోకి దిగిన సఫారీ మహిళలు ఆ లక్ష్య ఛేదనలో బొక్కబోర్లా పడ్డారు. భారత బౌలర్ల ధాటికి ఒక్కరొక్కరుగా పెవిలియన్ బాటపట్టారు. ఓపెనర్ లీ(73) రాణించినా మరో ఎండ్‌లో ఎవరూ నిలవలేదు. దీంతో దక్షిణాఫ్రికా జట్టు 30.5 ఓవర్లలో 124 పరుగుల మాత్రమే చేసి ఆలౌట్ అయింది. భారత బౌలర్లలో జులన్ గోస్వామి 4, దీప్తీ శర్మ, శిఖా పాండే రెండేసి, పూనం యాదవ్ రెండేసి వికెట్లు, రాజేశ్వరీ ఒక వికెట్ పడగొట్టారు.

కుంబ్లే మాయాజాలానికి 19 ఏళ్లు



న్యూఢిల్లీ: సరిగ్గా 19 ఏళ్ల క్రితం ప్రపంచ క్రికెట్ చరిత్రలో భారత క్రికెట్ అభిమానులు ఎన్నటికీ మర్చిపోలేని ఘట్టం చోటు చేసుకుంది. అదే.. భారత్ చిరకాల ప్రత్యర్థి పాకిస్తాన్‌ను కసితీరా ఓడించిన రోజు.. భారత లెజెండ్ స్పిన్నర్ అనిల్ కుంబ్లే క్రికెట్ జీవితంలో చిరస్మరణీయంగా నిలిచిన రోజు. తన స్పిన్ మాయాజాలంతో పాక్ జట్టును కుప్ప కూల్చాడు. అది టెస్ట్ మ్యాచ్.. 1999, ఫిబ్రవరి 7 న ఢిల్లీ, ఫిరోజ్‌షా కోట్ల స్టేడియంలో పాకిస్తాన్ ఎదుట 420 పరుగుల లక్ష్యం. చివరి రోజు 101/1 స్కారుతో పాక్ జట్టు డ్రా కోసం ఆడుతోంది. అప్పుడే రంగంలోకి దిగాడు అనిల్ కుంబ్లే. గింగిరాలు తిరిగే బంతులతో పాక్‌ను ముప్పు తిప్పలు పెట్టాడు. సయీద్ అన్వర్, షాహిద్ అఫ్రిదీలు కొద్ది సేపు నిలువరించినా చివరికి లొంగక తప్పలేదు. అంతే కుంబ్లే విసిరే స్పిన్‌ను ఎదుర్కొనలేని పాక్ ఆటగాళ్లు పెవిలియన్‌కు క్యూ కట్టారు. ఈ మ్యాచ్‌లో పాక్ ఆటగాళ్లందర్నీ కుంబ్లే పెవిలియన్‌కి పంపాడు. పదికి పది వికెట్లను నేల కూల్చాడు. ప్రపంచంలో పది వికెట్లు తీసిన రెండో ఆటగాడిగా రికార్డుకెక్కాడు. ఇంగ్లండ్‌కు చెందిన జిమ్ లాకర్ 1956లో ఆస్ట్రేలియాతో జరిగిన 4వటెస్టు మ్యాచ్‌లో పదివికెట్లు పడగొట్టాడు. ఆ తర్వాత ఒకే ఇన్నింగ్స్‌లో 10 వికెట్లు తీసిన ఘనత అనిల్ కుంబ్లేదే. ఈ మ్యాచ్‌లో కుంబ్లే 26.3 ఓవర్లు బౌలింగ్ చేయగా ఇందులో 9 ఓవర్లు మెయిడెన్లు ఉన్నాయి. 74 పరుగులు ఇచ్చి 10వికెట్లు తీసి పాకిస్తాన్‌ను కుప్ప కూల్చాడు. ఈ మ్యాచ్‌లో 207 పరుగులకు పాక్ ఆలౌట్ అయింది. 212 పరుగులతో భారత్ జట్టు అద్భుత విజయం అందుకుంది.

రెండో టీ20లోనూ ఆఫ్ఘన్ల హవా

- రషీద్‌ఖాన్, మహమ్మద్ నబీ మెరుపులు
- 2-0 తో జింబాబ్వేపై టీ20 సిరీస్ కైవసం



హరారే: జింబాంబ్వేతో జరిగిన రెండో టీ20 క్రికెట్ మ్యాచ్‌లో ఆఫ్ఘనిస్తాన్ సంచలన విజయం నమోదు చేసింది. వరుసగా రెండు టీ20 మ్యాచ్‌ల్లో ఘనవిజయం సాధించి సిరీస్‌ను గెలుచుకుంది. తొలుత బ్యాటింగ్ చేసిన ఆఫ్ఘనిస్తాన్ తొమ్మిది వికెట్ల నష్టానికి 158 పరుగులు చేసింది. ఐపీఎల్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ తరపున ఆడిన మహమ్మద్ నబీ 26 బంతుల్లో 45పరుగులు చేశాడు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన జింబాంబ్వే 20 ఓవర్లలో ఆరు వికెట్ల నష్టానికి 141 పరుగులు మాత్రమే చేయగలిగింది. కట్టుదిట్టమైన బౌలింగ్‌తో ఆఫ్ఘన్ బౌలర్లు జింబాంబ్వేను నిలువరించారు. ఇందులోను మరో సన్‌రైజర్స్ ఆటగాడు రషీద్ ఖాన్ మెరుగైన ప్రదర్శనతో ఆకట్టుకున్నాడు. నాలుగు ఓవర్లకు 23 పరుగులిచ్చి రెండు వికెట్లు పడగొట్టాడు. అండర్ 19 ప్రపంచకప్‌లో ఆఫ్ఘనిస్తాన్ సెమీస్ చేరుకోవడంలో కీలక పాత్ర పోషించిన మరో యువ కెరటం ముజీబ్ జర్దాన్ రెండు వికెట్లను తన ఖాతాలో వేసుకున్నాడు. ఈ నెల 9వ తేదీ నుంచి ఆఫ్ఘనిస్తాన్- జింబాబ్వే జట్ల మధ్య 5 మ్యాచ్‌ల వన్డే సిరీస్ ప్రారంభం కానుంది.

విరాట్ విహారం



- కోహ్లీ 160 నాటౌట్, ధావన్ 76
- భారత్ 303/6
- విఫలమైన మిడిలార్డర్

కేప్‌టౌన్: దక్షిణాఫ్రికాతో జరుగుతున్న మూడో వన్డేలో టీమిండియా సారథి విరాట్ కోహ్లీ (160 నాటౌట్, 159 బంతుల్లో 12×4, 2×6) బ్యాటింగ్‌ను చూసిన వారెవ్వరైనా 'ఆహా! ఏమి ఆడాడ్రా బాబూ!' అనకుండా ఉండలేరు. ఈ తరం క్రికెటర్లలో తనకు సాటి లేనే లేరు అనేంతగా చెలరేగాడు విరాట్. ఈ వన్డే సిరీస్‌కు ముందు దక్షిణాఫ్రికాలో కోహ్లీ ఖాతాలో ఒక్క శతకం లేదు. ఇప్పుడు 3 వన్డేల్లోనే 2 శతకాలు ఉన్నాయి. అటు సారథిగానూ రికార్డులు బద్దలు కొట్టేశాడు ఈ పరుగుల యంత్రం. కపిల్ దేవ్ (175 నాటౌట్, జింబాబ్వేపై 1983లో) తర్వాత విదేశాల్లో అత్యధిక వ్యక్తిగత పరుగులు సాధించిన భారత కెప్టెన్‌గా ఘనుతికెక్కాడు. కెరీర్‌లో 34వ శతకం బాది గంగూలీ (11) తర్వాత సారథిగా అత్యధిక శతకాలు సాధించిన భారత్ కెప్టెన్ (12)గా చరిత్ర లిఖించాడు.

సాటి లేని మేటి

టాస్ ఓడి బ్యాటింగ్ దిగిన భారత్‌కు ఆశించిన శుభారంభం దక్కలేదు. ఓపెనర్ రోహిత్ శర్మ (0, 6 బంతుల్లో) మరోసారి విఫలమయ్యాడు. రబాడ చేసిన ఇన్నింగ్స్ ఆరో బంతికే కీపర్ హెన్రిచ్‌కు క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. అతడి నిష్క్రమణ తర్వాతే మొదలైంది అసలైన ఆట. ఒక వైపు ఫామ్‌లో ఉన్న శిఖర్ ధావన్ (76, 63 బంతుల్లో 12×4). మరోవైపు పరుగుల యంత్రం విరాట్ కోహ్లీ (160 నాటౌట్). ఇద్దరూ పోటీ పడి ఆడారు. ఒకరితో ఒకరు పోటీగా బౌండరీలు బాదేశారు. విరాట్‌తో పోలిస్తే గబ్బర్ ఎక్కువగా బౌండరీలు బాదుతూ అలరించాడు. ఈ క్రమంలోనే ఇద్దరూ అర్ధశతకాలు సాధించి ఊపు కొనసాగించారు. రెండో వికెట్‌కు 140 పరుగుల భాగస్వామ్యం అందించారు. ధాటిగా ఆడుతున్న ఈ జోడీని ధావన్‌ను ఔట్ చేయడం ద్వారా డుమిని విడదీశాడు. ఆ తర్వాత 20 పరుగులకు అజింక్య రహానె (11, 13 బంతుల్లో), 188 వద్ద హార్దిక్ పాండ్య (14, 15 బంతుల్లో 1×6), 228 వద్ద ధోనీ (10, 22 బంతుల్లో), 236 వద్ద కేదార్ జాదవ్ (1, 3 బంతుల్లో) ఔటయ్యారు.

భువితో కలిసి వేట

మిడిలార్డర్ విఫలమైనా విరాట్ కోహ్లీ పరుగుల వేట ఆపలేదు. భువనేశ్వర్ కుమార్ (16 నాటౌట్, 19 బంతుల్లో 1×4) సహకారంతో విజృంభించాడు. ఏడో వికెట్‌కు 67 పరుగుల అజేయ భాగస్వామ్యం నెలకొల్పాడు. స్పిన్నర్లు, పేసర్లు అనే తేడా లేకుండా ఆడేశాడు. అందమైన హాఫ్ వ్యాలీలు, కవర్ డ్రైవ్‌లు, స్ట్రెయిట్ డ్రైవ్‌లు, పుల్ షాట్లు, కట్ షాట్లు ఆడుతూ పరుగులు రాబట్టాడు. మధ్యమధ్యలో పేసర్ రబాడ కవ్వించినా విరాట్ ఏకాగ్రత కోల్పోలేదు. అతడు విసురుతున్న షార్ట్‌పిచ్ బంతుల్ని చాకచక్యంగా ఆడి సింగిల్స్, డబుల్స్ తీశాడు. అనవసర షాట్లకు ప్రయత్నించలేదు. అతడు సాధించిన పరుగుల్లో 100 సింగిల్స్, డబుల్స్ ద్వారానే వచ్చాయి. భువి సైతం సారథికి చక్కగా స్ట్రైకింగ్ ఇచ్చాడు. స్కోరు 293 ఉన్నప్పుడు చివరి రెండు బంతుల్లో ఒక సిక్సర్, ఒక బౌండరీ బాది టీమిండియా స్కోరును 303కు చేర్చాడు కోహ్లీ. డుమిని 2, రబాడ, మోరిస్, ఫెహ్లుక్‌వాయో, తాహిర్ తలో వికెట్ తీశారు.

మిడిలార్డర్ విఫలం

తొలి రెండు వన్డేల్లో అంతగా బ్యాటింగ్ అవకాశం రాని మిడిలార్డర్ బ్యాట్స్‌మన్ ఈ మ్యాచ్‌లో వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోలేకపోయారు. పాండ్యా(14), ధోని(10), జాదవ్(1)లు దారుణంగా విఫలమయ్యారు.

రంగంలోకి స్పిన్నర్లు: కష్టాల్లో సఫారీలు

కేప్‌టౌన్: టీమిండియాతో జరుగుతున్న మూడో వన్డేలో ఆతిథ్య దక్షిణాఫ్రికా కష్టాల్లో పడింది. 304 పరుగుల లక్ష్య ఛేదనలో 95 పరుగులకే నాలుగు కీలక వికెట్లు చేజార్చుకుంది. కొత్త కుర్రాడు హెన్రిచ్ (6బీ 12 బంతుల్లో 1ఐ4)ను, అర్ధశతకం సాధించిన జేపీ డుమిని (51బీ 67 బంతుల్లో 4ఐ4)ని స్పిన్నర్ యుజువేంద్ర చాహల్ వికెట్ల ముందు దొరకబుచ్చుకున్నాడు. డేవిడ్ మిల్లర్ (12బీ 23 బంతుల్లో), జొండొ (5బీ 16 బంతుల్లో) ఇన్నింగ్స్ భారం మోస్తున్నారు. 27 ఓవర్లు ముగిసే సరికి దక్షిణాఫ్రికా 108/4తో ఉంది.

ఆత్మహత్యకైనా సిద్ధమే..

పారా వెయిట్‌లిఫ్టర్ ఆవేదన



ఢిల్లీ: విశేష ప్రతిభతో రాణిస్తున్నప్పటికీ భారత ఒలింపిక్ అసోసియేషన్(ఐఓఏ) తనను పట్టించుకోకపోవడంపై పారా వెయిట్ లిఫ్టర్ సకీనా ఖాటున్ తీవ్ర నిరుత్సాహానికి గురై ఆత్మ హత్యకైనా సిద్ధమేనని ఆక్రందన వెళ్లగక్కింది. కామన్వెల్త్ గేమ్స్‌లో తనను ఎంపిక చేయకపోతే ఐఓఏ ఎదుట ఆత్మహత్య చేసుకుంటానని హెచ్చరించింది. త్వరలో ఆస్ట్రేలియాలోని గోల్డ్‌కోస్ట్‌లో నిర్వహించనున్న కామన్వెల్త్ గేమ్స్-2018కు భారత్ తరపున ప్రాతినిధ్యం వహించనున్న పలువురు క్రీడాకారుల జాబితాను ఐఓఏ ప్రకటించింది. ఈ జాబితాలో సకీనాకు చోటు దక్కలేదు. దీంతో ఆమె తీవ్ర మనస్తాపానికి గురైంది. "భవిష్యత్తులో ఐఓఏ ప్రకటించే జాబితాల కోసం వేచి చూస్తున్నాను... కామన్వెల్త్ గేమ్స్‌లో పాల్గొనే భారత జట్టులో నా స్థానం కోసం చివరి వరకు పోరాడతాను... అయినప్పటికీ ఫలితం లేకుంటే కోర్టుకు వెళ్తాను... ఎందుకంటే వారు నా జీవితాన్ని నాశనం చేసినట్లే.. ఏమాత్రం వెనుకాడను.. ఐఓఏ ముందు ఆత్మహత్య చేసుకుంటానికైనా నేను సిద్ధంగా ఉన్నాను" అని తెలిపింది. గ్లాస్గోలో నిర్వహించిన కామన్వెల్త్ గేమ్స్ లైట్‌వెయిట్ కేటగిరీలో సకీనా పతకం సాధించింది. 'ఈ ఏడాది కామన్వె గేమ్స్ కోసం నేను నాలుగు సంవత్సరాలుగా ఎదురుచూస్తున్నాను. ఎంతో కష్టపడ్డాను. ఇప్పుడు ఎంపిక చేయకపోవడంతో నాకు ఏం చేయాలో అర్థం కావడం లేదు. చాలా ఒత్తిడికి గురవుతున్నాను' అని సకీనా తన ఆవేదనను వ్యక్తం చేసింది. దీనిపై ఇప్పటికే భారత పారాలింపిక్ కమిటీకి సకీనా లేఖ రాసింది. కాగా కామన్వెల్త్ గేమ్స్ కమిటీ ఎంపికలో కొన్ని మార్పులు చేసిందని, అందుకే ఆమెను ఎంపిక చేయలేదని ఐఓఏ వివరించింది. అయితే భారత పారా ఒలింపిక్ కమిటీ సకీనా లేఖకు స్పందించింది. కామెన్వెల్త్ గేమ్స్ కమిటీతో చర్చించి సకీనాను ఆడేలా చూడాలని ఐఓఏకు లేఖ రాయడం కొస మెరుపు.

"పాక్‌లో సెంచరీ చేయడం కోహ్లీకి సవాలే"



కరాచీ: ట్రాక్ ఏదైనా.. పిచ్ ఏదైనా.. ఫార్మాట్ ఏదైనా అవలీలగా సెంచరీ బాదేయడం భారత క్రికెట్ జట్టు కెప్టెన్ విరాట్ కోహ్లీకి వెన్నతో పెట్టిన విద్య. అయితే కోహ్లీకి పాకిస్థాన్ క్రికెట్ జట్టు కోచ్ మిక్కీ ఆర్థర్ సవాలు విసిరాడు. ఇప్పటి వరకు తాను పర్యటించిన అన్ని దేశాల్లో సెంచరీ సాధించిన క్రికెటర్‌గా కోహ్లీ అరుదైన ఘనత అందుకున్నాడు. ఈ నేపథ్యంలో పాక్ కోచ్ మిక్కీ మాట్లాడుతూ.. 'కోహ్లీ గొప్ప ఆటగాడు అనడంలో సందేహం లేదు. తానాడిన అన్ని దేశాల్లో కోహ్లీ శతకం సాధించడం సంతోషకరమైన విషయం. కోహ్లీ బ్యాటింగ్ శైలి నాకెంతో నచ్చుతుంది. అతని బ్యాటింగ్ చూడటం ఇష్టం. ప్రతి చోటా శతకం సాధించే కోహ్లీ పాక్ గడ్డపై మాత్రం సెంచరీ సాధించ లేదు. ఇది అతనికి అంత సులువేం కాదు. మా ఆటగాళ్లు కోహ్లీకి ఎంతో ప్రణాళికాబద్ధంగా బంతులేస్తారు.' అని అన్నాడు. భారత్-పాక్ మధ్య ద్వైపాక్షిక సిరీస్ జరిగి ఏళ్లు గడిచింది. భారత్-పాక్‌ల మధ్య ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో ఇరు జట్ల మధ్య సిరీస్‌లు నిర్వహించేందుకు భారత ప్రభుత్వం ఒప్పుకోవడం లేదన్న సంగతి తెలిసిందే. మళ్లీ సిరీస్ అంటూ జరిగితే ఆర్థర్ సవాల్‌ను కోహ్లీ అధిగమించడం తథ్యం.

బ్యాంకులకు వేలకోట్లు ఎగ్గొట్టిన వారిని ప్రశ్నిస్తే దేశద్రోహులా?

సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ



విశాలాంధ్ర బ్యూరో - తిరుపతి: బ్యాంకులకు వేల కోట్ల రూపాయలు ఎగ్గొట్టిన వారిని ప్రశ్నిస్తే దేశద్రోహులుగా కేంద్ర ప్రభుత్వం చిత్రీకరించే ప్రయత్నం చేయడం సిగ్గుచేటని సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ అన్నారు. పంటల కోసం ఉన్న ఆస్తులు తాకట్టు పెట్టి రుణాలు పొందిన రైతుల నడ్డివిరిచి వసూళ్లు చేస్తున్న ప్రభుత్వాలు 6 వేల కోట్లు రూపాయలు ఎగ్గొట్టిన ఘనులను ఎందుకు వదిలిపెడుతున్నారని ప్రశ్నించారు. పెద్దనోట్లు రద్దు చేసి కొత్త నోట్లు స్టాక్ లేదని బోర్డు పెట్టిన ఆర్బీఐ 32 కోట్లు రూపాయలు తమిళనాడుకు చెందిన శేఖర్‌రెడ్డి ఇంటికి ఎలా చేర్చారని ప్రశ్నించారు. బుధవారం సాయంత్రం స్థానిక ఉదయ్ ఇంటర్నేషనల్ హోటల్‌లో తిరుపతి బ్యాంకు ఉద్యోగుల సమన్వయ కమిటీ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న నారాయణ మాట్లాడుతూ లాభాల బాటలో నడుస్తున్న బ్యాంకులను నష్టాలవైపు తీసుకెళ్లేలా కేంద్ర ప్రభుత్వం నిర్ణయాలు చేస్తున్నదన్నారు. ఎఫ్ఆర్‌డిఏ బిల్లును తక్షణం ఉపసంహరించుకోవాలని, లేనిపక్షంలో బ్యాంకు ఉద్యోగులు చేసే పోరాటంలో సీపీఐ అగ్రభాగాన నిలిచి ఆందోళన ఉధృతం చేస్తుందని అన్నారు. స్వాతంత్ర్యం వచ్చాక తొలిసారిగా న్యాయవ్యవస్థలో సంక్షోభం ఏర్పడిందన్నారు. సీబీఐ, నీతిఆయోగ్, ఎన్నికల కమిషన్ కల్మషమైందన్నారు. ఓట్లు దండుకోవడం కోసం రిజర్వేషన్‌ల ఎర వేస్తున్నారని, అది సాధ్యం కాదని తెలిసినప్పటికీ పక్కదారి పట్టిస్తున్నారని విమర్శించారు. పాలకుల నిర్ణయాల వల్లే ప్రజాస్వామ్యం అపహాస్యం పాలవుతున్నదన్నారు. ప్రజలు అవగాహనతో కూడిన పోరాటాలు సాగించేందుకు సిద్ధపడాలన్నారు. ఆలిండియా బ్యాంకు ఉద్యోగుల సంఘం కార్యదర్శి రాంబాబు మాట్లాడుతూ బకాయిలు ఎగవేతదారుల పట్ల ఎన్డీయే ప్రభుత్వం అవలంబిస్తున్న విధానాలను ఎండగట్టారు. బ్యాంకుల్లో ఔట్‌సోర్సింగ్ విధానానికి స్వస్తిపలకాలన్నారు. సంస్కరణల పేరుతో బలహీన బ్యాంకులను పెద్దబ్యాంకుల్లో విలీనం ప్రతిపాదనలను మానుకోవాలన్నారు. ఈ సమావేశంలో బ్యాంకు ఉద్యోగుల సంఘం తిరుపతి అధ్యక్షులు రమణమూర్తి, కార్యదర్శి ధన్వంతకుమార్, కోశాధికారి సుమలత, సీపీఐ జిల్లా కార్యదర్శి ఎ.రామానాయుడు, బ్యాంకు ఉద్యోగుల కమిటీ నాయకులు మూర్తి, భాస్కర్, జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ సీనియర్ నేత, ఎమ్మెల్సీ

గాలి ముద్దుక్రిష్ణమనాయుడు మృతి

- సీఎం ప్రభృతుల దిగ్భ్రాంతి
- నేడు వెంకటరామాపురంలో అంత్యక్రియలు





విశాలాంధ్ర బ్యూరో - తిరుపతి/హైదరాబాద్: తెలుగుదేశం పార్టీ సీనియర్ నేత, ఎమ్మెల్సీ గాలి ముద్దుకృష్ణమ నాయుడు (71) మంగళవారం అర్ధరాత్రి హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో కన్నుమూశారు. ఆయనకు భార్య సరస్వతి, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. స్వగ్రామం వెంకట రామాపురంలో గురువారం అంత్యక్రియలు జరుగుతాయి. తెలుగుదేశం పార్టీలో సీనియర్ నాయకునిగా పలు పదవులు చేపట్టిన ఆయన రెండ్రోజులుగా జ్వరంతో బాధపడుతున్నారు. ఇటీవల గుండె ఆపరేషన్ కూడా చేయించుకున్నారు. ముద్దు మృతితో తెలుగుదేశం పార్టీలో విషాదచాయలు అలుముకున్నాయి. ముఖ్యమంత్రితోపాటు మంత్రులు, పార్టీ నేతలు తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. తమ నేత ఇక లేడని తెలిసిన చిత్తూరు జిల్లా ప్రజానీకం విషణ్ణవదనంలో మునిగిపోయింది. ముద్దుక్రిష్ణమనాయుడు భౌతికకాయాన్ని మధ్యాహ్నం విమానంలో రేణిగుంటకు తీసుకొచ్చారు. అక్కడి నుంచి రోడ్డుమార్గంలో స్వగ్రామమైన రామచంద్రాపురం మండలం వెంకటరామాపురానికి తరలించారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుతో సహా పలువురు ప్రముఖులు భౌతికకాయంపై పూలమాలలు వేసి, శ్రద్ధాంజలి ఘటించారు. గుంటూరు జిల్లా పెదనందిపాడు ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో అధ్యాపకునిగా పనిచేసిన ఆయన ఎన్టీఆర్ పిలుపుతో 1983లో రాజకీయ రంగప్రవేశం చేశారు. తాను ప్రాతినిధ్యం వహించిన నగరి నియోజకవర్గ అభివృద్ధి సహా జిల్లా అభివృద్ధికి ఆయన విశేషంగా కృషిచేశారు. తెలుగురాష్ట్రాల్లో ఆయన అందరికీ సుపరిచితులు. విపక్షాలపై ధ్వజమెత్తడంలో ఆయనది ప్రత్యేక శైలి. ముద్దుకృష్ణమ నాయుడు 1947 జూన్ 9న చిత్తూరు జిల్లా రామచంద్రాపురం మండలం వెంకట్రామాపురంలో జి.రామానాయుడు, రాజమ్మ దంపతులకు జన్మించారు. బీఎస్సీ, ఎంఏతోపాటు న్యాయవాద డిగ్రీ పట్టా పొందారు. పుత్తూరు నుంచి 5 సార్లు, నగరి నుంచి ఒకసారి శాసనసభకు ప్రాతినిధ్యం వహించారు. తెలుగుదేశం పార్టీ చీలిక సమయంలో ఆయన కొంతకాలం లక్ష్మీపార్వతి వర్గంగా ఉన్నారు. ఆ తర్వాత 2004లో కాంగ్రెస్ పార్టీలో చేరి ఆ పార్టీ నుంచి ఎమ్మెల్యేగా గెలిచారు. 2008లో మళ్లీ టీడీపీలో చేరి 2009 ఎన్నికల్లో నగరి నియోజకవర్గం నుంచి గెలిచారు. 2014 ఎన్నికల్లో ఇదే స్థానం నుంచి పోటీ చేసి ఓడిపోయారు. ఆయన ప్రస్తుతం టీడీపీ ఎమ్మెల్సీగా ఉన్నారు.

టీడీపీకి, చిత్తూరు తీరని లోటు : చంద్రబాబు

జిల్లాకు ఎన లేని సేవ చేసిన వ్యక్తి, ఒక ఆశయం కోసం పని చేసే సహచరుని కోల్పోవడం ఆవేదనకు గురిచేసిందని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అన్నారు. బుధవారం మధ్యాహ్నం 2.40 గంటలకు రామచంద్రాపురం మండలం, వెంకట్రామపురం చేరుకొని గాలి ముద్దు కృష్ణమనాయుడు భౌతికకాయంపై పూలమాల వేసి నివాళి అర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సాను భూతిని తెలిపి ఓదార్చారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ ముద్దు క్రిష్ణమనాయుడు మృతిని జీర్ణించు కోలేకపోతున్నానని, నమ్మ శక్యంగా లేదని అన్నారు. రాష్ట్ర మంత్రులు అచ్చెన్నాయుడు , నారాయణ, దేవినేని ఉమామహేశ్వర రావు, ఎంపీ శివప్రసాద్, ఎమ్మెల్సీలు గౌనివారి శ్రీనివా సులు, బీఎన్ రాజసింహులు, ఎమ్మెల్యేలు నారాయణ స్వామి, తలారి ఆదిత్య, డీకే సత్యప్రభ, సుగుణమ్మ, జిల్లా పరిషత్ చైర్మన్ గీర్వాణి , మేయర్ కటారి అనూరాధ, రాష్ట్ర మహిళా కమిషన్ చైర్మన్ నన్నపనేని రాజకుమారి, జిల్లా కలెక్టర్ పి.ఎస్.ప్రద్యుమ్న, జేసి. గిరీషా, జేసి 2 చంద్రమౌళి, ఎస్.పి.లు రాజశేఖర్ బాబు, అభిషేక్ మహంతి, జిల్లా పరిషత్ సీఈఓ తుకారాం, రాజకీయ నాయకులు గల్లా అరుణ కుమారి, రెడ్డి వారి రాజశేఖర రెడ్డి, హేమలత, లలితకుమారి, అమాస రాజశేఖర రెడ్డి, నాని , శ్రీధర్‌వర్మ, జెడ్పీటీసీలు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు ముద్దు కృష్ణమ నాయుడు భౌతికకాయానికి నివాళులు అర్పించిన వారిలో వున్నారు.

నారాయణ, రామకృష్ణ సంతాపం

ముద్దుక్రిష్ణమనాయుడు సామాన్య ప్రజలకు తలలో నాలుకలా పనిచేసేవారని సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ, రాష్ట్ర కార్యదర్శి కె. రామకృష్ణ అన్నారు. ఆయన మృతి తీరని లోటని పేర్కొంటూ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. పేద ప్రజల ఇళ్లలో జరిగే కార్యాలకు వెళ్ళి వారిలో కలిసిపోవడం ముద్దుక్రిష్ణమనాయుడు నైజం అన్నారు. ఆయనతో తనకు చాలా సానిహిత్యం ఉండేదని, అలాంటి వ్యక్తి ఇక లేరని తెలవడం కలచివేసిందని పేర్కొన్నారు. నారాయణతో పాటు ముద్దు భౌతికకాయానికి నివాళులర్పించిన వారిలో సీపీఐ జిల్లా కార్యదర్శి ఎ.రామానాయుడు, నగర కార్యదర్శి చిన్నం పెంచలయ్య, నాయకులు మురళి, వెంకయ్య, రాధాకృష్ణ, విశ్వనాథ్, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు శశి, కార్యదర్శి శివారెడ్డి తదితరులు ఉన్నారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : MUTYALA PRASAD. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2018-20, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.